

డెట్ ఉతికే బిళ్ల
సబ్బు కంటె 1½ రెట్లు ఎక్కువ శక్తివంతమైనది ఉప్పు నీళ్లలో కూడ.
డెట్ ఉతికే పౌడరు
ఎంచుకొందుకు వీలుగా ఎన్నో సైజుల ప్యాకులు. మీరు చేయవలసినదంతా బట్టలను తడిపి జాడించడమేను. మీ చేతులను మృదువుగా కూడ ఉంచుతుంది.
ఎన్-డెట్
మురకలను తొలగించే ఎన్‌జైమ్ ఉతికే పౌడరు. గుణకరమైనది కాని హాని చెయ్యదు.
new! det detergent washing cake
NEW! TRIPLE ACTION White det WASHES WHITEST
enzyme det
ఇదివరకు ఎన్నడూలేనంత తెల్లదనము—డెట్ ఉత్తమ తయారులతో!
Shilpi HPMA 6A/74 Tel

తొలిమాట

క్రికెట్ జెస్టులు పత్రికలకు ఒకరకంగా హాని చెయ్యగలవన్నందుకు ఈ సంచిక జ్యోతి ఆలస్యంగా విడుదలవడం ఒక ఉదాహరణ. దేశం మొత్తం క్రికెట్ జ్వరపీడితమై ఉండగా—జ్యోతి కవర్ డిజైన్ చేసిన ఆర్టిస్ట మరింత క్రికెట్ అభిమానం కలవాడవటంతో—తననుకొన్న విధంగా ఆడక అతి తక్కువ పరుగులుతీసి ఇండియా కెప్టెన్ ఔటవడంతో నిరుత్సాహంగా చేయి విదిలించి బాధపడ్డాడు. ఆ చేతిలో రంగుపూసిన బ్రష్ ఉండటం, ఆ రంగు దాదాపు పూర్తి అయిన డిజైన్ నిండా మరకలరూపంలో వెదజల్లబడటం, డిజైన్ కార్యక్రమం మళ్ళీ మొదటికి రావడం . ఇది మొదటి ఘట్టం

డిజైన్ తయారుచేయించి ప్రింటింగ్‌కోసం ప్రెస్‌కు తీసికెళ్ళినప్పుడు ఆ ప్రెస్ యజమాని ఆ రోజు దినపత్రికలోని ఒకవార్తను 'అండర్‌లైన్' చేసి మాకు చూపడం జరిగింది. 'మద్రాసులో 60 శాతం కరెంటుకోత' అన్నదే ఆ వార్త. అదీ సంగతి.

వె. శేషగిరిరావు


శ్రీ లక్ష్మీనారాయణ ఫిలింస్
శ్రీ రామాంజనేయ యుద్ధం
ఈస్ట్‌మన్ కలర్
దర్శకత్వం: బాపు
ఎన్.ఎస్.మూర్తి
పొట్లూరి వెంకటనారాయణరావు, ఎన్.బి.కె.ఉమామహేశ్వరరావు

జనవరి **1975**

సచిత్ర మాసపత్రిక సంపుటి 14; సంచిక: 1

విషయ సూచిక

ముఖచిత్రం: శ్రీ లక్ష్మి ప్రొడక్షన్స్ 'దేవుడు చేసిన పెళ్ళి' చిత్రంలో శోభన్‌బాబు, శారద

సంస్థాపకుడు: కీ. శే. వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్: శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

జ్యోతి, 40/1 మూసా సెయిట్ స్ట్రీట్, టి. నగర్, మద్రాసు-600017.

విడి ప్రతి: రు 2-00, సంవత్సర చందా (ప్రత్యేక సం॥తో) రు 20/-


వీనస్ మహీజా పిక్చర్స్
యశోద కృష్ణ
నిర్మాత: సి.హెచ్.ప్రకాశరావు దర్శకత్వం: సి.యస్.రావు
రచన ఆరుద్ర సంగీతం: యస్.రాజేశ్వరరావు
కెమెరా: జి.కె.రాము

తొలిమాట


పాఠకులందరికీ మా నూతనసంవత్సర శుభాకాంక్షలు.

నూతన సంవత్సరం అనగానే కొత్త కోరికలూ, కొత్త ఆశలూ చిగురింపజేసుకొనే అవకాశమన్నమాట! సుఖపడుతున్న వారు మరింత సుఖాన్నీ, కష్టపడుతున్నవారు కనీస సుఖాన్నీ కోరుకొనే సందర్భమిది. అయితే కనీసం 'కోరిక'లు కూడా ఘనంగా కోరుకోలేని నీరసపు స్థితిలో మనమున్నామంటూ ఉదాహరణగా ఓ కథకూడా చెప్పారు. 'కబుర్లు' శీర్షిక నిర్వాహకులు చలసాని ప్రసాదరావు: చూ. పే. 60

* * *

నూతన సంవత్సర సందర్భంగా 'జ్యోతి సంపాదకశాఖ' కూడా కొత్త ఆలోచనలతో నిండివుంది. జ్యోతిని మరింత పాఠక జనరంజకంగా, ఎన్నో కొత్త మార్పులతో వెలువరించే ప్రయత్నం ప్రారంభమయింది. త్వరలోనే జ్యోతి మరింత కొత్త పోకడలతో మీ ముందు కొస్తుంది. ఈ సందర్భంగా జ్యోతిలో పాఠకులు ఎటువంటి మార్పులు ఆశిస్తున్నారో మాకు రాయగోరుచున్నాము. పాఠకుల అభిప్రాయాలకు జ్యోతి ఎప్పుడూ విలువనిస్తుంది.

కారణాంతరాలవల్ల యీ సంచికలో ప్రచురించబడని 'ఈ నెల విడుదలలు' వచ్చే సంచికనుంచీ యథావిధిగా కొనసాగుతుంది. సరాగమాల పోటీ, ఈ సంచికలో ప్రకటించవలసిన విజేతల జాబితాలుకూడా వచ్చే సంచికలో చూడగలరు.



నమ్మశక్యంకాని పనితనపు నైపుణ్యం
కనులకింపుగా ధగధగ మెరిసే నగల నాణ్యం
జ్యోతి
జ్యూయలర్స్
నాణ్యానికి నమ్మకానికి
మాది ప్రత్యేకత!
ఫోన్:
446278
స్టార్ బజార్
రంగనాథన్ స్ట్రీట్
టి.నగర్
మద్రాసు-600017
బంగారు వెండి నగల
కోసం వాడుకందార్లు
వెదుకుతూ వచ్చుచోటు

ఉత్తరాలు

ఇటీవల అన్ని పత్రికల వెలలు విపరీతంగా పెరిగినా, ఆంధ్రుల అభిమాన 'జ్యోతి' వెల పెరగకపోయినా, విలువ మాత్రం పెరిగిపోవడం విశేషంగా పేర్కొంటూ— 'జ్యోతి' ఇక ముందు ఇంకా ప్రకాశవంతమై అశేష పాఠకుల ప్రశంస లందుకోవాలని నా ఆకాంక్ష.

—ఎం. జి. మూర్తి, విశాఖపట్నం-8.

డిశంబరు "జ్యోతి"లో ఈడ్పుగంటి లక్ష్మణరావుగారి "నేటి సినిమాలు తీరు తెన్నులు" వ్యాసంలో నేటి సినిమాల గురించి చక్కగా వర్ణించారు. క్రొత్తక్రొత్త శీర్షికలు చూడడం "జ్యోతి" లోనే నని ఘంటాపథముగా చెప్పవచ్చును.

కథలు, సీరియల్స్ మనమున ఆకట్టుకుంటున్నాయి. "జ్యోతి" నిర్వాహకులకు మా హృదయపూర్వ అభివందనలు.

—కె. సూర్యకుమారి,
—కె. ముంతాజోద్దీన్,
కరీంనగర్.

డిశంబరునెల జ్యోతిలో చక్కటి కథలతో వచ్చింది. తరాలు - అంతరాలు' వ్రాసిన ప్రణవిగారికి నా అభినందనలు. ఈ కథ చాలా చక్కగా వున్నది. కొత్త రకంగా వున్నది. ఇదివరలో ఎప్పుడూ ఇలాంటివి నేను చదవలేదు. చాలా బాగా వున్నది. ఈ దేశంలో నేనో ఆడపిల్లను కథకూడా బాగానే వున్నది. నవలాను బంధం ఈ నెలతో, తొణికిన స్వప్నం చివరిభాగం అయింది. చివరిలో చాలా గొప్పగా ముగింపు నాకు నచ్చింది. సీతాదేవిగారి రచన పాఠకులకు నచ్చేవిధంగా రచించేరు రాధ పాత్ర చాలా బాగా వున్నది.

—బి. మల్లిఖార్జునరావు.
మండపేట.

డిసెంబర్‌నెల జ్యోతి ముఖచిత్రం ఎంతో ముచ్చటగా వుంది "చీకటిపొద్దున వెలుగురేఖ" (సీరియల్) చాలా చక్కగా ముందుకు పోతుంది. ఈ నెల కథలు అన్నీ బాగున్నాయి. అతి తక్కువ ధరకు ఇంత ఎక్కువ ఐటమ్స్ కథలూ, విమర్శలు, కార్టూనులు, జోక్సులు ఇవ్వడం లేదు. జ్యోతికి మా నూతన సంవత్సర శుభాకాంక్షలు.

—యిమ్మిడి సాంబమూర్తి గుప్త అండ్
కోసూరి సుబ్బారావు.
విజయవాడ-2.

డిసెంబరునెల జ్యోతిలో వాసిరెడ్డి సీతాదేవి నవల పూర్తయింది. కథలో కొత్తదనం వుండి చక్కగా నడిచిన నవల యిది 'తొణికిన స్వప్నం' అనే పేరు చక్కగా వుంది. ప్రణవిగారి మినీ నవల 'తరాలు-అంతరాలు' చాలా బాగుంది. తరాలు మారినా-అంతరాలు 'మారలేదన్న' రచయిత చివరిమాట అర్థవంతంగావుంది.

—వై. లక్ష్మి, విజయవాడ.

డిశంబర్ 'జ్యోతి' కృష్ణ, విజయ నిర్మల ముఖచిత్రంతో ముగ్ధ మనోహరంగా మమ్ములను ఆకర్షించింది. "నేటి సినిమాలు - తీరుతెన్నులు" శ్రీ యిడ్పుగంటి లక్ష్మణరావుగారి వ్యాసం చాలా బాగుంది. నేటి రోజుల్లో విడుదలవుతున్న సినిమాలు, పాత సినిమాలవలె ర_క్తి కట్టక, నడవకపోవడం— వీటిని గూర్చి వివరంగా తెల్పినందుకు మా ప్రత్యేక ధన్యవాదాలు.

—ఇ. కమలా మనోహరరావు,
—ఎ. లక్ష్మీరాజము,
కమాన్‌పూర్.

డిశంబరునెల 'జ్యోతి' కృష్ణ, శ్రీమతి విజయనిర్మల ముఖచిత్రంతో ఒకవినూత్న అందాన్ని సంతరించుకొంది. 'చీకటి పొద్దున వెలుగురేఖ' సీరియల్ కడలి తరంగిణులవలె ఉత్సాహంగా ఉరకలేస్తోంది. 'కళ్యాణి' పాత్ర చాలా ఉన్నతమైనది. ముందు ముందు ఏమి జరుగుతుందోనన్న కుతూహలాన్ని కలిగిస్తూంది. 'రాధమ్మ పెళ్ళయింది' కథ పవిత్రమైన ప్రేమికులకు ఒక నిదర్శనం. 'ఈగలు', 'తరాలు అంతరాలు' కథలు కాలానికి తగినట్టున్నాయి 'ఈ దేశంలో నేనో ఆడపిల్లను' కథ ఈ నాటి అమ్మాయిలకు జ్ఞానోదయాన్ని కలిగిస్తుంది.

—డి. వి. సుబ్బారావు,
కొండాపురం.

ఇదివరకు నేను ఎప్పుడు ఇలా ఉత్తరము వ్రాయలేదు జ్యోతి, 74 డిశంబరు సంచిక చూశాక, నాకు మనస్సు నిలువలేదు ముఖచిత్రము చూశాను, అందరికి అంధాల నటుడు ఆంధ్రా జేమ్సుబాండ్, అందాల నటి మహిళా దర్శకురాలు విజయ కృష్ణల బొమ్మలింత కాంతులు వెదజల్లుతున్నవి. చీకటి ప్రొద్దున వెలుగు రేఖ సీరియల్ చాలా బాగున్నది. తరాలు-అంతరాలు కథ కూడా బాగున్నది.

—కంభం మెట్టు ప్రభబాదురి,
రాజమండ్రి.

'చీకటి పొద్దున వెలుగురేఖ' సీరియల్‌లో 'కల్యాణి' పాత్రను రచయిత్రి శ్రీమతి డి. కామేశ్వరిగారు అతిగా సమర్థిస్తున్నారేమో అనిపిస్తోంది. అనువాదకథ 'కారూన్' 'తొలిమాట'లో పేర్కొన్నట్లుగా ప్రస్తుత నగర జీవితంపై చక్కని సెటైర్.

—గుండాల వెంకటేశ్వరరావు,
భువనేశ్వర్.

1974 డిశంబరు జ్యోతిలో-మీరు ప్రచురించిన "రాధమ్మ - పెళ్ళయింది" "ఈగలు" - "తరాలు - అంతరాలు" "ఈ దేశంలో నేనో ఆడపిల్లను" పాఠకుల నెంతో ఆకర్షించినవి.

"నేనొక మంచి వెధవను" అనే శీర్షిక-మరో విధంగా మార్చితే - యింకా మంచి అనుభవాలను పాఠకులనుంచి రాబట్టగల అవకాశము కన్పించుచున్నది.

—కరెవరపు భాస్కరరావు,
తెనాలి.

కృష్ణ, విజయనిర్మల ముఖచిత్రంతో వెలువడిన డిసెంబరునెల జ్యోతి అత్యంత ఆకర్షణీయంగా ఉంది. "నేనొక మంచి వెధవను" శీర్షిక నేటి మన తెలుగు పత్రికా సాహిత్యంలో ఒక వినూత్న ప్రయోగం. "నేటి సినిమాలు-తీరుతెన్నులు" పై మీరు

ప్రచురించిన వ్యాసం చాలా బాగుంది. "విజ్ఞాన వీధుల్లో ." శీర్షిక చాలా విజ్ఞాన దాయకంగా ఉంది. చలసాని ప్రసాదరావు గారి "కబుర్లు" జ్యోతికే మణిపూస. ఈసారి ప్రచురించిన కథలన్నీ ఫరవాలేదు. జ్యోతి నవలానుబంధంలో మీరు అందించిన వాసిరెడ్డి సీతాదేవిగారి "తొణికిన స్వప్నం" నవల నేను మరువలేని ఒక ఉత్తమ నవల.

—బుఱుసు కామేశ్వరరావు, గుంటూరు-2.

'నవలానుబంధం' వాసిరెడ్డి సీతాదేవి గారి 'తొణికిన స్వప్నం' నవల చాలా బాగుంది. ముగింపు వూహించని విధంగా చక్కగా పూర్తిచేసారు. డి. కామేశ్వరి గారి చీకటిపొద్దున వెలుగురేఖ (సీరియల్) పోను, పోను, చాలా ఇంటరెస్టుగా వుంది.

ఇలాటి సీరియల్స్ పాఠకులకు అంతజేస్తున్న రచయిత్రులకు, "జ్యోతి"కి మా హృదయపూర్వక వందనములు.

—పి. మస్తానయ్య.
మద్రాసు-4.

నాటిక రచనల పోటీ

హైదరాబాదు ఏజీ ఆఫీసు తెలుగు నాటక సమితి తెలుగు నాటిక రచనల పోటీ నిర్వహించ నున్నదని తెలియజేయటానికి ఆనందిస్తున్నాం. ప్రవేశ రుసుం లేదు. అయితే కేంద్రప్రభుత్వ ఉద్యోగులకూ, కేంద్రపాలిత సంస్థలోని ఉద్యోగులకు మాత్రమే పరిమితమైన ఈ పోటీలో ఉత్తమ రచన, ద్వితీయ ఉత్తమ రచనలుగా ఎన్నికైన వాటికి వరసగా రూ. 116/-లు, రూ. 58/-లు బహూకరించబడతాయి. కాగా ఈ రచనలు సుమన పబ్లిషర్, హైదరాబాదు వారు పుస్తకరూపంలో వెలువరించేందుకు అంగీకరించారు. ఈ పోటీలో పాల్గొనదలచినవారు అప్లికేషను మరి ఇతర వివరాల కోసం 25 పైసల స్టాంపు అతికించిన కవరు పంపుతూ డి. ప్రభాకర్, కార్యదర్శి, తెలుగు నాటక సమితి, అకౌంటెంట్ జనరల్ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ సైఫాబాద్, హైదరాబాదు-500004 అను చిరునామాకు వ్రాయాలి. రచనలు 31-1-75 తేదీలోగా పై చిరునామాకు చేరాలి.

సంక్రాంత్యుత్సవం

ఈ ఉదయం—
తెలి నురుగుల తొలి ఉదయం!
ఈ వేకువ—
వెలుగు రేకుల మెలకువ!
ఈ వర్తమానం—
జాతి జాగృత ధ్యానం!
ఈ తూర్పు—
తేజస్సు నిట్టూర్పు!
ఈ చైతన్యం—
బంగరు బాట (కి) భవితవ్యం!
ఈ భావం—
సమ సామ్యం!
ఈ దృశ్యం—
మహోల్లాస లాస్యం!
అవును!
ఇది—
సంక్రాంత్యుత్సవం!!!

—యం. ఉమాకాంత్.

ప్రయోజనాత్మకమైన మంచి శీర్షిక!



నేనొక మంచి వెధవను!

మీ సరికొత్త శీర్షిక 'నేనొక మంచి వెధవను' చదివాను. మంచిని గుర్తించి ప్రోత్సహించ లేనివాడు, చెడుని ఖండించి, నిలబడలేనివాడు, నాకెందుకు లెమ్మని నడుం విరిగి నడిచేవాడు మంచి వెధవ. నూటికి తొంభై మందిని అలాటి వెధవలుగా యీ ప్రభుత్వం నయానో భయానో చేస్తూనే వుంది.

కాకపోతే పాతికేళ్ళ స్వాతంత్ర్యానంతరం నూటికి డెబ్బయిమందిని అక్షరం ముక్క రానివాళ్ళుగా వుంచలేరు—ప్రతీ ముగ్గురిలో ఇద్దర్ని నిరుద్యోగులుగా పకీర్లుగా రోడ్లమీద వుంచలేరు—స్కూల్లో సీటు మొదలు, కాన్పుకు మంచంవరకూ, లంచాన్ని మామూలుగా మార్చలేరు—నాలుగు పంచవర్ష ప్రణాళికల అనంతరం సగంమంది పూటకి కూటికి లేని దరిద్రుల్ని అణుబాంబు పరీక్షతో మీ ఆకలి తీరింది పొండని చెప్పలేరు.

లక్షలతో మంత్రులయ్యే యీ దేశంలో—పూటకో గూటిలో దూరి వోటుని అమ్ము కునే యం. ఎల్. ఏ. లున్నయీ దేశంలో-స్మగ్లర్లు బ్లాక్ మార్కెటీర్లు హైక్లాస్ బ్రోతల్సు, వి. ఐ. పి. లుగా పార్టీని పెంచి, పోషించి మంత్రుల్నీ, మేధావుల్నీ, సంస్కృతినీ జుట్టుపట్టుకుని ఆడించగల యీదేశంలో నూటికి తొంభయిమంది వెన్ను విరిగిన మంచి వెధవలే. వెధవలుగా తప్ప మరో మార్గంలో బతకలేమని గతానుభవం చెప్తూనే వుంది. యిలాకాదు బతకాల్సింది అని తిరగబడ్డ వెధవ ఎవడైనా వుంటే వాడు ఏ మూల జైల్లోనో, మీసా కిందో డి. ఐ. ఆర్. కిందో చచ్చో, చావబోతూనో వుంటాడు, యీ వెధవల్ని మంచి వెధవల్ని చేసేందుకు—ఏ అన్యాయానికైనా మనసులో ఏడ్చుకొని బయటి కొచ్చి కుళ్ళుగాలి పీలుస్తూ ఆదమరచి నిద్రపోయేందుకు కావలసినన్ని సినిమాలూ, పత్రికలూ వుండనే వున్నాయి.

—వెధవాయిత్వం జాతీయం వెయ్యబడ్డ సాంప్రదాయం. పాతికేళ్ళ పరిపాలన సరిసమానంగా పంచిన వరం. నైతిక భ్రష్టత్వం. వెధవకు మంచితనం కూడా వ్యాపార శీర్షికగా మార్చగలిగినందుకు మీకు మా ధన్యవాదాలు.

కె. మాధురి.

సమయం 12 గం॥ కావస్తుంది. రాణీ గంజ్ రోడ్డు మీద జనం పల్చగా ఉన్నారు. బస్స్టాండు చెట్టుక్రింద, ఒక బండిలో తాజాయైన బత్తాయి పళ్ళను సవరిస్తు నిల్చున్న సాయిబును చూచి, నేను ఆ బండి వద్దకు వెళ్ళి "బత్తాపళ్లు ఎలాగ?" అని అడిగాను. వాడు రూపాయికి ఐదు ఇస్తానన్నాడు. "ఎనిమిదిస్తే రూపాయివి తీసికొంటాను" అని చెప్పాను. అందుకు సాయిబు సమ్మతించ లేదు నేను వెళ్ళి పోతుంటే వెనక్కి పిల్చి "మంచిది. ఎనిమిది తీసికోండి" అని అన్నాడు. నేను బత్తాయిలను తీసికొంటున్నాను. అంతలో నా ప్రక్కగా ఒక రిక్షా ఆగింది. ఆ రిక్షాలో



ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. ఒక వ్యక్తి, చేతిలో సీసా పట్టుకొని, నీరసంగా ఉన్నాడు. బహుశా వారు ఆస్పత్రి నుంచి వస్తున్నట్టున్నారు. (సాయిబు ఇదంతా గమనించాడు" ఒక వ్యక్తి క్రిందకు దిగి "బత్తాయిపళ్లు ఎలాగ?" అని అడిగాడు. సాయిబు "రూపాయికి ఐదు" అన్నాడు. అతను సందేహిస్తూ "రూపాయికి ఎనిమిది ఇస్తావా" అని అడిగాడు. సాయిబు 'ఏంది సార్. రూపాయికి ఐదర్ నాల్గు ఇస్తుంటే, మంచిగున్నయి. ఇగో ఇయన (నన్ను) తీసికుంటుండు. ఏమి సార్!' అని నన్నడిగాడు. నిజం చెప్తే ఏమవుతుందో, అని నేను యాంత్రికంగా తలూపి, సాయిబుకి రూపాయి ఇచ్చాను. అతనికి అవసరం లాగుంది! నా మాటలు నమ్మి మారు మాటాడకుండా ఐదు పండ్లు చొప్పున రెండు రూపాయిలవి తీసికొని రిక్షాలో వెళ్ళిపోయాడు. సాయిబు నాకేసి గర్వంగా చూసాడు.

స్వార్ధం కోసం, సాయిబుకు భయపడి, నిజం తెలిసియుండి, తోటి మానవుణ్ణి మోసగించినందుకు నా మీద నాకే, ఆ క్షణంలో అసహ్యం వేసింది. నిజంగా 'నేనొక మంచి వెధవను' అని అనుకున్నాను. మరి మీరేమంటారు?

ముట్నూరు వెంకటరమణమూర్తి.



విజ్ఞాన వీధుల్లో...

ఎటు చూచినా దట్టమైన పొగలు! దిక్కులు పిక్కటిల్లేటట్లు భయంకర శబ్దాలు!! దిక్కుతోచని పరిస్థితి!!! ఎడారుల్లో ఇసుక మేటల్లాగా అంతటా పొగలు సెగలు వ్యాపించి పొయ్యాయి. ఇంకేముంది? ఒకటే హడావుడి. ఒకటే గందరగోళం! భీతావహులయిన ప్రజలు దిక్కుమొగా లేసుకుని పిక్కబలం కొద్దీ పారిపోసాగారు. కాని, ప్రయోజనం శూన్యం . అచిర సమయంలోనే ఆ అశేష ప్రజానీకం ప్రాణాలు అనంత వాయువుల్లో లీనమయి పొయ్యాయి.

డిటెక్టివ్ నవలలోని సంఘటన కాదిది క్రీ. శ. 1945 ఆగష్టు 6 వ తేదీన 'హీరోషిమా'లో నిజంగా జరిగిన సంఘటన యిది. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో హీరోషిమాకు, 'నాగాసాకి'కి పట్టిన దుర్గతి అందరికీ తెలిసిన సంగతే.

ఆ సంఘటన జరిగిన తరువాత నుండి అణువు విషయంలో ప్రపంచమంతా ప్రత్యేక శ్రద్ధ తీసుకోనారంభించింది.

అధునిక యుగంలో విజ్ఞానం ఎంతగానో పురోగమించింది. ఆధునిక యుగం ప్రస్తుతం అణుయుగంగా సైతం మారింది. కనుక యీ కాలంలో అణవిక శక్తి యుక్తుల్ని గురించి విననివారుంటారంటే అతిశయోక్తి అవుతుంది. కాని, అణువు పుట్టుపూర్వోత్తరాలు అందరికీ తెలియక పోవచ్చు.

'యాటమ్' అనేది గ్రీకులోంచి వచ్చిన శబ్దం. గ్రీకు భాషలో దానికి 'అవిభాజ్యం' అని అర్థం. చాలాకాలం వరకు సైంటిస్టులు పదార్థాలు అనేక అణువులసంయోగం వల్ల ఏర్పడ్డాయని, అణువులు అవిభాజ్యాలయిన అంశాలనీ, పొరబడ్డారు. కాని కాలక్రమేణా డాల్టన్ తరువాత వచ్చిన 'నీల్స్ బోర్', 'రూథర్‌ఫర్డు', 'ఐన్‌స్టీన్' మొదలగు విజ్ఞానవేత్తలు ఆ పొరపాటును సరిదిద్దుకుని అణువును గురించి ఎన్నో తెలియని విషయాలను తెలుసుకున్నారు.

ప్రకృతిలో లభించే ధాతువుల్లాగానే అణువులు గూడా 92 రకాలు. అణుస్వరూపం చిన్నసైజు సౌరకుటుంబంలాగా వుంటుందని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. సౌరకుటుంబంలో సూర్యుడి చుట్టూ విభిన్న గ్రహాలు భ్రమణం చేసేటట్లుగానే అణువులో గూడా కేంద్ర భాగం లేక న్యూక్లియసు చుట్టూ ఎలక్ట్రానులు తిరుగుతూ వుంటాయి.

అణువులో మూడు ప్రధానమయిన

కణాలుంటాయి. ఎలక్ట్రానులు, ప్రోటానులు మరియు న్యూట్రానులు. ప్రకృతిలో సూక్ష్మాతిసూక్ష్మమయిన ఉదజని అణువు (హైడ్రోజను యాటమ్)లో ఒకేఒక ప్రోటాను వుంటుంది. అదే ఆ అణువు యొక్క కేంద్రభాగం. దానిచుట్టూఎలక్ట్రాను సెకనుకు లక్షమైళ్ళ వేగంతో తిరుగుతూ వుంటుంది.


అణువులలోని శకలాలకు విద్యుచ్ఛక్తి వుంటుంది. ప్రోటానులు ధన విద్యుత్తు (పాజిటివ్ ఛార్జి) కలిగియున్న శకలాలు ఎలక్ట్రానులు ఋణ విద్యుత్తు (నెగెటివ్ ఛార్జి) కలిగియున్న శకలాలు. న్యూట్రానులు విద్యుచ్ఛక్తి దృష్ట్యా తటస్థమయిన శకలాలు. ప్రోటానులు, ఎలక్ట్రానులు పరస్పర వ్యతిరేక విద్యుత్తులు కలిగియుండడంతో ఆ రెండు విద్యుత్తులూ రద్దయి పోయి, అణువు తటస్థంగా తయారవుతుంది. మరో ముఖ్యవిషయం —ఎలక్ట్రానులు చెప్పలేనంత వేగంతో న్యూక్లియసు చుట్టూ ప్రదక్షిణం చేస్తూవుంటాయి. లేకుంటే అవి లేకుంటే అవి ఏనాడో న్యూక్లియస్‌లో పడిపోయేవే. ఇదీ అణువు యొక్క సంక్షిప్త స్వరూపం.

అణువుయొక్క గర్భంలో అపారమయిన శక్తి యిమిడివుంటుంది. దాన్ని ఛేదించడంవలన అణువు ప్రేలుతుంది. ప్రకృతిలో పుష్కలంగా లభ్యమయ్యే యురేనియం 'యు-238' అనే రకం, దీని అణుగర్భాన్ని ఛేదించడానికి మరింత వేగంగల న్యూట్రానులవల్ల దీనిలో అణుగర్భ విచ్ఛిత్తి అసంభవం కావచ్చు. కాని, 'యు-235' అనే యురేనియం 'ఐసోటోపు' ఒకమాదిరి న్యూట్రాను తాకిడికి గూడా విచ్ఛిన్నం కాగలదు. హీరోషిమాను ధ్వంసంచేసిన అణ్వస్త్రం దీనితో నిర్మితమైందే. కాని, యు-235 ధాతువు ప్రకృతిలో లభించేది బహుకొద్ది. కనుక శాస్త్రజ్ఞులు ప్లుటొనియం అనే కృత్రిమ రేడియో యాక్టివ్ ధాతువును తయారు చేశారు. దీని అణుగర్భాన్ని గూడా యు-235 లాగానే స్వల్పమయిన న్యూట్రానులతో గూడా ఛేదించవచ్చును. ఇటీవల భారతదేశం జరిపిన ఆణవిక ప్రయోగంలో ప్లుటోనియాన్నే వాడుకున్నారు.

నిజానికి అణువును తలుచుకోగానే మనం ఆటంబాంబునో, హైడ్రోజను బాంబునో గుర్తు చేసుకుని అణువణువునా అదిరిపో నక్కరలేదు విధ్వంసానికే కాదు, అణువు విశ్వకల్యాణానికి కూడా దోహదం చేయగలదు. అణువుని అప్రమత్తతో వాడుకోవాలేగాని, దానివల్ల ప్రయోజనాలు కోకొల్లలు. అది అందరికీ తెలిసిన విషయమే. ఒక కుటుంబానికి కొంత బొగ్గు అవసరమనుకుందాం అదే పరిమాణంలో యురేనియాన్ని వాడితే కొన్ని లక్షల కుటుంబాలకు సరిపోతుంది. ప్రస్తుతం మన దేశంలో బొగ్గు,విద్యుచ్ఛక్తి ప్రధానమయిన శక్తి జనకాలు. కాని, ఇలా వాటిని వాడుకొంటూపోతే త్వరలోనే శక్తిహీనుల మయ్యే ప్రమాదముంది. ఆ ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు మనకు ఆణవిక శక్తి యుక్తులు ఎంతయినా సహకరిస్తాయి.

—'ఆలపాటి'

సీరియల్



చీకటిపొద్దున వెలుగురేఖ

డి. కామేశ్వరి

“విడిపో ! విడిపోవడం చాలా సరదాగా వుందనుకుంటూ అలాగే విడిపోదాం, కోర్టుకెక్కు. విడిపోయే వరకు నేను నీ భర్తని. నా మాట చెల్లాల్సిందే యీ యింట్లో ”

“కళ్యాణీ, ” అమ్మ గాభరాగా అడ్డింది. “ఏమిటి ఇద్దరికీ మతులు పోయాయా? ఏమిటే విడిపోవడం అంత సుళువనుకుంటున్నావా! వివాహ బంధాలు అంత సుళువుగా విడిపోవడానికి యిదేం విదేశాలు కావే తల్లీ . . ఎందుకొచ్చిన మాటలు. మన పరువేమిటి, మర్యాద ఏమిటి.'

“ఇంకా మనకో పరువు మర్యాద వుందనుకుంటున్నారా ఏమిటి మీరు” హేళనగా ఎత్తిపొడిచారు ఆయన. “ఏ అమ్మాయి మన పరువు నడిరోడ్డుకి సగం ఇదివరకే ఎక్కించింది. మిగతాది యిప్పుడు పూర్తిగా ఎక్కుతుంది ”

“ఇంత మాత్రానికే పోయే పరువు ప్రతిష్ఠల మీద నాకేం కోరిక లేదు. ఎవరి కోసమో, ఎవరేమనుకుంటారోనని ఇంకా

భయపడి యీ మిగిలిన బ్రతుకు కూడా నాశనం చేసుకోను. అందరి కోసం ఈ జీవితంలో పోగొట్టుకున్నది, నష్టపోయింది చాలు. ఇక మీదయినా నా కోసం నేను బ్రతకడం నేర్చుకుంటాను'' దృఢ నిశ్చయంతో అన్నాను. అవును. అంతవరకు వచ్చాక ఇంకా ఆయనకి, లోకానికి భయపడి నా జీవితాన్ని నాశనం ఎందుకు చేసుకోవాలి యింకా! నా మొహంలో కనపడ్డ నిర్లక్ష్యానికి, నిబ్బరానికి, నిశ్చయానికి ఆయన కాస్త భయపడ్డారనుకుంటాను. అన్నింటిని బావ కోసం తెగించగలిగే నా నిబ్బరంనిశ్చయం చూసి నిజంగా అన్నంత పనిచేస్తానని భయపడివుంటారు. మేం విడిపోతే పోయే పరువు ప్రతిష్ఠల కంటె నన్ను పోగొట్టుకుంటే ఆర్థికంగా ముందు ఆయన పడాల్సిన యిబ్బందులు గుర్తువచ్చివుంటాయి. ఆయన మొహం కోపంతో జేవురించింది. ''విడిపోవడానికి, వుండడానికి అన్నింటికి నీ యిష్టమే అనుకుంటున్నావు గాబోలు. మహా సుళువుగా విడిపోదాం అంటున్నావు. చూస్తాను నీ వెలా నన్ను కాదని,ఏం చేస్తావో నేనూ చూస్తాను. నీ ఆట కట్టించడం ఎలాగో నాకు తెలుసు. నీ అంతు చూస్తాను. ఏ కోర్టులు అడ్డు వస్తాయో నేనూ చూస్తాను'' కోపంతో రెచ్చిపోతూ, అసూయాద్వేషాలతో మండిపోతూ, చదువు సంస్కారం వున్న మనిషి నన్న సంగతి మరిచిపోయి అలగా వాళ్ళ లాగ నన్ను బావని కలిపి తిట్టడం ఆరంభించారు. ఆ మాటలకి నేను తెల్లబోతూ చూడడం మినహా ఏం చెయ్యలేక పోయాను.

అంతవరకు నిలద్రొక్కుకున్న బావ ఇంక ఆగలేక పోయాడు.

ముఖ్యంగా నన్ను అలాంటి మాటలనడం సహించలేక పోయాడనుకుంటాను. ఆత్రుతతో మా మధ్యకి వచ్చాడు. ఆయన వంక తిరిగి ''ఆగండి. దయచేసి వూరుకోండి. కళ్యాణీ, యీ అనర్థానికి కంతటికీ కారణం నీవు. నేను రానంటూంటే తీసుకొచ్చావు.నాకు తెలుసు. ఇలాంటి గొడవలు నావల్ల జరగడం ఇష్టం లేకే రానన్నాను. ఫలితం చూశావా. రంగారావుగారూ, నన్ను క్షమించండి ఈ గొడవంతా నా వల్లే జరిగింది. నేను వేడుతున్నాను. కళ్యాణిని క్షమించండి'' అంటూ ఆయన చేతులు పట్టుకున్నాడు అర్థింపుగా.

కోపంతో వళ్ళు తెలియకుండా వున్న ఆయన బావ చేతులు పట్టుకోగానే ''యూ. స్కౌండ్రల్. డర్టీ రోగ్ యు ఆర్ ది రూట్ కాజ్ ఫర్ ఆల్ ది ట్రబుల్. గెటౌట్ ఐసే, గెటౌట్'' అంటూ విసురుగా ఒక్క తోపు తోశారు. అసలే నీరసంగా, వుండి ఇంకా పూర్తిగా కోలుకోని బావ, జరిగిన గొడవకి మానసికంగా చలించిన బావ, ఆడనాటుగా వున్న బావ-ఆయన బలంగా తోసిన ఆ త్రోపుకి దూరంగా వెళ్ళి పడ్డాడు. ఆ పడడంలో ఫ్రాక్చర్ అయిన ఆ చేతి మీద వ్రాలి పడడంతో కెవ్వుమని కేకేసాడు. అమ్మ నేను పరుగెత్తి బావని లేవదీశాం ఆరాటంగా. బావ తెలివి తప్పి పోయాడు. నేను ఆరాటంగా చేయి చూశాను. క్రొత్తగా ఫ్రాక్చర్ అయిన ఆ

: జరిగిన కథ :

డాక్టర్ కల్యాణి దగ్గర హౌస్ కీపర్ సుజాత. కల్యాణి దగ్గర అసిస్టెంటుగా చేరిన రామకృష్ణ, సుజాతలు ప్రేమించుకున్నారు. వారి పెళ్లి కళ్యాణే జరిపించింది. కళ్యాణి భర్త డాక్టర్ రంగారావు త్రాగుబోతు. భార్యను చాలా హీనంగా చూస్తుంటాడు. బావ ఆనంద్ వచ్చి తన దగ్గర వున్నంతకాలం ఉత్సాహంగా ఉండేది కల్యాణి. ఎంతో మంచిదనుకున్న కల్యాణి భర్తను మోసంచేస్తూ బావతో ప్రేమకలాపాలు సాగించడం వింతగా అన్పించింది సుజాతకు. సుజాత అనుమాన నివృత్తిచేస్తూ తనకథ చెప్పసాగింది కల్యాణి.

కల్యాణి మామయ్య కొడుకు ఆనంద్. బీదవాడు. కల్యాణి ఇంట్లోనే ఉండే వాడు. యౌవనంలో ప్రవేశించిన కల్యాణి,ఆనంద్ లు ప్రేమించుకొన్నారు. కల్యాణి తండ్రి వారి పెళ్ళికి వప్పుకోలేదు. కల్యాణి ఎదురు తిరిగింది. ఆనంద్ ఇంట్లోంచి వెళ్ళ గొట్టబడ్డాడు. కళ్యాణిని బలవంతాన పెళ్లికి వప్పించారు. కల్యాణిని చూడటానికి ఆనంద్ చాలా కాలానికి రావడంతో ఆనందం, బాధపట్టలేక అతన్ని కౌగలించు కొని ఊరటచెందింది కల్యాణి. అదిచూచిన ఆమెభర్త రంగారావు వీరిద్దరినీ అనుమా నించి, ఆనంద్ ను అవమానించి పంపాడు. యుద్ధంలో గాయపడ్డ ఆనంద్ ను కల్యాణి ఇంటికి తీసుకురావడంతో భార్యాభర్తల మధ్య కలత లెక్కువయ్యాయి.

చేయి మీదే మళ్లీ మోపయిన దెబ్బ తగల డంతో ఆ బాధకి తట్టుకోలేక స్పృహ తప్పింది అవి అర్థం అయింది. చేయి విరిగిందేమోనని అనుమానం వచ్చింది నాకు. పట్టరాని కోపంతో ఏహ్యంగా చూశాను ఆయన వంక. ఆయన ఎగిసి పడుతున్న గుండెలతో ఆవేశంగా వగరు స్తున్నారు. "మీరు మీరు మనుష్యులు కారు. ఛీ" అన్నాను తిరస్కారంగా.

"నోర్ముయ్. అట్టే పేలకు" అన్నారు నేను ఏదో అనబోయాను. అమ్మ తీవ్రంగా చూస్తూ "కళ్యాణీ, వూరుకుంటావా ఇంక. యీ జరిగింది చాలు. ముందు వాడి సంగతి చూడు" అంటూ గదమాయించి నా కర్తవ్యం గుర్తు చేసింది. ఆయన విసు రుగా మేడ మీదకి వెళ్ళి పోయారు. బావకి తెలివి తెప్పించే ప్రయత్నాలు చేయడంలో మునిగాను.

నేను భయపడినట్టే బావచెయ్యి మళ్ళీ విరిగింది. ఎక్సరే తీయించి, ప్లాస్టరు వేయించాను మర్నాడు. బావ చాలా బాధ పడ్డాడు. శారీరక బాధ ఓ ప్రక్క. నాకోసం బాధ ఓ ప్రక్క।బావ వెళ్ళిపోతానని మొండి పట్టుపట్టి కూర్చున్నాడు. అమ్మ, నేను చెప్పినా కూడా వినలేదు.

అసలే విరిగిపోయిన నా మనసు-బావ వెళ్ళిపోతానంటే ఓడిపోయినట్టు యీ జీవితంతో పోరాడే శక్తిలేక నిస్సహాయంగా ఓడిపోయినట్లు . యింక పోరాడే శక్తి లేక అలిసిపోయినట్టు నిస్సహాయంగా ఏడి చాను. బావని వుండమనలేక, వెడుతూంటే భరించలేక వెర్రిదానిలా ఏడిచాను. 'నీవూ

వెడితే.. యింక నాకెవరున్నారు బావా, నీ అసరాకూడా లేకపోతే నేనెలా బ్రతకను... యింక యీ యింట్లో నా బ్రతుకెలా వుంటుందో కూడా తెలిసి నన్నీ నరకంలో వదిలేసి వెళ్ళిపోతావా! . నీవుంటే, నా ప్రక్కన నీవుంటే . ఎవరితోనైనా ఆఖ రికి దేముడితోనన్నా పోరాడగలిగే ఆత్మ విశ్వాసం వుంటుంది. నీవు లేకపోతే. యింక నేను బ్రతకలేను బావా రెండో సారినిన్ను పోగొట్టుకోలేను బావా....నీతో నన్నూ తీసికెళ్ళు ...నాకీ సంఘం, యీ పరువు, ప్రతిష్ఠ ఏమీ అక్కరలేదు .ఎవరే మనుకున్నా లెక్కలేదు....నన్ను నరకం లోంచి తీసికెళ్ళు .. ' అంటూ వెక్కి వెక్కి ఏడ్చాను. బావ నా దుఃఖానికి చలించిపోయాడు. కాని ఏం చెయ్య గలడు? 'వూరుకో కళ్యాణీ....వూరుకో' అంటూ నా తల నిమిరాడు. బావకళ్ళ నిండా నీరు నిండుకుంది ...'నీవలా ఏడిస్తే నేనెలా వెళ్ళగలను కళ్యాణీ' అంటూంటే గొంతు రుద్ధమయింది. 'కళ్యాణీ నీవిలా దుఃఖపడతావనే, నీ బాధ తలచుకుని వచ్చాను కానీ.. .కానీ ఎలా వుండను యిక్కడ నన్నేం చెయ్యమన్నావు కళ్యాణీ నీ దుఃఖాన్ని, బాధని ఉప శమింపచేయడానికి నేనే చెయ్యగలను కళ్యాణీ''....అంటూ బావకూడా ఆడ దానిలా ఏడ్చాడు.

మమ్మల్నిద్దరినీ చూస్తూ అమ్మ ఏడ్చింది. ''కళ్యాణీ, ఆనంద్ మీ యిద్దరి బ్రతుకులు యిలా బండలు కావడానికి మేమే కారణం. దాని కిష్టంలేని పెళ్ళిచేసి దాని గొంతు కోశాం. మా ముచ్చటకి దాని జీవితాన్ని బలిపెట్టాం, అది సుఖపడాలని పెళ్ళి పేరుతో నరకంలో పడేశాం. ఆనంద్ నీవుండు నాయనా, నీ వెడితే మళ్ళీ అది పిచ్చిది అయిపోతుంది. కనీసం కళ్ళెదుట కనిపిస్తే శాంతిగా అయినా బ్రతకగలదు!'' పాతరోజులు గుర్తు తెచ్చుకుని నేనేమయి పోతానోనన్న భయంతో అమ్మ నా కోసం అల్లుడి భయంకూడా వదులుకుని బావని వుండమని అడిగింది.

''ఎలా వుండనత్తయ్యా. ఆయనలా కళ్యాణిని మాటలతో హింసిస్తూంటే నే వింటూ వూరుకోలేను. వూరుకోక ఏం చెయ్యలేని స్థితిలో ఎలా వుండమంటావు! నేను వుంటే ఆయనలాగే ప్రవర్తిస్తారు.'' దైన్యంగా అన్నాడు బావ.

''నాకోసం కాదు బావా, నన్నెన్ని అన్నా భరించగలను. చూసే దిక్కులేక, నా అనే వాళ్ళులేక వంటరిగా నీవీ స్థితిలో ఉన్నప్పుడు వెళ్ళిపోతే నే నిక్కడ ప్రశాంతంగా ఎలా వుంటాను బావా, ఆయన నన్నేమన్నా నేను లెక్కచెయ్యను ఇంతకంటె ఆయన నన్నేం చేస్తారు?''

''వుండరా నాయనా. ఈ స్థితిలో చూసే దిక్కులేకుండా వెళ్ళి ఏం చేస్తావు.'' అమ్మకూడా వుండమనే అంది

''కానీ అత్తయ్యా, ఆయన మళ్ళీ ఏం అంటారో.''

''అంటే అననీ, నీ వూరుకో మాట్లాడ కుండా,'' నిర్లక్ష్యంగా అన్నాను. ''అన వలసినవన్నీ అన్నాడు కదా, ఇంకేముంది అనడానికి ...కాస్త కోలుకున్నాక వెళ్ళి

పోదువుగానిలే. నేనూ చెప్తుతాను అతనితో. నా యింట్లో నిన్ను పెట్టుకోడానికి అతని అధికారం ఏమిటి.'' అమ్మ సిబ్బరంగా అంది. అమ్మ అలా మాట్లాడడం నాకు చాలా ఆశ్చర్యంగా, ఆనందంగా అనిపించింది. బహుశా అమ్మ నా బాధ, అల్లుడి ప్రవర్తన అన్నీ చూసి యీ పెళ్ళిచేసి నా జీవితాన్ని నాశనం చేసినందుకు పశ్చాత్తాప పడుతూ, నే చేసిన చిన్న తప్పుని క్షమించని ఆయన కోపాన్ని అసహ్యించుకుంటూ, నేను అంత క్షమించరాని తప్పు ఏం చెయ్యలేదన్న నమ్మకం కలిగివుంటుంది. అమ్మ, నేను నచ్చచెప్పి బావని వుంచేశాం.

ఆ రాత్రి నేను నిద్రపోవడానికి గదిలోకి వెడితే ఆయన ...నా వంక తీక్షణంగా చూశారు. కాసేపు వూరుకుని ''వాడింకా వెళ్ళలేదన్నమాట. వెళ్ళనీయలేదన్నమాట. సరే, నీకెలా బుద్ధిచెప్పాలో నాకు తెలుసు'' అన్నారు. నేనేం మాట్లాడలేదు. అటు చూడలేదు. తలగడలు సర్దుకుని అటు తిరిగి పడుకొన్నాను. ''ఏం, పాపం బావగారి సేవలుచేస్తూ అక్కడే పడుకోవాల్సింది. అర్ధరాత్రి అవసరం వుంటుందేమో. వెళ్ళు వెళ్ళు అక్కడ పడుకో.'' అన్నారు వ్యంగ్యంగా. ఆయన ధోరణికి ఎదురుతిరిగి జవాబుకూడా చెప్పాలనిపించనంత ఏహ్యత పుట్టింది. మాటకి మాట జవాబు చెపుతూంటే ఆయన మరింత రెచ్చిపోతారు. ఆయన నోటికి హద్దూ పద్దూ వుండదని నా కర్థంఅయి మౌనం వహించడమే మంచిదని నిర్ణయించుకున్నాను.

''ఇక్కడెందుకు పడుకోడం. మన మధ్య యింకా భార్యాభర్తల సంబంధం ఏమన్నా మిగిలిందా ఏమిటి, ఫో, యీ గదిలోంచి విడిపోయేవాళ్ళకి యీ గదులు కూడ ఎందుకు, ఐ హేట్ యూ లైన్ ఎనీ థింగ్ వెళ్ళిక్కడినించి, ..''కఠిగా అన్నారు.

అప్పటికీ నేను మాట్లాడలేదు. నా మౌనం ఆయన్ని మరింత రెచ్చగొట్టింది. ''నీకే చెబుతున్నాను. చేసేదంతా చేస్తూ మాట్లాడకుండా వూరుకుంటే పోతుందనుకున్నావా?''

ఆయనకి నన్ను రెచ్చగొట్టి, నేను జవాబిస్తూంటే, నేను చేసిన తప్పుని వేలెత్తి చూపిస్తూ ఆయన ఆధిక్యతని కాపాడుకోవడం కావాలి, కాని నే నిలా మౌనం వహించి, ఆయన్ని లెక్కచెయ్యకుండా విడిపోవడం కాదు. నిజంగా నా పట్ల అంత వైముఖ్యత వున్న మనిషి నా అంతట నేనే విడిపోవాలని కోరుకున్నప్పుడు సుఖవుగా నన్ను తప్పించుకోవచ్చు. నిజంగా నేను ఆయన్ని మోసం చేస్తున్నానని ఆయన నమ్మితే నాలాంటి భార్యని ఆయన విడిచిపెట్టాలనే కోరుకుంటారు తనభార్య నిజంగానే ప్రేమ వ్యవహారం నడుపుతూందని తెలుసుకుంటే ఏ భర్తా సహించడు. అలాంటి భార్యతో పొందు కావాలనీ కోరడు. ఎంత పరువు ప్రతిష్ట ఆలోచించినా, పిల్లల కోసమన్నా తెలిసి తెలిసీ భార్య ప్రేమ వ్యవహారం ఆమోదించలేడు, నే నిలా ఇన్నిసార్లు విడిపోదామన్నా బింకంగా విడిపో అంటున్నారు గాని విడిపోవడం అన్నది ఆయనకి

ఇష్టం లేదన్నది నా కర్థం అవుతుంది. నే నింక ఖచ్చితంగా చెప్తున్నా ఆయన గట్టిగా యిప్పటివరకు విడిపోదాం అని అనలేదు. నన్ను రెచ్చగొడ్తూ, సాధిస్తూ, మాటలతో హింసిస్తున్నారు. యింట్లో యీ గొడవంతా సహిస్తున్నారు. కాని విడి పోవాలన్న ఆలోచన ఆయనకి లేదు. కారణం ఏమయితేనేం కానీ నన్ను వదులు కోడం ఆయన కిష్టంలేదు! నే నిలా బెది రించి మాట్లాడుతూంటే ఆయన తగ్గినట్లు కనపడడం యిష్టంలేక, భర్తగా తన అధి క్యతని నిల్పుకోవడానికి మాత్రం యిలా సూటిపోటి మాటలతో నన్ను హింసిస్తున్నా రన్న సంగతి నా కర్థం అయింది. ఆయన ఏమన్నా నేను జవాబీయలేదు. మన సులు కలువనప్పుడు మాటలతో ఆ మన సులని మరింత నొప్పించుకుంటూ కాపురం చెయ్యడంకంటె విడిపోవడం మంచిదన్న నిర్ణయం మరింత ధృవపడింది నాలో. వున్నన్ని రోజులు అసహ్యంగా సంస్కా రం మరిచి, నలుగురు చెప్పుకునేటట్టు ప్రవర్తించడం నా కిష్టంలేదు.

ఆయన ధోరణేమో అర్థం కాలేదు. ఏం చేస్తానంటారు! ఎలా బుద్ధి చెప్తా నంటారు' విడాకులు యీయడానికి యిష్టపడకుండా అల్లరిపెడతారా? పిల్లలని నా కప్పచెప్పకుండా ఏడిపిస్తారా? . రకరకాల ఆలోచనలతో అనుమానాలతో ఎప్పటికో నిద్రపోయాను.

46

తరువాత మూడురోజులు అతి ప్రశాం తంగా గడిచాయి. తుపాను ముందు ప్రశాంతి అని ఊహించలేదు నేను.

ఆ మూడు రోజులలో ఆయన బావ ప్రసక్తి ఎత్తలేదు. బావ ఇంట్లో యింకా వుండడం చూసి మళ్ళీ ఏం అంటారోనని భయపడిన అమ్మ నేను. ఆయన ఆ విష యం చూసి చూడనట్లు వూరుకోవడంతో ఆశ్చర్యంతోపాటు తేలిగ్గా ఊపిరి తీసుకుని సంతోషించాం. చెప్పి లాభం లేదని వూరు కున్నారో, అమ్మ కూడా నా తరఫున మాట్లాడడం, ఆ ఇల్లు మా ఇల్లు అని చెప్పడం వల్ల వూరుకున్నారో నను కున్నాం. బావ కూడా ఆశ్చర్యపోయాడు. ఏం గొడవ లేవనందుకు ఆనందించాడు. ముగ్గురం నిశ్చింతగా నిట్టూర్చాం.

ఆ సంతోషం మరి మూడు రోజుల లోనే పోయింది. ఆ మూడు రోజులూ ఆయన నర్సింగ్ హోముకి కూడా రాలేదు. మొదటి రోజు మామూలుగా తయారై బైటికి వెళ్ళిపోయారు. రోజూ నర్సింగ్ హోముకి నాకంటె ముందు వెడతారు గనక అదే అనుకున్నాను. కాని నేను ఆస్పత్రికి వెళ్ళేసరికి ఆయన రాలేదని తెలిసి ఆశ్చర్యపోయాను. ఆ రోజంతా రాకపోతే కాస్త కంగారు పడిన మాట నిజమే! ఎక్కడికి, ఏం పని మీద వెళ్లారో నని సరి పెట్టుకున్నాను. నిన్న ఆయన నన్ను బెదిరించడానికి ఏవేవో అన్నవి గుర్తు వచ్చి ఏం చేస్తున్నారు చెప్మా అని అను కున్నాను. అమ్మ కూడా కాస్త గాభరా పడింది. రోజంతా కబురు లేకుండా వెళ్ళి పోయారని. రాత్రి కూడా ఇంటికి రాలేదు అర్ధరాత్రి ఎప్పుడో వచ్చారు క్రింద పడు కునే అమ్మ తలుపు వేసి 'ఎక్కడికి వెళ్ళావు నాయనా' అందట.

"ఏం నేనెక్కడికి వెళ్లానో, ఏం చేశానో మీ అందరికి సంజాయిషీలు యివ్వాలా ఏమిటి. మొగాణ్ణి నా ఇష్టం" అన్నారట. ఆయన నడక, ఆయన కళ్ళు, ఆయన మాట అవి చూసి ఆశ్చర్య పడిందట అమ్మ. మంచి నిద్రలో వున్న నాకు ఆయనరాక తెలియలేదు. ఉదయం లేచాక అమ్మ యీ సంగతి చెప్పి 'అతను తాగి వచ్చినట్టున్నాడే. గుప్పున వాసన కొట్టింది. మాట మామూలుగా లేదు' అంది. 'హుం. నన్ను సాధించే ప్రయత్నానికి ఇది మొదటి మెట్టు గాబోలు అనుకున్నాను మనసులో. అమ్మదగ్గిర ఏం అనకుండా వూరుకున్నాను. ఆయనతోటి ఏమనలేదు.

రెండో రోజు, మూడో రోజు యిదే వరస-ఆస్పత్రికి కూడా రాకుండా రోజంతా ఎక్కడెక్కడో తిరుగుతున్నారని, రాత్రిళ్ళు తాగి వస్తున్నారని అర్థం అయింది నాకు. అలవాటు లేని తాగుడు ఆరంభించి, ఆస్పత్రికి రాకుండా నన్ను శిక్షించాలనీ, ఇలా చేస్తున్నట్టు పూర్తిగా అర్థమయింది. అమ్మ, బావ ఆయన వరస చూసి భయపడ్డారు. ఏం చెయ్యడమో పాలుపోలేదు.

ఆ పరిస్థితిలో నేనేదన్నా అంటే, అడిగితే ఆ అవకాశంకోసం చూస్తున్న ఆయన నామీద విరుచుకుపడతారని, నేరం నా మీదే మోపుతారని, తన స్థితికి నేనే కారకురాలినని నిందిస్తారని తెలిసి ఆయనని ఏమడగాలో అర్థంగాలేదు. అలా అని ఆస్పత్రికి కూడా రాకుండా, ఇల్లు పట్టకుండా తిరుగుతూంటే ఎలా వూరుకోడం? ఆ మూడు రోజులలో ఆయన లేక అంతమంది పేషెంట్సుని చూసుకోడానికి ఉక్కిరి బిక్కిరి అయ్యాను. మరో రెండు రోజులు చూసి అసలు ఆయన ఉద్దేశం ఏమిటో అడగాలని నిర్ణయించుకున్నాను. చట్టబద్ధంగా విడిపోయే వరకు, ఒకే ఇంట్లో వుంటున్నంతవరకు ఆయన సంగతి పట్టించుకోకుండా ఎలా వుండగలను? నా భర్తగా వున్నంతకాలం, ఆయనకి నాకు మధ్య ఎన్ని కలతలు, మనస్పర్థలు వున్నా ఇంటికి వేళపట్టన రాని మనిషి గురించి ఆందోళన పడకుండా ఎలా వుండగలం? అమ్మ, బావ ఆయనని అడుగమన్నా కూడా మరో రెండురోజులు చూసి మాట్లాడుదాం అని వూరుకున్నాను.

మరో రెండు రోజులు ఆగనక్కర లేకుండానే మర్నాడే జరగాల్సిన భాగోతం జరిగింది.

47

ఆ రోజు రాత్రి తొమ్మిదిన్నర అయింది. అందరం భోజనాలు చేసి డ్రాయింగు రూములో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాము. పిల్లలు పడుకున్నారు. రేడియో వింటూ బావ నేను అమ్మ ఏవో మాట్లాడుతున్నాం. మూడు రోజుల బట్టి ఆయన పగలంతా ఇంటి పట్టున వుండడం లేదు. రాత్రి ఎప్పుడో తప్ప తాగి వచ్చి పడుకుంటున్నారు. ఆరోజురాత్రి,ఆయనబాగా తాగి తూలుకుంటూ లోపలికి వచ్చారు. ఆయన వెంట ఎవరో ఒక స్త్రీ కూడా లోపలికి వచ్చింది. మేం ఆశ్చర్యపోయి చూస్తూండగానే ఆయన మమ్మల్ని చూసి చూడనట్టు ఆ యువతి బుజం మీద చెయ్యి వేసి

'కమాన్ డార్లింగ్' అంటూ మేడ మీదకి దారి తీశారు. మేం తెల్లబోతూ ఒకరి మొహాలు ఒకరం చూసుకున్నాం. ఆ యువతి ఎవరో ఏమిటో కూడా మాకు తెలియదు. వేషం చూస్తే చాలా ఫ్లాషీగా, చవకరకం షిఫాన్ చీర, స్లీవ్‌లెస్ బ్లౌజు, లిప్‌స్టిక్, చేతిలో హేండ్‌బ్యాగు, మొహాన దట్టంగా కొట్టిన పౌడరు, దిద్దుకున్న కనుబొమ్మలు, హైహీల్సు చూడగానే ఎవరికీ గౌరవం యీయ బుద్ధి పుట్టనట్టు వుంది ఆ అలంకరణ। ఆ మొహంలో, నడకలో అదోరకం వయ్యారం, చవకరకం విలాసత్వం చూడగానే కనిపిస్తూంది. ఆమెని చూసింది పట్టుమని ఒక్క నిమిషమే ఐనా చూడగానే ఆమె ఏదో బజారు సరుకు అని అర్థం అయిపోయింది. ఆ బజారు సరుకులో కాస్త ఖరీదయిన ఎన్నిక.

ఒక్క నిమిషం ఎవరికీ బుర్ర పని చెయ్యలేదు. ఆ యువతి ఆయన వెంట హేండ్‌బ్యాగు వూపుకుంటూ విలాసంగా వెడుతూంటే ముగ్గురం బొమ్మల్లా నిలబడి చూశాం. ఆయన ఆమె బుజం మీద చెయ్యి వేసి మరీ నడిపించుకు వెళ్ళారు. వాళ్ళు కనుమరుగయ్యాక గాని మాకు స్మృతి రాలేదు.

"ఏమిటే యీ ఘోరం?" అందరి కంటె అమ్మ తేరుకుని అంది. బావ నా మొహంలో చూశాడు. 'నిన్ను శిక్షించడానికి ఆయనకింత కంటె మంచి దారి దొరకలేదులా వుంది' అన్నాడు వ్యథగా. నేను బావ మొహంలోకి చూడలేక తల దించు కున్నాను. "అయ్యొయ్యో ఏమిటి ఇలా ఆరంభించాడు. అదెవర్తో తిన్నగా మేడ మీదకి కూడా తీసికెళ్ళాడు. ఇంతకి తెగించాడేమిటే" అమ్మ ఆందోళనగా గోల పెట్టింది. నేనేమనాలో తెలియక, మాట్లాడ లేక, అలా క్రింద పెదవి కొరుక్కుంటూ నిలబడ్డాను. నిన్న ఆయన బెదిరించిన బెదిరింపుకు యిదా అర్థం అనుకున్నాను. ఆయన నా మీద కక్ష సాధించడానికి ఇంత నీచానికి దిగజారుతారని నేను ఊహించలేదు. విడాకులు యీయకుండా నన్నేడిపిస్తారని అనుకున్నాను గానీ, ఆయన చదువు, సంస్కారం అన్నీ ఇంత హీనంగా దిగజారిపోయాయని ఊహించలేదు. నన్ను సాధించడానికి ఆయన కింతకంటె మంచి మార్గం కనపడలేదు గాబోలు। ఆయన నన్ను అన్న మాటలకి పడిన బాధ కంటె ఆయన నామీద కసితీర్చుకోవటానికి యింత దిగజారినందుకు ఎక్కువ బాధపడ్డాను. నాకు ఆయన ద్రోహం చేస్తున్నారన్న బాధ కాదు. నా మీద కోపంతో ఆయన ఎలాంటి తప్పటడుగు వేసారో, ఆయన విచక్షణా జ్ఞానం కోల్పోయి ఎలాంటి బురద గుంటలో కళ్ళు మూసుకు కూరుకు పోతున్నారో నన్నది ఎక్కువ బాధ అన్పించింది। సవ్యంగా ఇద్దరం విడాకులు తీసుకున్నాక, ఆయన మరో వివాహం చేసుకుంటే ఎంత మర్యాదగా, హుందాగా వుంటుంది. ఆయన మరొక వివాహం చేసుకుంటే అందరి కంటె ముందు నేను సంతోషించి వుండేదాన్ని. కనీసం ఆ వివాహంలోనైనా ఆయనని మనసారా ప్రేమించ గలిగే భార్య దొరికి ఆయన సుఖ పడడం

కంటె నాకు ఆనందం ఏముంటుంది!— కానీ ఇలా ఎవరినో డబ్బిచ్చి తెచ్చుకున్న మనిషి నింటికి తీసుకొచ్చి తిన్నగా మేడ ఎక్కించి, బెడ్‌రూము లోకి తీసికెళ్ళడం చూస్తూ చూస్తూ ఎలా వూరుకోగలను? ఒక్క సారిగా నా మనసు జుగుప్సతో నిండి పోయింది.

"ఏమిటే అలా చూస్తూ వూరు కుంటావు. అదెవర్తో ముందు దాన్ని బయటికి పంపించు. అడ్డమయిన వాళ్ళని ఇంటికి తీసుకొస్తాడా. ఇది సంసారుల ఇల్లా సాని కొంపా" అమ్మ ఆవేశంగా అంది.

"హు చూస్తూ వూరుకోక ఏం చెయ్యమంటావమ్మా, ఏదన్నా నేను అంటే నా నోరు మూయించడానికే ఇలా చేస్తున్నారు" శుష్క హాసం చేస్తూ అన్నాను. "అవును, కళ్యాణి మీద కోపం కొద్ది ఆయన ఇలా ప్రవర్తిస్తున్నారు ఏదన్నా మనం అంటే నీవు చేస్తున్న దేమిటి అని కళ్యాణి నోరు మూస్తాడు. ప్చ్, కళ్యాణీ, చూశావా, ఆఖరికి యీ గొడవ ఎంత అనర్థానికి దారి తీసిందో ఇప్పుడేం చేస్తావు?" బావ విషాదంగా అన్నాడు కుర్చీలో కూలబడి.

నా మనసు ఆ సంఘటనతో పూర్తిగా విరిగి పోయింది. ఇన్నాళ్లు కాస్తో కూస్తో వివాహ బంధాన్ని గౌరవించాను. ఇంక ఇప్పుడా అవసరం ఏం మిగల లేదని పించింది. ఇంకా ఆయనకి కట్టుకున్న భర్తగా ఇవ్వాల్సిన గౌరవం ఏం కనపడ లేదు ఇంక మా ఇద్దరి మధ్య పూర్తిగా సంబంధం తెగిపోయినట్టే లెక్క అని నిర్ణయం చేసుకున్నాను. ఇంత నీచానికి దిగజారిన ఆయనతో నేను మరి కాపురం చెయ్యలేను. విడాకులు పొందక పోయినా ఈ రోజుతో మా సంబంధం తెగింది. ఇంక ఆయన ప్రవర్తన ఎలా వున్నా నా కనవసరం అనిపించింది. కానీ, మా అందరి ముందు ఇంట్లో యీ వ్యవహారం సహించలేను. ఆయన బయటికి వెళ్ళి ఎలా ప్రవర్తించినా అది ఆయన ఇష్టం! అదే చెప్పాలనుకున్నాను. నా ఆలోచనలు, నా ఆవేశాన్ని నా మొహం మీదే చదివాడు బావ.

"కళ్యాణీ, తొందర పడకు, ఆలోచించు" అన్నాడు శాంతంగా.

"హు! ఇంక ఆలోచించడానికి ఏమన్నా మిగిలిందా బావా!"

"లేదనుకో. అయినా తొందరపడకు. శాంతంగా సవ్యంగా యీ వ్యవహారం పరిష్కరించు కోవడం మంచిది. పిల్లలు విషయం మరిచిపోకు" హెచ్చరిస్తూ అన్నాడు బావ ముందు చూపుతో.

"ఆలోచించటం ఏమిటిరా, బజారు దాన్ని తీసుకొచ్చి మేడ ఎక్కిస్తే ఇంకా శాంతం ఏమిటిరా! నాలుగూ దులపక. ఛీ . ఛీ. నలుగురూ ఏమన్నా అనుకుంటారో నని కూడా లేదు గాటోలు. అవ్వ రేప్పొద్దున యీ సంగతి నలుగురికీ తెలిస్తే మొహం ఎలా ఎత్తుకుంటాం" అమ్మ కోపంగా అంది

"అత్తయ్యా, సరిగా యీ మాటలే నీ కూతురు విషయంలో అంటాడు అతను. దానికి నీవేం జవాబు చెప్ప గలవు అప్పుడు?" బావ అదోలా నవ్వి అడిగాడు.

అమ్మ తెల్లబోయి చూసింది "ఏమిటీ, కళ్యాణి ...కళ్యాణి మీద ఇలాంటి నింద ఎలా వేస్తాడురా, ఒరేయ్ అదెలాంటిదో నాకు తెలుసురా, మీ ఇద్దరూ ఎప్పుడూ హద్దు మీరి ప్రవర్తించ లేదన్న విషయం నాకు తెలుసురా. అదిలా నీతిమాలి ప్రవర్తించ లేదురా" అమ్మ సగర్వంగా అంది. అమ్మకి నా పట్ల వున్న సదభిప్రాయానికి గర్వించాను మనసులోనే. నిజానికి బావ నేను ఒకరి పట్ల ఒకరికి ఎంత ప్రేమాభిమానాలు వున్నా-ఎన్ని అవకాశాలు వున్నా-అప్పటి వరకు హద్దుమీరి నీతి తప్పి ప్రవర్తించ లేదన్నది నిజం।

"అవునత్తయ్యా. అది నీకు తెలుసు. మాకు తెలుసు. కాని ఆయనికి తెలియదుగా. తెల్సినా అది వప్పుకోరు గదా."

"బావా, ఏం చేద్దాం అంటావు చెప్పు. నీవెలా చెపితే అలా చేస్తాను. ఆలోచించి చెప్పు" అన్నాను. బావ స్థిరంగా ఆలోచించ గలడని, ముందు చూపుతో చెప్తాడని నాకు నమ్మకం వుంది. బావ కాసేపు మాట్లాడ లేదు.

"ఏం చెప్పను కళ్యాణీ, ఆమెని వెంటనే ఇంట్లోంచి పంపించడం ఏం కష్టం కాదు. కానీ, ఆ మనిషి ముందు నీవు అవమాన పడాలి. ఇప్పుడు వూరుకోవడమే మంచిదని నా కనిపిస్తూంది కళ్యాణీ. ఆ మనిషిని వెళ్ళనీ ముందు. తర్వాత ఆయన నీవు మాట్లాడుకోడం మంచిది" అన్నాడు బావ. నాకూ అదే మంచిదనిపించింది. ఆ మనిషి ముందు వెళ్ళి నుంచుని మాట్లాడడం అంటేనే నాకు అదోలా అన్పించింది. నేను ఏదన్నా అంటే దాని కోసమే చూస్తూ నన్ను అనరాని మాటలంటారు. ఇదంతా ఎలా సహించ గలను।

"సరే, రేపు మాట్లాడుతాను. ఇంక ఏదో ఒకటి ఖచ్చితంగా తేల్చుకునే సమయం వచ్చింది. ఇంక మా యిద్దరికి ఈ రోజునించీ ఏ సంబంధం లేదు. ఆయన మీద నాకేదన్నా గౌరవం మిగిలితే అది నా పిల్లల తండ్రి అని మాత్రమే గౌరవించాలి. ఇంక యీ యింట్లోనే మే మిద్దరం వుండడం అన్నది అసంభవం. కోర్టుద్వారా విడిపోయేవరకు కూడా నే నుండలేను" చాలా ఆవేశంగా అన్నాను.

అమ్మ కళ్ళు వత్తుకుంది. "ఏమిటో నీ జాతకం ముందునించీ ఒక్కలాగే వుంది. ఇష్టంలేని పెళ్ళి అయింది. పోనీ ఏదో అందరి ఆడవాళ్ళలాగ ఆ కాపురంలో ఇమిడిపోయి సంసారం చేసుకుంటావంటే అదీ లేకుండా యీ ఖర్మేమిటి, యీ కోర్టులేమిటి, యీ విడాకులేమిటి" అమ్మ రుద్ధమయిన కంఠంతో అంది. బావ నేరస్థుడిలా తల దించుకున్నాడు.

"అత్తయ్యా, అన్నింటికి నేనే మూల కారణం గాదూ. కళ్యాణి బ్రతుకు యిలా అవడానికి నేనే కారణం. వెళ్ళిపోయిన వాడిని మళ్లీ వచ్చి కళ్యాణికి ఎందుకు కన పడాలి. ఇదంతా నా వల్లే జరిగింది. నన్ను క్షమించత్తయ్యా. కళ్యాణీ, యిప్పటికన్నా నన్ను వెళ్లనీయవా" బాధగా అన్నాడు.

"హుఁ బావా, నీవు కారణం అనుకుని నీవు బాధపడడం అనవసరం. ఈ పెళ్లి, యీ కాపురం ఏదీ నా ప్రమేయం. నా

యిష్టం లేకుండానే జరిగాయి. నీవు వచ్చాక మనసులేని కాపురం చేస్తూ, ఆయన్ని ప్రేమించకుండానే ఆయనతో కాపురం చేయడంలో ఎంత ఆత్మవంచన వుందో అర్థం అయింది. మనసు మరొకరి మీద వుండి, శరీరం ఆయనకిస్తూ నాకు నేను ఎంత ద్రోహం చేసుకుంటున్నానో, ఆయన కెంత ద్రోహం చేస్తున్నానో అర్థం అయి అలాంటి కాపురంవించి స్వేచ్ఛ పొందా లన్న ఆలోచనకి ధైర్యాన్నిచ్చావు అంతే, అంతకన్న నీవు చేసిన నేరం ఏం లేదు. ఇంత ఎలాగో జరిగాక, యింకా నేను ఆయనకి భయపడి నిన్ను దూరం చేసు కోవడం అనవసరం. ఇప్పటివరకు మా మధ్య ఏం వున్నా, లేకపోయినా వివాహ బంధం వుండేది. ఇంక యిప్పుడు అదీ లేదు. కనక యిప్పుడు నిన్ను రంగారావు భార్యగా కాక కళ్యాణిగా యీ యింట్లో వుంచుకునే అధికారం నాకు పూర్తిగా వుంది. ఇది నా ఇల్లు. నా ఇష్టాన్ని ఎవరూ వ్యతిరేకించలేరు. వ్యతిరేకిస్తే వూరుకోను" చాలా దృఢనిశ్చయంతో, చాలా ఆవే శంతో అన్నాను.

అమ్మ కాసేపు వూరుకుని "అయితే, దాన్నెవర్తినో మేడమీదకి తీసికెడితే ఇలా యీ రాత్రంతా వూరుకోవడమేనా చూస్తూ. ఆ ఏడుపేదో ఎక్కడో ఏడవక యింటికే తీసుకొచ్చాడేమిటి, ఖర్మ."

"ఎక్కడో ఐతే నే ఎలా చూస్తాను. ఇదంతా ఆయన ఎవరికోసం చేస్తున్నారు నేను చూడాలనేగా. కానీ అమ్మా....బావ అన్నట్టు, ఆ మనిషి ముందు ఏదన్నా అంటే అవమానపడాల్సింది నేనేగా.... రేపు చూద్దాం." అన్నాను. ఆ రాత్రి క్రిందనే అమ్మ గదిలో పడుకున్నాను. మర్నాడు ఆయనతో ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో కోర్టుకెక్క నక్కర లేకుండానే ఆయన విడిపోవడానికి వప్పు కుంటాదా, వప్పుకోకపోతే కోర్టుకెక్కాలా. ఎక్కేంతవరకు ఆయన నేను కలిపి వుండాలా. ఆలోచనలతో సతమతమయి ఎప్పటికో నిద్రపోయాను.

కాని మర్నాడు మేము అనుకున్నది అనుకున్నట్టు జరగలేదు.

48

మర్నాడు ఆమె వెళ్ళకుండా యింట్లోనే వుంది మేం అందరం అనుకున్నట్టు ఆమె వెళ్ళిపోకుండా యింకా ఇంట్లోనే వుండడంతో ఏంచెయ్యాలో అర్థంగాలేదు. ఉదయం కాఫీలు, టిఫిన్లు, వంటవాడిని పిలిచి పైకి తెప్పించుకున్నారు ఆయన. మేడమీదనించి యిద్దరి మాటలు గట్టిగానే వినిపిస్తున్నాయి క్రిందకి. కాఫీలవి తీసి కెళ్ళిన వంటవాడి మొహంలో ఆశ్చర్యం, ప్రశ్నార్థకాలు చూసీ చూడనట్టు తప్పించు కోవాల్సి వచ్చింది. ఇంట్లో పనివాళ్ల ముందు తల వంచుకోవాల్సిన పరిస్థితికి కోపం వచ్చింది. బావ నేను, అమ్మ ముగ్గురం ఏం చెయ్యాలో తోచనట్టు వూరు కున్నాం. యాంత్రికంగా మా దినచర్యలు చేసుకున్నాం ఆస్పత్రికి వెళ్లడానికి తయా రవాలంటే నా బట్టలన్నీ మేడమీద వున్నాయి. ఆ గదిలోకి వెళ్ళాలంటే నా మనసంగీకరించలేదు. వాళ్ళిద్దరి ఎదుట పడాలంటేనే అసహ్యం మనిపించింది.

'అడగవేం' అంటుంది అమ్మ. ఆయనతో ఆ మనిషి వుండగా నాకు మాట్లాడా లని పించడం లేదు. అదే అమ్మతో చెప్పాను. ఆ పూటకి అమ్మ చీర కట్టుకుని మామూ లుగా ఆస్పత్రికి వెళ్ళిపోయాను. ఆస్ప త్రిలో పనిమీద మనసు నిలవక, వుండ లేక, రోజూకంటె బాగా ముందే యిల్లు చేరాను.

మేడమీదనించి నవ్వులు, మాటలు, గ్లాసుల చప్పుళ్ళు అన్నీ వింటూనే అమ్మ, బావ క్రింద హాలులో కూర్చున్నారు. నే రాగానే అమ్మ చాలా ఆవేశంగా 'ఆ మని షికి నీ చీరకూడా కట్టబెట్టాడే, యింకా చూస్తూ వూరుకుంటావా, నీ వడుగుతావా, నన్నెళ్ళి ముందు దాన్ని యింట్లోంచి గెంట మన్నావా' అంటూ కోపంగా మాట్లాడింది. నా యింట్లో, నా చీర కట్టుకోడానికి ఇచ్చిన ఆయన ధైర్యానికి విస్తుబోయాను. 'పదవే, రా .. యింక వూరుకుంటే లాభం లేదు' అంది అమ్మ. నేను బావ వంక చూశాను. "ఇందాకటినించి అత్తయ్య ఆవేశపడు తూంటే నీవు వచ్చేవరకు ఆగమన్నాను" అన్నాడు, "ఏం చెయ్యమన్నావు బావా, అడగనా వెళ్ళి" అడిగాను. "ముందు ఆ మనిషిని పంపించే విధం చూడు తర్వాత యిద్దరూ మాట్లాడచ్చు" అన్నాడు బావ. నా కెందుకో కాళ్లు వణికాయి. ఆయనతో ముఖాముఖి తల పడడం అనుకున్నంత సుళువు కాదనిపించి భయపడ్డాను. కానీ, తప్పదు గదా!

నేను మేడ ఎక్కబోతూంటే, వాళ్ళిద్దరూ క్రిందకి రావడానికి దిగి వస్తు న్నారు. నా చీర కట్టుకుని నా ఎదటికే వస్తున్న ఆమెని, నన్ను చూసి, కావాలని మరీ ఆమె భుజంమీద చెయ్యివేసి దగ్గిరకి లాక్కుంటూ,. తూలుతూ, నవ్వుతూ వస్తున్న ఆయన్ని చూస్తూ బొమ్మలా నిల బడ్డాను. నన్ను చూసి నిర్లక్ష్యంగా తల ఎగరేసి ఆయన నా ప్రక్కనించే వెళ్ళి డైనింగ్ టేబిల్‌దగ్గిర కూర్చున్నారు ఆమెతో సహా! "నాయర్! భోజనం వడ్డించు" అని కేక పెట్టారు. ఆ యువతి నన్ను చూస్తూ అదో రకంగా నవ్వింది. ఆయన బాగా త్రాగివున్నారని ఆయన వాలకం చెపుతూంది. ఇంక ఆగలేక పోయాను.

"ఆగండి" గర్జించాను. 'ఎవరీవిడ? ఎవరినో తీసుకొచ్చి నా చీర కట్టబెట్టి, నా మంచంమీద పడుకోబెట్టి, నా యింట్లో భోజనం పెట్టించడానికి మీ కెవరిచ్చారు అధికారం. మర్యాదగా ముందామెని బయ టికి పంపించండి' కోపంతో వణికిపోతూ గుమ్మంవైపు చూపించాను. ఆయన నా వంక హేళనగా నిర్లక్ష్యంగా ఓ నవ్వు విసిరారు. "నాయర్, అన్నం తీసుకురా" మళ్లీ కేక పెట్టారు. నే నక్కడ లేనట్టే, నా మాట విననట్టే, ఆ నిర్లక్ష్యానికి వళ్లు మండింది.' "వీల్లేదు, ముందు ఆమెని బయటికి పంపించండి. అడ్డమైనవాళ్ళని తీసుకొచ్చి భోజనం పెట్టించడానికి ఇదేం ధర్మసత్రం కాదు."

'రావ్!' ఆ మనిషి కోపంగా, ఉక్రో షంగా నా వంక చూస్తూ ఆయన చెయ్యి పట్టుకుంది కంప్లైంట్ చేస్తున్నట్టు.

"నీ వూరుకో డియర్" అంటూ ఆమె

చేయి నిమిరి ఆయన నా వంక తిరిగి 'అడ్డమైన వాళ్ళని తీసుకొచ్చి యింట్లో రోజుల తరబడి వుంచుకోడానికి నీకేం అధికారం వుందో, ఆ అధికారంతోనే నా యిష్టం వచ్చినవాళ్ళని తెచ్చుకునే హక్కు నాకుంది' క్రూరంగా చూస్తూ, కసిగా, హేళనగా అన్నారు.

"ఏమిటి... బావకీ, యీ బజారు మని షికీ పోలికా" కోపంతో అంతకంటె మాట్లాడలేకపోయాను.

నీకు నీ బావ ఎలా ప్రియుడో, నా కీమె అలా ప్రేయసి. నీ కెవ రిష్టమో వాళ్ళతో వుండు నా కెవరు కావాలో చూసు కోడం అది నా యిష్టం. మై డియర్ వైఫ్ నీ దారికి నేను అడ్డం రాను. నా దారికి నీ వడ్డం రాకు. ఓకే! నీతి నియమాలు ఆడ వాళ్ళకే అక్కర లేనపుడు, మగాడ్ని నా కెందుకు చెప్పు" వ్యంగ్యంగా నవ్వారు.

"మీ వ్యంగ్యాలు, విసుర్లు ఆపండి. మీరు నీతి నియమాలు అక్కర లేదను కుంటే అది మి యిష్టం. మీరు బయట ఏం చేసినా నా కనవసరం. నా యింట్లో మాత్రం మీ రెవరినో తీసుకొచ్చి పెట్టి ఆటలాడడానికి మాత్రం వీలులేదు. ముం దామెను బయటికి పంపించండి. తరువాత మనం ఏం చెయ్యాల్సిందీ ఆలోచిద్దాం.' కఠినంగా అన్నాను.

"ముందు నీ ప్రియుడిని బయటికి పంపు. అప్పుడు నా ప్రియురాలు వెడు తుంది" వెకసక్కెంగా అన్నారు.

"రంగారావుగారూ, మీరు చాలా అన్యా యంగా, అక్రమంగా మాట్లాడుతున్నారు. కళ్యాణికి నాకు మధ్య మీ రనేదేం లేదని మీకూ తెలుసు." బావ ఆ మాటలని భరించలేక తీక్షణంగా అన్నాడు ఆవేశ పడ్తూ.

"షటప్, నిన్నెవడూ అడగలేదు. అనవసరంగా అట్టే మాట్లాడకు" కోపంగా అన్నారు.

"ఇదిగో రంగారావూ, నిన్నటినించి చూస్తున్నాను. ఎంత అల్లుడవని సరిపెట్టు కుందామన్నా నీవు చేసిన పని ఏం బాగు లేదు. చేసింది చాలక పైగా దాన్ని, వాడ్ని నోటికొచ్చినట్లు అంటున్నావు. అడ్డమైన వాళ్ళని ఇంటికి తీసుకొచ్చి ఏమిటయ్యా ఈ భాగోతం. ఇదేం సంసారుల యిల్లా" అమ్మ చాలా కోపంగా అంది.

"అదే నేనూ అంటున్నాను. మీ కూతురు చేసే పనిని మీలాంటి పెద్దలు యింట్లో వుండి సమర్థిస్తూండగా యిది సంసారుల యిల్లెలా అవుతుంది. ఇదివరకే ఈ యిల్లు సానికొంప అయింది. క్రొత్తగా యిప్పుడే మీకు తెలిసినట్లు మాట్లాడకండి' చాలా వ్యంగ్యంగా చాలా తెలివిగా మాట్లాడుతున్నా ననుకున్న గర్వం ఆయన మొహంలో తొంగి చూపింది. అంత అస హ్యంగా ఆయన మాట్లాడుతూంటే ఇంక మేం అనేందుకు ఏం లేనట్టు మాట్లాడలేక పోయాం కొన్ని క్షణాలు.

మా మాటలన్నీ వింటూ అదోరకంగా నవ్వుతూ, విలాసంగా ఆయన చేతివేళ్లతో ఆడుకుంటున్న ఆమెని చూస్తుంటే నే నన్నా సహించగలిగాను కాని, అమ్మ సహించలేక పోయింది. గబగబ అక్కడికి వెళ్లి "ఇదిగో నీ పేరేమిటో గానీ. ముందు

లే, ఆ కుర్చీలోంచి లే...బయటికి నడు... ఊఁ. లేస్తావా లేదా'' భద్రకాళిలా అమ్మ హుంకరించింది. ఆమె కాస్త బెదురుతూ ఆయన వంక చూసి లేవబోయింది. అది గమనించి ఆయన ఎడంచేత్తో ఆమెని లాగి మళ్లీ కూర్చోపెట్టారు. ''మై డియర్ అత్తగారూ యీ మాత్రం బుద్ధి మీరు కూతురికి చెప్పివుంటే యీ నాడు యీ గొడవలేం జరగకపోయేవి. ఇప్పుడెందుకు నోరు పారేసుకుంటారు.''

''ఇదిగో నా కూతురేం బుద్ధి తక్కువ పనులు యిప్పటివరకు చెయ్యలేదు బుద్ధి చెప్పడానికి.'' అమ్మ సమర్థించుకుంటూ మాట్లాడబోయింది. ఆయన విసుగ్గా, విసురుగా చేయి ఆడించి 'నాయర్, అన్నం పెట్టమంటూంటే వినపడలేదా' అని కేక పెట్టారు. మా మాటలు ఆయనకేం లెక్కలేనట్టు, అవి లెక్కచెయ్యాల్సిన అవసరం లేనట్టు.

నాయర్ జరుగుతున్న భాగోతం అంతా చూస్తూనే వున్నాడు. ఏం చెయ్యాలో తోచక ప్రశ్నార్థకంగా నా వంక చూశాడు. ఎంత విస్పష్టంగా నా యిల్లు అని చెపుతున్నా ఆయన అలా మొండిగా ప్రవర్తిస్తూంటే ఏం చెయ్యలేని నిస్సహాయతతో కోపం ముంచుకు వచ్చింది. ''ఇదిగో నాయర్, ఆ మనిషి అక్కడ వుండగా నీ వన్నం వడ్డించద్దు. తెలిసిందా ఇది నా యిల్లు . నీకు నా దగ్గర పనిచేయాలంటే నా మాట వినాలి. ....నేను చెప్పేవరకు రాకు, లోపలికి వెళ్లు.' అని ఆజ్ఞాపించాను.

ఆయన మొఖం జేవురించింది. కళ్లు చింతనిప్పులయ్యాయి. ఒక్క ఉదుటున కుర్చీలోంచి లేచి 'నీకెంత అహంకారం, నాకే అన్నం పెట్టద్దంటున్నావా?'' అంటూ నేను జరిగేది గ్రహించేలోపలే ఎడాపెడా దవడమీద నాలుగైదు దెబ్బలు కొట్టేశారు. అమ్మ, బావముందు కురికి అడ్డుకునేసరికి తినాల్సిన దెబ్బలు పూర్తి అయ్యాయి. నా కళ్ళముందు మెరుపులు మెరిసినట్లయి. చెవులు గింగురులెత్తాయి. అలా దవడ పట్టుకుని కొన్ని నిమిషాలు అచేతనంగా నిలబడిపోయాను. 'యూ డర్టీ బిచ్, ఎవరనుకుంటున్నావు నేను, నీ మొగుడ్ని. నాకే అన్నం పెట్టద్దంటావా ' తాగిన మైకానికి తోడు, ఆవేశంతో ఊగిపోతూ పూర్తిగా యుక్తాయుక్త జ్ఞానం పోగొట్టుకొని ఆయన నోటివెంట వచ్చే దుర్భాషలని వింటూ కూడా ముగ్గురం ఏమి చెయ్యలేనట్టు నిలబడ్డాం కొన్ని క్షణాలు!

ఈ గొడవకి విసుక్కుంటూ ఆమె వయ్యారంగా లేచి ''రావ్, కమాన్ లెటజ్ గో. వెధవ భోజనం ఇక్కడే తినాలా, హాయిగా ఏ హోటలుకన్నా పోదాం' అంటూ నావైపు ఓ వంకరచూపు విసిరింది.

''ఆ, అవును, దీని భోజమేనా మనకు. రా. హాయిగా బయటికి పోయి భోంచేద్దాం' అంటూ తూలుకుంటూ లేచాడు.

అప్పటికి నాకు మళ్ళీ చుట్టూ మనుష్యులు కనపడడం మొదలుపెట్టాక తెలివిలోకి వచ్చాను. ''ఆమాత్రం పౌరుషంవుంటే. మళ్ళీ యీ గడప తొక్కక ఆ మాటమీదే నిలబడి యీ యింటికి రాకండి మళ్ళీ. యీ క్షణంనించి మీకు నాకు ఏం సంబంధం

లేదు' అన్నాను గట్టిగా అరుస్తూ.

"కోర్టుకెక్కి కోర్టులో డైవోర్సు తీసుకునేవరకు నేను నీకు మొగుడ్నే. నీ బెదరింపులు నా దగ్గర కావు. నీకు మొగుడిగా వున్నన్ని రోజులు యిక్కడే వుంటాను. నా యిష్టం వచ్చినట్టు చేస్తాను, నా కెవరడ్డం వస్తారో చూస్తాను. నిన్నింత సుళువుగా వదిలిపెట్టను. మై డియర్ గర్ల్ నా తడాఖా రుచిచూపించకుండా నిన్నింక వదలి పోనీయను. నీవు చేసిన మోసానికి నిన్నింత సుళువుగా అప్పుడే వదులుతానా యిది ఆరంభమే మై డియర్. నీ పాట్లు ముందున్నాయి' క్రూరంగా నవ్వి.

"మిస్టర్ రంగారావు, ఆపండి మీ బెదిరింపును. మీ ఇష్టం వచ్చింది మీరు చెయ్యండి. ఇన్నాళ్లూ పెళ్ళి చేసుకున్న నేరానికి మీతో కాపురం చేశాను. వివాహ బంధాన్ని గౌరవించి మీకు గౌరవం యిచ్చాను. నా పిల్లల తండ్రిగా గౌరవించి యిదంతా సహించాను. ఇంక మీరు నా భర్త కారు, నేను మీ భార్యని కాను. డైవోర్సు యిచ్చేవరకే కాదు మరో క్షణం కూడ మీ రిక్కడ వుండడానికి వీలులేదు. నౌ, యు గెటౌట్- వెళ్ళండి. నా యింట్లోంచి తక్షణం ఇద్దరూ బయటికి నడవండి, ముందు బయటికి వెళ్ళి మీ యిష్టం వచ్చినట్లు బెదిరిద్దురు గాని-ఊ-కదలండి,'

"కళ్యాణీ!" బావ హెచ్చరికగా పిల్చాడు.

"నీ వూరుకో బావా. దేనికన్నా ఓ హద్దు అంటూ వుంటుంది. ఆ హద్దు యీ రోజుతో దాటింది. యింకెవరి బెదిరింపులు నన్నేం చెయ్యలేవు. ఈ క్షణం నించి నేను స్వతంత్రురాలిని. నన్నెవరూ ఏం చెయ్యలేరు- నా యిష్టం వచ్చినట్లు చేస్తాను, నా దారికి ఎవరడ్డం వస్తారో చూస్తాను' ఆవేశంలో ఊగిపోతూ అరిచాను.

"ఊ, వెళ్ళండి, యింకా విల్చున్నా రెందుకు" మళ్ళీ ఆయనవంక తిరిగి గుమ్మం చూపిస్తూ అన్నాను.

"వెళ్ళకపోతే ఏం చేస్తావు?" ఎంతో నిర్లక్ష్యంగా అడిగారు.

"మర్యాద దక్కించుకోకపోతే దానికి నేను బాధ్యురాలను గాను" కటువుగా అన్నాను.

"అంటే గెంటిస్తావా."

"అన్నమాటే" నేనూ నిర్లక్ష్యంగా అన్నాను. ఆ మాట వింటూనే ఆయన మెరుపులా టేబిల్‌మీద వున్న మంచినీళ్ళ సీసా తీసి ఒక్క ఉదుటున నా దగ్గిరకి వచ్చి బలంగా నా తలమీద సీసాతో మోదారు. "నన్ను గెంటి వాడితో హాయిగా కులుకుదామనుకున్నావా? నీకా అవకాశం యిస్తాననుకున్నావా? చంపుతాను నిన్ను. నిన్ను చంపి జైలు కెడతానుగాని నీకోరిక నెరవేరనీయను. చావు' అంటూ ఆ విరిగిన సీసాతో భయంకరంగా నా మీద ఉరికి మరోసారి కొట్టారు. అంతా అరక్షణంలో జరిగిపోయింది. మొదటి దెబ్బకే నేను కెవ్వున నేలకూలాను చెయ్యి అడ్డు పెట్టుకుని. రెండోదెబ్బ చెయ్యికి తగిలి చెయ్యి కోసుకుపోయింది. నిర్ఘాంతపోయి చూస్తున్న బావ తెప్పరిల్లి మెరుపులా వచ్చి

ఆయన చేతిలో సీసా లాక్కోబోయాడు. అసలే నీరసంగావున్న బావ వంటిచేత్తో ఆయన తాగిన బలం ముందు నిలబడలేక పోయాడు. ఆయన తోసిన తోపుకి దూరంగా వెళ్లి పడి మళ్ళీ వెంటనే లేచి ఆయన మీదకి పురికాడు వంటిచేత్తోనే- అమ్మ భయంతో పిచ్చిదానిలా కేకలు పెట్టింది. నాయర్ పరిగెత్తి వచ్చాడు. చూస్తూనే బావ 'నాయర్, ఆయన్ని పట్టుకో, ఆ సీసా లాగేయ్' అంటూ అరిచాడు' నాయర్ వెనకనించి ఆయన్ని పట్టేసుకున్నాడు. గింజుకుంటున్న ఆయన చేతిలోంచి పెనుగులాడి సీసా లాగేసాడు బావ. విరిగిపోయిన ఆ సీసా అంతా చేయినిండా గీరుకుని బావ చెయ్యి రక్తసిక్తం అయింది 'వదులు నన్ను వదులు. ఇవాళ దాన్ని చంపందే నే నూరుకోను. వదులు నన్ను''ఆయన పిచ్చివాడిలా కేకలు పెడ్తూ గింజుకుని వదిలించుకుని మళ్ళీ నా దగ్గరకి వచ్చారు. ఏం చేసేవారో కానీ, బావ ముందుకు వచ్చి ఆయన షర్టు గుప్పిటతో బిగించి పట్టుకున్నాడు. 'మిస్టర్ రంగారావు, కళ్యాణి వంటిమీద చెయ్యిపడిందో, జాగ్రత్త - నీ అంతు తేలుస్తా. యివాళ కళ్యాణి రక్తం చూసినందుకు మరొకడ్ని అయితే చంపివుండేవాడిని, కళ్యాణి భర్తవని, కళ్యాణి పిల్లల తండ్రివని ఆలోచించి వూరుకున్నాను. బ్రతికిపోయావు.జాగ్రత్త, వెళ్లు, ఊ, మళ్ళీ ఎప్పుడన్నా సరే ఆమె వంటిమీద చెయ్యివేసావో,జాగ్రత్త, దవడ ఎముక విరుగుతూందేమోనన్నంత గట్టిగా పళ్లు బిగపట్టి ఆవేశంతో, ఆగ్రహంతో వణికిపోతున్నాడు. బావకి అంత కోపం రావడం, బావ అంత ఆవేశపడడం చూడడం అదే మొదటిసారి. బావ కోపానికి, ఆవేశానికి ఆయనా కాస్త బెదిరినట్టున్నారు. అయినా బింకంగా, పౌరుషంగా షర్టు విదిలించుకుంటూ బావని ''నోర్ముయ్, నీ వెవడివి మా మధ్య కలగచేసుకోడానికి. నా భార్య, నా యిష్టం'' అంటూ విదిలించుకోబోయారు. బావ వదలలేదు. కఠినంగా 'నే నెవరికో మీరే చెప్తున్నారుగా, కళ్యాణి ప్రియుడిని. కాబోయే మొగుడ్ని.ఏం? ఇంకా నే నెవరో తెలుసుకోవాలని వుందా. జాగ్రత్త, నా కళ్యాణి వంటిమీద చెయ్యి వేస్తే బ్రతకనీయను. ఫో. ముందు బయటికి.''

''ఎవడ్రా నీవు, నన్ను బయటికి పొమ్మనడానికి. యూ రాస్కెల్ అసలు నీ వల్లే యింత జరిగింది. దాన్ని, నిన్నుకూడా కలిపి చంపుతాను.'' అంటూ మళ్ళీ ముందుకువచ్చి నా గొంతు రెండుచేతులతో పట్టుకున్నాడు. అమ్మ కెవ్వుమని అరుస్తూ ఆయన్ని లాగడానికి ప్రయత్నిస్తూంది. బావకి యింక ఆవేశం ఆగలేదు. గాబోలు ఆయన్ని కాలరెత్తి లేపి ఆ ఒంటిచేత్తోనే ఎడా పెడా దవడలు పగలగొట్టాడు. ఎన్ని దెబ్బలు కొట్టాడో బావకే తెలియలేదు. అమ్మ, నాయరు యిద్దరిని విడదీసారు. అప్పటికి ఆయన తాగిన మత్తు పూర్తిగా దిగింది కాబోలు. ఎగిసిపడుతున్న గుండెలతోఅలా కొన్ని క్షణాలు దిగ్భ్రాంతులయినట్లుండి పోయారు.

(సశేషం)



నీలితెర

ముద్దంశెట్టి హనుమంతరావు

భాస్కరం అప్పుడే రిక్షాలోంచి దిగి, విసురుగా లోపలి కొచ్చాడు. అతడి మొహంలో ప్రసన్నత అగుపించలేదు వీర్రాజుకి. కొద్దిపాటి ఆశ్చర్యం కలిగింది. "అమ్మాయి నచ్చినట్టేనా భాస్కర్?" అన్నాడు వీర్రాజు. "నాకు నచ్చలా" విసురుగానే అంటూ లోపలి గదిలోకి వెళ్ళబోయాడు భాస్కరం.

"నచ్చలేదూ? కారణం?" మామూలు ధోరణిలోనే మరోప్రశ్న వేశాడు వీర్రాజు. ఆ ప్రశ్న భాస్కరంని షడన్‌బ్రేకు వేసినట్టుగా నిలబెట్టింది.

భాస్కరం వెనక్కి తిరిగి, తండ్రికేసి తీక్షణంగా చూశాడు.

"కారణాలు సవాలక్ష వుంటాయి నాన్నా; అవన్నీ మీతో చెప్పాలా? నా అర్థాంగి! యెన్నుకోవడంలో నాకు పూర్తి స్వాతంత్ర్యం వుండాలి...వుంది కూడాను. కాదంటారా? అటువంటప్పుడు, యీ విషయంలోనూ మీరే కలిగించుకుని మీ పెద్దరికాన్ని నిలబెట్టుకోడానికి ప్రయత్నించడంలో అర్థం లేదంటాను. అది అవివేకం కూడాను" నిర్లక్ష్యంగా అంటూ, అక్కణ్ణించి నిష్క్రమించాడు భాస్కరం.

వీర్రాజు మనస్సు చివుక్కుమంది. అప్పుడే బైట్నుంచి వచ్చిన జానకమ్మ, కొడుకు మాటల్ని స్పష్టంగా వింది. ఆమెకీ బాధనిపించింది. ఇటీవల కొడుకు ప్రవర్తన చాలా వింతగా విపరీతంగా మారింది. దానికి కారణం యేమిటో ఆమెకీ బోధపడ్డంలేదు. ముఖ్యంగా వాడు తండ్రిని మరీ లోకువచేసి మాట్లాడ్డంతో అర్థమేమిటో యెంత ఆలోచించినా, సమాధానం దొరకలేదు. "ఎంతో ఆశతో పెళ్ళిచూపులకి వెళ్ళాం గానండీ మనవాడికి ఆ అమ్మాయి నచ్చలేదుట" చెప్పింది జానకమ్మ. "అవన్నీ నాకెందుకు లేవే! వివాహం వాడి స్వవిషయం. ఇందులో నాకేం ప్రమేయం లేదు. వుండకూడదు కూడాను" ఎంతో బాధపడుతూ అన్నాడు.

భర్త బాధను అర్థం చేసుకుంది జానకమ్మ. "వాడి మాటల్ని మీరు పట్టించుకోకండి. చిన్నవాడు ఆవేశం ఎక్కువ" అంది.

వీర్రాజు బాధతో కూడిన ఓనిట్టూర్పు విడిచాడు.

"ఔనే యేంచేస్తాం? ఉద్యోగం చేసుకుంటున్నా వాడు చిన్నవాడే! ఏం చేస్తాం? ఏదో విధంగా సరిపెట్టుకుందాం. కాయలున్న చెట్టే రాళ్ళ దెబ్బలు తింటుంది" అన్నాడు.

జానకమ్మ మరేం మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది.

వీర్రాజు బరువుగా ఓ నిశ్వాసం వదులుతూ పంచెకొనతో చెమ్మగిల్లిన కళ్ళను ఒత్తుకున్నాడు.

* * *

వీర్రాజు ప్రభుత్వ కార్యాలయంలో సబ్ హెడ్‌గా పనిచేసి, యీమధ్యనే రిటైరయ్యాడు. మంచికి మారుపేరుగా అందరితో మసలి, మన్ననల్ని పొందాడు. నిజాయితీగా బ్రతికి, కష్టార్జనతో కొడుకుని ఇంజనీరింగు చదివించాడు. ఫలితముగా అప్పులపాలయ్యాడు. రిటైర్ అయ్యాక, వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చేశాడు.

అయితే తండ్రి అప్పులుచేసి తనని చదివించాడన్న విషయం అప్పుడే తెలిసిన భాస్కరం, తండ్రి ప్రయత్నాన్ని హర్షించలేకపోయాడు. ఆయన రిటైరయి తాను తెచ్చుకున్న డబ్బుతో హాయిగా జీవిస్తాడని భావించిన భాస్కరానికి

ఆయన ఏమీ మిగల్చకపోగా పూర్తిగా తనకి భారమై కూర్చున్నాడన్న భావన రావడంతో తండ్రిమీద యేహ్యభావం అతనిలో మొలకెత్తింది. అదీ అతని నిరసనకు నాంది.


కొడుకులో వచ్చిన పరిణామాన్ని అర్థం చేసుకోకపోలేదు వీర్రాజు. అయితే తను డబ్బుని తగలెయ్యలేదు కదా! అప్పులు చేసినా, కొడుకుని ప్రయోజకుణ్ణి చెయ్యగలిగానన్న తృప్తి అతనిలో మిగిలింది. జీవితంలో అతను సాధించిన పెద్దవిజయం అదే! కాని ఆ తృప్తి కొడుకులో లేకపోయినందుకు బాధపడ్డాడు. తనని తేలిగ్గా చూస్తోన్న కొడుకు తెలివి హీనతకు లోలోన నవ్వుకుంటూ వుంటాడు వీర్రాజు.

పుత్రసంతానం కావాలని ప్రతీ తలిదండ్రులూ వాంఛిస్తూంటారు. పుత్రుడు తమని పున్నామనరకం నించి తప్పిస్తాడన్న చాదస్తపు వాదన ఒకటి. మరో స్వార్థంకూడా వారిలో లేకపోలేదు. అదేమిటంటే తమని కొడుకు వృద్ధాప్యములో పోషిస్తాడన్నది. అయితే యీనాటి తరంలో వస్తోన్న మార్పుల్ని పరిశీలనగా గమనిస్తే తలిదండ్రుల ఆశల్ని తీర్చే కొడుకులు తక్కువ శాతంలో వుంటున్నారేమో ననిపించింది వీర్రాజుకి. యువతరం యెందుకిలా మారిపోతున్నారో అతనికేం బోధపడలేదు.

* * *

ఒకరోజు ధర్మరాజు అనే కంట్రాక్టరు భాస్కరంతో మాట్లాడుతూ వుంటే, అనుకోకుండా వీర్రాజు ఆ గదిలోకి రావడము తటస్థించింది. ధర్మరాజు చిరపరిచితుడవ్వడంవల్ల వీర్రాజు అతణ్ణి పలుకరించాడు.

భాస్కరం మొహం చిట్లించుకుని తండ్రికేసి నిరసన భావంతో చూశాడు.



"మీ రెండుకు నాన్నా నా ఆఫీసు గదిలోకి వస్తారు? ఎక్కడో ఓ మూల కూచుని 'రామా కృష్ణా' అనుకో కూడదూ?" అన్నాడు.

ధర్మరాజు నివ్వెరపోయాడు. అతనికి కొంత మేరకు తెలుసు, వీర్రాజుగారు కొడుకు చదువుకోసం యెన్ని అవస్థలు పడేవారో; అటువంటి తండ్రికి లభిస్తోన్న గౌరవం యిదా?...అన్న ఆశ్చర్యం కలిగింది అతనికి. అయినా యేమీ అనలేక పోయాడు. ఎందుకూ అంటే, భాస్కరం గారి చేతిలోనే తనపని జరగాలిప్పుడు.

వీర్రాజు మొహం దించుకుని, అవమాన భారంతో కృంగిపోతూ, అక్కణ్ణించి వెళ్ళిపోయాడు. ఆ సమయంలో, అతనికి జీవితంమీద విరక్తిభావం మొలకెత్తినమాట వాస్తవమే! అయితే అతని లోని సహనం అతణ్ణి సమాధానపర్చింది. ఆరోజునుంచీ వీర్రాజు, కొడుకు ఆఫీసు గదిలోకి రావడం మానుకున్నాడు.

భాస్కరం, తాను ప్రేమించిన ప్రేమ బాలను పెళ్ళిచేసుకున్నప్పుడు, ఎవ్వరితోనూ సంప్రదించలేదు. తల్లితో ఏదో మాటవరుసకి చెప్పాడుగాని,ఆ చెప్పడం తండ్రితో అసలే లేదు. గుట్టుచప్పుడు గాకుండా రిజిష్టరు మేరేజ్ చేసుకుని, చక్కా యిద్దరూ యింటికొచ్చినపుడే వీర్రాజు చూశాడు. అతనికి నిజంగా మతిపోయినట్టయ్యింది. కనీసం తను పెళ్లి చేసుకుంటున్న వైనంకూడా తెలియనివ్వకుండా కొడుకు ప్రవర్తించిన తీరు, అతనికి అవమానకరంగానే తోచింది. ఒక ప్రక్క ఆవేశమూ వచ్చింది. కాని, యిప్పుడు ఆవేశపడి తను సాధించవల్సిందేమీ లేదనుకున్నాడు. అందుకు తన వయస్సు అడ్డొస్తోందని భావించాడు.

క్రమంగా వీర్రాజు పరిస్థితి దిగజారిపోతోంది ఆ ఇంట్లో. ఏపాటి గౌరవం ఇచ్చినా, అగ్నిసాక్షిగా అతను వివాహమాడిన భార్య మినహా మరెవ్వరూ గౌరవించడంలేదు. ఆ ఇంట్లో, ఈ పనికీ, ఆ పనికీ వుపయోగపడే వ్యక్తిగా మినహా, అతని వునికి మరో ప్రయోజనాన్ని సాధించలేకపోతోందంటే, ఆశ్చర్యం లేదు.

* * *

భర్తని, కొడుకే అంత నిరసనగా చూస్తుంటే ఏ భార్య మాత్రం హర్షిస్తుంది? జానకమ్మకి కొడుకు ప్రవర్తన ఏమీ నచ్చలేదు. ఇంతకీ ఆయన చేసిన తప్పేవిఁటి, వాడంతగా నిరసించడానికి అబ్బాయి చెప్పిన కారణం ఒక్కటే! తనకి ఆస్తిపాస్తులు అందివ్వలేదని, పైపెచ్చు బరువై కూచున్నారని ఆ అభిప్రాయాన్ని మార్చుకోమని, ఎన్నోసార్లు కొడుక్కినచ్చజెప్పింది. కాని,భాస్కరం మారలేదు. అతడిలో వేళ్లు నాటుకుపోయిన ఆ భావన, ఇంత సులువుగా అంతరించేదికాదు. అందుకే జానకమ్మ మరింత కుమిలిపోసాగింది.

ఓ రోజు కోడలితో యీ విషయాన్ని చెప్పింది వివరంగా కోడలయినా పరిస్థితిని చక్కదిద్దుతుందేమోనన్న ఆశతో.

అంతా విన్న ప్రేమబాల నిర్ఘాంతపోయింది. భర్త చెప్పినంత మేరకు మావఁగార్ని ఖాతరు చెయ్యకుండానే ప్రవర్తించింది గాని, కారణం ఏమిటో తెలియదు. యిపుడు తెలుసుకున్న

కారణం చాలా అర్థరహితంగా తోచింది. ఆయన ప్రవర్తనని ఆమె గర్హించింది. "అసలు కారణం ఏవిటో తెలీకుండా, నేనుకూడా మీ అబ్బాయిలాగే తెలివితక్కువగా ప్రవర్తించాను అత్తయ్యగారూ! నన్ను క్షమించండి" అంది ప్రేమబాల.

జానకమ్మ బరువుగా ఓ నిట్టూర్పు విడిచింది.

"క్షమాపణ కోరడం కాదమ్మా నువ్విప్పుడు చెయ్యాల్సింది నీ చాకచక్యంతో భాస్కరంని మార్చాలి వాడిలోని మొండి పట్టుదల, నా మాటకూడా విననివ్వడంలేదు. మీ మావఁగారు కన్నకొడుకు ప్రవర్తనకి ఎంతగా లోలోన కుమిలిపోతున్నారో నీకు తెలీదమ్మా! విషయం అంతా చెప్పాను. ఆయన తప్పేమిటో నువ్వే ఆలోచించు" అంది, బాధగా

"అంతా అవగాహన చేసుకున్నాను అత్తయ్యగారూ! నా ప్రయత్నమేదో నేను చేస్తాను. మీరు నిశ్చింతగా వుండండి" అంటూ హామీ ఇచ్చింది, ప్రేమబాల.

జానకమ్మ మొహం, విప్పారింది. ఆ జవాబుకోసమే, ఆమె యిన్నాళ్ళు ఎదురు చూసింది మరేం అనకుండా, అక్కణ్ణించి వెళ్ళిపోయింది ప్రేమబాల ఆలోచనల్లో పడింది.

* * *

ఆరోజు ఆఫీసుకి బైలుదేరుతోన్న భాస్కరం, నిలువుటద్దంముందు నుంచుని నెక్ టై సర్దుకుంటూ భార్యను కేకేశాడు ఆమెనుండి జవాబేలేదు. నాలుగైదు రోజుల్నుంచి ఆమెలో ఏదో హఠాత్తుగా మార్పువచ్చినట్టనిపిస్తోందతనికి.



'దేవుడుచేసిన పెళ్లి' లో
లక్ష్మి, నాగభూషణం

"ప్రేమా...ఓ ప్రేమా..."విసుగ్గా మళ్ళీ కేకేశాడు.

"అబ్బబ్బ! ఏవిటండీ? ఎందుకా కేకలు?" అంటూ వచ్చింది.

భాస్కరం, నివ్వెరపోయాడు. భార్య ఎప్పుడూ అలా విసుక్కోవడం చూళ్ళేదే! ఏవిటీ మార్పు?...అతనికేం బోధపడలేదు.

"ఏం చేస్తున్నావ్?" ఆమె మొహంలోకి చూస్తూ అన్నాడు.

"ఆడవాళ్ళకి పనులే వుండవా? ఏదో ఒకటి చేస్తుంటాం. అవన్నీ మీతో ఏకరువు పెట్టాలంటే సాధ్యమా చెప్పండి!

మావఁగారు యిప్పుడే బజార్నుంచి వచ్చారు. పాపం, యెండలో వచ్చారు, అందుకని నిమ్మకాయ నీళ్ళు చీనీ కలిపి యిస్తున్నా!"

అసలే ఆమెలో ఏదో మార్పు వచ్చిందని ఆలోచిస్తోన్న భాస్కరంకి, తన మాటల్ని లెక్కచెయ్యకుండా మావఁగార్ని ఆదరణతో చూస్తోన్న భార్య మీద చెప్పలేనంత కోపం వచ్చింది.

"ఏఁవిటి ప్రేమా, నాలుగయిదు రోజుల్నుంచి నీలో ఏదో మార్పు వచ్చినట్టు గమనించాను చివరికి నా మాటల్ని కూడా ఖాతరు చెయ్యనంత నిర్లక్ష్యంగా తయారవుతున్నావని, ఇప్పుడే తెలుసుకున్నాను. ఏఁవిటిదంతా? నీలో యిటువంటిమార్పు వస్తుందని నేనూహించలేదు" అన్నాడు విసురుగా

"ఎవరిలో, యెప్పుడు, యెటువంటి మార్పు వస్తుందో, యెవరు చెప్పగలరండీ? అయినా, పిలిస్తే పలకడం ఆలస్యమయినంతమాత్రాన అది నిర్లక్ష్యం అనుకోవడ మేఁవిటి?" యెదురు ప్రశ్న వేసింది, ప్రేమబాల.

ఆమె మాట్లాడే ధోరణి కొత్తగా కనిపించింది భాస్కరంకి

"పోనీ ఆ విషయం వదిలేద్దాం కాని, మా నాన్నగారిపట్ల ఇంత ఆదరణ చూపడ మేఁవిటి? నిర్లక్ష్యంగా వుండమని చెప్పానా?"

"మీరు చెబుతారండీ కాని, నలుగురి విమర్శకు గురయ్యేది నేను అయినా, కన్నతండ్రిమీద మీకింత కక్ష ఎందుకో నా కర్థం కావడంలేదు అష్టకష్టాలుపడి, మిమ్మల్ని చదివించి, ఈ స్థాయికి తీసుకొచ్చారు ఆయనేగా!" అని ప్రేమబాల యేదో చెబుతూ వుంటే, భాస్కరం ఆవేశాన్ని పట్టలేకపోయాడు.

"స్టాపిట్ . ఏఁవిటీ ధోరణి? నాకు నీతులు చెప్పడానికి ప్రయత్నిస్తున్నావా? పిచ్చిపిచ్చి వేషాలు వెయ్యకు. ఈ నిర్లక్ష్యాన్ని నేను సహించలేను నేను చెప్పినట్టు చెయ్యి నా అర్ధాంగివన్న మాట మర్చిపోకు " అన్నాడు కోపంగా.

ఆ క్లయిమాక్సు కోసమే యెదురు చూస్తోంది ప్రేమబాల. నిర్లక్ష్యంగా ఓ నవ్వు నవ్వింది భాస్కరం మరీ రెచ్చిపోయాడు.

"ఏఁవిటా వెకిలినవ్వు . నీ హద్దుల్ని నువ్వు తెలుసుకోవడం మంచిది "

"ఎందుకండీ అంత కోపం? ఆత్మీయతలు, అభిమానాలు, వుండవల్సిన చోట, యే ఒక్కరిలో నిర్లక్ష్యమూ, నిరసనా పెరిగినా, యెదుటి వ్యక్తి యెంతగా బాధపడతారో స్వానుభవంతో తెలుసుకున్నారనుకుంటాను " సౌమ్యంగా అంది, ప్రేమబాల

భార్య మాటల్లో అంతరార్థం, చప్పున అవగాహన కాలేదు భాస్కరంకి మాటకి మాటా విసురుగా జవాబివ్వకుండా, అంత సౌమ్యంగా చెబుతోన్న ప్రేమబాలకేసి అదోలా చూశాడు ఏదో విశేషం వుందనిపించింది "అంటే యేఁవిటి నీ వుద్దేశం?"

"అంటే యేఁవిటో అర్థంకాలేదాండీ? ఇటీజ్ సింపిల్ మొన్న మొన్న నే మీ జీవితంలో అర్ధాంగిగా అడుగుపెట్టిన నేను, కాస్తంత నిర్లక్ష్యంగా ప్రవర్తించినంత మాత్రాన మీరు దాన్ని సహించలేక, ఆవేశాన్ని పట్టలేక, యేఁవేఁవిటో అన్నారు అర్ధాంగిగా నా హద్దుల్ని గుర్తు చేశారు మీరు చెప్పేవదాన్నే మీ నాన్నగారి విషయంలో మీరు యెందుకు విస్మ

రిస్తున్నారో, నాకు బోధపడదు. మిమ్మల్ని కని, పెంచి, ప్రయోజకుణ్ణి చేసిన ఆయన, మీరు ఆయనపట్ల ప్రకటిస్తున్న నిర్లక్ష్యాన్ని, నిరసనను చూసి, యెంతగా బాధపడుతూ వుంటారో, ఆలోచించారా? రిటైరయి మీమీదఆధారపడి వున్న వ్యక్తిగాబట్టి, మీమీద ఆవేశపడే అవకాశం లేదాయనకి కాని, ఆయన మనసులో రగుల్తున్న బాధ ఆయనలో యెటువంటి విరక్తిని కలిగిస్తుందో యోచించండి. ఆయన పరిస్థితి చూస్తూ, మీ తల్లిగారూ కుమిలిపోతున్నారు, యేమీ చెయ్యలేని నిస్సహాయ వ్యక్తిగా లోకులు మాత్రం వూరుకుంటారనా? మీ యెదుట అనకపోయినా, మీ పరోక్షంలో అనుకుంటారు అప్పుడు మీ అంతస్తుకి విలువే వుండదు. తల్లిదండ్రుల్ని నొప్పించి, మీరు సాధించేదేమిటో నాకు బోధపడదు అందుకే, మీకు యెలా చెప్పాలో తెలీక, నా కపట నిర్లక్ష్యాన్ని మీ ముందుంచాను నా ప్రయత్నం ఫలించింది. మీరు చదువుకున్నవారు. అర్థం చేసుకోగల శక్తివుంది. ఆపైన మీ ఇష్టం '' అంది.


భాస్కరం మాట్లాడలేకపోయాడు. అతని మెదడులో సంక్షోభం ప్రారంభమయ్యింది. తను ఇన్నాళ్ళూ తెలివితక్కువగా ప్రవర్తించాడేమోనన్న పశ్చాత్తాపం కలిగిందతనిలో. పశ్చాత్తాపమే మనిషి తప్పుల్ని ప్రక్షాళితం చేసేది! సిగ్గుతో అతని మొహం అవనితమయ్యింది అతనిలోని అహం కరిగిపోయింది భార్య రెండుచేతులూ పట్టుకున్నాడు.


"ప్రేమా! నా కళ్ళనుకప్పిన నీలితెరను తొలగించావు. నా ప్రవర్తనకి సిగ్గుపడుతున్నాను రియల్లీ అయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ వస్తా... ఆలస్యమౌతోంది." అంటూ నిష్క్రమించాడు.

ప్రేమబాల ఆనందానికి అవధుల్లేకపోయాయి. ఆమె మొహంలో వెయ్యి సూర్యుల వెలుగు ప్రకాశించింది.

* * *

ఆ రోజునించీ ఆ ఇంట్లోని వాతావరణమే మారింది, వీర్రాజు జీవితంలో వుత్సాహం మళ్ళీ పుంజుకుంది. ఇప్పుడా ఇల్లు ఆనందనిలయం. *





కల్ ఆజ్ ఔర్ కల్

-యం హెచ్ వి సుబ్బారావు

శ్రీరస్తు చిరంజీవి సౌభాగ్యవతియైన మా భార్య జానకికి ఆశీర్వచనములు. క్షేమం, అక్కడ పిల్లలు అందరూ క్షేమమని తలుస్తాను లేఖాంశములు.

రంగసానిని నువ్వెరుగుదువు గదా. పోయిన సంవత్సరం మనవూరి గోపాలస్వామి కోవెల్లో వుత్సవాలకి గజ్జె కట్టింది. రాజమండ్రినించి వచ్చిందని జనమంతా విరగబడి చూశారు. చూడు అదే రంగసాని. నిన్న ఇక్కడ నాకు కనిపించింది పాపం. ప్రస్తుతం ఒంటరిగా బ్రతుకుతోందట. మొన్న మన వూరు వచ్చినప్పుడు ఎంత చలాకీగా. వుత్సాహంగా వుంది. యిప్పుడు మనిషి ఏమీలేదు. బాగా తీసి

పోయింది. ఏదో దిగులుతో కృశించి పోతున్న దానిలా కనబడుతోంది.. .అసలు మనవూళ్లో కలుసుకున్నప్పుడే నాతో అన్నది

"అమ్మగారిలాంటి ధర్మతల్లి పాదాల దగ్గరబడి వూడిగం చేసుకుంటే ఎన్ని పాపాలైనా పోతాయని" , దానికి నీదగ్గర వుండి నీ సేవ చేయాలని వున్నదట మని ద్దరం పార్వతీ పరమేశ్వరుల్లా వుంటా మట.

నా సంగతి నీకు తెలుసు గదా! వట్టి జాలిగుండె ఎవరు ఆపదలో వున్నా కాదనలేను. అలాగే కానిమ్మన్నాను. మీ అక్కకి రాస్తాను, అన్నీ ఏర్పాట్లూ చేస్తుంది అని చెప్పాను. దాన్ని నాతో తీసుకు వస్తాను. పాపం, అది సుఖంగా పెరిగిం దేమో దానికే యిబ్బందీ కలక్కుండా చూడు.

అది యింట్లోకి వస్తే కొన్ని చిక్కు లున్నాయనుకో. పిల్లలు దాన్ని ముట్టుకున్న ప్పుడల్లా జంధ్యాలు తడుపుకొని బట్టలు మార్చుకోవాలి. కాని ఏం చేస్తాం మరి! అందుకే అది అస్తమానం ఇల్లంతా కలియ తిరక్కుండా దాన్ని మేడమీదే వుంచేద్దాం. అది వండితేమనం ఎలాగా తినం. కాబట్టి నీవే యింత వండి. నీ వింత తిని, దాని కింత పడేస్తే సరిపోతుంది. వండి వార్చే పని ఎలాగూ లేదు గనుక అస్తమానం మడి వాళ్ల కంటపడకుండా దాన్నక్కడే మేడమీదే దిగకుండా వుంచేసి వేళకి యింత అన్నం పంపుతూంటే సరి. అదే పడుంటుంది

మొదటినించీ రాజులదగ్గర మెదిగిన మనిషి. కష్టానికి వోర్చుకోలేదు. కాబట్టి యీ విషయాలన్నీ నీవే స్వయంగా చూడు. పిల్లలకి కూడా చెప్పి అట్టే పెట్టు, నాన్న గారు ఒక పిన్నిని తీసుకొస్తున్నారా అని. తరవాత వాళ్లు ఎవరో అని తెల్ల బోకుండా, నేను నాలుగురోజుల్లో బైలుదేరి వస్తు న్నాను. ఏర్పాట్లన్నీ చేసి వుంచుతావని నమ్ముతాను. ఇట్లా రాసినందుకు ఏమీ అనుకోకు.

ఇట్లు
రాజశేఖరశాస్త్రి వ్రాలు

*

మహారాజరాజశ్రీ శ్రీవారి పాద పద్మ ములకు నమస్కరించి తమ చరణదాసి జానకి వ్రాయు విన్నపములు.

తమరు వ్రాసిన లేఖ అందినది. మీ చమత్కారమునుచూసి మురిసిపోయినాము. గం॥ అమ్మమ్మగారు చూసి 'కొంటె గోపాలకృష్ణుడు. అన్నీ వాళ్ల తాతగారి పోలికలే' అని ఎంతో ఆనందించినారు. ఇక నా విషయం. మీరు నా పాతివ్రత్యాన్ని పరీక్షించడానికే యిట్లా రాశారని నమ్ము తున్నాను. లేకపోతే నేను ఎప్పుడైనా కాదంటానా?! మీ సుఖం కంటే నాకీ జన్మలో యింక కోరుకోవలసిందేముంది? చివర్న మీరు రాసిన మాటలు—"యిట్లా రాసినందుకు ఏమీ అనుకోకు" అన్నవి నా తలకొట్టేసినట్లు వున్నాయి నేనా?! నేనేనా ఏమైనా అనుకునేది?! నాస్వామి తన సుఖాన్ని కాంక్షించి ఏదైనా పనిచేస్తే దానికి అడ్డు తగిలేంత పామర స్త్రీ నను

కున్నారా? మీరా ముక్కలు రాసేటప్పుడు మా సంప్రదాయాన్ని మర్చి పోయారను కుంటాను. మా పుట్టింట్లో ఆపనీ యీపనీ చేస్తూ వుండేవాడే, ఖాదర్ అనే కుర్రాడు-మేం అంతా అన్నయ్యా అని పిలుస్తూ వుండే వాళ్ళం - వాడు మా పని మనిషికి మొగుడు పోయిన మూడేండ్లకి మా యింట్లో వుంటూండగా కలిగిన కొడుకు. ఓ రోజున అది పొట్టమీద గుండ్రాయితో కొట్టు కుంటూంటే మా అమ్మచూసి, "ఓసి నీ ఇల్లు బంగారంగానూ, ఎందుకే ఇలాటి అఘాయిత్యప్పన్లు చేస్తావ్" అని చీవాట్లు పెట్టి తీసుకొచ్చి పురుడు పోసిందట. వాడు పుట్టాకే మేమంతా పుట్టాం. అలాంటి సంప్రదాయంలో పుట్టిన నేను మీ సుఖాని కడ్డువస్తానా? కుష్ఠు వాణ్ణి గంపలో కూర్చో బెట్టుకుని వేశ్యఇంటికి మోసుకుని పోయిన సతీసుమతి రక్తం నాలో ప్రవహిస్తోంది. మీరేమీ సంకోచించకుండా ఆమెను ఇంటికి తీసుకు రండి. మళ్లీ మరొక్కసారి చెబుతున్నాను. మీ సుఖమే నా సుఖం.

త్వరలో వస్తారని ఎదురు చూసే

మీ

సహధర్మచారిణి

జానకి.

2

జానకీ,

ఈ వుత్తరం నీకు ఎలా రాయాలో నాకు బోధ పడడం లేదు. జీవితపు అంచున నిలబడి నీ తీర్పు కోసం ఎదురు చూస్తున్నానంటే నమ్ముతావా? దార్లు చీలిపోయే చోట నిల్చుని అయోమయంలో పడ్డ ప్రయాణీకుణ్ణి నేను. నిజానికి నా జేబులో టిక్కెట్టుంది. అయితే, నా హృదయంలోని సర్వశక్తులూ. నాలోని బుద్ధీ, చైతన్యం. స్పందన, అన్నీ నా గమ్యం అటుకాదని చెబుతున్నాయ్ విధాతకోసిన ఆ టిక్కెట్టుకి కాన్సెల్లేషనూలేదు. ఎక్స్ఛేంజీలేదు. ఆ విషయం నాకు తెలుసు, కాని ఏం చెయ్యను? నాలోని బుద్ధీ, విచక్షణా మనస్సుని జయించలేక పోతున్నాయి. నాకు తెలుసు నేను టిక్కెట్టులేని ప్రయాణీకుణ్ణే అవుతానని కాని ఏం చెయ్యను? ఏనాటి కయినా ఆ మార్గంలోనే నాగమ్యం వున్నదని నా కనిపిస్తున్నది. అక్కడికి చేరుకుంటేనే నాకు ప్రశాంతి లభ్యమౌతుంది. నాలోని ప్రతి అణువూ ఆ ప్రశాంతినే కోరుతోంది.

జానకీ! నన్నుచూస్తే నీకు అసహ్యం వేస్తోంది గదూ! అవును, నలభయ్యోపడిలో యిలాటి జంజాటంలో ముగ్గురు పిల్లల తండ్రి యిరుక్కున్నాడంటే ఎవరికి గౌరవం వుంటుంది? జానకీ! యీ నా పరిణామానికి అర్థం నాకు తెలుసు గనుకనా ఒకరితో చెప్పుకునేందుకు? యీ సంఘర్షణలోపడి నేను ఎంత నలిగి పోతున్నానో నీకు చెప్పుకునే అర్హత నాకు లేదు. అయినా తప్పదు. ఏదో ఒకనాడు విషయమంతా నీకు వివరించవలసిందే! విషయం యింకా మథ్యపెట్టి యిటు నిన్నూ, అటు సుజాతనీ యిద్దర్నీ మోసం చెయ్యలేను.

జానకీ! మనం ఎంతో ప్రేమించుకున్నాం గదూ! మనం కాలేజీల్లో కలుసుకోలేదు. తోటల్లో, దొడ్లల్లో పడి ప్రేమ గీతాలు పాడుకోలేదు. పెళ్ళికాక ముందు

నిన్నో అరగంట చూశాను. ఆ అర గంటలో నిన్ను చూడగానే వులిక్కి పడ్డాననీ, జన్మజన్మలుగా నేను వెదుకుతోంది. నీకోసమేనని అప్పుడే తెలుసుకున్నాననీ చెప్పను. ఆ రోజు నిన్ను చూసి 'బాగుంది అనుకున్నాను. నీ అందాన్ని 'క్రిటికల్'గా గూడా చూశాను. అంతమంది వుండగా మంచి నీళ్ళు నిన్నే ఎందుకు తెమ్మన్నారనుకున్నావ్? నీ నడక తీరు పరీక్షించేందుకు గోడవారగా కుర్చీలో కూర్చున్న నేను నువ్వు వంటింటి గుమ్మంలోంచి వస్తోంటే వెడుతోంటే నీ 'ప్రొఫైల్ని' జాగ్రత్తగా చూశాను. నువ్వు నాకు నచ్చావు. నీ జాతకం మా నాన్నకు నచ్చింది. మీ నాన్న చెక్కు బుక్కు మా అందరికీ నచ్చింది.

పెళ్ళిలో మాటిమాటికీ నీచెయ్యి పుచ్చుకోమని ఆదేశిస్తోన్న పురోహితుడికి లోలోపల నేనెంతో కృతజ్ఞత తెలియపరచుకున్నాను. మెత్తని పువ్వులాంటి నీచెయ్యి నా చేతుల్లో ఎంత నలిగి పోయిందో, ఆ రోజు నువ్వు నాకేసి ఎంత కోపంగా చూశావో గుర్తుంది. కాని ఏం చెయ్యను? నేను ముట్టుకున్న మొట్టమొదటి ప్రాజ్ఞురాలైన స్త్రీవి నువ్వు.

ఆ తరువాత వెచ్చవెచ్చగా గడిచిపోయిన మొదటి రోజులు....నిన్ను ప్రేమించి పెళ్లాడలేదని నేను ఏనాడూ అనుకోలేదు. మొదటి రోజుల వేడి తగ్గిపోయాక గూడా మన మేనాడూ పోట్లాడుకోలేదు. ఒకరి నొకరు కష్టపెట్టుకోలేదు. మనది ఎంతో అన్యోన్య దాంపత్యం గదూ? ఎప్పుడైనా చిన్నచిన్న కలతలు వచ్చినా



నటి రత్న

తరవాత ఎంత హాయిగా రాజీ పడేవాళ్ళం మనం? నీ మృదుల స్వభావమూ, వివేకమే మన యింటిని అంత ఆనందమయం చేశాయని నేను యీ నాటికీ నమ్ముతున్నాను. నీ పేరు ఎత్తగానే మనసంతా తృప్తితో, హృదయం నిండా పారిజాత పరిమళం అలముకున్నట్లు హాయిగా అనిపిస్తుంది. చెప్పుకోడానికి సిగ్గేస్తున్నదిగానీ, నేనింకా నిన్ను వెనుకటిలాగే ప్రేమిస్తున్నాను.

సుజాత బొత్తిగా నువ్వెరగనిది కాదు. బహుశా నాలోని యీ కోణమే నీకు

పూర్తిగా అపరిచితమైనదేమో. కవులు ఒక రకం ఆకర్షణని 'దివ్యప్రేమ' అంటారు. బహుశా అది వేరు కావచ్చు. లేకపోతే కవులకి అలవాటైన గారడీ పదాల్లో అదీ ఒకటి కావచ్చు. ఏమైనా ఒకటి మాత్రం నిజం. ఇది ఆకర్షణ మాత్రం అవును. ఆకర్షణ దురవిలంఘ్యమైన ఆకర్షణ, క్రైవేట్ యిన్‌డిస్పెన్సిబిల్ రెక్కలుతెగినా, మంటలలోబడి మలమల మాడిపోయినా దీపం చుట్టూ ప్రదక్షిణం చెయ్యడంలో ఎంత ఆనందం వుందనీ!

యింకా ఎక్కువగా రాయదలుచుకో లేదు నన్ను నేను సమర్థించుకోడమూ లేదు. మనం యథాప్రకారంగా జీవించవచ్చు. పిల్లలకుగానీ, నీకుగానీ ఏలోటూ వుండదు.

ఏమైనా నా జీవితం యిప్పుడు నీ చేతుల్లో వుంది. నిన్ను ఎక్కువగా విసిగించడం, అసహ్యంగానూ,స్వార్థంగానూ వుంటుంది. దయచేసి యీ విషయాన్ని నిరుద్రేకంగా ఆలోచించు

మరో విషయం గూడా నీకు స్పష్టం చేస్తున్నాను నీ తీర్పుకి—అదేదైనాగానీ- కట్టుబడి వుంటాను

ఇట్లు
నీ రాజు,

* * *

రాజశేఖరరావుగారికి

నమస్కారములు మీ వుత్తరం అందింది. మీ సమస్యని నిరుద్రేకంగా ఆలోచించి నా నిర్ణయాన్ని రాయమన్నారు అంటే 'నేనూ యిందులో ఓ పాత్రని' అన్న ముక్క మరచిపోయి అభిప్రాయం యివ్వాలి. అంతే కదూ! బాగానే వుంది. సినిమాల్లో అయితే ముడి ఫిలిం కోటా అయిపోగానే ఎవరో ఒకర్ని చటుక్కుని చంపేస్తారు. కాని యీ దౌర్భాగ్య జీవితంలో మన కోటా ఎంతో మనకి తెలీదు.

నేను మీ అంత తెలివైనదాన్ని కాను. మిమ్మల్ని ప్రస్తుతం కదిలించిన ఆ 'దివ్యప్రేమ'ని గురించి నాకాట్టే తెలీదు.ప్రేమంటే మనం యిప్పటివరకూ ఒకరిపట్ల ఒకరం కలిగివున్న అనుభూతి లాంటిదేనని అనుకుంటూ వుండే దాన్ని. నా గురించి వదిలెయ్యండి. నా కొక్కటే అనుమానం. మీరు మళ్లీ మరోసారి మోసపోవడంలేదు గదా అని. ఇంకా విస్పష్టంగా చెప్పాలంటే మిమ్మల్ని మీరు మోసం చేసు లేదు గదా అని—అంత అపురూపమైన అనుభవం నిజంగా మీరు పొందుటోతూ వుంటే మిమ్మల్ని నేను అభినందిస్తున్నాను. మీ దారికి నేను అడ్డురాను. ఎందుకో తెలుసా? భారతనారికి ఎట్టి పరిస్థితుల్లోనూ భర్త సుఖమే ముఖ్యం. కుష్ఠువాడైన భర్తని బోగందానింటికి మోసుకుని వెళ్లిందట సుమతి—యీ దేశంలో పుట్టిన ఒకానొక మహాసాధ్వి—అలాంటి సిగ్గుమాలిన ఆవిడకు వారసురాల్నవుదామనే దురాశతో కాదు. మీకు నేను అక్కర్లేదని తోచాక మిమ్మల్నే పట్టుకు దేవిరించడం అసహ్యంవేసి, మనిషిని మనిషిగా, కేవలం ఆమెయొక్క వ్యక్తిత్వంమీద ఏ నాటికీ చెరగని నమ్మకంతో, తనయెడల ఆమెకి గల గాఢమైన

ప్రేమమీది విశ్వాసంతో ప్రేమించగల వాడే నిజమైన ప్రేమికుడు. అన్ని సంవత్సరాలు కాపురం చేసికూడా శ్రీరామ చంద్రుడివద్దనుండి ఆపాటి విశ్వాసాని క్కూడా నోచుకోని సీతాదేవి అగ్నిలో ప్రవేశించడం చూస్తే నాకురాముడిమీద గౌరవం కలగదు సరిగదా—సీతాదేవిమీద గూడా కలగదు. నేను మీ పురాణస్త్రీలతో ఎందునా పోలను, ఒప్పుకుంటాను. నేనో స్త్రీని మామూలు, అతిమామూలు, ఆడదాన్ని. కాని అంతకంటే ముందే నేనో మనిషిని మనిషై పుట్టిన ప్రతిజీవికీ—ఆఖరుకి ఆడదానిక్కూడా — ఆత్మగౌరవమే ప్రియమైనదని నేను నమ్ముతాను మనిషిని నీడగా మార్చే ప్రేమలుగానీ, ధర్మాలుగానీ నా కసహ్యం. సుజాతనీ, మిమ్మల్నీ మీ ఆనందమయమైన కాపురాన్ని చూస్తూ, మీ రనుభవించే సంతృప్తికి ఆనందిస్తూ, మీ పాదాలదగ్గర యింత చోటుచేసుకుని బ్రతకడానికి చాలా పాతివ్రత్యం కావాలి. దానికి నేను పనికిరాను

పిల్లలకీ నాకూ ఏ లోటూ రాకుండా చూస్తామన్నారు. మీ విశాల హృదయానికి నా జోహార్లు. కాని నేను మీ సహాయాన్ని ఏ హక్కుతో స్వీకరించను? పదిహేను సంవత్సరాల క్రితం పెళ్ళి అనేపేరుతో జరిగిపోయిన ఒకానొక యాదృచ్ఛిక సంఘటనకి మీకు అంత జరిమానా విధించలేను.

శోకతో యీదుకుంటూ అమాయకంగా అటూయిటూ చలించే మెదడులేని హృదయంలేని ప్రాణుల్ని నా గర్భంలో దాచుకుని, వాటికి రక్తం, మాంసం, హృదయం, మనస్సు అన్నీ నా శరీరంలోంచి చీల్చి యిచ్చాను. వాళ్లు నా పిల్లలు సంఘం, చట్టం ఏమైనా అననీయండి యీనాడు మీరు నాకేమీ కారు. నా దృష్టిలో పిల్లలకీ మీరు అంతే. ఆ విషయంలో మీరేమీ బెంగపెట్టుకోకండి. వాళ్ళని నేను ఎలాగయినా పోషించుకోగలను.

మీ అన్వేషణ జయప్రదంగా సాగాలనీ, మీరు వాంఛించే 'దివ్యప్రేమ' అంచుల్ని మీరు చేరుకోవాలనీ మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను వుంటాను మరి.

ఇట్లు
జానకీదేవి.

3

డియర్ జానీ!

నీకో తమాషా చెప్పనా! నిన్న సాయంకాలం యీ వూళ్ళో బీచ్‌లో కూర్చుని ఏదో ఆలోచిస్తుండగా హఠాత్తుగా నాకు జ్ఞాపకం వచ్చింది. ఆ యిదురోజులబట్టీ నీవంటే నాకెందుకో ప్రేమగా వుండడం లేదు. మొన్ననే వుత్తరం రాయబోతూ మళ్ళీ ఆగాను యింకో రెండ్రోజులు చూద్దామని ఉహుఁ! లాభంలేదు, ప్రేమగా వుండడమేలేదు. మన మధ్య గడిచిన మధురక్షణాలు జ్ఞాపకం చేసుకుంటే బాధ కలుగుతోంది గాని ప్రస్తుతం నా కెదురుగా వూహాలే వున్న నీ మీద ప్రేమ వుండడం లేదు రోజీ చాలా స్వీట్‌గర్ల్. నాకు ఆమె మీదనే ప్రేమగా వుంటోంది నీవేమైనా 'ఫీల్' అవుతావేమోనని యీ నాలుగు రోజులు తటపటాయించి చివరికి రాస్తున్నాను, ఇందులో 'డైవోర్స్ ఫారం' ఒకటి ఖాళీదిపెట్టి పంపుతున్నాను సంతకం చేసి వెంటనే పంపు. పిల్లల విషయంలో యిద్దరం కూర్చుని రోజీని కూడా కూర్చోపెట్టుకుని ఓ 'డెసిషన్'కి వద్దాం. ఆలస్యం చెయ్యకు.

నీ
రాజ్

* * *

డియర్ డార్లింగ్,

నీ వుత్తరం అందింది. వుత్త 'సెంటిమెంటల్ ఫూల్'లాగా అంత వర్రీ అవుతావేమిటి గురో! నా దగ్గరా ఓ సర్‌ప్రైజ్ న్యూస్ వుంది. గమ్మత్తు చూడు. నేనూ నాలుగురోజుల క్రితమే ఓ ఖాళీఫారం నీకు పంపాను, సంతకానికి. చూశావా, యిద్దరికీ ఒకేసారి ప్రేమ అయిపోయింది, మన ప్రేమ పవిత్రమైంది అనడానికి యింత కన్నా ఏం నిదర్శనం కావాలి?

సరే, యిక విషయానికి వద్దాం, నన్నడిగితే వృథాగా పోస్టులో ఈ కాలయాపన ఎందుకు? ఎల్లుండి వుదయం పదిగంటలకి కోర్టు దగ్గరికి వచ్చెయ్ మ్యాజిస్ట్రేట్‌గారి సమక్షంలో యిద్దరం మన దరఖాస్తులిచ్చి 'మ్యారేజ్ క్యాన్సెలేషన్ సర్టిఫికేట్' పుచ్చుకుందాం. నువ్వన్నట్లు పిల్లలసమస్య మనిద్దరం 'డిసైడ్' చెయ్యడం కాక రోజీ, రోజీతోపాటూ 'ఎడ్వర్డ్' గూడా వుంటే బాగుంటుందేమో! ఏమైనా ఎల్లుండి కోర్టుదగ్గర తప్పక కలుసుకో అన్ని వివరాలూ అక్కడే. వుంటాను మరి

నీ
జానీ

* * *



''నాకు అటువంటి వాటిమీద నమ్మకం లేదు!'' అన్నది సోమిదేవి.

''తప్పు - చెంపలేసుకో అటువంటి మాటలంటే పాపం వస్తుంది!'' అన్నాడు యాజులు భయపడుతూ.

''మీరేమన్నా అనండి-మంత్రాలకు చింతకాయలు రాలవు.''

యాజులు గబగబా చెంపలు వాయించుకున్నాడు.

''అపచారం-అపచారం'' అన్నాడు.

''నువ్వలా దైవదూషణ చేస్తావుకనుకే నీకు పిల్లలు పుట్ట లేదు!—అంతకన్నా వేరే కారణం ఏమీ లేదు. నేను చెప్పినట్టు విను నిష్టగా నేను చెప్పింది చేయి. ఫలితం దక్కుతుంది!'' అన్నాడు మళ్ళీ.

సోమిదేవి మాట్లాడలేదు.

''దేవుడిమీద నమ్మకాలు లేక దైవ దూషణ చేయటంవల్లనే ఈ కలికాలంలో పాపం యిలా రాజ్యంచేస్తున్నది. అంత కన్నా ఏమీ కాదు''

సోమిదేవి యాజుల్ని ఒకసారి దీక్షగా

చూసి తలవంచుకున్నది.

యాజులు సోమిదేవి ప్రక్కనేచేరి మెల్లగా అన్నాడు.

"కుంతీదేవికి పుత్రోదయం ఎలా జరిగిందో తెలుసా-సూర్యభగవానుడిని నిష్టగా ధ్యానించటంవల్ల. ఆ ధ్యాన్నం, నిష్ట, నమ్మకం వుండాలేకానీ. ఏకాలంలో నయినా దైవసహాయం వుంటుంది!"

"అది పురాణాలలోని కథ!" నెమ్మదిగా అన్నది భర్త మాటకు ఎదురు చెప్ప లేని సోమిదేవి.

యాజులు మండిపడ్డాడు-"పురాణాలు అంటే ఏమిటి? అన్నీ జరిగినవే. ఎప్పుడో జరిగినవి కనుక తర్వాత తరాలవారికోసం పురాణాల రూపంలో అలా వున్నాయి."

కొంచెం ఆగి మళ్లీ అన్నాడు "గాంధీ గారు స్వాతంత్ర్యంకోసం పాటుపడటం నువ్వు మాశావా? అసలు నువ్వప్పుడు పుట్టలేదు కదూ—కానీ నువ్వు నమ్మావ్ ఎందుకు? పుస్తకాల్లో వున్నది కనుక అందరు అంటున్నారు కనుక మరి అది పురాణం కాదా? అది కూడా కథేనా?"

సోమిదేవి తల ఎత్తలేదు.

యాజులు కొంచెం ఆగి నెమ్మదిగా అన్నాడు "నా సంగతి నీకుతెలుసు నా పూజలూ, నిష్ట, దైవభక్తి ఈ నాలుగేళ్లుగా చూస్తున్నా నాలాటి భక్తుల్ని ఆ పరాత్పరుడు అన్యాయం చేయడు. నామాటవిని నేను చెప్పినట్టు ఈసారి చేయి. మూఢ నమ్మకం అని కొట్టివేయకు కనీసం నా పుణ్యఫలంగా నయినా మనకు పిల్లవాడు పుడతాడు"

సోమిదేవిది భర్తకు ఎదురుచెప్పే మన స్తత్వంకాదు. వయసులో చిన్నదే అయినా, సనాతనుల కుటుంబంలోనించి వచ్చింది కనుక భర్త చెప్పినదానికి తలవూపింది.

మర్నాడు భర్తతోపాటు 'కాకాని'కి బయల్దేరింది. ముందుగా యాజులు చెరువులో స్నానంచేశాడు. తర్వాత సోమిదేవి కూడా తలమీద స్నానంచేసింది. తర్వాత గుడిలోకివెళ్ళి దైవదర్శనం చేసుకున్నారు. యాజులు తనకు పుత్రోదయం కల్గించమని పరమశివుడ్ని భక్తితో ధ్యానించాడు. నిష్టగా ప్రార్థించాడు తర్వాత గుడివెనక భాగానికి సోమిదేవితో సహా వచ్చాడు. అక్కడ కొంతమంది ముత్తయిదువులు, తడిబట్టలతో చేతులు చాపి దోసిలిపట్టి, బోర్లాపడుకుని వున్నారు సోమిదేవి కేమీ అర్థంకాలేదు.

యాజులు అన్నాడు—"తడిబట్టలతో యిలా దోసిలిచాపి బోర్లా పడుకోవాలి. భక్తి పారవశ్యంతో శివపార్వతులను ధ్యాన్నించాలి. కొంచెంసేపటికి నిద్రలాగా మైకం కమ్ముతుంది అప్పుడు శివపార్వతులు కలలో కనపడి ఆశీర్వదిస్తారు దోసిలిలో అరటిపళ్ళు ప్రసాదంగా యిస్తారు. ఆ అరటిపళ్ళు భుజిస్తే పిల్లలు కలుగుతారు. చూశావా వీళ్ళందరూ అలా చేస్తున్నవారే. ఆ పరాత్పరుడు తనను నమ్మినవారిని చల్లగా చూస్తారు"

సోమిదేవికి అలా అక్కడ పడుకుని వున్నవారు దాదాపు పదిమంది కనపడ్డారు. అది మూఢనమ్మకమని అనిపించినాకానీ, యాజులు చెప్పిన పద్ధతివల్లా, అక్కడ

పదిమంది ప్రత్యక్షంగా అలాచేయటంవల్లా, అభ్యంతరం చెప్పలేదు ఆమె

తనూ తడిబట్టలతో అక్కడ పడుకుంది, దోపిలిచాపి, బోర్లాపడుకుని, మన స్ఫూర్తిగానే పరమేశ్వరుడిని జపించింది

యాజులు కొంచెందూరంలో చెట్టుక్రింద కూర్చుని వినాయకుడి విగ్రహానికి పూజలు చేస్తున్నాడు.

అలా అరగంట గడిచింది.

ఎండి మండిపోతుంది

సోమిదేవికి నిద్ర రావటంలేదు.

కల అసలే రావటంలేదు.

గంట గడిచింది.

ఎండలో సోమిదేవి శరీరం కాలిపోతున్నది.

ఆమెకు నడుం నొప్పిపుడుతున్నది కళ్ళు మూతలు పడుతున్నాయి.

యింకో పావుగంట గడిచింది

యాజులు ముందుకువచ్చి చూశాడు.

సోమిదేవి శరీరంమీద తడిబట్టలు ఆరి పొడిబట్టలుగా తయారయాయి.. ఎండ ఆమె శరీరంమీద మెరుస్తున్నది. ఆమె కళ్ళు మూసుకుని వున్నాయి.

"నిద్ర వచ్చేసింది. యిక ప్రసాదం వస్తుంది!" అనుకున్నాడు.


యింకో అరగంట గడిచింది.

సోమిదేవి కదలలేదు. అలాగే పడుకుని వుంది

దగ్గరకువెళ్ళి చూశాడు యాజులు. ఆమె కళ్ళు తేలవేసివుంది.

అతనికి ఏదో గాభరా పుట్టింది. ఆమెను చేత్తో తట్టి లేపాడు. ఆమెశరీరం సలసలా కాలిపోతున్నది. నీరసంగా కళ్లుతెరిచింది.

"దేవుడు కనపడ్డాడా?" అడిగాడు యాజులు



బలహీనంగా తలవూపింది సోమిదేవి

ఆమెను జాగ్రత్తగా యింటికి తీసుకు వెళ్లాడు యాజులు.

ఆరోజునుంచీ సోమిదేవి మూసినకన్ను తెరువలేదు.

న్యుమోనియా వచ్చిందో, టైఫాయిడ్ వచ్చిందో తెలీలేదు. యాజులు డాక్టరుకి చూపిస్తేకదా ఏరోగమో తెలియటానికి —

"డాక్టరేమయినా దేవుడా ప్రాణం పోయటానికి!" అన్నాడు

"ఏం జరగాలో అలా జరుగుతుంది" అన్నాడు.

శ్రీశైలంనుంచి తెప్పించిన విభూతి, మూడుపూటలా సోమదేవి నుదటిమీద రాశేవాడు.

కాశీనుంచి తెప్పించిన గంగాజలం రోజుకి మూడుసార్లు, మడికట్టుకుని తీర్థం లాగా యిచ్చేవాడు.

"దానిబదులు కాస్త విషం యివ్వ కూడదూ, ఏబాధలేకుండా చచ్చిపోతాను కదా!" అన్నది సోమిదేవి

"మీ మూఢనమ్మకాలు ఈ జన్మకు పోవు కనీసం నేనిలాచస్తే అయినా మీకు తెలిసివస్తుందేమో!" అన్నది.

సోమిదేవి తరపున, యాజులు చెంపలు వాయించుకున్నాడు. "ఎంత అపచారం మాటలు అంటున్నది!" అనుకున్నాడు

"భక్తిభావం, నిష్టలేవు కనుకే కాకాని మల్లేశ్వరుడు నిన్ను కనికరించలేదు!" అనుకున్నాడు.

కాసేపాగి "కలియుగం!" అని కూడా అనుకున్నాడు.

ఎలా అయితేనేం, నెలరోజులు నానా బాధపడి, చివరకు తేరుకున్నది సోమిదేవి

"చూశావా-ఏ డాక్టరు మందిచ్చాడని నీకు తగ్గింది ఇంకెప్పుడూ అలా అజ్ఞానంగా మాట్లాడకు!" అన్నాడు మరింత విభూతి ఆమె నుదుటికి పూస్తూ.

ఆ రోజే శివాలయంలో అర్చన కూడా చేయించాడు

తర్వాత పది రోజుల్లోనే, సోమిదేవి బాగా తేరుకుంది పూర్తి ఆరోగ్యం వచ్చింది

కొన్నాళ్ళ తర్వాత సోమిదేవితో అన్నాడు యాజులు-"మన వూరినుంచి ఒక బస్సు బయల్దేరుతుందిట. భారత దేశం లోని అన్ని పుణ్యక్షేత్రాలు-దక్షిణాన కన్యాకుమారి, రామేశ్వరం, ఉత్తరాదిన కాశీ, హరిద్వారం మొదలయిన పుణ్యక్షేత్రాలతో సహా అన్నీ చూపిస్తారుట. మొత్తం నాలుగు నెలలు దాకా వుంటుంది యాత్ర. మనిషికి రెండువందల యాభై రూపాయలు టిక్కెట్టు!"

"నాకు వెళ్ళాలని వుంది!" అని కూడా అన్నాడు యాజులు.

"నేను ఒక్కదాన్నీ వుండలేను నేనూ వస్తాను!" అన్నది సోమిదేవి గోముగా

"వస్తే బాగానే వుంటుంది. కానీ ఇద్దరికీ టిక్కెట్టే ఐదు వందలు అవుతుంది. ఇక పై ఖర్చో!" కాసేపు దూలాల వేపు చూశాడు. ఏదో ఆలోచించాడు.

"వద్దులే. నేను వచ్చింతర్వాత యాత్ర విశేషాలన్నీ చెబుతాను. అప్పటి దాకా నువ్వు మీ అమ్మగారింట్లోనే వుండు-" లాలిస్తూ అన్నాడు యాజులు

సోమిదేవి ఏనాడు యాజులు మాటకి ఎదురు చెప్పింది కనుక! అంగీకార సూచకంగా మౌనం పాటించింది.

యాజులు చెప్పింది నాలుగు నెలలే అయినా, అతను యాత్ర పూర్తి చేసుకుని

వచ్చేసరికి దాదాపు ఐదు నెలలు అయింది-కానీ భారతదేశంలో వున్న చిన్నా, పెద్దా, అన్ని పుణ్యక్షేత్రాలూ తృప్తిగా దర్శించి వచ్చాడు. పుణ్యం సంగతేమో కానీ, చాలా మూటల నిండా సోమిదేవి కోసం ఏవేవో పట్టుకొచ్చాడు.

సరాసరి అత్తగారింటికే వచ్చాడు.

''ఏం పడుకున్నావ్!'' అని అడిగాడు గాభరాగా-మంచం మీద నీరసంగా,భారంగా పడుకుని వున్న సోమిదేవిని చూస్తూ.

''కూర్చోండి'' అన్నది సోమిదేవి సిగ్గు పడుతూ.

యాజులు మంచం మీద కూర్చుని లాలనగా అడిగాడు ''ఏమిటి కథ!'' అని.

సోమిదేవి యాజులు చెవిలో నెమ్మదిగా చెప్పి, సిగ్గు పడింది.

యాజులు చాలా సంతోష పడ్డాడు

''అంతా నా యాత్రాఫలం?'' అన్నాడు.

కాసేపాగి నెమ్మదిగా అడిగాడు ''ఎన్నో నెల'' అని.

సోమిదేవి మరింత సిగ్గు పడుతూ, మెల్లగా అంది-

''మూడో నెల'' అని.

''మూడో నెలా?'' అదిరి పడ్డాడు యాజులు.

''అదేమిటి?'' అన్నాడు కాసేపాగి.

''అబద్ధం!'' అన్నాడు ఏదో ఆలోచించి.

''నిజమేనా!'' అన్నాడు తేరుకుని.

''అవును'' అన్నది సోమిదేవి నిర్మలంగా, నిండుగా.

''నేను వెళ్ళి ఐదు నెలలు అవలా '' అనుమానంగా అన్నాడు యాజులు.

కానీ సోమిదేవి నిప్పులాంటిది. ఆమెను అనుమానించటం అనవసరం.

''కూర్చుని తీరిగ్గా వినండి. జరిగింది చెబుతాను!'' అన్నది సోమిదేవి.

''చెప్పు!'' ఆతృత కనపరిచాడు యాజులు.

''మీరు వెళ్ళిన దాదాపు రెండు నెలల కనుకుంటాను-ఒక రోజు రాత్రి కూర్చుని రామాయణం చదువుతున్నాను. దశరధుడు తనకు పిల్లలు కలగలేదనే బాధలో వున్నాడు. అప్పుడు వశిష్టుల వారు సలహా ఇచ్చారు. పుత్రకామేష్టి యజ్ఞం చేస్తే పిల్లలు కలుగుతారని. దశరధుడు ఆయన సలహా పాటించి 'పుత్రకామేష్టి' యజ్ఞం చేశాడు. అగ్నిహోత్రంలోంచి, అగ్ని దేవుడు బయటకు వచ్చి, ఒక పాత్రలో పాయసం అందించాడు. అది త్రాగి దశరధుని ముగ్గురు భార్యలూ గర్భవతులయారు. అది చదవగానే నా మనసంతా అదోలా అయింది. ఆ రోజు నిద్రలేకుండా అదే కల, కలవరింత. ఆ రోజు కలలోనే, నాకు అగ్ని దేవుడు కనబడ్డాడు. ఒక పాత్రలో పాయసం తెచ్చి ఇచ్చాడు. నేను ఆ పాయసం త్రాగాను. అగ్ని అంతర్ధానమయిపోయాడు. నా కలా కరిగిపోయింది కాని శరీరమంతా ఏదో బరువుగా, బడలికగా అనిపించింది. తర్వాత వాంతులవుతుంటే డాక్టరుగారు పరీక్ష చేసి, గర్భవతి నయానని చెప్పారు.'' ఆగింది సోమిదేవి.

''అంతా వర్రిది!'' అనబోయాడు యాజులు.

''మీ భక్తి తత్పరతా, నిష్టా, యాత్రా ఫలం, పుణ్యం-నాకు తోడ్పడ్డాయి. అవి వున్న వాళ్ళకెప్పుడు దైవం సహాయం వుంటుంది!'' భర్త కాళ్ళకు నమస్కరించింది సోమిదేవి.

యాజులు బిత్తరపోయి చూశాడు సోమిదేవిని. *

కథలు రాసే ఆనందమూర్తి పెళ్లి వార్తా పత్రికలలో చూసి ఒక్క నిమిషం కళ్లు చిట్లించింది ఉమ.



సెంటిమెంట్ల మెట్లు

– అందే గోపాలకృష్ణమూర్తి

సుందరి అనే అమ్మాయిని గాఢంగా ప్రేమించి, దరిమిలా ఆ ప్రేమ విఫలమై పోవడం మూలంగా నైతేనేమి, సదరు సుందరి తన పాత ప్రేమ వ్యవహారాన్ని సులభంగా మర్చిపోగలిగి భర్తతో సుఖంగా కాపురం చేయడం వల్లనైతేనేమి, ఆనందమూర్తి 'ఆడది సెంటిమెంట్ల మెట్లను ఎంత వేగంగా ఎక్కగలదో, అంతే వేగంగా లేక అంతకు రెట్టించిన వేగంతో దిగిపోనూ గలదు' అనీ. 'రోజూ మార్చే చీరల్లా సెంటిమెంట్లనుకూడా మార్చేసుకోగల నేర్పూ, చాకచక్యం అన్నీ ఒక్క ఆడదానికే ఉన్నవనీ, పెళ్ళికి ముందు ఎంత గాఢమైన ప్రేమ వ్యవహారమున్నా అనక దేవుడిచ్చిన భర్తతో అతి సునాయాసంగా ఎడ్జస్టయి పోగల కెపాసిటీ, ఓర్పూ ఆడ మనసుకే గలవనీ, ఎన్నో థియరీలను రూపొందించి వందలాది కథలను ప్రచురించి. సెంటిమెంట్లను 'మగవాడు మార్చుకోలేడనీ, అటువంటి పరిస్థితే వస్తే అతను ఆత్మహత్యకైనా పాల్పడతాడుగానీ 'రియాలిటీ'తో 'కాంప్రమైజ్' అవలేడనీ నిరూపించ ప్రయత్నించేవాడు

అతని కథలమీద 'ఫర్'గానూ, 'ఎగనిస్ట్' గానూ కూడా ఎన్నో చర్చలు చదువుకొనే అమ్మాయిల మధ్యనే జరిగేరోజుల్లో తాను కూడా ఎన్నోసార్లు పాల్గొన్నది ఉమ. అయితే అతని భావాలతో పూర్తిగా ఎప్పుడూ కూడా ఏకీభవించలేకపోయేది. తను ఎమ్మే చదివే రోజుల్లో 'ఇతనే కథలు రాసే ఆనందమూర్తి' అని ఆనందమూర్తిని క్లాస్‌మేట్ భారతి పరిచయం చేసింది.

ప్రత్యక్షంగా మనిషిని చూసేసరికి కొన్ని క్షణాలపాటు ఉమ ఆశ్చర్యంతో మునిగి పోయింది. ఆ క్షణాలు తన కింకా గుర్తు.

కథలను బట్టి ఆనందమూర్తి అంటే, ఆరడుగుల పొడుగూ, మాసినగెడ్డం, విషాదం తాండవించే ముఖం, ఎటో చూస్తున్నట్లుంటే కళ్ళూ కొద్దిగా మాసిన బట్టలూ, పొడిదగ్గూలాంటి భగ్నప్రేమికుడి లక్షణాలూ, క్వాలిఫికేషన్లూ కలిగిఉండే మనిషేమో ననుకొని ఊహించుకొన్న ఉమకి ఉషారుగా, జోవియల్‌గా మాట్లాడుతూ 'పింక్-ఫోర్ గాగుల్స్'ను అస్తమానం సరిచేసుకుంటూ చుట్టుప్రక్కలి వాతావరణాన్నంతటినీ నవ్వుల్తో ముంచేసేట్టు చేస్తున్న అయిదున్నర అడుగుల నీట్ ఆసామీ 'ఉడికోలోన్' సువాసనలను వెదజల్లుతూ 'సో అండ్ సో' ఇతనే అని పరిచయం చేయబడేసరికి, అతని కథల్లోని హీరో, హీరోయిన్ పాత్రలు రెండూ తన కళ్ళముందు అదేపనిగా తిరిగినట్లయింది. ఆనక మెల్లిగా తేరుకుని 'నమస్తే'అంటూ అతని నమస్కారానికి ప్రతినమస్కారం చేయగల్గిందే గాని, చురకలాంటి అతని నవ్వుకి బదులుగా మరో చిరునవ్వు ఇవ్వలేకపోయింది.

ఆరోజు రాత్రంతా హాస్టల్ టెర్రేస్‌మీద అతన్ని గురించిన డిస్కషనే! తనూ, భారతీ, జూవాలజీ సుశీలా, శాంతీ, శ్యామలానూ! అతని భావాల్ని హాట్‌రైట్‌గా ఖండించేసేది సుశీల మిగతావాళ్లు అదేవిటో! 'అతను చెప్పిందీ నిజమేనే!' అంటూ అతని కథల్లో కొన్నింటిని తెగ మెచ్చుకొనేవాళ్ళు. మీరు పిల్లలు. మీకేం తెల్సు?మీకు ఇంకా 'సెంటిమెంట్లు' అంటే పూర్తిగా అర్థం తెలీదు. అదేవిటో తెలిసేక అప్పుడు అతని కథలు చదివి నాతో మాట్లాడండి—' అంటూ వాళ్ళని కొట్టిపారేసేది సుశీల. ఎంత ఆలోచించినా సుశీల భావాలే తనకూ నచ్చేవి. తన భావాలకు దగ్గరగానూ ఉండేవి. 'అందుచేతనే సుశీలని కన్సల్ట్ చేసి' ఆనందమూర్తిని కడిగేస్తూ ఓ లెటర్ రాయాలి?' అనుకొని సుశీల ఇంటి వెళ్లే ప్రయత్నంలో మునిగి పోయింది ఉమ.

*　　*　　*

'నిజమే, నేనూ అదే అనుకొంటున్నాను' అన్నది సుశీల. ఆనక ఆనందమూర్తిని కాసేపు దుమ్మెత్తి పోసింది. 'ఒక్క ఆనందమూర్తేవిటి, పురుషజాతి బుద్ధే ఇంత!' అని కసిగా పళ్లు కొరుక్కున్నది. వెంటనే కలం తీసుకుని రాయడం ప్రారంభించింది.

"ఆనందమూర్తి గార్కి,

సుమారు సంవత్సరం క్రితం యూనివర్శిటీ హాస్టల్లో మీరు మాకు పరిచయం చేయబడ్డారు. గుర్తుండే ఉంటుంది మీ కథల్ని ఆ మధ్య ముఖం మీదే విమర్శించినందుకు అప్పుడు మీరు సీరియస్ అయిపోయారు జ్ఞాపకం ఉందా? ఆ అమ్మాయినే నేను పేరు సుశీల ఈ మధ్యనే మీ వివాహ వార్త పత్రికలలో చూసి నేనూ, నా స్నేహితురాలు ఉమ చాలా ఆశ్చర్యపోయాం. మీరు ఎంతో పైకి ఎక్కేసి కూర్చున్న సెంటిమెంట్ల పెల్లను అంత వేగిరం ఎలా దిగగలిగేసేరా అని!

అదీ పురుషుడై య్యుండి!! కథలలో మీరు వెలిబుచ్చే అభిప్రాయాలను బట్టి మీ వ్యక్తిత్వాన్ని వేరేలా ఊహించుకొన్నాం. ఇకపై సెంటిమెంట్లను మార్చుకొనే మగవారిపైన కూడా కథలు రాస్తారని ఆశిస్తున్నాం. ఏదేమైనప్పటికీ తిరిగ్గా మీ పూర్వపు కథలను మరోసారి చదువుకొని ఆ దృక్పథంతో మిమ్మల్ని మీరు ఎనలైజ్ చేసుకో ప్రయత్నించండి. బహుశ హనీమూన్ లో ఉంటారు గనుక మిమ్మల్ని వెంటనే జాబు రాయమనడం భావ్యం కాదు. వీలైనప్పుడు మీ భావాల మార్పును తెలియజేస్తూ ఉత్తరం రాస్తే ఆనందిస్తాం. వివాహ శుభాకాంక్షలతో—సుశీల, ఉమ ''

ఉత్తరాన్ని మడిచి కవర్లో పెట్టి వెనక ఎడ్రస్ వ్రాసి, ఆనందమూర్తి చిరునామాకు పోస్ట్ చేసింది సుశీల.

''రిప్లై వ్రాస్తాడంటావా?'' అడిగింది ఉమ.

''రాస్తాడనుకోను. ఊహలో తను వెలిబుచ్చిన భావాలకీ, యదార్థంలో అతని ప్రవర్తనకూ ఎక్కడా సామ్యం కనపడడం లేదు గనక తేలు కుట్టిన దొంగలా మౌనం వహిస్తాడు. లేదా, ఏదో వెర్రిమొర్రి భావాలతో మరో కథ ఎక్కడో ప్రచురిస్తాడు. ఏంతైనా ఈసారి మరీ అంతగా ఆడవాళ్ళ సెంటిమెంట్లమీద విసుర్లూ, చణుకులూ విసర్లేడు. అలాగే చూస్తుండు'' అంటూ ఆనందమూర్తిని బ్రీఫ్‌గా ఎనలైజ్ చేసింది సుశీల.

* * *

''పోస్ట్!''

కంగారుగా వెళ్ళి ఉత్తరం అందుకొన్నది సుశీల. ''పాత స్మృతులను మరువలేక, యదార్థంతో రాజీ పడలేక అందమైన భార్యనీ, ఐశ్వర్యాన్నీ అన్నీ వదులుకొని ఈ మధ్యనే ఆత్మహత్య చేసుకొన్నాడు ఆనందమూర్తి. అతని మరణ వార్త పత్రికలలో ప్రచురింపబడటం అతని కిష్టంలేని కారణంగా, అతనితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే కొద్దిమంది పాఠకులకు మాత్రం ఈ విధంగా తెలియజేస్తున్నాం — ఆనందమూర్తి కుటుంబ శ్రేయోభిలాషులూ, అభిమానులు''—

కళ్ళు తిరిగినట్లైంది సుశీలకి. అప్రతిభురాలై అలాగే నిల్చుండి పోయింది. అనుకోకుండా ఆమె కళ్ళు చమర్చినయ్. ఆమె కళ్ళముందు ఊహకందని రూపంతో అన్నీ కోల్పోయి, శుష్కించిపోయిన ఆనందమూర్తి భార్య అనబడే ఓ 'స్త్రీ మూర్తి' లీలగా తచ్చాడసాగింది. అన్నెం పున్నెం ఎరుగని ఆ అమాయకమూర్తి ఒక వ్యక్తి సెంటిమెంట్ల మూలంగా మోడువారిన జీవితాన్ని గడపవలసి వచ్చిందంటే ఎంతటి ఘోరం! ఆమె చేయని నేరానికి ఇంతటి కఠోర శిక్ష? పాత స్మృతులను మరువలేనివాడు మరో వ్యక్తి జీవితంతో ముడి పెట్టుకోవడం ఎందుకు? మనసు మార్చుకుని పెళ్ళి చేసుకున్నవాడు మాట్లాడకుండా సంసారం చేయడం మాని, సెంటిమెంట్ల చాంతాడుతో ఉరేసుకు చావడం దేనికి? అసలా మనిషిని పెళ్ళెవడు చేసుకోమన్నాడు?

ఉక్రోషంతో గట్టిగా అరిచింది సుశీల. అవే మాటలను ఉమతో అన్నప్పుడు

"కంపల్సరీగా వివాహం చేసుకోవల్సిన పరిస్థితి ఏర్పడిందేమోనే!" అనే అనుమానాన్ని వెళ్ళబుచ్చింది.

"అంటే?" అన్నది సుశీల విసుగ్గా.


"ఏ మూలనన్న ముసిలావిడ అంతిమ కోర్కె అనో, లేక తల్లిదండ్రుల పట్టుదలలో కారణం అయివుండచ్చుగా."

"కాటికి కాళ్ళు జాపుకు కూర్చున్న ముసిలావిడ కోర్కె కోసం మరో స్త్రీ జీవితాన్ని నాశనం చేసే సాహసం ఒక్క మగాడికే వుంది! ఏదైనా అంటే తల్లిదండ్రుల పట్టుదల అంటారు. వాళ్ళ పట్టుదల దేనికి? సంతలో పశువు నమ్మినట్టు కొడుకుల్ని బేరానికి పెట్టి వసూలు చేసే కట్నం కోసమే కదా వాళ్ల పట్టుదలా, తాపత్రయమూను! ఈ ఆనంద మూర్తి మీద రావల్సిన సొమ్ము వాళ్ల తల్లిదండ్రుల కొచ్చేసే వుంటుంది. ఆ విధంగా వాళ్ళ మాటను తీసివేయలేక వాళ్ళ తృప్తి కోసం మనువాడి, సెంటిమెంట్లను మార్చు కోలేననే నెపంతో, తనను నమ్ముకున్న మరో ఆడదాని మాంగల్యంతో ఉరేసుకు చావాల్సిన పరిస్థితిని ఎందుకు కల్పించుకోవాలి? ఐ హేట్ దీజ్ ఫెలోస్."

"సుశీ!" అన్నది ఉమ.

"ఆనందమూర్తి భార్యను తల్చుకొంటుంటే గుండె చెరువై పోతుంది. ఆమె వెల్‌విషర్స్‌గా ముందొక సానుభూతి సందేశం పంపుతూ జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కోమని, అందుకు కావల్సిన వాతావరణాన్ని సృష్టించుకోవడంలో మన సహాయ సహకారాలెప్పుడూ ఉంటవనీ ఓ ఉత్తరం రాద్దాం."

"అంతే కాదు, ఆమెకు అతను చేసిన ఘోరాతి ఘోరమైన అన్యాయానికి ప్రతీకారంగా ఆమె మనసులో అతని మీదున్న సదభిప్రాయన్ని పూర్తిగా రూపు మాపి, ఆమె మళ్ళీ వివాహం చేసుకొనేట్లుగా మనం ఎంకరేజ్ చేయాలి. మళ్ళీ పెళ్ళి చేసుకొనే అవకాశం వస్తే ఆమె వెంటనే



అంగీకరించేట్టుగా చేసి తీరాలి!'' అంటూ లెటర్‌ప్యాడ్ తీసుకున్నది సుశీల.

* * *

''ప్రియమైన సోదరి శ్రీమతి ఆనంద మూర్తికి,

చెల్లీ, మేం నీకు అపరిచితులం అయినా కీ.శే. ఆనందమూర్తి తన రచనల ద్వారా మాకు సుపరిచితులే! ఇటీవల నీకు జరిగిన అన్యాయానికి అమితంగా చింతిస్తున్నాం. అందుకే నీకీ ఉత్తరం రాయాలని సంకల్పించుకొన్నాం.

చెల్లీ, నీ గుండెకి తగిలిన గాయం ఇప్పట్లో మానదు. అయినా గతాన్ని మర్చిపో ప్రయత్నించు. ఆ గాయం నీ గుండెల్లో మంటల్ని పుట్టిస్తుంటుంది. ఆ మంటల్లో నీ కలల పంటలన్నీ మాడిపో కూడదు. నీ భవిష్యత్తు అందంగా మల్చుకో గలిగే మనోధైర్యాన్ని పొందు.

మనసులతో జూదమాడే మహత్తరమైన విద్య ఒక్క మగవాడికే చేతనౌను. సెంటిమెంట్ల పేరుతో మగాడు ఏం చేసినా చెల్లిపోతుంది. ఆడదాని సెంటిమెంట్ల మీద రాళ్లు రువ్వుతూ రచనలు చేసే ఆనందమూర్తి ఆత్మహత్య చేసుకొన్నాడంటే ఆశ్చర్యపోయాం. దానికి మరో అమాయకురాలి బంగారు భవిష్యత్తు బలైపోయిందంటే బాధతో క్రుంగిపోయాం. జీవితంలో ఆడది కూడా చేయలేనిదంటూ ఏదీ లేదని నిరూపించేందుకు ప్రయత్నించు చెల్లీ! అందుకు కావల్సిన అండదండలూ, ప్రోత్సాహం అన్నీ మావద్దనుంచి ఎప్పుడూ నీకు అందుతూనే ఉంటయ్.

అయితే, అన్యథా భావించకపోతే మా చిన్న విన్నపం ఒకటి మన్నించు చెల్లీ! ఈ స్వల్ప వ్యవధిలో ఆనందమూర్తి బహుశ నీ మనసులో మరచిపోలేనంత బలంగా పాతుకుపోయి ఉండి ఉండడు. నీ మనసులో ఏ భావాలు కలుగకముందే అతను నిష్క్రమించాడు గనుక, ముమ్ముందు అవకాశం వస్తే, నిన్ను కోరుకునే మరో వ్యక్తి తారసపడితే ఉపేక్షించక, ధైర్యంగా స్వాగతం పలుకు! నువ్వు ఎదుర్కొనే ప్రతి సమస్యకూ, ప్రతి కష్టానికీ మా సహాయం అందించడానికి మేం ఎప్పుడూ సిద్ధంగా ఉంటామన్న విషయం గుర్తుంచుకో చెల్లీ! వీలైనంత త్వరలో జాబు వ్రాసే ప్రయత్నం చేస్తావని ఆశిస్తూ—సుశీల, ఉమ''.

* * *

''ప్రియస్నేహితురైన సుశీల, ఉమ గార్లకు!

ఆనందమూర్తి నమస్కారాలు.''

ఉత్తరం చదువుతున్న సుశీలకు చెంపమీద 'ఛెళ్లు'న తగిలినట్లైంది. ''మీ రనుకొన్నట్లుగా నేను ఆత్మహత్య చేసుకు చావలేదు. హాయిగా బ్రతికే వున్నాను. అయితే, 'పురుషునిపట్ల మీ ఆలోచనల తీవ్రత ఎలాగుంటుందీ' అన్న విషయాన్ని, మీ సైకాలజీని తెల్సికొనే ప్రయత్నంతో 'ఆనందమూర్తి'—అంటే నేను - ఆత్మహత్య చేసికొన్నట్టూ మీకు ఉత్తరం వ్రాయించాను. నేనూహించిన విధంగానే మీరు మళ్ళీ 'ఆనందమూర్తి'నే తూలనాడేరు. అతనికి ఆత్మహత్య చేసుకొనేందుకు కూడా హక్కు అధికారం లేదన్నట్లు ఉత్తరం వ్రాసేరు. అంతకుపూర్వం అతను వివాహం చేసుకొన్నాడని విరుచుకుపడ్డారు. అయితే మీ ఉద్దేశ్యంలో 'ఆనందమూర్తి' ఏం

చెయ్యాలి? సెంటిమెంట్లను పట్టుకుని ఉరేసుకు చచ్చినా అతనిదే తప్పు! లేదా, వివాహం చేసుకుని సుఖపడినా అతనిదే తప్పు!—ఇదేగా మీ రెండు లేఖలలోని సారాంశం! అయితే, 'ఆనందమూర్తి'కి గానీ, అటువంటి వ్యక్తులకు గాని మీరిచ్చే పరిష్కారమేమిటి? మీరు సూచించబోయేది 'సొల్యూషన్'గా వుండాలేగాని, 'సమస్యను' మరింత జటిలం చేసేదిగా ఉండకూడదు మీరెండు ఉత్తరాలను బట్టీ చూస్తుంటే పురుషజాతిని ఈసడించుకొనే ధోరణి ఉధృతంగా ఉన్నట్టు వ్యక్తమౌతుంది. 'ఇకపై సెంటిమెంట్లను మార్చుకొనే మగవారిపై కూడా కథలు రాస్తారని ఆశిస్తున్నాం' అని వ్యంగ్యం వెలిబుచ్చారు మీ మొదటి ఉత్తరంలో. మీ రెండు ఉత్తరాలనీ చూస్తే, అంత త్వరితంగా మారిపోగల్గిన మీ సెంటిమెంట్లు స్టడీచేయాలన్పించింది. అందుచేతనే చిన్నప్రయత్నం చేసాను. నే అనుకొన్న ఫలితాలే వచ్చినయ్. ఈ 'ఎక్స్‌పెరిమెంటల్ స్టడీ'లో సహకరించిన మీకు నా కృతజ్ఞతలు. నా భార్యకు అందించిన సానుభూతి, సహాయాలకు ఆమె తరపున కూడా నా థాంక్స్! మీ ఆనందమూర్తి ''

వాస్తవంలోకి వస్తూ తన రెండు ఉత్తరాల సారాంశాన్నీ నెమరువేసుకొనే ప్రయత్నంలో మౌనంగా కూర్చుండి పోయింది సుశీల ★

కబుర్లు

బాలసాని ప్రసాదరావు

వెనకటికి హనుమాన్లనే ఓ బాల మేధావి ఉండేవాడు. సదరు అనుమాన్లుగారికి తోక ఉండవలసిన చోట కాకుండా బుర్రలోనే ఉండటంవలన గాబోలు బుర్ర ఎప్పుడూ చురుగ్గా పని చేస్తుండేది.

గొప్పవాళ్ళ తాలూకు గొప్ప లక్షణాలన్నీ బాల్యంలోనే బయట పడుతూంటాయంటారు గదా! ఆ ఆచార ప్రకారమే గాబోలు మనవాడు స్కూలు ఎగ్గొట్టి సెకండ్ హాండ్ బీడీల వేటలో కాలాన్ని సద్వినియోగం చేస్తుండేవాడు అప్పటికింకా సినిమాలు రాలేదు తోలుబొమ్మలాటలూ, వీధి భాగవతాలూ, మాట్నీ షో లుండేవి గావు. కనుక మన వాడికి వేరే కాలాక్షేపం ఉండేది గాదు.

సదరు అనుమాన్లకు ఆంజనేయులు గారనే బాగా డబ్బున్న మామగారుండేవాడు ఆయనకు తోక ఉండవలసిన చోట కాకుండా ఇంట్లో ఇనప్పెట్టెలో వుండేది కనుక ఆ ఇనప్పెట్టె ఏడాదికేడాదికీ పెద్దదవుతుండేది ఆంజనేయులుగారు తీరిగ్గా ఇంటి ముందు అరుగుమీద కూర్చుని రోజుకో అరడజను చీపురుకట్టంత మట్టలు తగలేస్తుండేవారు. ఆ పొగ చూసి ఓసారి పొరుగూరి వాళ్లు ఇక్కడేదో అగ్నిప్రమాదం జరుగుతోందని కడవలతో సహా పరుగెత్తుకొచ్చారనుకోండి అది వేరే సంగతి

హనుమాన్లు ఓ సుదినాన ఊరి చివరి చింతచెట్టు క్రింద పద్మాసనం వేసుక్కూర్చుని బీడీలు తగలేస్తూండగా గొప్ప సందేహం ఒకటి వచ్చింది

"మా ఆంజనేయులు మామ హాయిగా ఇల్లు కదలకుండా అన్ని చుట్టలూ ఒక్కడే కాల్చేస్తూ కూర్చుంటాడే! మరి నాకు ఈ సెకండ్ హాండ్ బీడీలేం ఖర్మ! మామకు అన్ని చుట్టలూ, అంత పెద్ద ఇనప్పెట్టె, దాన్నిండా అంత బంగారం, డబ్బూ ఎక్కడివి? నాకు కనీసం ఓ కొయ్యబీరువా, దాన్నిండా బీడీ కట్టలూ అయినా లేవు ఎందువల్ల?" అని.

డౌట్లు రావటం అనేది గొప్పవాళ్ళ సహజ లక్షణం కనుక అనుమాన్లకీ యీ సందేహం రావటం సహజమే. కానీ, వాడు మార్క్సు పుస్తకాలు గానీ, మావో సూక్తులు గానీ చదివి ఉండలేదు. కనీసం కృశ్చేవ్, నెహ్రూల సోషలిజం ఉపన్యాసాలన్నా చదూకోలేడు 'భూమికోసం' సినిమా అయినా చూసి ఉండలేడు అందువల్ల జవాబూ దొరకలేదు

అందుమీదట ఇలాగ్గాదని అనుమాన్లు సరాసరి చింతచెట్టు పద్మాసన ధ్యానం వదలి ఆంజనేయులు మామగారి దర్శనం చేసుకున్నాడు. "మామా! నా దగ్గర చిల్లి కానీకూడా లేదే! మరి నీ కింత డబ్బెలా వచ్చింది?" అని సూటిగా

అడిగేసేడు.

ఆంజనేయులుగారు మొదట తెల్లబోయేరు ఆ తర్వాత ఆశ్చర్యపోయేరు. అల్లుడి మొహంలోని అమాయకత్వం యధాతధంగానే ఉండటం చూసి ఆందోళన చెందాల్సిన పనిలేదని ఊరుకున్నారు ఆలోచించి, ఆలోచించి ఇలా సెలవిచ్చేరు.

"చూశావు గదరా! అనుమాన్లూ! నా చెవుల్నిండా వెంట్రుకలు దట్టంగా చింతగుబ్బల్లా ఉన్నాయి గదరా! ఇవే నా అదృష్టానికి కారణం! నా ఇనప్పెట్టెకూ, చుట్టల కట్టలకూ ఇవే శ్రీరామ రక్ష" అని.

అందుమీదట హనుమాన్లు ఎకాఎకీన ఊరు దాటి, చింతచెట్లూ, పొలాలూ దాటి, అడవిలో ఓ మంచి చోటు చూసుకుని తన ఇష్టదైవమైన హనుమంతుడిని గురించి ఘోర తపస్సు చేసేడు.

అలా కొంతకాలం గడిచాక హనుమంతుడుగారు ప్రత్యక్షమై "భక్తా! బాల అనుమాన్లూ! నీ భక్తికి మెచ్చితిని! నీకేం కావాలో కోరుకో! మా రాములవారితోనో, సీతమ్మగారితోనో చెప్పి ఇప్పిస్తాను" అని అభయం ఇచ్చేరు

అంతట మన అనుమాన్లు సంతోషించి రపీమని లేచి "స్వామీ! నా చెవుల్నిండా మా మామకున్న దుబ్బులకన్నా పెద్దగా— అదుగో మీ తోక చివరున్నంత పెద్ద దుబ్బులు అర్జంటుగా పెరిగేలా ఆశీర్వదించండి" అని వేడుకున్నాట్ట!

"ఓస్! ఇంతేనా! ఇంకేదో పెద్ద కోరిక లడుగుతా వనుకున్నాను. ఈ మాత్రానికి మా రాములవారి పర్మిషన్ కూడా అక్కర్లేదు. ఇచ్చేశాను ఫో!" అని తోకాడించుకుంటూ మాయమై పోయాట్ట! హనుమంతుడుగారు

ఆ తర్వాత ఏం జరిగిందో మన కనవసరం! కానీ, ఈనాడు మనల్నెవరో ఎందుకు సాక్షాత్తూ ఇందిరాజీయే వచ్చి "ఏం కావాలో కోరుకోండి నూతన సంవత్సర కానుకగా ఇచ్చేస్తాను" అనడిగితే మనం కోరబోయేవి అచ్చం మన హనుమాన్లు కోరికల్లాగే కాకున్నా, అంతకన్నా ఘనంగా మాత్రం వుండవేమో ననిపిస్తోంది.

మనం అల్ప సంతోషులమో, లేక అలసిపోయిన మనుషులమో గానీ, మొత్తంమీద మనకీనాడు పెద్దగా నూతన సంవత్సర కోరికలు గానీ, ప్రణాళికలు గానీ లేవు గ్యాస్ పొయ్యికోసం ఒకప్పుడు కలవరించేవారు ఈనాడు ఆ కోరిక వారానికో బుడ్డీ కిరసనాయిల్ ఇప్పిస్తే చాలు ప్రభో! అనేదాకా దిగి వచ్చింది. మనకన్నా అన్యాయంగా బ్రతికే మనుషులున్నారు వారికి కనీసం కిలో రూపాయికి 'అన్నా' రైస్ గానీ, ఇందిరా గోధుమలు గానీ కూడా అక్కర్లేదు. రూపాయికో కిలో నూకలు ఇప్పించినా ఇది రామరాజ్యం అని సంతోషించే స్థితిలో ఉన్నారు వారు

ఎప్పుడూ జీతాలు, జీతాలు పెరగాలి, పెంచాలి అంటూండే ఎన్జీవోలు కూడా నూతన సంవత్సర కానుకగా జీతాలు పెంచమని అడగబోవటం లేదు. "ప్రభో! వేజ్ ఫ్రీజ్ చట్టం క్రింద బిగబట్టిన మా ఇంక్రిమెంట్లు బాపతు అయిదున్నర రూపాయలూ ఇప్పించెయ్యండి! అదే పదివేలు!" అనడిగేలా ఉన్నారిప్పుడు.

కనుక, నూతన సంవత్సర శుభాకాంక్షలు ఏమని చెప్పుకోవాలనేది ఓ సమస్యే! ఆ సమస్యను నూతన సంవత్సరంలోనే తీర్చుకుందాం గాక! ★

రాగవసంతం

-యామినీ సరస్వతి-

''నాకీ పెళ్ళి వద్దు నాన్నగారూ.''

నివ్వెరపోయి చూశారు కృష్ణస్వామిగారు.

''అవునండీ నాన్నగారూ! నాకీ పెళ్లి వద్దు. నేను పెళ్లి చేసుకోను. నన్నిలాగే వుండనివ్వండి.''

''ఎందుకమ్మా'' ఆశ్చర్యంగా అడిగారాయన.

''ఎందుకంటే ఎందుకో స్పష్టంగా చెప్పలేను. కాని నన్ను బలవంతం చెయ్యకండి నాన్నగారూ.''

''చూడు బేబీ! నీవూ చదువుకున్నావు. లోకం ఎలాంటిదో తెలుసుకున్నావు. ఈ సంఘం ఒక అడవి. అందులో సింహాలూ, శరభాలూ భల్లూకాలే కాదు. గార్ధభాలూ వున్నాయ్! అందులో అందమైన లేడి హాయిగా కులాసాగా స్వేచ్ఛగా తిరగటానికి వీల్లేదమ్మా! రక్షణ....రక్షణ కావాలి బేబీ!''

ఆ మాటకి నవ్వి అంది వేదవతి ''మీరు చెప్పింది నిజమే నాన్నగారూ! కానీ అమ్మా మీరూ వున్నంత కాలం నాకేం భయం?''

నిట్టూర్చారు ఆయన. ''నీ మాట నిజమే తల్లీ. ఈ శాశ్వతం కాని నన్ను నమ్ముకుంటే ఎలాగమ్మా? అప్పుడో యిప్పుడో అనేట్లున్నాను నేను.''

ఆయన మాటలు పూర్తి కాకముందే 'అలా అనకండి నాన్నగారూ! మీరు నిండా నూరేళ్లు వుండాలి. దేశానికి మీరెంతో అవసరం' అంది.

ఆ మాటలకి ఆయన భారంగా 'దేశానికి మేమెంతో అవసరం. ఆ మాట నిజమే తల్లీ! కానీ మాకు దేశం వుపకరించటం లేదు. అడుగడుగునా అపజయాలతో, మోసపోతో, బ్రతుకుని నెగ్గించుకుని వచ్చాను. అందలాల్లో తిరగవలసిన మీరు నా వల్ల అద్దె కొంపలో బ్రతుకుతున్నారు' అన్నాడు.

''మీరేం చేశారు నాన్నగారూ! భగవంతుడి పంచాయితీ అది ఏం జరిగినా ఆయన ఏది ఎలా ఎప్పుడు జరగాలో విజ్ఞయించి నిర్దేశించినట్లే జరుగుతుంది. అలానే జరిగింది ''



''ఈ మాటలన్నీ ఎందుకులేమ్మా! నీవూ ఓ ఇంటిదానివై నీ కడుపున ఓ కాయ కాస్తే మేం చూసి ఆనందిస్తాం. వాళ్ళకి రేపు జాబు రాయాలి. బాగా ఆలోచించుకొని రేపు చెప్పు బేబీ'' అన్నారాయన.

మౌనంగా గదినించి వెళ్ళింది వేదవతి.

*　　*　　*

''అతనికి నీవు నచ్చావట! నీవూ నీ మాట చెపితే వాళ్ళకి జాబు వ్రాస్తాను.''

వారం రోజుల తర్వాత మళ్ళీ నాన్నగారు అడిగిన ప్రశ్నకి తల వంచుకుని సమాధానం ఇవ్వలేదు వేదవతి.

''బేబీ! చెప్పమ్మా! నీకు నావద్ద పూర్తి స్వాతంత్ర్యం వుంది. నీకు నచ్చకపోతే చెప్పమ్మా. ఏదో వంకబెట్టి వ్రాసేస్తాను.''

ఆ మాటలకి పేలవమైన గొంతుతో కాంతి విహీనమైన ముఖంతో అంది 'నచ్చక పోవటానికి అతనికేం లోటు నాన్నగారూ! అందానికి అందమూ, చదువుకి చదువూ, చదువుకి తగ్గ వుద్యోగమూ అన్నీ వున్నాయ్. కానీ నాకే అసలు

పెళ్ళి చేసుకోవటం ఇష్టం లేదు' అంది వేదవతి.

ఒక్క క్షణంపాటు జవాబివ్వలేదాయన తర్వాత మెల్లిగా "ఇక ఆ మాట అనొద్దు బేబీ! నీవు పెళ్ళి చేసుకోక తప్పదు. కాదంటే నన్ను చంపుకు తిన్నట్టే ఏదో నీ చిన్న వయస్సులో మేం పడిన ముచ్చట ఆ విధంగా భగ్నమై పోయిందని మమ్మల్ని మనోవ్యధకు గురి చేయకు" అన్నారు బాధగా.

ఆ మాటలకు గాయపడినట్టే 'ఎంత మాట అన్నారు నాన్నగారూ! మీ కొరకు ప్రాణం వదలమన్నా వదలగలను అలాటిది .'

ఆమె మాట పూర్తి కాకుండానే 'ఐతే ఇంకేం తల్లీ! ముహూర్తం నిశ్చయించు కోటానికి వస్తానని వ్రాస్తాను' అన్నాడు సంబరంగా.

ఆయన ముఖంలో ద్యోతక మౌతున్న ఆనందానికి లొంగిపోయి, ఆయన్ని బాధ పెట్టటం ఇష్టంలేక, ఎదురు చెప్పలేక, విధి ఎలా లాక్కెళితే అలా పోవటమే మనుష్యుల బాధ్యత అనుకుని మౌనంగా వుండిపోయింది ఆమె.

"రాయనా బేబీ."

తలూపింది.

"ఇంకో మాట బేబీ! అతను కట్నకానుకలు ఏమీ వద్దన్నాడు. నా అదృష్టం కొద్దీ నీవు కలిగావనుకుంటే అంతకంటే ఇతను అల్లుడు కావటం మరీ అదృష్టం అనిపిస్తోంది. ఐ.ఏ.యస్. అయి డివిజనల్ కలెక్టరుగా పనిచేస్తున్న వాడు కట్నం లేకుండా రావటం యీ జన్మకి అదో భాగ్యం తల్లీ."

ఆయన ఆనందాన్ని గమనించి నిట్టూర్చింది.

ఇక ఆయనకూడా ఏమీ అనలేదు.

ఓ నిమిషం నిశ్శబ్దంలో లీనమైంది.

"నాన్నగారూ! నా గురించి ఆయనకి చెప్పారా?"

"బేబీ! ఇక అవన్నీ మరిచిపోమ్మా! మీ నాన్న అవివేకంగా చేసిన దానికి నీవు అనుభవించిన శిక్ష చాలు మళ్ళీమళ్ళీ గుర్తు చేసి బాధ పెట్టి బాధ పడొద్దు అదో జన్మ! అంతే!! ఇది నీకు వేరు జన్మ! అతనూ అదే మాట అన్నాడు. వేదశిఖ లాంటి వేదవతి అన్నాడమ్మా అబ్బాయి అదంతా విని."

ఎంత కాదనుకున్నా అతని సంస్కారాన్ని కాదనలేక పోయింది. మనస్సులో ఓ మూల మంచి భావం మెదిలింది.

"వెళ్ళమ్మా. మీ అమ్మతో కలిసి వెళ్ళి మాటాడు. కావలసిన చీరలూ, నగలూ తీసుకో తల్లీ. నాకు నీకంటే కోర్కెలు తీర్చవలసిన వారెవరున్నారు."

"మీ ఇష్టమే నా ఇష్టం నాన్నా. మీరూ అమ్మా ఏవి తెస్తే అవే నాకు తృప్తి నిస్తాయి."

ఆనందంతో నిట్టూర్చారు కృష్ణస్వామి గారు

* * *

పెళ్లి శాస్త్రోక్తంగా విధి విహితంగా జరిగి పోయింది.

ఆసక్తి లేకున్నా, ఆనందంతో కాకున్నా బాధ్యతాయుతంగా నైనా కార్య కలాపాలు

ట్వింకిల్ ట్వింకిల్ ఫిల్మ్‌స్టార్!

ఇంటగెలిచి రచ్చగెలవటం అసలు
సామెత
రచ్చగెలిచి ఇంటికి రావటం ఈమె
సాధించిన ఘనత
విషాద చిత్రాలతో తనకంటూ వేసు
కుందో ముద్ర
హుషారు పాత్రలలో కూడ తనదే
పై చేయంటుంది ఊర్వశి శారద.
కాలం మారినా ఈమెమాత్రం
మారని మనిషి
కనుకనే కాగలిగింది ప్రేక్షక
హృదయాల పట్టమహిషి



—జి. యస్. సూరి

అన్నీ నెరవేర్చింది వేదవతి.

పెళ్లి వైభవంగా చేశారు కృష్ణస్వామి గారు. అల్లుడుగారు కట్నం కోరక పోవ డంతో వియ్యాలవారు అబ్బురపడేట్టు కథల్లో చెప్పినట్టుగా ఆకాశమంత పందిరీ, భూదేవంత అరుగూ వేయించారన్నట్టు, ముత్యాల ముగ్గులూ రత్నాల రంగవల్లికలూ అన్నట్టుగా చేశారు. ఏ లోటూ లేకుండా, రాకుండా ఎవరూ నొచ్చుకోకుండా అయిదు రోజులూ అఖండవైభవంగా పెళ్ళి జరి పించారు.

పెళ్ళి ముగిసి పోయింది. అయిదవ నాటి నాగవళ్ళి వేడుకతో.

ఆ రోజు సాయంకాలం వియ్యంకుల వారు కృష్ణస్వామిగారిని పిలిచి హెచ్చరిం చారు.

ఆడవాళ్ళతో ఒకమాట అడిగి చెపుతా మని వెళ్లి భార్యని పిలిచి చెప్పారాయన 'అమ్మాయిని కనుక్కో'మని.

మేడ పైభాగాన క్రిందినించి పాకించిన సన్నజాజితీగ చివర పూసిన మొగ్గని చూస్తో కూర్చుంది వేదవతి.

''పాపా!''

తల్లినిచూసి 'ఏమ్మా' అంటూ వచ్చింది ఎదురుగా.

కూతురిని దగ్గరగా కూర్చోపెట్టుకుని తల నవరించి వీపు నెమ్మదిగా నిమురుతూ 'ఒక్కదానివీ యిలా కూర్చున్నావేమ్మా' అంది రామలక్ష్మిగారు

తల్లి ముఖంలోకి దీనంగా చూసింది వేదవతి.

'పాపా' అని గుండెల కదుముకుంది ఆమె

'ఆడవాళ్లు ఎన్ని యేళ్లు పెరిగినా తలి దండ్రులని విడిచిపోక తప్పదమ్మా. ఇది మనకు శాపం కాదు వరం తల్లీ! మనం వెళ్లిమరొక వంశాన్ని వుద్ధరిస్తున్నాం. పాపా మనం లేని మగవాడిజీవితం శూన్యం

తల్లీ? నరకం లాంటి వాళ్ల జీవితాన్ని స్వర్గంగా మారుస్తామమ్మా మనం''

''కానీ—కానీ—నేను నిన్నూ నాన్న గారినీ విడిచి వెళ్లలేనమ్మా! నన్ను ఇక్కడి నుండి బలవంతంగా పంపించి వెయ్యకండి. మీకు దూరమై మసలలేనమ్మా.''

దాదాపు దుఃఖంతో పూడుకపోతున్న గొంతుకతో అన్నకూతురి మాటలు విని పేలవంగా జవాబిచ్చింది రామలక్ష్మమ్మగారు ''మొదట మొదట అలాగే వుంటుంది తల్లీ, ఈ రాత్రి కాస్తా గడిస్తే రేపటికంతా మమ్మల్ని మరచి పోతావు మాకంటే అతనే నీకు ఎక్కువౌతాడు. ఆడపిల్లలంతా అంతేనమ్మా''

'అమ్మా!'

''ఏమ్మా?''

''వద్దమ్మా! వద్దు! నా కిష్టం లేదు - కొన్నాళ్లయినా నన్ను యిలాగే వుండ నివ్వండి'' ఓడిపోతున్న గొంతుకతో అంది వేదవతి

''ఛ! ఛ! అలా అనొద్దమ్మా కన్య వధువుగా మారక తప్పదమ్మా. జీవితం సంపూర్ణం కావాలంటే జత కాక తప్ప దమ్మా.''

''అమ్మా.''

''పాపా! నా మాట వినమ్మా! నీవు ఎంత వాదించినా దీనినుంచి తప్పించుకో లేవు. మూర్ఖంగా వాదించి తప్పించుకోవా లని యత్నిస్తే దక్కేది అవమానమే నమ్మా.''

ఆ మాటలకి చివాలున లేచి నుంచుని ''కనీసం నీవన్నా అడ్డుపడి ఈరోజుని తప్పించమ్మా. అంతకంటే నేను మరేమీ కోరను'' అని చకచకా దిగిపోయింది యింకో మాటకి ఆస్కారం యివ్వకుండా.

భార్యద్వారా అంతా విన్న కృష్ణస్వామి గారు ఆలోచనా సంక్రాంతమయిన మనస్సుతో వియ్యంకులకు ఏదో సర్ది చెప్పి అప్పటికి వాయిదా వేయించి కూతురి కోర్కె నెరవేర్చారు.

* * *

తర్వాత రెండు నెలలకి పెళ్లయి మూడో మాసంరాగానే కబురుచేశారు వియ్యంకులు. మంచిరోజు చూసి ముహూర్తానికి ఏర్పాటు చేయించండని.

కూతురు ''వద్దమ్మా వద్దు. ఈ మగ వాళ్లు రాక్షసులు వాసన చూచి ఆనందించాల్సిన పువ్వుని నలిపి నేలవేసి కాలరాస్తారు'' అన్న మాటలు విని నిర్ఘాంతపోయింది రామలక్ష్మి.

''అవునమ్మా! సున్నితమైన మనస్సుని వాళ్లు గ్రహించలేరు సరికదా గ్రహించటానికి ప్రయత్నమైనా చెయ్యరు. మనం బానిసలం వాళ్ల దృష్టిలో. మనమొక సాధనాలం మాత్రమే. అంతకు మించి వుపయోగమూ లేదు వుద్దేశ్యమూ లేదు''

మారు చెప్పలేకపోయింది ఆమె.

ఆమె దగ్గరిగా వెళ్ళి భుజంపై చేయివేసి ''నాన్నగారిలాంటి పూజనీయులని చేసుకున్న నీకు అర్థం కాదమ్మా యిది. ఇదంతా సొదగా అనవసర ప్రసంగంగా అనుకుంటున్నావు కదూ'' అంది లాలనగా వేదవతి.

ఆ మాటలకి నొచ్చుకుని ''లేదమ్మా! కానీ అలా అనకూడదమ్మా తప్పు. అందమైన తీగకి పందిరి ముఖ్యం తల్లీ'' అంది.

''అందుకే మీకొఱకై పెళ్ళిచేసుకున్నా

నుగా అమ్మా. నే నిప్పు డెవరో తెలుసా? ....జిల్లాలో....డివిజనల్ సబ్ కలెక్టర్ గారి సతీమణిని. శ్రీమతి వేదవతీ కరుణాకరాన్ని తెలుసా?....ఇంతకంటే ముత్యాల పందిరి ఎక్కడమ్మా?"

"వేదా!"

"నా గుండెల్లో వుండే మంటలు మీరు చూడలేరమ్మా! కనీసం నే చెప్పే మాట లయినా విని అర్థం చేసుకుని ఆదరించండి"

[illegible]

[illegible]

.కాదని మీరు పట్టుబడితే ఆ శృంగారం నా శవానికే నమ్మా."

"వేదా!"

"కోపపడవద్దమ్మా! కొన్ని కొన్ని నిజాలు చాలా కఠినంగానే వుంటాయి. ఏం చెయ్యను? మనసుకీ మాటకీ అంగరందని వాళ్లలా అబద్ధం చెప్పటానికి నా చేతకాదు, మీరూ నేర్చుకోలేదు! ఈ మూగమనసు బాసా లాడితే వినే అదృష్టం ఎవరికీ లేదమ్మా"

[illegible]

[illegible]



వుండాలి.

కానీ తనదో?

"భగవంతుడా యిక నీవే దిక్కు" అనుకుంది వేదవతి గత్యంతరం లేక.

* * *

మేడమీద గది అలంకరించారు.

గదిలో ఒక్కో గోడకి మధ్య ఒక్కో పెద్ద పటం తగిలించారు. అన్నీ శృంగార రస తరంగాలే! శకుంతలా దుష్యంతులూ, మేనకా విశ్వామిత్రులు, రతీ మన్మధులు, సత్యా కృష్ణులు వివిధ భంగిమల్లో శృంగార రసాన్ని గది నిండా వెదజల్లు తున్నారు. పందిరి మంచానికి తల వైపూ అటూ ఇటూ గోడలకి పెద్ద పెద్ద అద్దాలు తగిలించారు.

పందిరి మంచం చుట్టూ మల్లెపూల సరాలు వేలాడ దీశారు. చాందినీ నుంచి దోమ తెరకు బదులుగా మల్లెదండెలే వేలాడ దీశారు. వేలు మోపితే నల్లనౌతుందా అన్నట్టుగా వుంది తలగడ. దానిపై స్వీట్ నైట్ అని అందంగా అల్లారు.

పరుపుపై పరచిన రోజ్ బ్లాంకెట్ కనులపండువుగా వుంది. కాళ్ళ వైపున మరో దిండూ దాని పైన్నే మరో బ్లూ బ్లాంకెట్.

మంచానికి తలవైపున కుడి వైపున ఓ టేబిల్పై పళ్ళెరాల నిండా రకరకాల స్వీట్స్! ఫ్లాస్కులు రెంటి నిండా పాలు, టీ ఇంకో పళ్లెరంలో లేత తమలపాకులూ, వక్కా, సుగంధ ద్రవ్యాలూ, ఏలకలూ, లవంగాలూ వున్నాయ్. మరో వైపు పన్నీరు బుడ్డి!

పైన సీలింగ్ ఫాన్.

మంచానికి దిగువ వైపు స్టూల్పై టేబిల్ ఫాన్.

పక్కనున్న పడక కుర్చీలో కూర్చున్నాడు కరుణాకర్.

తలుపు తీసి లోపలకు పంపారు వేదవతిని.

ఆమె లోపలకు రాగానే తలుపు మూసుకుంది

వంచిన తల ఎత్తలేదు వేదవతి.

ఉన్న చోటినుంచి కదల్లేదు ఆమె.

కుర్చీలోంచి లేచాడు అతను.

వెళ్ళి టేబిల్పై నున్న పన్నీరు అందుకుని ఆమె దగ్గరిగా వెళ్ళి సుతారంగా ఆమెపై పన్నీరు చిలకరించాడు.

తలెత్తి చూసి వంచేసుకుంది ఆమె.

మల్లె మొగ్గలు చేతిలో తీసుకుని ఆమెపై చల్లాడు.

కదల్లేదు మెదల్లేదు.

సమీపంగా వెళ్లి కౌగిట్లోకి తీసుకోవటానికి చేతులు చాచాడు.

దూరంగా వెళ్లింది ఆమె.

"వేదా "

" "

"వేదా "

" "

చేయి చాచి ఆమె చేతిని అందుకోబోయాడు అతను. తప్పించుకుని దూరంగా వెళ్ళింది.

"నీవు అందాల రాశివి. నా ప్రేమ రాశివి. హాయిగా తీయగా గడపవలసిన యీ రాత్రిని నీ మౌనంతో వృధా చెయ్యకు. క్షణక్షణమూ మధురమైన యీ రేయిని

ట్వింకిల్ ట్వింకిల్ ఫిల్మ్‌స్టార్!



నవలా నాయకి సిరివాణి
చలన చిత్రరంగానికి మకుటంలేని
మహారాణి
నటనలో కనపరుస్తుంది సహజమైన
ఈజ్
అందుకనే ప్రేక్షకులకు ఈమంటే
అమితమైన క్రేజ్

—జి. యన్. సూరి

వృథా చేయకు. రా.''

అతని చేతినుండి తన చేయి విడిపించుకో చూసింది. కానీ సాధ్యం కాలేదామెకి.

''పదిమంది పెద్దల మధ్య పవిత్రమైన వేదమంత్రముల మధ్య శుభ ముహూర్తాన పడిన లంకె యిది అంత సులభంగా జారిపోదు ''

మౌనంగా నిలుచుంది

దగ్గరగా లాక్కోబోయాడతను.

సాధ్యం కాలేదు.

''ఇదిగో! ఇలా బెట్టుపోయావంటే నిన్నెత్తుక వెళతాను. తెలుసా? మంచిగా మల్లెపూవులా నడిచిరా.''

దానికి సమాధానం లేదు.

చేయి వదిలి రెండు చేతులూ సాచి కౌగిట్లో బంధించ బోయాడు.

''నన్ను వదలండి.''

''ఎందుకో?'' ఆమె మాట్లాడినందుకే సంతోషపడ్డాడతను.

''నాకిష్టం లేదు.''

నవ్వాడతను.

''నిజం! నాకు మగవాళ్ళంటే అసహ్యం'' దానికి అతను నవ్వితే మళ్లీ అంది ''నవ్వినా నాకేం భయం లేదు. నాకు మగ పురుగులంటే గిట్టదు ''

పకపక నవ్వాడతను.

''ఛీ! ఎందుకలా నవ్వుతారు? అసహ్యమంటే అర్థం కావటం లేదా? మిమ్మల్ని చూసినా మాట్లాడినా మీరు తాకబోయినా నా కసహ్యం. నేను భరించుకోలేను. కాదని రాక్షసుడిలా ఏదయినా చేయబోతే మధ్యలో నా శవంతో సంసారం చెయ్యాలి మీరు.''

అతని ముఖంలో గాంభీర్యం అలుముకుంది.

''దయచేసి నన్నర్థం చేసుకోండి. పశువులా మూర్ఖంగా ''

ఆమె మాటలు పూర్తి కాకముందే ''ప్లీజ్! ఇంక ఏమీ చెప్పొద్దు. నాకు అర్థమైంది. అంతగా వివరించ నక్కర లేదు. కానీ ..కానీ...ఇలాంటి దానివి పెళ్లెందుకు

చేసుకున్నావు?'' అన్నాడతను ఆలోచనా పూర్వకంగా.

''జన్మనిచ్చిన తల్లిదండ్రుల్ని బాధించ లేక.''

''కానీ యీ నీ అసంగత చర్యవల్ల నేనెంత బాధపడాలో నీకు తెలుసా?''

ఆమె ఓ క్షణం ఆలోచించి అంది.

''మీకేం మగ మహారాజులు. వాల దలచుకున్న తోటికి తోట నిండా పువ్వులే.''

''హుం పొరపడ్డావన్న మాట! నేనలాంటి వాడిని కాదు మగవాడి నైనంత మాత్రాన నిప్పులవిడిగా తిరుగుతా ననుకో వద్దు.''

''మీ ఇష్టం.''

''నా ఇష్టం....నా ఇష్ట మేముంది? నా ఇష్టమూ నా ప్రేమా యీ మనస్సూ అన్నీ యీ క్షణాన్నే నీ చుట్టూ అల్లుకున్నాయి. కానీ అవి నిన్ను బంధించలేక పోతు న్నాయి.''

''చూడండి! ప్రవాహంలో కొట్టుకుని వెళుతున్న కట్టెల్లాంటి వాళ్లం మనం. ఇక్కడ కలుస్తాం. మరికొంత దూరం వెళ్లాక విడిపోతాం. కారణం ప్రవాహం కానీ మనం కాదు. జీవన ప్రవాహం చేర దీసిన మనల్ని ఏ క్షణాన్నో విడదీయక మానదు. కొద్ది రోజులయ్యాక మీరు విడాకులు తీసుకోండి మీ కిష్టమైన అమ్మా యిని మళ్లీ పెళ్లి చేసుకోండి.''

''హుం మాటలు విషం పూసిన కత్తు ల్లాటివి. ఎంత మాట పడితే అంత మాట అనటం చాలా అన్యాయం. ఏ నాటికైనా నీ మనసు మారాలి. నా బ్రతుకు పండాలి. అంతే.''

''చాలా కృతజ్ఞురాలిని. అన్య క్తుల చేతిలో నయితే యీ పరికి అశువులు పోయివుండేవి.''

అతను ఓ క్షణం పాటు మౌనం వహిం చాడు.

తర్వాత 'సరే! ఇదంతా మన మధ్యనే వుండనీ చివరికి మీ తలితండ్రులకి కానీ మా తలిదండ్రులకి కానీ తెలియనవసరం లేదు అనుకూలించిన నాడు అనురాగాలు పంచుకుందాం. లేదా యింతే....పగలంతా ఒకటయినా చీకటిలో యిద్దరిగా బ్రతుకు దాం'' అన్నాడు పేలవంగా నవ్వి.

ఆమె ఏమీ అనలేదు.

''నేను కుర్చీలో పడుకుంటాను. నీవు వెళ్ళి ఆ మంచం పై పడుకో....నో....నో ...యింకేమీ చెప్పకు నేను కలెక్టర్ని నా ఆర్డరుకి ఎదురు చెప్పకూడదు'' అన్నాడతను నవ్వుతూ.

వెళ్ళి పడుకుంది ఆమె యింకేమీ అనలేక.

అతను కుర్చీలో పడుకున్నాడు. కాలం గడుస్తోన్నా అతనికి నిదుర రావటం లేదు ....దాదాపు గంట గడిచాక లేచి చూశాడు. ప్రశాంతంగా నిదరపోతోంది వేదవతి.

'సుఖంగా హాయిగా ఎన్నేళ్ళ నుంచో కంటోన్న కలలు ఫలింప జేసుకోవలసిన యీ శుభ గడియలో యిలా గడుపు తున్నాను. ఏ జన్మాన ఏ దంపతుల విడ దీసిన ఫలితమో యిది!'

చూసి చూసి విసిగి ఏ నాటికయినా యీ సంపెంగ తనదవుతుందా అనుకుని వెళ్ళి కుర్చీలో పడుకున్నాడు నిద్రపోతున్నా.

అత్తవారింటికి వెళ్ళక తప్పలేదు వేదవతికి.

ఈ ప్రపంచంలో ఏది ఎలా వున్నా షో మాత్రం తప్పదు. కడుపునిండా తిండి లేకున్నా మంచి బట్టకట్టి తిరగాలి. లోపల చిరుగు చొక్కా తొడుక్కున్నా పైన కోటు వుంటే ఫరవాలేదు ఇదీ దీని ప్రకృతి.

అత్తవారింటికి వెళ్లాక ఆ రోజు రాత్రి గదిలోకి వెళ్ళను. చాలా భయపడింది వేదవతి. కానీ సభ్యతా సంస్కారాలు మూర్తీభవించిన కరుణాకర్ వేదవతికి స్నేహితుడిలానే వున్నాడు.

రోజులు గడుస్తున్నాయ్. కాలంలో మార్పు వస్తోంది. కానీ వాళ్ళ దాంపత్యంలో మార్పులేదు. అతనితో షికార్లకీ సినిమాలకీ వెళుతుంది. తప్పనిసరి అయినచోట డిన్నర్‌కీ వెడుతోంది.


ఓ రోజు హఠాత్తుగా కరుణాకర్ అక్కగారు ఉత్తరం రాశారు, నూతన దంపతులని రమ్మని. ఉత్తరం వచ్చిన రోజు సాయంకానికే దిగబడ్డారు కరుణాకర్ బావగారు.

ఇహ తప్పనిసరి అయి కరుణాకర్, వేదవతి మరురోజు ఆయనవెంట బయలుదేరి వెళ్ళారు. అక్కడికి వెళ్ళాక, మొదటి రోజు మామూలుగానే గడిచిపోయింది, కానీ చిక్కల్లా తెల్లారాక కనిపించింది.

సూక్ష్మజ్ఞానీ, అనుభవజ్ఞురాలు అయిన ఆమె సంగతి చూచాయగా గ్రహించింది. నలగని పరుపూ, వాడని పూలూ, వాడబడని పదార్థాలూ ఆమెకి చెప్పక చెప్పాయ్ రహస్యాన్ని.

మరదలికి తలంటిపోస్తూ నిలవేసి అడిగింది ఆమె.

ముందు తటపటాయించినా చివరికి భయం భయంగానే తన వూహలూ భయాలూ చెప్పింది వేదవతి. ఫక్కుమని



నవ్వించామె.

"పిచ్చిదానా! ఆడదానికి తోడులేనిది యీ ప్రపంచంలో వ్యర్థమే పాలయినా కాగాకా తోడకుంటే అవి వ్యర్థమై విరిగి పోతాయ్. ఆడదయినా అంతే! కాపీ పూయని మొక్క వ్యర్థమే "

దానికి జవాబు యివ్వలేదు వేదవతి! ఇది మామూలు పాఠేగా' అనుకుని.

హఠాత్తుగా అడిగింది ఆమె ' మీ అమ్మ గారికి యీ విషయం తెలియదా?"

"తెలుసు కానీ నాతో తెలియనట్లే వుంటుంది."

"ఏమీ చేయలేదా!"

"ఎందుకు లేదు వదినగారూ! ఎవరెవరినో అడిగి యంత్రాలు వేయించింది. తంత్రాలు చేయించింది ఆకులమందు పెట్టించింది ఇవన్నీ ఫలానా అని చెప్పకుండా చేసి చేయించింది. కానీ నాకు తెలుసు. తెలిసీ ఆమె తృప్తికై అన్నీ తీసుకున్నాను. చివరికీ నాలో ఏదో లోపముందని లేడీ డాక్టర్ వద్దకి కూడా తీసికెళ్ళి పరీక్ష చేయించింది.

"డాక్టర్ ఏమంది? ఆత్రుతతో ప్రశ్నించిందామె 'ఏమంటుంది' నాలో ఏదయినా లోపముంటే కదా?"

"అయితే లోపమల్లా బుద్ధి లోవుందన్న మాట."

జవాబు చెప్పలేదు వేదవతి

"వేదవతీ! నేను ఒకటి చెపుతాను వింటావా?"

తలూపింది

"ఇలారా "

దగ్గరికి వచ్చింది చెవిలో ఏదో చెప్పిందామె. తలూపింది వేదవతి. తర్వాత అర గంటసేపు తల తుడుస్తూ, చిక్కుతీస్తూ ఏదేదో చెప్పింది ఆమె.

* * *

సాయంకాలం అలా బయటికి వెళ్లారు బావా మరదులు.

"మీ అక్కయ్య అంతా చెప్పిందోయ్. మృష్టాన్నాన్ని ఎదురుగా వుంచుకుని నోరూరుతూ వుంటే ఎలా సహించుకుంటున్నావ్?"

దెబ్బ తిన్నట్టయి 'మీ కెలా తెలుసు?' అని అడిగాడు

"మీ అక్కయ్య చెప్పింది."

"ఆమె కెలా తెలుసు?"

"మీ అక్కయ్యలాటి ఆడవాళ్ళకి ఎవరూ చెప్పనవసరంలేదు. వాళ్లే అంతా గ్రహించుకోగలరు .'

మౌనం వహించాడు కరుణాకర్.

"నేనో మాట చెపుతా విను మేడ మెట్లు ఒక్కొక్కటే ఎక్కాలి గానీ ఎగిరి పోలేం మనం. అర్థమయిందా?"

"నిచ్చెన ముట్టుకునే అవకాశమేలేదు."

"పిచ్చివాడా? ఎలా కలెక్టరువయ్యావ్ ఏదయినా మనం కలిగించుకోవాలి. వెన్న ఒక్కసారిగా కరిగి నేయి కాదు. పెగ సోకాలి. అంతే!"

* * *

మామూలుగా పడుకున్నా ఏదో ఆలోచన! ఏదో భావన? నిద్రలో చేయివేశాడు కరుణాకర్. నిదానించి చూసింది. గాఢంగా నిద్రపోతున్నాడతను. ఆ చేయి సోకుతున్న చోట వేడిగా మండుతున్నట్టుగా వుంది ఆమెకి. ఆ వేడిలో ఏదో తపన! ఏదో ఆరాటం!!

తర్వాత అతను నిద్రలో తెలిసో తెలియకో చేసిన చర్యలకి ఆమె దేహం నిప్పువిఅను? కుని వున్న వెన్నలా కరిగిపో సాగింది వేడిలో.

అతని కౌగిట దాగిన ఆమెకి శరీర మంతా చెప్పరాని తపన - తెలియని బాధ.

* * *

"ఎక్కడో ఏదో చదివో ఏ బుద్ధిహీను రాలో చెపితో వినో పండంటి సంసార సుఖాలు యిన్నాళ్ళూ వ్యర్థం చేసుకున్నావ్. జీవితం చాలా విలువైంది. యవ్వనం చాలా చిన్నది. అనుక్షణమూ అనుభ వించవలసిన వయసది. దాన్ని వ్యర్థం చేసుకున్నారు యిన్నాళ్లూ. పూర్వంలా విడమరిచి చెప్పే ముసలమ్మలు లేరు. ఆధునికమైన చదువులు చదివి, అర్థం లేని సిగ్గుతో, భయాలతో జీవితాలు పాడు చేసుకుంటున్నారు యువతీ యువకులు. సెక్స్ పేరిట వచ్చే నానా చెత్తా చదివి తెలి యని విషయాలని భయంకరంగా వూహించు కుని సంసారాలని నరకం చేసుకుంటు న్నారు. నిజమైన సెక్స్ ఎడ్యుకేషన్ వచ్చే వరకూ యీ జెనరేషన్ జీవితాలు యింతే! వక్రమార్గాల్లో జీవితాలు నడుస్తే మనుషులు భయంకరంగా తయారయి సంఘానికి శత్రువులై సంఘవినాశనానికి మూలకారణ మవుతున్నారు."

వదినగారు చెప్పినమాటలు విని పాదా లకి నమస్కరించి అంది వేదవతి. "ముళ్ళ కంచె తొలగించి నందనోద్యానంలో ప్రవేశ పెట్టారు నన్ను. మీకు ఆజన్మాంతం కృతజ్ఞురాలిని."

లేవనెత్తి కౌగిట్లోకి తీసుకుని కృతజ్ఞత లతో నీ ఋణం తీరదు మఱదలా! కోడ లిని కని నా కొడుక్కివ్వాలి" అంది నవ్వుతూ ఆమె.

ముసి ముసి నవ్వులు నవ్వింది వేదవతి. ★

వస్తు గుణ విశేషములు

సుగుణ

గోంగూర

ఆంధ్రుడే గోంగూర. గోంగూరయే ఆంధ్రుడు అన్నంత అవినాభావ సంబంధ ముంది ఆంధ్రులకు గోంగూరకు. దక్షిణా దిన ఆంధ్ర దనగానే అబ్బ. ఆంధ్రుల గోంగూర ఎంత బాగుంటుంది అంటారు. తమిళ, కన్నడ, మలయాళీ, తదితరులు.

చిన్నతనంలో తద్దిపండుగలు గోంగూర పచ్చడి, గోరింటాకు ఆనందాన్ననుభవిం చని ఆంధ్ర వనిత లుండరేమో.

గోంగూరలో తెల్లగోంగూర, నార గోంగూర, యెఱ్ఱగోంగూర ఇలా కొన్ని రకా లున్నాయి. సన్నని ఆకులతో ఉండే తెల్లగోంగూర వంటికి మంచిది.

గోంగూరలో iron ఉంది. గోంగూ రతో చేసే పచ్చడి, పులుసు చాలా రుచిగా వుంటాయి.

గోంగూర వాతహరము, ముఖ్యంగా పులుసు రేజీకటి పోగొడుతుందంటారు పెద్దలు.

గోంగూర, లివర్‌కు బలాన్నిస్తుంది. మలబద్దకమును పోగొడుతుంది.

గోంగూరాకు వాపినపై ఉడికించి ఆము దము కొద్దిగ చేర్చి గడ్డలకు కడితే పక్వ పరచి పగులజేయును. దెబ్బలకు వాపులకు వేసి కట్టినను పేరుకున్న రక్తము విరిగి వాపు నొప్పి తగ్గును.

గోంగూర వేపాకు మెత్తగా నూరి కట్టిన బోదకాలు తగ్గును. మేహవ్రణములు కూడ తగ్గును. గోగుపువ్వులుకూడ పప్పు లోను కూరల్లోను వేసి చేసిన రుచిగా నుండును. పువ్వుల రసంలో పంచదార మిరియపు చూర్ణము కలిపి తీసికుంటే పైత్యము తగ్గును.

గోంగూర పచ్చడి, కూర అనేక విధా లుగా చేయవచ్చు. గోంగూర ఉప్పువేసి తొక్కి నిల్వ పెట్టుకొని అప్పుడప్పుడు పచ్చడిక్రింద వాడుకొందురు. ఇది పథ్యము క్రింద కూడ వాడుదురు. కొన్ని ప్రాంతాల వారు. గోంగూర తరచు తింటూవుంటే తలవెంట్రుకలకు గట్టిదనము నిచ్చి నలుపు నిలుపునందురు. ★

ముద్దబంతి నవ్వింది

ఎమ్మెస్. బాబూరావ్

టవర్‌క్లాక్ ఓపిగ్గా పన్నెండు కొట్టి, ఓపిక చచ్చి తన నోరుతానే నొక్కుకున్న ఓ వీకెండ్ జాలీ డే మధ్యాహ్నం కాలేజీ హాస్టల్ స్ట్రిక్ట్లీ ఫర్ మెన్‌లో ఒక అందమైన గావు కేక వినబడింది.

అటు తరువాత ఆ అందమైన గావుకేక తాలూకు వ్యక్తి తాలూకా సైకిలు ముందు చక్రం, ఆ పిమ్మట ఆ సైకిలూ, సైకిలు యజమాని నారాయణ కనబడతారు, కోపర్నికస్ చెప్పినట్టు. కాబట్టి భూమి గుండ్రంగా వుందని ఒప్పేసుకోవచ్చు.



అతగాడికి అంటే సదరు నారాయణకు తరచుగా అలా అందమైన గావుకేకలు పెట్టడం, పార్టీలు కొట్టెయ్యడం విధిగా అలవాటు.

ఫస్ట్ టెరమ్ అయ్యాక ఆర్ట్సుఫస్టియర్‌లో ఓ అమ్మడు చేరబోతుందనీ, ఆ అమ్మాయి పేరు ఫలానా అనీ ఆవిడ్ని ముందు తనే చూశాననీ ఒక చక్కటి గావుకేక పెట్టి పేరు చెప్పినందుగ్గాను పబ్లిగ్గా కాలేజీ కేంటీన్‌లో వెజిటబుల్ సలావు పార్టీ కొట్టేశాడు.

అతి సీరియస్‌గా 'సన్యాసయ్య అండ్ రంగనాధాచారి' గైడులోంచి ఎకనామిక్స్ ఎసైన్‌మెంట్సు కాపీ చేసేస్తున్న అవతారం చెవిలో "వెల్‌మై డియర్ ఫెలో! ఎకనమిక్సు ప్రొఫెసరు యాత్రల కెళ్ళారోచ్" అనే గావుకేక పెట్టి అతగాడికి రిలీఫ్ ఇచ్చినందుగ్గాను సోఫియాలారెన్స్ పిక్చర్‌కు ఛాన్స్ సంపాయించేసాడు.

ఈ మార్చికి జనరల్ ఎడ్యుకేషనూ, కెమిస్ట్రీ మిగిలిపోయేలా వున్నాయని. 'టూలీ అండ్ సోపీ'ని ''టువర్డ్స్ అండర్ స్టాండింగ్ ఇండియా''ను ఒళ్లో పెట్టుకొని కొండంత బెంగ పడిపోతున్న కొండబాబు రూమ్‌లో ''విద్యామంత్రి మారా'' డనీ ఆయనతోబాటు మునుపటి రివైజ్‌డు రెగ్యులేషన్సు మంచివైనా మారక తప్పదనీ. వాటి స్థానే మోడిఫైడు రెగ్యులేషన్సు అనేవి వచ్చి తీరుతున్నాయనీ. మాకు ''ఆరారే'' కావాలనీ బ్రహ్మాండం బద్ద లయ్యేలా స్ట్రయిక్ చేసినా, పొట్టి శ్రీరాములుగారి శిష్యులు కుర్రాళ్ళకు తోడైనా, యూనివర్శిటీ వాళ్లు మాత్రం ఏమాత్రం చలించకుండా ''పార్కలాం'' అంటూ అందర్నీ బుట్టలో వేసేసి మోడిఫైడ్ రెగ్యులేషన్స్ ఖరారు చేస్తారనీ. తద్వారా కొండబాబు లాంటివారి అదృష్టం పండి జనరల్ ఎడ్యుకేషన్ అనే పరీక్షే వుండబోదనీ, షష్టియర్ ఎగ్జామ్స్ అసలే వుండవనీ, వార్తేరు నుండి సంపాయించిన శుభవార్త కొండబాబు చెవిలో పారేసి, సీక్రెట్‌గా పంజాబీ హోటల్లో కోడి బిరియానీ లాగించేసేడు.

రైల్వేగార్డు దగ్గర సప్లిమెంటు అందరికన్నా ముందు సంపాయించేసి ''రిజల్సొచ్చినయ్ రోయ్'' అని మామూలుగా అరిచేసి హోల్ పాసైన వాళ్ళ దగ్గర నిండు పార్టీ పుచ్చేసుకొని, అనక అన్నీ మిగిలిన వారినీ. ఒక్కొక్కటే మిగిలిన వారినీ సందర్శించి ''మాలతి ప్రేమించక పోతే స్నేహలత ప్రేమించదా? మార్చి పోతే సెప్టెంబరు లేదా? సెప్టెంబరు పోతే మార్చి రాదా? అలక్ష్యం అయితే అచ్చన్న హోటల్లో చల్లారిపోయిన బజ్జీలు కూడా మిగలవు. నడవండి గురూ కాఫీకి పోదాం'' అని ఓదార్చబోయి అలవాటులో పొరపాటుగా గావుకేక పెట్టి చీవాట్లు భోంచేసి. అమ్మాయిల్ని కంగ్రాట్ చెయ్యాలని వొంకపెట్టి సైకిలుమీద తుర్రుమన్నాడింకో సారి

ఇలా ఒక్కొక్క రకమైన అందమైన గావుకేకలతో ఒక్కొక్క రకమైన హాట్ కేక్స్‌లాంటి న్యూస్‌తో తరచుగా పార్టీలారగించటం, అరుదుగా చీవాట్లులాంటివి భోంచెయ్యటం నారాయణకు అలవాటు

ఆ ఆదివారం మధ్యాహ్నం జనతా ఎక్స్‌ప్రెస్‌లా వూడిపడి ''వురేయ్ కొంపలంటుకున్నాయ్ రోయ్'' అని మామూలు ధోరణిలో గావుకేక పెట్టి సగం కూజా ఖాళీ చేసి కుర్చీలో కూలబడి తాటాకు ఫేన్‌తో విసిరికోవటం మొదలెట్టాడు. తెలుగు క్లాసులో అటెన్‌డెన్సు అరిచేసి అనక కబుర్లాడుకోడానికీ, సిగరెట్లూ దెయ్యడానికీ కాలేజీ కేంపస్‌లోని చెట్లక్రిందకు చేరుకున్నట్టు, హాస్టలు పక్షులన్నీ నారాయణ చుట్టూ చేరేయి.

పరోపకారి దాసు, నారాయణ చేతిలోని 'ఫేన్' లాక్కొని అతగాడి కొకసారి విసిరి, తాను విసురుకోవటం మొదలు పెట్టేడు సిగరెట్ పెట్టె బ్లాక్ వారిచ్చిన శ్వేతకాష్టం అగ్గిపెట్టె బ్లాకు వారిచ్చిన అగ్గిపుల్లా తీసేసుకొని ఒక్కసారి కళ్ళు నులుముకొని, అందరూ వచ్చారా? లేదా? అన్నట్టు మౌనంగా పరీక్షలో మునిగిపోయాడు. (సిగరెట్టుపెట్టె బ్లాక్ అంటే

సృష్టిచిత్రం!



రెండుకాళ్ళు, రెండు తలలూ, నాలుగు చేతులతో బాంగ్ కాక్‌లోని హ్యూయాచ్యూ హాస్పిటల్‌లో జన్మించి

జూనియర్స్ వుండే డబుల్ రూమ్స్ బ్లాక్ అనీ అగ్గిపెట్టె బ్లాక్ అంటే సీనియర్స్ వుండే సింగిల్ రూమ్స్ బ్లాక్ అనీ తెలీని స్టూడెంట్ కుర్రాళ్లు వుంటారనుకోను. అగ్గిపెట్టె బ్లాక్‌లో వుండేవాళ్లంతా నిజంగా అగ్గిపుల్ల లాంటి వారనే ఇంకో అర్థం కూడా వుంది.)

మౌనంగా వుండిపోయిన అతగాణ్ణి "ఎక్కడరా? పటమటిలోనా? భద్రాచలంలోనా? పియూసీ షెడ్డుల్లోనా? లేక కెమిస్ట్రీలేబ్‌లోనా?" అని తలో ప్రశ్న వేసిన మిత్రబృందాన్ని చూసి, అజ్ఞాన చీకటిలో, సంసారసాగరంలో కొట్టుకుపోతున్న మృగాల్లాంటి మానవుల్ని చూసి దొంగస్వామీజీ హాసం చేస్తా[illegible].

"ఆనక కాఫీ లచ్మిపిన్మా'యో 'హిచ్-స్త్రాంగాని సస్పెన్సు బద్దలుచెయ్యనా?" అని ఎవరన్నా అంటారేమోనని రెండు క్షణాలు చూసి. సిగరెట్టువాసన తప్ప ఆ వాసన లేపీ లేవని పసిగట్టి, నెలాకరు రోజులని గుర్తుతెచ్చుకొని, వీళ్ళెక్కడికి పోతార్లే అని సరిపెట్టుకొని "వెంకటేశం మళ్ళీ ప్రేమలో పడ్డాడోచ్" అని రెండో గావుకేక పెట్టి వూరుకొన్నాడు.

అందరూ ముక్కుమీద వేలేసుకొని, సిగరెట్లు నోట్లోంచి తియ్యకపోతే నోరు

చటానికిగాను ముక్కుమీద వేలుతీసేసారు. కళ్లు తేలేసి ఎంతవరకూ నిజం? అనే సందిగ్ధంలో పడి నెమ్మదిగా తేరుకోవడం మొదలెట్టారు. కుర్రాళ్ళు అందులోనూ టీనేజ్ కాలేజీ కుర్రాళ్ల ప్రేమవలలో చిక్కుకోవటం విని అమితంగా ఆశ్చర్య పడి పోవటంతో, ముక్కుమీద వేలేసు కోవటంలో అర్థంలేదు. అయితే వెంక టేశం గతచరిత్ర తెలిసిన వాళ్లంతా ముక్కు మీద వేలేసుకోక తప్పదు.

ఒక్కొక్కరికీ ఒక్కొక్క రకమైన ఆదర్శాలూ, జీవితంపట్ల సిద్ధాంతాలూ గట్టా వుంటాయి. అలాగే వెంకటేశానికీ కొన్ని కట్టుబాట్లూ, కొన్ని సిద్ధాంతాలూ అవీ వున్నాయి. వాటి పరిధిని కలలో కూడా దాటకూడదని ఒట్టుపెట్టుకొన్న వెంకటేశం మారిపోయాడంటే ఆశ్చ ర్యం కదూ?

'విద్యార్థిదశలో ప్రేమలో పడకూడదు' అనేది వెంకటేశం గోల్డెన్ మోటో,

అయితే అతగాడు రాసేవన్నీ ఇంచుమించు ప్రేమకథలు. "ఇది మహాదారుణం" అని చాలా సివియర్‌గా క్రిటిసైజ్ చేసారు మిత్రులు. అయినా అతగాడు తన సిద్ధాంతాలని ఇంకొకరి ఇష్టంకోసం మార్చుకోదలచలేదు. ఎందుకు ప్రేమలో పడకూడదో సాధకాబాధకాలన్నీ ఉదాహరణలతో సహా లెక్చర్లు కొట్టి కొందరికి 'కాలక్షేపాన్ని', కొందరి 'బోధను' మరికొందరికి 'జెన్యూయన్ థాట్'ను తెలిపిస్తాడు. అదే విషయాలుమీద కథలు రాస్తున్న ప్రయత్నం అక్కడక్కడా కనిపిస్తుంది కూడా.

అతడు అనేక కారణాలు చెప్పుకొస్తాడు (ఆ కారణాలు చెప్పకుండా దాచెయ్యడం వెంకటేశానికి ద్రోహం చెయ్యడం అవుతుంది కనుక) "ప్రేమలో పడటం వల్ల ముఖ్యంగా చదువు పాడవుతుంది." అంటాడు వెంకటేశం. ప్రేమలో [illegible] ఉంటే చదువు సంగతి ఎలా వుంచి, పేకాడుకోటానికీ, సినిమాలు చూడ్డానికీ, జల్సాగా కార్నర్స్ అన్నీ తిరగానికి టైమ్ వుండకపోవచ్చు. ప్రేయసి వెనకాలో, లేదా ప్రేయసి చుట్టూ ఊహాలోకంలో తిరగటంతోనే ప్రశస్తమైన పుణ్యకాలం కాస్తా గట్టెక్కి పారిపోవచ్చు. పదిమందినోట్లోనూ ప్రేమపక్షులుగా చెలామణి అయి కాలేజీ గోడలమీద కెక్కడం మరీ బాగుండదు. ప్రేమలో ఎంతోమంది విలన్స్‌ను ఎదుర్కోవాలి. తీరా అంత సాహసానికి ఒడిగట్టితే ఆ హీరోయిన్ హీరోగార్ని నిరాకరించి ఇంకో క్రొత్త హీరోతో డ్యూయెట్టూ, జనగనమణా పాడెయ్యొచ్చు. లేదా, డబ్బు, అందం, హోదా, కులం, మతం ఇలాటి ప్రతిబంధకాలు దాటరానివైనంతగా ఎదిగిపోవచ్చు. హాబీ ప్రేమ అని ఆవిడ అనొచ్చు. లేదా సిస్టర్స్‌ప్రేమో, సిన్సియర్ స్నేహమో అని కొయ్యవచ్చు. ఇంకా లోతుకెళితే పెద్దాళ్ళను నరుక్కురావటంలోని రసాభాసలు క్రొత్తవి కావు. ఒకవేళ ఇలాంటివన్నీ ఎదుర్కొన్నా భగ్న ప్రేమికులు కాకుండా ఉండలేని [illegible] క్రొత్త అనివార్య పరిస్థితులు ఏర్పడవచ్చు. అప్పుడు దేవదాసులా గెడ్డం పెంచేసుకొని సైగల్‌వో ముఖేష్‌వో ప్రేమ విరహగీతాలు పాడుకుంటూ, సిగరెట్టు టిన్నులూ, రం[illegible] ఖాళీచేస్తూ [illegible] జీవితం [illegible]రంగా నాశనం చేసుకోవటం [illegible]"

"అదీకాకుండా, ప్రేమలో పడితే 'లవ్' [illegible] మరో అ[illegible] చూడ్డానికీ ఫ్రీగా అవకాశం [illegible]ండక పోవచ్చు. అటువంటి సమయాల్లో అనేక అందమైన రంగురంగుల బొమ్మలను, పూలజడలను, చంచలాక్షులనూ చూసి ఆనందించటానికి అవకాశం వుండదు. ఇది అపచారం కాదు." "సౌందర్యాన్ని చూసి ఆనందించని, ఆరాధించని బ్రతుకెందులకో....సీ అండ్ ఎన్‌జోయ్....బట్ డోంట్ గో డీప్....ఎ థింగ్ ఆఫ్ బ్యూటీ ఈజ్ ఎ జాయ్ ఫరెవర్...." అంటూ గేయకవిత్వం రాసుకొన్నాడు.

"అమ్మాయిల అందచందాల గురించి ఫ్రీగా డిస్కస్ చేసుకోవటంలో తప్పులేదని ఎందుకన్నానో తెలుసా?" అన్నాడొకసారి వెంకటేశం.

సమాధానానికి ఎదురు చూడకుండా, "మీ నాయనమ్మ బుర్రలకు ఈపాటి సమాధానం తెలిస్తే మీరో టెంపరరీ బ్రహ్మచారి మఠంలాంటిది స్థాపించి నాపర్సులాంటి పదవిని (?) కాజేద్దురు. అఫ్‌కోర్సు! నాయకణ్ణని మీ మీద పెత్తనం చెయ్యాలనే అభిమతం నాకేనాడూ లేదు ఇంతకూ నే చెప్పదలచిన దేమిటంటే, సవోజ్ ఒక బుద్ధిమంతుడు అంటే నా దృష్టిలో ఒక పిరికి సన్నాసి. ఉన్నాడనుకోండి. వాడు అమ్మాయిల్ని చూసి ఆమడదూరం పారిపోతాడు. ఎదురుపడితే వెనక్కి పరుగు పెడతాడు. మాట్లాడాలంటే మూర్ఛపోతాడు. కామెంట్లు పాస్ చెయ్యటం గురించి అసలు విని వుండడు. వాడు లోకంలో అందమైన అమ్మాయిల్ని కలలో కూడా చూడడు. అలా చూడటం మహా పాపం అనుకొంటాడు. దూరదూరంగా, ఎడం ఎడంగా పారిపోతూ వుంటాడు. 'అలాంటి వాళ్ళు మహా సంకుచిత హృదయాంత రంగులై దుర్మార్గులు అయిపోడానికి అవకాశం వుంద'ని షేక్‌స్పియరో, కాళిదాసో ఎవరో అన్నారు కూడా.

"వాళ్ళకు జనరల్ నాలెడ్జీ అసలుండదు గనుక, అకస్మాత్తుగా ఏ రైల్వే ప్లాట్ ఫారం మీదో ఓ చక్కని చుక్క కనిపించిందనుకోండి. అంతవరకూ అమ్మాయిల అందచందాల గురించి కనీ వినీ వుండని వాడి మనస్సు ఒక్కసారిగా చలిస్తుంది. మనస్సులో కలకలం బయలుదేరుతుంది. గుండెల్లోంచి ప్రేమ తుపానులా పొంగి వచ్చేస్తుంది. లవ్ ఎట్ ఫస్ట్ సైట్‌తో అమాంతం మూర్ఛపోతాడు. ఆ తరువాత తల కట్టుకుని గెడ్డం పెంచేసుకొని అనేక విధాలుగా మనోవేదన పడొచ్చు. హీరో వెంటనే కత్తో, కటారో, ధామ్మనే పిస్టలో పట్టుకొని, అమెరికన్ కౌబోయ్‌లాగో లేక తెలుగు జానపద హీరోలాగో డ్రెస్ చేసేసుకొని రాయల్ ఫీల్డ్‌లాంటి గుర్రానెక్కి హీరోయిన్‌ను వెతుక్కుంటూ సోలోలు. ఒక్కొక్కప్పుడు డ్రీమ్ సీక్వెన్సు డ్యూయట్లూ పాడుకుంటూ. కొండలూ గుట్టలూ దాడ్డం, దారిలో అడివి మనుషుల్తోటి, క్రూర మృగాల్తోటి బ్రహ్మాండమైన ఫైటింగ్సు గట్రా అయ్యాక కొసకు హీరోయిన్ను కలిసికోవటం ఏ సత్యజిత్ రాయ్ చిత్రంలోనూ సాధ్యం కాకపోయినా ఏ విఠలాచార్య పిక్చర్లోనో సుసాధ్యమవ్వచ్చు. కాని నిజజీవితంలో అది సాధ్యం కాకపోవచ్చు.

"బండి గాడి తప్పుతుందనీ ఏ కంట్రీ సరుకో పుచ్చుకొచ్చానని మీరు భ్రమపడకండి. కావలిస్తే నా నోరు వాసన చూడండి. బర్కిలీ వాసన తప్ప ఇంకోటి వస్తే మీసాలు వెంకటేశ్వర స్వామికి పార్శిలు చేస్తాను. ఇంతకూ చెప్పదలచింది ఏమిటంటే సినిమాల్ని జీవితానికి అప్లయి చేసాను అంతే. ఫైటింగ్సూ గట్రా అంటే ఈ రాటెన్ సొసైటీలోని అవక తవకలన్న మాట నేను చెప్పేవన్నీ నూటికి నూరు పాళ్ళు నిజం. మీ బేచ్చీ అంతా ఫస్టు ఛాన్సులో ఫస్టు క్లాసు మార్కుల్తో కెమిస్ట్రీ పాసవ్వనంత ఒట్టు. ప్రాక్టికల్స్‌లో ఎవ్వరికీ "ఫాస్ఫేట్" రాకుండా ఉండనంత ఒట్టు. కాబట్టిసౌందర్యారాధన చేసేవాడికి ఇట్లాంటి చిక్కులు రావు. వాడి హృదయం మైక్రో

స్కోపులా వుండదు. టెలిస్కోపు అంత అవుతుంది.

అతి ముఖ్యమైన ఇంకో సిద్ధాంతం వెంకటేశం చెబుతూంటాడు. ప్రేమికులు కేవలం ప్రేమనే తింటూ ప్రేమగాలినే పీలుస్తూ బతకలేరు కాబట్టి ప్రేమ వివాహాలు విజయవంతం కావాలంటే ముందు ఆర్థికంగా స్వతంత్రులు కావాలి. ఇది నమ్మదగ్గ నగ్న సత్యం. ప్రేమ రోల్లో తల దూర్చి పై చెప్పిన రోకటిపోట్లు పడటం కంటే ఒక పొజిషన్లోకి వచ్చేక, నచ్చిన, అమ్మా నాన్నా మెచ్చిన సంబంధం చేసేసుకొని ఏ భయం. భీతీ లేకుండా భార్యామణిని హాయిగా ప్రేమించెయ్యవచ్చు. హాయిగా నిజం డ్యూయట్లు పాడుకోవచ్చు. ఎవరి అభ్యంతరమూ వుండదు .

ఇవన్నీ వెంకటేశం అభిప్రాయాలు. వురేయ్ నువ్వు చెప్పేవన్నీ బేలన్స్డ్ ఈక్వేషన్సు కావు. నజ భజ జజర ఈజ్ ఈక్వల్ టు తేటగీతి అని కంగారులో తెలుగు పేపర్లో రాసినంత తప్పు'' అని లక్షన్నర ఉదాహరణలతో, సవా లక్ష కొటేషన్లతో బుజూ చెయ్యగల సమర్థులు లేకపోలేరు. కాని ఇంతవరకూ సదరు సాహసకార్యం చేయ సమకట్టిన వీరుడు ముందుకు రాలేదు. కారణం? అఫ్కోర్స్! అనూహ్యం కాదు.

వెంకటేశం ఇంత ప్రేమ విరక్తిని ఎందుకు చాటుతున్నాడు. అంటే, వెంకటేశం గత చరిత్ర పుటల్ని తిరగెయ్యక తప్పదు. అందుక్కావాల్సిన సరంజామా కోసం హిస్టరీ స్టూడెంట్ అశోక్వర్ధన్ అనబడే పల్లవ్ను కన్సల్ట్ చెయ్యక తప్పదు. "యుసీ! హిస్టరీ స్పీక్స్ అండ్ రిపీట్స్ ఇట్సెల్ఫ్ అనేది అక్షరాలా అబద్ధం కాదు.'' అంటూ ప్రారంభిస్తాడో హిస్టరీ పల్లవ్.

"ఉద్యమ నాయకులంతా పదవులు పోగొట్టుకోవటమో, పరపతి పోగొట్టుకోవటమో లేదా ఇంకోటో, ఏదో ఒక షాక్ తిని మహానాయకులై పోతారు. ఉదాహరణగా అనేక చిల్లర నాయకుల్ని పేర్కోవచ్చు. గాంధీగార్ని ఆ జాబితాలో చేర్చకూడదు. కాని ఉదాహరణ ఇవ్వక పోవటం నా నేరం అవుతుంది. గాంధీగారు ఆఫ్రికాలో తెల్లవాళ్ళ సమక్షంలో టెరిబుల్ షాక్ తిన్నాకనే స్వాతంత్ర్య సమరంలోకి జంప్ చేసాడు. వెంకటేశం అంత పెద్ద షాక్ తినకపోయినా చిన్న తరహా షాక్ తిన్నాడు'' అంటూ చరిత్ర ఏకరవు పెడతాడు పల్లవ్.

"వెంకటేశం కాలేజీలో మామూలు పాఠాలతో బాటు సిగరెట్లూ దెయ్యటం, అల్లరి చేసెయ్యటం అందులో ఒక రకమైన ఆనందం అనుభవించటం, అదీ అయ్యాక ప్రేమపాఠాలు వల్లె వేయడం, ప్రేమలో ప్రాక్టికల్స్ మొదలు పెట్టడం అన్నీ ఒకదాని తరువాత ఒకటి ప్రాక్టీస్ ప్రారంభించాడు

కథల్లోనూ, సినిమాల్లోనూ, కాలేజీలోనూ, హాస్టల్లోనూ, ఇంటా, బయటా ప్రేమ కథలు అనేకం విని విని బోరెత్తని వెంకటేశానికి విశ్వమంతా ప్రేమమయంగా కనిపించింది. తనకూ ప్రేమించెయ్యాలనే బుద్ధిపుట్టింది. ఎవర్ని ప్రేమించాలి? సరళ, గిరిజ, ఆషిమా, అన్నపూర్ణ, కుసుమ,

ఎలిజబెత్, కోమలి, మణి, లక్ష్మి, యూనీస్, భవానీ, అక్తార్, రేవతి వేణి, అనసూయ, అంబ, మేరీ, పద్మ, రాధ, సత్య, ఫాతిమా, చంద్ర, రూత్, వల్లి, మల్లిక అందమైన కాలేజీ అమ్మాయిలందర్నీ మనో వీధిలో పలుకరించాడు ఇమీడియట్‌గా ఒక ప్లాన్ ఆలోచించాడు. అన్ని పేర్లు చీటీలమీద రాసి ఒక్క చీటీ లాటరీతీసి చూసాడు కోమలిపేరు వచ్చింది.

ప్రేమ లేఖల విషయంకోసం కాలేజీ లైబ్రరీనుండి లోకల్ లైబ్రరీలవరకూ ఆక్స్‌ఫర్డ్‌నుండి అణా లైబ్రరీలదాకా కాళ్ళరిగేలా తిరిగి చివరికి "హౌ టు రైట్ లవ్ లెటర్స్" "చలంగారి ప్రేమ లేఖలు" లాంటివి దొరికించుకొని నమిలి మింగేసి అనేక ఒక అందమైన గీతాలవరకూ కథాలు చూసి ఘాటుగా ఓ అందమైన ప్రేమ లేఖ వ్రాసేసి, ఎప్పుడూ రెగ్యులర్‌గా సివిలియన్‌గా ఎన్సీసీకు అటెండయ్యి ఆకురాలా పద్దెనిమిది ఉపాయాల వాషింగ్ ఎలపెన్ను కొట్టేసిన బాబ్జీ ... క్షమించాలి... తెలుగు క్లాస్ ఒక్కదానికీ ఆబ్సెంట్ కాని సదరు కథలూ గట్రా రాసుకునే బాబ్జీతో తప్పులు దిద్దించుకొని, ఒంటరిగా కోమలి వున్న సమయంచూసి ఆ అమ్మాయికి అందచేసాడు.

ఆ చిన్నది ముందుగా తెల్లబోయి హైహీల్సుతో దౌడ సాపుచెయ్య సాహసించలేక కంగారుగా ఇంకో అమ్మాయి సలహాతో ఎకా ఎకిని మార్చింగ్ చేసుకుంటూ ప్రిన్సిపాలుడుగారి ముందు నిలబడి ఢామ్మని రిపోర్టుచేసి పారేసింది. ఆ తరువాత చాలా చాలా రిపెంట్ అయ్యిందని విశ్వసనీయ వర్గాల ద్వారా వార్త అందాయి చేతులు కాలినతర్వాత ఆకులు పట్టుకొంటే సుఖం లేదని ఊరుకుంది. కాలేజీ అమ్మాయిలకు, అందులోనూ అందమైన అమ్మాయిలకు వింజామరలు వీచే ఫేన్స్ వుండటం గొప్ప క్వాలిఫికేషన్ అనీ అనేక ఉత్తరాలు 'ఆరాధన'తో వస్తూంటాయనీ, 'జేకిటీజీ' అనుకోవాలనీ, భద్రంగా దాచుకొని మురిసి పోవటమో, చింపి పారెయ్యటమో, లేదా ఉడికిస్తూనో, నిజం ప్రేమ వెలిబుచ్చుస్తూనో జవాబివ్వాలనీ, ఆ ఆనందమైన అనుభవం లేని రెండు జడల చిన్ని ఈ అమ్మాయికేం తెలుసు పాపం!

అనేక ప్రేమ కథలు విన్న ప్రిన్సిపాలుగారికి మాత్రం మనస్సులో "జేకిటీజీ" అనుకోవటం ప్రైక మాత్రం బాగుంటుందని "ఇంకోసారిల్లా జరిగిందంటే టీసీ ఇచ్చి చేతికిస్తా" అని సీరియస్‌గా చెప్పడి వారంరోజులు మాత్రం సస్పెండు చేస్తున్నట్టు చెప్పి బైటకి తరిమేశారు. నోటీసు బోర్డులో తనను గురించిన శ్రీ ముఖం అంటించకుండా, ఇంటికి రాసిన ఉత్తరం పోస్టు చెయ్యకుండా వుండేలా హెడ్ ఆఫ్ ది ఫ్యాన్స్ వెంకట్రావును కాకా పట్టేసి కాలరు ఎగరేసాడు వెంకటేశం.

అంతటితో వెంకటేశం భగ్న ప్రేమ పక్షి అయిపోయి ప్రేమలు లేని ఇంకో క్రొత్త ప్రపంచంలోకి ఎగిరిపోలేదు. కాని "ఫెయిల్యూర్స్ ఆర్ ది స్టెప్పింగ్ స్టోన్స్ ఫర్ గ్రేట్ సక్సెస్" అనుకొని అనేక సీరియల్ కథలు జరిగించాడు. అలాంటి కథలన్నీ బెడిసికొట్టడంతో పార్టీలుమార్చేసి

(అ) రాజకీయ అవకాశవాదుల్లా కొంగ్రొత్త స్లో'గన్నులు' పేల్చడం మొదలెట్టాడు ." అంటూ గత చరిత్ర అంతా పునశ్చరణ చేసి, "అన్నట్టు శారదా టాకీస్‌లో ఏదో హిస్టారికల్ పిక్చరొచ్చి నట్టుంది నడు గురూ " అంటాడు పల్లవ్ ముగింపుగా.

ఇలాంటి ప్రముఖ చరిత్ర కలిగిన వెంకటేశం ప్రేమలో పడ్డాడంటే ముక్కు మీద వేలేసుకోని వారెవరూ ఉండరు. అందరిలోకెల్లా అతిగా సంబరపడిపోయిన వాడు సుబ్బారాయుడు. వెంకటేశం అంటే సుబ్రాయుడికి పిడికెడు జెలసీ అనీ, బ్రహ్మచారి నిలయానికి పోటీలేని నాయకుడిలా వెంకటేశం ఎన్నికై పోతున్నందుకు లోలోపల కుళ్ళిపోతున్నాడనీ, ఈసారి ఆ పదవిని తాను కొట్టెయ్యడానికి 'నెపంధస్"లా ఎదురు చూస్తున్నాడనీ, కాని వెంకటేశం "మిసూమెనాస్ నెపంధి కోలాస్" అంత తెలివైన ఘటం అనీ సుబ్బారాయుడికి చివరికి "హై బిస్ కస్" చట్నీయేననీ బోల్డు బోటానికల్ జోక్సు సుబ్బారాయుడి మీద పేల్చేసారు ఫ్రెండ్సంతా. హాస్టల్ బ్లాక్‌లన్నీ ఎలక్షన్ ఆఫీసు రూముల్లా తయారయ్యాయి. వెంకటేశం ప్రేమలో పడడానికి సుబ్బారాయుడి కుట్ర తప్పకుండా వుండి వుంటుందనే విలనిక్ విట్సు కూడా పుట్టుకొచ్చాయి. నవ్వులు పువ్వులు రాలాయి. అవన్నీ ఏరేసుకొని "జగతి"లో ప్రయిజుకొట్టే సాడు పీయూసీ కుర్ర జోకిష్టు గోపాలం. రికొన్ని 'జ్యోతి'లో అచ్చు కొట్టించే నాడు

ఈ సారి పదవి తప్పకుండా నీదేనని సుబ్బారాయుడికి బాగా హైరుకొట్టి మిత్రులంతా పార్టీ పుచ్చేసుకున్నారు. సుబ్బారాయుడు ఐస్‌వాటరై పోయాడు. వెంకటేశం ప్రేమ సాహసాన్ని వేనోళ్ళ పొగిడాడు. "ప్రేమ వర్ధిల్లాలి" అని అరిచాడు. అరిపించాడు. "వెంకటేశం భగ్న ప్రేమికుడు కాకుండా 'రతీ మన్మధులకు', ప్రేమదేవత 'కుపిడ్'కూ ఆ తరువాత చర్చిల్లోనూ, మసీదుల్లోనూ, దేవాలయాల్లోనూ ప్రార్ధనలు జరిపించాలి. అందుకు చందాలు వసూలు చేద్దాం" అన్నాడు.

"నోర్ముయ్! దేశోద్ధారకుడిలా మాట్లాడకు, చందాలు వసూలుచేసి సిగరెట్లూదేద్దామనా? పేకాడేద్దామనా? హాయ్‌దొంగా ..." అన్న బాబ్జీవంక సీరియస్‌గా చూపి, కళ్ళెర్ర చేస్తున్న పోజుపెట్టి "ఇవల్యూషన్ థీరీ ప్రకారమో, సోషల్ కాంట్రాక్టు థీరీ ప్రకారమో, లేదా ఇంకోటో ఇంకోటో ప్రకారమో దేవుళ్ళూ దేవతలూ,దెయ్యాలూ కల్పితాలు కావచ్చు. కాని, చండీ యాగాలూ, రుద్రాభిషేకాలూ, సహస్ర ఘటాభిషేకాలూ, కప్పలపెళ్ళిళ్ళూ మున్నగునవి ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా జరిపించి వానలు కురిపించ వచ్చుననుకున్నప్పుడూ, గరీబీ హరావోకూడా బాబాల మంత్ర దండంలాంటి దాంతో సాధించవచ్చునను కున్నప్పుడూ మన నాయకులకు లేని తప్పు నాకు వచ్చిందా?'! అని సుబ్బారాయుడు గట్టిగా డబాయించి పారేశాడు.

ఇదంతా జరిగిన రెండు మూడురోజుల తరువాత గాబోలు వెంకటేశం హాస్టలుకు వచ్చిపడ్డాడు. ఎక్కడెక్కడ తిరిగాడో ఏమిటో పాపం? ప్రేమజ్వరం వచ్చి చాలా 'ఇడై' పోయి వుంటాడనీ, పుట్టెడు

సానుభూతి ఒలకబోద్దామనీ రెడీగా వున్న మిత్రకూటమినందర్నీ ఫూల్స్‌ని చేసి పారే శాడు.

"నేను ప్రేమలో పడటం నిజం. ఇది ఇదివరకటి ఆకతాయి ప్రేమకాదు. ఆ ముద్దబంతి నన్ను చూసి అందంగా అతి ప్రేమగా నవ్వింది. నా హృదయమంతా ప్రేమతో ఉప్పొంగిపోయింది. హృదయంలో సిరలూ, ధమనులతోబాటు 'ప్రేమలు' కూడా వుంటాయనే నగ్నసత్యం ఇప్పుడిప్పుడే తెలుస్తుంది. నా హృదయం 'లబ్‌డబ్' అనటం మానేసి 'ప్రేమ ప్రేమ' అనటం మొదలెట్టింది. చక్రాల్లాంటి ఆమెకళ్ళూ, నవ్వితే సొట్టలు బడే గులాబి చెక్కిళ్ళూ, ఆమె చలాకీతనం, నన్ను ప్రేమ ఉచ్చులో బిగించాయి ఆమె తోడిదే నా జీవితము. అలా కాకుంటే నేను కథలు రాయటం మానేసినంత ఒట్టు డిగ్రీ చదువు వదిలేసి సన్యాసుల్లోనో,హిప్పీల్లోనోకలిసిపోయినంత ఒట్టు. కాలేజీ ఎలక్షన్లో పోటీ చెయ్యనంతటి ఒట్టు ఇంకా చెప్పాలంటే ఎకనమిక్స్ ప్రొఫెసరు మగ స్టూడెంట్సును సైతం ప్రశ్న లడగటం మానేసినంత ఒట్టు అన్నట్టు చెప్పటం మరిచాను. ఏ సలహాల చెవులాయ్ సలహా నా కక్కర్లేదు. మీరు నా గురించి కథలల్లి ప్రచారం చేసుకోండి. 'పార్టీ' అంటారా తర్వాత చూద్దాం" అంటూ బడబడా వాగేసి మళ్ళీ చటుక్కున మాయ మయ్యాడు బేతాళుడిలా. "నిజంగా వీడికి ప్రేమ పైత్యం ముదిరిపోయింది. విజయ విహార్‌లోనో అలంకార్ కేఫ్‌లోనో ఐదు రకాల పెసరెట్లు అందరం ఆరగించేసి బిల్లు వీడిచేత ఇప్పిస్తేనే గాని వీడి తిక్క కుదరదు" అన్నాడు పెసరెట్ల ఫాన్ విక్టర్.

*   *   *

"ఎంతవరకూ వచ్చిందిరా నీ ప్రేమ కథ? పోటీకి నిలుస్తుందా? మామూలు ప్రచురణకయినా వుంటుందా, బుట్టదాఖలా అవుతుందా? లేక తిరిగొస్తుందా?" అన్నాడు దాసు వెంకటేశంతో బస్సుస్టాప్‌లో కనబడి.

మిల్లునో, సింగళి సూరననో నమలటం మొదలెట్టాడు వెంకటేశం. రెండు క్షణాలయ్యాక నమలటం ఆపి "ఇంకా రాయటం మొదలెట్టలేదురా?" అన్నాడు నీరసంగా.

"ఇంత లేటా? నీకన్నా తిరుపతి పాసెంజరు నయం." అన్నాడు దాసు.

"ఏం చెయ్యనురా " అన్నాడు వెంకటేశం.

"ఎం చెయ్యనంటావేరా ఉత్తరకుమారా? సరళతో నీకు బొత్తిగా పరిచయం లేకపోలేదు. ఆవిడ నీలోని రచయితగాణ్ణి కొద్దో గొప్పో ఆరాధిస్తుంది. పైపెచ్చు అపుడే ఓ రచయిత్రి తన కథలు దిద్ది పెట్టమని నిన్ను అడుగుతూంటుంది. ఆ మాత్రం పరిచయం చాలు నువ్వు గట్టెక్కడానికి."

"'మీ ధాట్ చాలా గొప్పది. ఇలాంటి కథలే చివరకు సాహితీ ప్రపంచంలో నిలిచేవి' అని మెత్తగా కోసేయ్. శుక్రాచార్యుడి నీతి ప్రకారం అబద్ధం ఆట్టం తప్పు లేదు, అంతే కాని నువ్వు మూడ కన్నులు కాదు, వెయ్యికన్నులు చేసుకొని చూసినా భయపడేది లేదు. నువ్వు జగదీ

శ్వరుడివి అయితే అయ్యిండొచ్చు. కాని నిజం మాత్రం దాగదు. నీ భార్య కురులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వెట్ చిమ్మవనటం, సహజ పరిమళం కలిగివుంటాయనటం అక్షరాలా తప్పు ' అని నక్కీరుడిలా ఫ్రాంక్‌గా మాట్లాడేవా నీ పని ఖాళీ. నిన్ను ఆమె ఏ 'ఎండ్ మీ బా జింజి వాలీస్'గానో లేదా 'ఆస్కారికి లుంబ్రు కోయిద్దో' అయిపొమ్మని శపించెయ్య గలదు.

కథ చాలా చచ్చుగా వుందని ఎప్పుడూ అనకు. కావలిస్తే ఇలా మార్చి రాయండి అను. అంతకూ అవసర మనుకొంటే ఒకటో అరో నీ సొంత థీమ్సు ఆమెకు సొంతంగా యిచ్చెయ్. కావలిస్తే నేను నీకు థీమ్సు చెబుతాను. గొప్ప ఫ్యూచర్ వుందని గాస్ కొట్టు. ఓడ్ హౌస్‌నుండి ముళ్ళపూడివరకూ, రస్సెల్‌నుండి బుచ్చి బాబువరకూ, చాసో, రావిశాస్త్రినుండి గోపీచంద్‌వరకూ. షేక్‌స్పియర్స్, షాల నుండి ఇబ్సన్‌వరకూ, గొల్లపూడి మారుతీ రావునుండి,ఆదివిష్ణువరకు మా రేమండ సీతా రామయ్యనుండి బాబ్జీ అనబడే బాబూరావు వరకూ, డేర్ కార్నేల్ నుండి ముని మాణిక్యం గారివరకూ జాషువాగారి నుండి విశ్వనాథవారి వరకూ, అక్కడ నుండి అగథా క్రిస్టీవరకూ, అగథా క్రిస్టీనుండి కొమ్మూరి సాంబశివరావువరకూ డిస్కస్ చేసి పారేయ్. ఎన్ని పేర్లు ఎక్కువ దొర్లితే శ మంచిది. నీ సాహిత్య పరిమకు ంగై పోవాలి. ఆమెకు బోరుకొడు పసిగడితే వెంటనే టాపిక్ ఫ్ రిచర్డ్‌ను ఎత్తుకొవి తిన్నగా సైరాబాను దగ్గరికి వచ్చేయ్. అక్కడ నుండి బయలుదేరి మద్రాసులో దిగు.... వింటున్నావా?

ఆ తరువాత ఓ అందమైన సాయంత్రం హాలీవుడ్ హీరోలా, హాలీవుడ్ హీరో ఏం ఖర్మ? పదహారణాల లేదా నూరుపైసల తెలుగు హీరోలా "ఐ లవ్‌యూ" అని చెప్పేయ్. అనుకూలంగా రిప్లయి రాక పోతే, నేను నీ జతపచ్చి కొట్టేసినంతఒట్టు, కథల పోటీలో నీకు ప్రయిజ్ వచ్చినా మేమంతా నీకు సన్మానం చెయ్యకుండా వూరుకున్నంత ఒట్టు బేటిల్ బోయ్ ఎటు జెడ్ పిండేసి నువ్వు ఫేలయిపోయినంత ఒట్టు ఇంకా ఎన్ని ఒట్లు వెయ్యా మంటావ్? '' అన్నాడు దాసు.

"వురేయ్! ఆపరా నా చిట్టి తంద్రీ. ఎంత తేలిగ్గా చెప్పేసావురా విపరీత మైన భయమేస్తుందిరా?"

"అయితే ఇంకో పనిచెయ్యి. అందంగా పొందికగా ప్రేమ పత్రం తయారుచేసి ఆమె చేతికియ్యిలేదా డబ్బాలో వేసెయ్యి" తేల్చిపారేసాడు దాసు.

పాత కథలన్నీ మదిలో తిరగటం మొదలెట్టడంతో ఆలోచనలో పడ్డాడు వెంక టేశం.

"ఓరి పిరికి ప్రేమపక్షీ! నీకన్నా నీ కథల్లోని పాత్రలు నయం. ఆమాత్రం సాహసం చెయ్యలేనివాడి వింకెందుకు పని కొస్తావురా? నీ ప్రేమ కథలు సంకలనంగా వెయ్యించటం కాదురా, తగలెయ్యాలిరా! ఏ ఋషీకేశ్‌కో, పాండురంగడి కొండ మీదకో లేకపోతే సారంగధర మెట్టమీదకో పోయి ప్రేమ మంత్రం జపిస్తూ తపస్సు

చేసుకో, ప్రజలు నై వేద్యం పెడతారు. ఏ ప్రేమ త్రిమూర్తులో సరళను ఎత్తుకొచ్చి నీతో ముడేస్తారు'' అన్నాడు కోపంగా దాసు.

షేక్స్పియర్ మొహం పెట్టిన వెంక టేశాన్ని చూసి జాలిపడి "అంత బేజారై పోవద్దు భాయ్! నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్‌లా నీది చిన్నడుగయినా పెద్దడుగు అనుకో . అన్నట్టు యూనివర్సిటీవాళ్ళ సప్తాహం వస్తున్నట్టుంది విష్ యూ బెస్టాఫ్ లక్'' అన్నాడు దాసు.

కాఫీ టిఫిన్లతో దాసుకు పూజచేద్దామను కొన్న వెంకటేశం ఆలోచనని కరెక్టు టయానికి వచ్చిన సిటీ బస్సు ఆపుచేసింది. దాసు బస్సెక్కేసాడు.

* * *

ఆ తరువాత వెంకటేశం, సరళా బీచ్‌లో చాలాసార్లు కలుసుకొన్నారు. కాలేజీ కబుర్లూ, కథలూ కాకరకాయలూ చాలా మాట్లాడుకున్నారు. అయితే "ఐలవ్‌యూ'' అనే సాహసం వెంకటేశం చెయ్యలేక పోయాడు. ఇది ఇండియా అని తనకు తాను సరి పెట్టుకొని ఉత్తరాయణంలో పడాలని అనుకొని గట్టిగా నిర్ణయించేసు కొని ఆ కార్యక్రమంలో నిమగ్నం అయి పోయాడు. అయితే అతగాడి ఆశ సెంచరీ కొట్టేముందు ఔటైన వాడేకర్‌లా, పటా డిలా అడియాశ అయిపోయింది. సరళ ఎవరిదో పెళ్ళికి ఏదో వూరు చెక్కేసింది.

సరళతో తనకు ఎప్పటినుండో పరి చయమున్నా తనను చూసి నవ్విన ఆరోజు నుండే ఆమె ప్రేమకు తహతహ లాడు తున్నాడు. సరళ ఎన్నిసార్లు నవ్వలేదు? కాని ఈ నవ్వువేరు "సరళ తన ప్రేమను అపార్థం చేసుకుంటుందేమో?'' ఏమూలో దాక్కున్న డౌట్ రక్కున అవు టయింది. విలన్‌లా ముందుకు దూసుకొని వచ్చింది. వెంకటేశం గుండె కాయ కలుక్కుమంది. నోటిలో పెట్టుకోబోతున్న ఆఖరి సిగరెట్టును నెలాకరు టయిమ్‌లో ఎవడో లాగేసుకుంటున్నట్టూ, చేతి కంద బోయే అదృష్టం లాటరీ టిక్కెట్టు అను మానం గాలిలో ఎగిరిపోతున్నట్టూ, చేతి కందిన ఇంకో రకం అదృష్టం ఆటమ్ బాంబులా పేలిపోతున్నట్టూ ఫీలయ్యాడు.

అలా జరగటానికి వీల్లేదు. సినిమా ల్లోలా, తన కథల్లోలా ఎంతమంది విలన్సు వచ్చినా, ఆమె హృదయమే ఒక విలన్‌గా మారినా ఆమె ప్రేమను తాను పొందటానికి ఎన్ని సాహసాలైనా చెయ్యటానికి సిద్ధం కమ్మని హృదయం ఘోషపెడుతూంది. ఆమె ఫేవర్ సంపాయించటానికి తను కావలిస్తే స్క్రీన్ హీరో అయిపోతాడు. దేవానందో, దిలీప్‌కుమారో. రాజకపూరో రామారావో, నాగేశ్వర్రావో, కాంతారావో అయిపోతాడు

తను రాసిన ఒక కథలో హీరోయిన్ బాడీ గార్డులా హీరో తిరుగుతూంటాడు. ఆమె అసహ్యించుకుంటూ వుంటుంది. ఒకసారి ఆమె తిరునాళ్ళకో, పుష్కరాలకో వెడుతుంది. గోపాదాల రేవులోనో, కోటి లింగాల దగ్గిరో, అంతర్వేదిలోనో, పాత పట్టి సీమలోనో, కనకదుర్గ గుడి దగ ఎక్కడో స్నానం చేస్తూ చేస్తూ « దామని సరదా పుట్టి నీటిలోదిగి · మునిగిపోతుంది. ఆమెని

హీరో ప్రాణాలకు లెక్కచెయ్యకుండా అమాంతం నీటిలోకి దూకేసి ఈది ఆవిణ్ణి రక్షించేస్తాడు. ఆమె అసహ్యాన్ని ప్రేమగా మార్చేసుకుంటుంది. లాంగ్ షాట్ లో డ్యూయట్లు పాడేసుకుంటారు.

అలా తనూ ఏదో సాహసం చెయ్యాలి.

ఆలోచిస్తూ నడుస్తున్న వెంకటేశానికి దూరంగా సరళ కనిపించింది. హేండ్ బేగ్ వయ్యారంగా వూపుకుంటూ చకచకా నడిచి ఒంటరిగా వెళుతుంది ఎక్కడికో. వూరి నుండి వచ్చేసింది కాబోలు. "వురేయ్ వెంకటేశం నువ్వు అదృష్టవంతుడివిరా?" తనని తాను అభినందించుకొని అడుగులో అడుగు వేసుకుంటూ వేగాన్ని హెచ్చించాడు. అదే సమయంలో ప్రక్కనున్న చింతతోపులోనుండి ఎవరో ఆగంతకుడు వూడిపడ్డాడు. "ఎవడీ విలన్?" కసిగా ఇంగ్లీషులో తిట్టుకొని గొప్ప జెలసీ ఫీలయ్యాడు. వాడు సరళను సమీపించాడు. అతని చేతిలో తళతళ మెరుస్తున్న డేగర్ వుంది "ఆగు" అన్నాడు సరళ నుద్దేశించి. ఆమె బిత్తరపోయింది. "వాచీ. దుద్దులూ, హేండ్ బేగ్ అన్నీ యిలా యిచ్చేయ్." అన్నాడు బొంగురు గొంతుతో. సరళ బెదురుతూ బెదురుతూ వాచీ తియ్యటంలో నిమగ్నమయింది.

వెంకటేశంలో ఉత్సాహం ఉరక లేసింది. ఆ క్షణంలో జేమ్స్ బాండ్ అయిపోయాడు ఫాంటమ్ అయిపోయాడు యుగంధర్ అయిపోయాడు వెనగ్గా వెళ్ళి రెండు చేతులూ గట్టిగా బిగించి ఆ విలన్ గాడి కుడిభుజం మీద కేజీన్నర గుద్దిచ్చాడు ఆ రౌడీ చేతిలో కత్తి ఎగిరి పడింది వెనక్కి తిరిగేలోగా డొక్కలో ఇంకోటిచ్చాడు. వాడు సర్దుకోకుండా ఐదారు డిష్కిమ్‌లు ఇచ్చేసాడు. వాడికి మిల్కా సింగ్ జ్ఞాపకానికి వచ్చి వుంటాడు. పరుగు లంకించుకున్నాడు.

"మీకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలో తెలీకుండా వుంది" అంది సరళ.

"నో మెన్షన్" అనాలనుకొని "మెన్షన్ నాట్" అంటే బాగుంటుందను కొని లేకపోతే "నాటేటాల్" అందామా? "డోంట్ బాదర్" అందామా? అని ఏదీ తేల్చుకోలేక చివరకు ఏమీ అనకుండా చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు. చిరునవ్వుకు ప్రతిగా ఆమె చెయ్యి అందించింది ఆమె చెయ్యి అందుకొని వింత లోకాల్లో తేలిపోతూ ఆమెతో ఏదో చెబుతూ ముందుకు అడుగేసాడు వెంకటేశం.

"ఏమిట్రా పట్టపగలు కలవరింతలు. క్లాసు సంపాయించాలని ఎంత పట్టుదలగా వుంటే మాత్రం నైటంతా కంటిన్యూ చేసి పగలంతా నిద్దరోతూ ఈస్ట్‌మన్ కలలు కనటం ఏమీ బావోలేదు. లేచి కాస్త ముఖం కడుక్కొని ఫ్లాస్కులో అమృతం సేవించు, రిలీఫ్‌గా ఒక అరగంట చతుర్ముఖ పారాయణం చేద్దాం. అహ్...ఉహ్.ఉహం హూ హూ హే హే హే..హే ర రా ..ర ర ర .ర ర . ర రూ ఓ హో హో ర . రా ర ర ర ర .రూ... హమ్ తో హీ రాహేదిల్ కా చెలేహై .అంటూ కిషోర్‌కుమార్‌ను అందుకొన్న యూసఫ్ గొంతు విని, తను కంటున్న అందమైన ఈస్ట్‌మన్ కలర్ ఫ్రేములోంచి హాస్టల్లో

మంచం మీద పడ్డాడు వెంకటేశం.

* * *

"దారి తప్పినట్టున్నారే" అంది సరళ నవ్వుతూ. ఆమె చేతిలో 'మార్క్‌ట్వెయిన్ హకల్ బెరేఫిన్' వున్నాడు. నవ్వుతూండగా సొట్టలు పడిన ఆమె గులాబీ చెక్కిళ్ళను చూస్తూ.

"అచ్చు మీరు ముద్దబంతిలా, పాల పిట్టలా నవ్వుతారండీ" అన్నాడు వెంకటేశం ఆమె కెదురుగా ఇసుకలో కూర్చుంటూ. కాళిదాసును డీప్‌గా చదవనందుకూ, ఇంకా ఎక్కువ సిమిలీలు ఉపయోగించలేక పోయినందుకూ లోలోన తనను తాను తిట్టుకున్నాడు.

"ముద్దబంతి, పాలపిట్ట నవ్వటం చూశారా మీరు" అంది సరళ.

"ఆ! మిమ్మల్ని చూస్తున్నాగా."

ఒక్కసారి సీరియస్‌గా చూపి ఫక్కున నవ్వింది సరళ. వెంకటేశం హృదయంలో నియాన్ లైట్లు వెలిగాయి.

"మీ కథల్లోని ఆదర్శహీరోలమీద మా అమ్మాయిలంతా బెట్ కాసుకున్నారు" అంది సరళ ఏదో మాట్లాడాలని.

"ఏమని?"

"మీ హీరోల చేతలన్నీ నీటిమీద రాతలనీ మీవన్నీ వట్టి కోతలనీ "

"అయితే ఆ రాతలన్నీ ఎప్పుడో ఒకప్పుడు అంటే అవకాశం వచ్చినప్పుడు నిజం చేస్తానని మీరు బెట్ కాయండి. తప్పకుండా నెగ్గుతారు."

"నిజమా?"

"మిమ్మల్ని ప్రేమిస్తున్నంత ఒట్టు" సాహసించేసాడు హీరో.

"ఏమిటీ?" ఒక్కసారి ఆశ్చర్యపడింది సరళ.

"నిజం! మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీరు. "

"మరి ఈ విషయం ఇంతవరకూ ఎందుకు చెప్పలేదు?"

"అవకాశం రాలేదు. ఇప్పుడు చెబుతున్నాను కదూ!"

"వెల్ మై డియర్ ఫ్రెండ్! మిస్టర్ వెంకటేశం!! ఎక్స్‌ట్రీమ్లీ సారీ "

"ఏమిటి మీరంటున్నది?"

"నన్ను పూర్తిగా చెప్పనివ్వండి. నిజానికి నాకీ వర్ణవ్యవస్థ మీదా, రిలిజయన్స్ మీదా అట్టే నమ్మకం లేదు. కాని ఫర్ యువర్ ఇనఫర్మేషన్."

"అబ్బ అవేం మాటలండీ! నేను రాజారామ్‌మోహన్‌రాయ్ ఏకలవ్య శిష్యుణ్ణి. .. రాయిస్టును "

"అది సరే నేను విడోనండీ బాబూ."

"అబ్బబ్బ! మళ్ళీ మొదటి కొచ్చేరా? వీరేశలింగంగారు నాకు దేవుడి కంటే ఎక్కువ."

"నన్ను మాట్లాడనివ్వటం లేదు వెంకటేశంగారూ?"

"మాట్లాడండి."

"మీరు అపార్థం చేసుకోకండి. డైరెక్ట్‌గా చెప్పేస్తున్నాను. ఫైనల్ ఎంపీసీలో నల్లగా పొడుగ్గా 'ఎర్రయ్య' అని వుంటాడు చూసారూ, అతనికి నా హృదయాన్నిచ్చేసి చాలా కాలం అయింది."

"జోక్ చేస్తున్నారా?"

"జోక్ కాదు పచ్చి నిజం!"

"అన్యాయం!"

"శాంతించండి మహాశయా? మీకే కాదు నాకూ హృదయం వుంది నా హృదయాన్ని నాకు నచ్చిన వాళ్ళకు ఇచ్చే అధికారం నాకు లేదూ?"

"అంతే నంటారా?"

"ప్రేమ త్యాగం చేస్తుందంటారు. మీరు నిజంగా నన్ను ప్రేమిస్తూంటే మీరు మీ ప్రేమమ నా ఆనందం కోసం త్యాగం చెయ్యలేరూ?"

"త ప్పకుండాను."

* * *

పది రోజుల తరువాత ఎన్సీసీ బెంగుళూర్ కేంప్‌నుండి వూడిపడ్డ నారాయణ "అందరూ బాగున్నారా?" అని ఓ చిన్న గావుకేక పెట్టి ముసుగుతన్ని లేజీగా పడుకొన్న వెంకటేశాన్నీ. అతగాడి పెరిగిన గడ్డాన్నీ. ప్రక్కనే వున్న ఖాళీ సిగరెట్టు పెట్టెలనూ చూసి గతుక్కుమని. పగలబడి నవ్వుదామనుకొని అంతలోనే సీరియస్ అయిపోయి కథంతా మిత్రులద్వారా విని నిట్టూర్చి "హాయ్! ఎంతపని జరిగిపోయింది వీడికి ధైర్యం చెప్పటం మానేసి జోకులు పేలుస్తున్నారా బుద్ధాయిలూ! "ఎమ్మెస్సెమ్" బండిని మీరు ఎప్పుడూ అందుకోలేరనీ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజీకి వెళ్ళే బస్సు ఎప్పుడూ లేటవ్వాలనీ అమాయకుడు వెంకటేశం శపించేసాడంటే ఆ శాపం మీకు తగులక మానదు. అందరూ వాడికి అపాలజీ చెప్పుకోండి రోయ్! వురేయ్ వెంకటేశం! బుజ్జిబాబూ!! సరళ కాకపోతే సంధ్య. సంధ్య కాకపోతే శకుంతల, ఆమె కాకపోతే పోర్షియా; మన దేశంలో అమ్మాయిలకు కరువు లేదు గాని లేచి గెడ్డం గీసుకోరా చిట్టి తండ్రీ.. క్లియోపాత్రా సినిమా కెడదాం. అన్నట్టు. ఎవడ్రా ఈ ఎట్టాయ్! అని ఒక్కసారి ఆలోచించి. "హా .హా హా హా.." అంటూ గట్టిగా మాయల ఫకీరు నవ్వొకటి విసిరేడు నారాయణ.

వెంకటేశం ఛటుక్కున లేచి కూర్చుని "ఏమిట్రా పిచ్చిగాని పట్టలేదు కదా?" అన్నాడు.

"లేదు. మనకు తెలీని ఈ ఎర్రాయ్ ఎవడ్రా? ఎంపీసీలోనే కాదు, కాలేజీ మొత్తానికే ఈ పేరుగల కధానాయకుడు లేడు. సరళ విదోనసీ, ప్రేమించేసాననీ గొప్పగా కోసేసి వెంకటేశానికి పరీక్ష పెట్టి వుంటుంది. వెంకటేశం ద్వేషం పెంచుకోలేదు గనుక నెగ్గినట్టే..." తేల్చి పారేసాడు నారాయణ.

"ఈ సగంతి నువ్వెలా పసిగట్టావురా?" అన్నాడు బాబ్జీ.

"కామన్‌సెన్సు. అదే కాకుండా . మా బామ్మ పిన్ని కూతురూ, సరళ నాయనమ్మ చెల్లెలి...,బాబోయ్ నా సైకిల్రోయ్." చెప్పేది మధ్యలో ఆపి అలవాటుగా గావు కేక పెట్టాడు నారాయణ.

"వురేయ్ నారాయణా! వెంకటేశం నీ సైకిలెక్కి సరళ ఇంటికి వెళ్లాడు పార్టీ పుచ్చుకుందాం గాని. గావుకేకలు పెట్టకు" అన్నాడు బాబ్జీ. ★

సినిమా

సంక్రాంతి విడుదల

శ్రీ లక్ష్మి ప్రొడక్షన్స్ పతాకం క్రింద ఎ. పూర్ణచంద్రరావు నిర్మించిన 'దేవుడు చేసిన పెళ్ళి' వర్ణచిత్రం సంక్రాంతికి విడుదల కాబోతోంది. శోభన్‌బాబు, శారదలు వెరైటీ పాత్రలలో నాయకా నాయికలుగా నటించిన యీ చిత్రం గొల్లపూడి కథకు సత్యానంద్ మాటలతో తయారై వస్తోంది. తాతినేని రామారావు దర్శకత్వం క్రింద యీ చిత్రంలో లక్ష్మి, నాగభూషణం, ప్రభాకర రెడ్డి, రావుగోపాలరావు, చంద్రమోహన్, గిరిబాబు, మురళీమోహన్ కూడా నటించారు. చాలాకాలం తర్వాత 'జ్యోతిలక్ష్మి'నృత్యాన్ని యీ చిత్రం ద్వారా చూడగలరు ప్రేక్షకులు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణ దర్శకత్వం కన్నప్ప, సంగీత దర్శకత్వం టి. చలపతిరావు నిర్వహించారు.

చిత్రకారుడి దర్శకత్వం!

ప్రముఖ పబ్లిసిటీ ఆర్టిస్టు కె. ఈశ్వరరావు ఎన్నో చిత్రాలకు ప్రేక్షకుల్నాకర్షించే విధంగా పబ్లిసిటీ డిజైన్లు చేశారు. 'నెంబర్ వన్' పబ్లిసిటీ ఆర్టిస్ట్‌గా పేరొందిన-త్వరలో తయారవ బోతున్న చిత్రానికి పబ్లిసిటీ డిజైన్లు కంటే ముందే, ఆ చిత్రానికి కథను రాసేసింది ఈశ్వర్ చేతి 'కుంచె'. ఆ కథను 'అయినవాళ్లు' పేరిట తెరకెక్కిస్తున్నది బోణం ఆంజనేయులు. కథతోపాటు దర్శకత్వం కూడా నిర్వహిస్తున్న కె. ఈశ్వరరావు యీ చిత్రాన్ని 'ఆర్టిస్టిక్'గా తయారు చేయగలడని ఆశించవచ్చు. పూర్తిగా ఔట్‌డోర్‌లోనే నిర్మిత మౌతున్న యీ చిత్రంలో చాలావరకు నూతన నటీ నటులే కన్పిస్తారు. ఆ నూతన తారల వివరాలు మరోసారి!



'చదువు-సంస్కారం'

జమీందారుగారి అమ్మాయి!

అనగనగా ఓ జమీందారు. ఆ జమీందారు కున్నదో వ్యసనం. ఆ వ్యసనం పేరే 'దానధర్మాలు' చేయడం. మద్రాసులో ప్రొహిబిషన్ లేనప్పుడు త్రాగటం అలవాటున్న వారు త్రాగినంత విచ్చలవిడిగా



'దేవుడు చేసిన పెళ్ళి'

ధర్మాలు చేసేవాడు. మద్రాసులో ప్రొహిబిషన్ వచ్చాక 'విస్కీరాయుల' లాగానే. తన ఆస్థి అంతా కరిగిపోవడంతో 'జమీందారు' చిక్కుల్లో పడ్డాడు. ఉన్నదంతా ఊడిపోయి కట్టు బట్టలూ, కన్న బిడ్డలూ మాత్రం మిగిలారు. ఉన్న బిడ్డలలోని ఓ ఆడపిల్ల, తండ్రి ఏ మంచితనంలో సర్వస్వాన్ని కోల్పోయాడో, అదే మంచితనంతో తండ్రి కోల్పోయిన ఇంద్రభవనంతో స్థానం సంపాదించడానికి ప్రయత్నించింది. ఆ ప్రయత్నమే 'జమీందారుగారి అమ్మాయి'గా చిత్రరూపం ధరించింది. శారద గుమ్మడి. రంగనాథ్, రాజబాబు గిరిబాబు, అల్లు రామలింగయ్య, కృష్ణకుమారి సెక్సీ స్టార్ మమత, కూడా నటిస్తున్న యీ చిత్రానికి సింగీతం శ్రీనివాసరావు (కేంద్ర ప్రభుత్వ అవార్డు పొందిన తమిళ చిత్రం దిక్కట్ర పార్వతి దర్శకుడు) దర్శకుడు. అసోషియేట్ డైరెక్టర్ జి వి కె. శంభు ప్రసాద్, జి కె వెంకటేష్ సంగీతము. సుఖదేవ్ (వెంకటరాఘవన్స్ కాఫీ, నెస్ కేఫ్) ఛాయాగ్రహణ దర్శకత్వము, డి. వి నరసరాజు మాటలు గల యీ చిత్రానికి నిర్మాత ఎన్. కృష్ణంరాజు, నిర్మాణ సంస్థ: నవతచిత్ర.



అమ్మాయిలూ జాగ్రత్త!


తెలుగు దేశంలోని అమ్మాయిలను హెచ్చరిస్తూ వస్తోన్న రంగుల చిత్రం పేరిది. వెరైటీ పుష్కలంగా గల కథతో పరువంలో ఉన్న యువతి ఎదుర్కొనే కొన్ని ముఖ్యమైన సమస్యలూ ('ప్రేమ' వాటిల్లో తప్పకుండా ఒకటి కదా సార్!) చూపిస్తూ జాగ్రత్తగా ఉండాలమ్మాయిలూ అని చెప్పే యీ చిత్రం నవశక్తి పతాకం క్రింద సాహస వంతుడయిన నిర్మాత పి. గంగాధరరావు నిర్మిస్తున్నారు 'నీడలేని ఆడది'లో నటించిన తారలలో అధికభాగం యీ చిత్రంలోని ముఖ్యపాత్రలలో కన్పిస్తారు. ఈ చిత్రానికి పి. సాంబశివరావు దర్శకత్వం నిర్వహించారు ఈ చిత్రం కూడా త్వరలోనే విడుదలవుతుంది.

దర్శకుల నిర్మాణం!

నిర్మాత రాఘవ సాహసి. సాహస వంతుల కథల్ని తీసుకొని నిర్మించబడ్డ కొన్ని చిత్రాల (జగత్ కిలాడీలు, జట్టీలు) నిర్మాణంలో పాలు పంచుకొన్న తర్వాత దర్శకుల నిర్మాణం ప్రారంభించారు తన 'ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్' ద్వారా. మేటి దర్శకుడుగా పేరొందిన దాసరి నారాయణ రావుకు (తాత - మనవడు, సంసారం-సాగరం) మొట్టమొదటి దర్శకత్వపు అవ

'రామయ తండ్రి'






'శ్రీ రామాంజనేయ యుద్ధం'

కాశం ఇచ్చిన యీ నిర్మాత ఇప్పుడు రచయిత రాజశ్రీని దర్శకుడిగా తయారు చేశారు. ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్ 'చదువు-సంస్కారం' ద్వారా, త్వరలో విడుదల కాబోయే యీ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలూ కూడా దర్శకుడు రాజశ్రీవే: సంగీతం రమేష్‌నాయుడు.

రంగుల పౌరాణికాలు!

రెండు పౌరాణిక చిత్రాలు నిర్మితమై ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధంగా వున్నాయి. రెండూ రంగుల చిత్రాలే. వీనస్ మహీజా పిక్చర్స్ నిర్మించిన చిత్రం 'యశోదాకృష్ణ' రామకృష్ణ, కీ॥ శే॥ యస్వీ ఆర్, గుమ్మడి, చంద్రమోహన్, ప్రభాకర్ రెడ్డి, జమున, కృష్ణకుమారి, మంజుల, ఎస్. వరలక్ష్మి, శ్రీ విద్య, వై విజయ, ప్రసన్నరాణి, విజయభాను, కల్యాణి, బేబీ శ్రీదేవి, డాలీ, సుమతి, రోహిణి, మాస్టర్ ప్రభాకర్‌లు నటించే యీ చిత్రానికి సి. యస్ రావు దర్శకులు. పి హెచ్. ప్రకాశరావు నిర్మాత.

'సంపూర్ణ రామాయణం' చిత్రంతో తన ప్రతిభను చూపిన 'బాపు' దర్శకత్వంలో తయారయినది 'శ్రీ రామాంజనేయ యుద్ధం' శ్రీ లక్ష్మి నారాయణ ఫిలింస్ పతాకం క్రింద యీ చిత్రాన్ని నిర్మించినది పొట్లూరి వెంకటనారాయణరావు. ఎన్నెస్ మూర్తి శ్రీ రాముడిగా పద్మశ్రీ ఎన్. టి. రామారావు, ఆంజనేయుడిగా అర్జా జనార్ధనరావు నటించిన యీ చిత్రంలో కాంతారావు, ధూళిపాళ, ముక్కామల.



'జమీందారుగారి అమ్మాయి'

శ్రీధర్, కాశీనాథ్ తాతా, పి. హెచ్. కృష్ణమూర్తి, జయంతి, బి. సరోజాదేవి, రాజశ్రీ, జయకుమారి, హేమలత కూడా నటిస్తున్నారు. కె. వి. మహదేవన్ సంగీతమూ, కె. యస్. ప్రసాద్ 'ఛాయ' కల్గిన చిత్రమిది.

తారాబలం – కథాబలం

చిత్రవిజయానికి తారాబలం ముఖ్యమా? కథాబలం ముఖ్యమా అన్న ప్రశ్నకు సమాధానంగా కౌముదీ పిక్చర్స్ నిర్మాత యం. యస్. రెడ్డి ఇచ్చిన సమాధానం చాలా సమంజసంగా వుంది. 'తారాబలం శారీరక సౌందర్యమైతే, కథాబలం ఆత్మ సౌందర్యమౌతుంది' అంటూ రాయన. అంతేకాదు ఆయన నిర్మించిన కొత్త చిత్రం 'రామయ తండ్రి' యీ ప్రశ్నోత్తరాల సంకేతంగా రూపొందించబడిందనీ అన్నారు. "మంచిని నమ్ముకొని బ్రతుకుతున్న ఓ మనిషితో విధి చెలగాటాలాడింది. ఆ మనిషిని అన్ని విధాలా ఇబ్బందులకు గురిచేసింది. అయితే ఆ మనిషి చెక్కు చెదరలేదు. మంచిని వీడలేదు. 'మంచి మనిషి'గానే చివరివరకూ నిలిచి 'విధి' పైనే విజయం సాధించాడు. ఆ మనిషికథే, 'రామయ తండ్రి' కలర్ చిత్రం. ఈ చిత్రాన్ని నిర్మించటమే కాక స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు కూడా నిర్మాతే సమకూర్చారు ('మల్లెమాల') సత్యనారాయణ, రంగనాథ్, రాజబాబు, ముక్కామల, లక్ష్మీకాంత్, రావి కొండలరావు, జయంతి, ప్రభ, పండరీబాయి, పుష్పకుమారి మొదలైనవారు నటించిన యీ చిత్రానికి వి. వి. ప్రసాద్ దర్శకుడు.

బాలనాగమ్మ

నటుడిగా చిత్ర రంగంలో ప్రవేశించిన జయకృష్ణ నిర్మాతగా మారి మొదటి ప్రయత్నంగానే భారీ ఎత్తున రంగులలో 'బాలనాగమ్మ' చిత్రాన్ని నిర్మిస్తున్నారు 'బాలనాగమ్మకు 'సైంటిఫిక్' ట్రీట్‌మెంట్ తయారుచేశాము 'లాజికల్'గా ఆలోచించి ప్రవేశపెట్టిన ప్రతి మార్పునూ అర్థవంతంగా చేశాము. దర్శకులు సి. యస్. రావు గారు ప్రత్యేక శ్రద్ధతో యీ 'కథను మలచే' కార్యక్రమంలో పాల్గొన్నారు పాత్రల ఎన్నిక కూడా ఎంతో శ్రద్ధగా చేశాము. 'బాలనాగమ్మ' చిత్రానికి కొత్త రూపం ఇస్తున్నాము ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారన్న నమ్మకం నాకుంది' అంటాడీ నిర్మాత. ఈ 'బాలనాగమ్మ'లో జమున (బాలనాగమ్మ), సత్యనారాయణ (మాయల పకీరు), ప్రమీల (సంగు), రామకృష్ణ (కార్యవర్ధి) ముఖ్య పాత్రలలో కన్పిస్తారు. ఇంకా యీ చిత్రంలో ప్రభాకర రెడ్డి, రావు గోపాలరావు, పద్మనాభం, అల్లురామలింగయ్య, ముక్కామల, రమాప్రభ, రాజసులోచన జ్యోతిలక్ష్మి మొదలగువారు నటిస్తున్నారు సంగీతం సుసర్ల దక్షిణామూర్తి. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కె. యం. నాయుడు, దర్శకత్వం సి యస్. రావు.

నందనరావు చిత్రాలు!

దర్శకుడు కె వి నందనరావు తెలుగు ప్రేక్షకులకు రెండు చిత్రాలు సమర్పిస్తున్నారు రోజారమణి, నాగేష్‌లు ముఖ్య భూమికలలో కన్పించే 'పూర్ణమ్మ కథ'(ఆదివిష్ణు రచన) మొదలై షూటింగులు జరుపుకొంటూంది. నిర్మాణం శివాజీ ఆర్ట్స్ సంస్థ'

'చిన్ననాటి కలలు'





'బలిపీఠం'

మరో చిత్రం శ్రీ సుధాచిత్రవారి ప్రొడక్షన్ నెం: 1, చంద్రమోహన్, ప్రసాద్‌బాబు, ప్రభాకర్‌రెడ్డి, జయంతి, ప్రమీల, రోజా రమణి, ఎస్. వరలక్ష్మి మొదలయిన వారు నటిస్తున్న యీ చిత్రానికి మహారథి సంభాషణలూ, సత్యం సంగీతమూ, సమకూర్చారు. రెండు చిత్రాలకూ స్క్రీన్‌ప్లే దర్శకత్వం: కె. వి. నందనరావు.

రోజారమణి

రోజారమణి బాలతారగా భక్తప్రహ్లాద చిత్రంలో 'నమ్మశక్యం' గాని నటన చూపించి. అతి క్లిష్టమయిన సంస్కృత శ్లోకాలకు సైతం అద్భుతమైన 'లిప్ మూమెంట్' చూపి తన ప్రతిభ నిరూపించుకొంది. అంతేకాదు బాలతార, తారయై తెలుగు తెరకు మామూలే అయిన పద్ధతిలో తెలుగువారికంటే ముందు మలయాళీలచే గుర్తించబడ్డ తర్వాత తిరిగి తెలుగు చిత్రాలలో అవకాశం పొందింది. 'శోభన' పేరుతో మలయాళ ప్రేక్షకులు రోజారమణిని ఉత్తమనటిగా గౌరవించారు. అయితే రోజారమణి నటించే తెలుగు చిత్రాలు చూస్తుంటే 'నటి'గా. తన ప్రతిభను చూపించుకొనే అవకాశాలు తక్కువ కలుగుతున్నాయని అనుకోవలసివస్తోంది. రోజారమణిని 'బ్రాండ్' చేయబడ్డ ఓ రకమైన పాత్రలోనే చూడగలుగుతున్నాం మనం. దిక్కులేనిదో, లేక బీదదో అయిన ఆ పాత్రపై దుష్టపాత్ర జరిపే అత్యాచారం సినొకటీ మొత్తానికి రోజారమణి అనగానే 'కళ్ళు ఇంతలేసి వాసిపోయి (ఏడుపుతో) ముఖమంతా దైన్యం గూడుకట్టుకొన్న' రూపం మాత్రమే కన్పించే పద్ధతిలో వస్తున్నాయి సినిమాలు. 'యాక్టింగ్ టాలెంట్' పుష్కలంగావున్న తార రోజారమణి. వయసుకి చిన్నది. ఎంతో భః

జో

ష్యత్తున్నది. ఆ 'టాలెంట్'ను సక్రమమైన మార్గాన మలచుకోవలసిన బాధ్యత చిత్ర పరిశ్రమ పైనున్నది.-

హీరో తిరిగొచ్చాడు

మూడునెలల పై బడి అమెరికాలోవుండి తిరిగొచ్చాడు ఇప్పటికీ ఆంధ్ర ప్రేక్షకుల దృష్టిలో 'రొమాంటిక్ హీరో'గానే నిలువ గలిగిన ఎవర్ గ్రీన్ ఏ యన్.ఆర్ ఆయన సంపూర్ణారోగ్యంతో వున్నారు త్వరలోనే తిరిగి కొత్త చిత్రాలు ప్రారంభమవుతాయనీ అక్కినేని నటించబోయే చిత్రాలలో అధిక భాగం 'సాత్వికమైన గుణం'గల పాత్రలకు మాత్రమే ఎన్నుకొంటా నంటున్నారు. ఆయనెలా అన్నప్పటికీ మరో అయిదేళ్ళు పోయాకయినా మరో 'దసరా బుల్లోడు' లాంటి పాత్రలో కన్పించి ప్రేక్షకుల్నుర్రూత లూగించగలిగిన మహా నటుడు నటనేగాక ప్రేక్షకులను 'మెస్మరైజ్' చేసే శక్తికూడా ఉన్నట్లుందీ పద్మశ్రీయుతుడయిన నట సామ్రాట్ నాగేశ్వరావుకి.

రంగుల చీకటి వెలుగులు

రంజిత్ మూవీస్‌వారు రంగుల్లో 'చీకటి వెలుగులు' చిత్రీకరించారు. ఒకటికి రెండు సార్లు కాశ్మీర్ యాత్రచేసి భూతల స్వర్గపు అందచందాలు 'రంగుల ఫ్రేము'ల్లో బిగించి ప్రేక్షకులకూ చూపేందుకుగాను యీచిత్ర నిర్మాతలు విశేష వ్యయ ప్రయాసలకు ోనై తమ ప్రయత్నం చేశారు. ాశ్మీర్ అందాలతోపాటు వాణిశ్రీ అందాలూ ుంచే యీ చిత్రంలో కృష్ణ కథానాయ పద్మప్రియ, సత్యనారాయణ, రాజ్ బాబు, సూర్యకాంతం, కృష్ణకుమారి, రమాప్రభ, మొదలైనవారు కూడా నటించే యీ చిత్రానికి కథ, దర్శకత్వం. కె యస్. ప్రకాశరావు, నిర్మాత కె. రంజిత్‌కుమార్.

జేబు దొంగ!

దొంగని దొంగే పట్టాలన్న సూత్రంతో ముల్లును ముల్లుతోనే తీయాలన్న నీతితో దేశం గొంతులో ముల్లులా గుచ్చుకుని ఉన్న ఘరానా దొంగల్ని, నల్లడబ్బుకు వెల్ల వేసేవారు, తెల్లడబ్బుకు తారుపూసేవారు, అనుమానించే అధికారులను హతమార్చేవారు, అమాయక జీవులతో ఆటలాడుకునేవార్ని, రచ్చకెక్కించాలన్న కసితో బయలుదేరిన 'రాజా' ప్రయత్నంలో కరిగించే కన్నీళ్ళు, రుచికలిగించే ప్రేమానురాగాలు, అడుగడుగునా ఎదుర్కొన్నాడు. ఆ అనుభవాలను చిత్రీకరిస్తూ తయారవుతూంది. "జేబు దొంగ." కథకుడు కె. ఛటర్జి.

'శోభన్‌బాబు' జేబుదొంగగా నటిస్తున్న ఈ చిత్రంలో మంజుల, రోజారమణి, రమాప్రభ, కృష్ణకుమారి, రావుగోపాలరావు, సత్యనారాయణ. రాజబాబు, మురళీమోహన్, అల్లు రామలింగయ్య, ప్రభాకరరెడ్డి, కె వి. చలం, పి జె శర్మ, పి వెంకటేశ్వరరావు మొదలగు ప్రముఖ తారాగణంతో వి మధుసూదనరావు, యస్. వెంకటరత్నం, చక్రవర్తి ముళ్ళపూడి, ఆత్రేయ, ఆరుద్ర, కుదరవల్లి, అంకిరెడ్డి, హీరాలాల్ మున్నగు ప్రముఖ సాంకేతిక వర్గంతో రూపొందే "జేబుదొంగ" వర్ణ చిత్రానికి కె. చటర్జి, యాచేంద్ర నిర్మాతలు.

★

జ్యోతి నవలానుబంధం



ఊహాలోకాల్లో తేలిపోతూ, కలల ప్రపంచంలో కరిగిపోతూ, సన్నగా కూనిరాగాలు తీస్తూ పద్యాలు రాస్తున్నవాడల్లా, ఆ గావుకేకకి ఉలిక్కిపడి, కరిగిపోతూన్న కలల లోకంలోంచి కళ్ళుతెరిచి ఒక్కమారు వెనక్కి తిరిగిచూశాడు కిరీటి.

శేఖర్!

సగం అయినా పూర్తికాని సిగరెట్టుని ఒక్కదమ్ములాగి నేలమీదికి విసిరికొట్టి బూటుతో నలిపివేసి, చొక్కాచేతుల్ని మోచేతులదగ్గర మడుస్తూ సిద్ధం అవుతున్నాడు. మొహంమీదకి పడిన జుట్టుని వెనక్కితోసే ఆ విసురుచూస్తేనే అర్థం అయింది కిరీటికి, వాడేదో అఘాయిత్యం చెయ్యబోతున్నాడనే సంగతి

ఇంక ఆలస్యంచేస్తే లాభంలేదు.

అంతపనీ చేసినా చేస్తాడు-అసలే బాణసంచా బాపతు.

వెంటనే, సగం సగం రాస్తూన్న పద్యాన్ని ఆ మట్టునే ఆపేసి, చిన్నముల్లు అయిదుమీదకి రావడాన్ని చూసిన స్టేట్‌బాంక్ గుమాస్తాలాగ, రక్కున ఎక్కడి కాగితా లక్కడచుట్టబెట్టి టేబిల్ సొరుగులోకి తోసేసి, టంచన్‌గా లేచి నిలబడ్డాడు కిరీటి.

"ఒరేయ్! ఇటురా ఇటు రా అంటే" గర్జించాడు శేఖర్.

'ఏదో కొంప మునిగింది కాబోలు రా దేవుడా!'- నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ దగ్గరగావచ్చి నిలబడ్డాడు కిరీటి.

"ఏరా! నువ్వు ఆ కోస్తానుంచీ నేను ఈ కోస్తానుంచీ ఈ పట్నం ఎందుకొచ్చాం.. అహా! ఎందుకొచ్చాం అని?"

'ఇలా అడుగుతాడేవిటి కొత్తగా?'

"ఎందుకొచ్చాం చెప్పు."

"ఎందుకేవిటి? నువ్వు తెలుగు ఎం.ఏ కాదు కాదు నేను తెలుగు ఎం.ఏ, నువ్వు న్యూరాలేజీ ఎం. డి. చదవడానికి" అన్నాడు కిరీటి. "ఏం, నేను చెప్పిం దాంట్లో ఏమైనా తప్పుందా?" అన్నట్టు మొహం పెడుతూ.

"అవునా? అది అలా ఉంచు, ఆవిడెవరో, మీ అత్తయ్యేనా? ఆ మహా ఇల్లాలు నీకు నెల నెలా ఎంత కష్టపడి డబ్బు పంపిస్తోంది?"

'నేను కాదన్నానా!' అన్నట్టు చూశాడు కిరీటి.

"నీకంటే రెండేళ్ళు పెద్దవాడి నయితేనేం, ఈ పట్నంలో నాలుగేళ్ళు ఎక్కువ అనుభవం ఉండడంవల్ల నయితేనేం, నువ్వు వట్టి పీచుమిరాయి పిరికి సన్యాసివీ, మీదు మిక్కిలి నా రూమ్ మేట్‌వీ అయితేనేం, కారణం ఏదైతేనేం, నీకు నేను లోకల్ గార్డియన్‌గా దాఖలు పడ్డానుకదా."

"అవునూ " లోపల అనుకుందాం అనుకుని పైకి అనేశాడు కిరీటి.

"ఉండు మాట్లాడకు. ఈ పరిస్థితిలో, ఫస్ట్‌క్లాసు వచ్చేలాగ, నాకు నచ్చే

లాగా, మీ మేనత్త మెచ్చేలాగా నువ్వు జాగ్రత్తగా చదువుకోవాలా వద్దా? ఏం .. మాట్లాడవేం?'' గద్దించి అడిగాడు శేఖర్.

ఇప్పటిదాకా నోరుతెరిస్తే ఎక్కడ తంతాడో అని మాట్లాడక ఊరుకుంటే, ఇప్పుడు తెరిచేదాకా ఊరుకొనేలాలేడు. వీడికేం మాయరోగం వచ్చిందో ఇవాళ ఇలా పట్టించాడు

గుడ్లు ఇంతలేసిచేసి చూస్తున్నాడు శేఖర్.

ఆ కళ్ళల్లోకి చూడలేక నేలచూపులు చూస్తూ 'నువ్వు చెప్పింది నిజమే' అన్నట్టు తల ఆడించాడు కిరీటి.

''అవునుకదా! మరి అటువంటప్పుడు నువ్వు చెయ్యవలసినపని ఇదేనా? ఇదేనా అంట?''

'ఇప్పుడు కానిపని ఏం చేసాను?'- కంగారుపడుతూ ఒళ్ళంతా ఓ మారు పరిశీలించి చూసుకున్నాడు.

''ఇంకా బుద్ధిగా చదువుకుంటున్నావు అనుకున్నాను నేను.''

వేళ్ళకి అయిన సిరా చూసేసరికి కిరీటికి అర్థం అయింది. సిగ్గుపడి తల వొంచుకొని గోళ్ళు గిల్లుకుంటూ ''పొరబాటయిందిరా ఇంకెప్పుడూ చెయ్యను''- నెమ్మదిగా అన్నాడు.

''ఆ! ఇంకెప్పుడూ చెయ్యడూ? అంటే తను అడుగుతున్నది వీడికి అర్థంకాలేదా? లేదా, తనకి తెలియంది వీడు ఇంకోటి ఏదైనా చేశాడా? అదీ ఇదీకాక తనలాగే వీడుకూడా ఓ దబాయింపు పర్వం ప్రారంభించి తనమతి పోగొట్టి కసి తీర్చుకోవాలని చూస్తున్నాడా?''- అనుమానంగా చూశాడు శేఖర్.

కాస్సేపుఆగి, ఆ తర్వాత భయం భయంగా నీళ్ళునముల్తూ ''మరేమోను ... ఆగోడ...అదే ఆగోడ అవతలనుంచి చల్లగాలికి తలఆడిస్తూ ఒక అందమైన గులాబీ కనిపిస్తే...'' అంటూ ఇంకా వాక్యం పూర్తి చెయ్యలేదు కిరీటి.

శేఖర్, 'ఆ!' అని ఆశ్చర్యంగా అరిచి, ఒక్కగెంతు గెంతి కిరీటిని సమీపించాడు.

''నిజంరా ..ఆ!గులాబీనిచూసి, నా హృదయం పరవశించి పరవళ్ళు తొక్కింది. ఆ పారవశ్యం ఆపుకోలేక పద్యంరాశాను, అంతే''—సంజాయిషీ ఇచ్చుకున్నాడు కిరీటి.

''ఏవిటీ! ఏవిటి?...గులాబీ తల ఊచిందా? గోడ అవతలనుంచా?...ఎవరురా ఆ అమ్మాయి?''- దగ్గరగా జరుగుతూ అడిగాడు శేఖర్.

''అమ్మాయేవిట్రా?...గులాబీ...అదే...గులాబీ పువ్వు''

''ఏవిటీ?...గులాబీపువ్వా? ఓరి స్టుపిడ్! చంపావు ఫో...ఇంకా ఎవరో అమ్మాయినిచూసి ఐసయిపోయావనుకున్నాను నేనూ... ఒక పుష్పాన్నిచూశా ఈ పరవశత్వం అంతానూ?..ఛీ...ఛీ..నువ్వెందుకూ పనికిరావురా...పువ్వుల్నిచూసీ లతల్ని చూసీ పరవశించడం ఏవిట్రా బుద్ధిలేకపోతేనూ? ఓ వాలుజడనిచూసి సోలిపోవడం, ఓ

మందహాసాన్ని చూసి మతిపోగొట్టుకోవడం ఓ హైహీల్డు యానని చూసి ఐసయి పోవడం ఎక్కడేనా ఉందికాని మరీ ఈ బొటానికల్ లవ్ ఏవిట్రా నీబొంద?"

తండ్రి చివాట్లు పెడుతూంటే తప్పుచేసిన కొడుకులాగ తల దించుకొని ఉండి పోయాడు కిరీటి.

"ఊ..సరే..ఏదో అఘోరించావుగాని, దానిసంగతి అలా ఉంచు...ముందు దీని సంగతి చెప్పు" అంటూ జేబులోంచి ఓ కవరు తీశాడు శేఖర్.

"ఇదేవిటి?"

"ఇదా?..,దీన్ని కవరు అంటారులే చిట్టినాయనా!. .సోయగాలుపోక అసలు సంగతి సూటిగాచెప్పు. ఈ కవరేమిటి, కథేమిటి? బుద్ధిగా చదువుకోరా నాయనా అంటే నాటకాలా?"

కిరీటికి అంతా అయోమయంలా ఉంది. ఈ కవరేమిటి, నాటకం ఏవిటి?

"ఈ కవరు గొడవ నాకేం తెలియదు" అన్నాడు కిరీటి మొండిగా.

"తెలియదూ? ఇది నీ పేరనే వచ్చింది. ఇప్పుడే వీధిమొగలో పోస్ట్‌మేన్ ఇచ్చి వెళ్ళాడు. విప్పి చూస్తే ఏం ఉంది, నీ రహస్యం బయటపడింది"

"రహస్యం!"

"ఆ! తమరు ఆదరంగా పంపింది అందుకున్నాం. అంగీకరించాం. మీకు కట్నం నూట పాతికరూపాయలు! పెళ్ళివారిని తీసుకుని ఫలానారోజున ఫలానా టైముకి వచ్చెయ్యండి అంటూ అంతా స్పష్టంగా రాస్తేనా ఇందులో—ఇంతకంటే వివరంగా ఏ మావగారు రాస్తాడురా!"

"మావగా రేవిటి, కట్నం ఏవిటి? ఎవరో బాబోయ్ నన్నేడిపించడానికి రాశా రిదంతా."

"అలాగా చిట్టితండ్రీ!" అన్నాడు శేఖర్ వస్తూన్న నవ్వు ఆపుకుంటూ.

"అస లది ఎవరు రాశారో ఏవిటో ఇలా ఇయ్యి" అంటూ చటుక్కున శేఖర్ చేతుల్లోంచి కిరీటి లాక్కున్నాడు. లాక్కుని, ఆదుర్దాగా నాలుగు పంక్తులు చదివి, పకపకా నవ్వి శేఖర్‌కేసి చూశాడు. దాంతో అప్పటిదాకా నానా అవస్థా పడుతూ, అతి ప్రయత్నంమీద ఆగిఉన్న శేఖర్‌కూడా, విరగబడి నవ్వేశాడు.

కిరీటి శేఖర్‌కేసి చూసి నవ్వా, శేఖర్ కిరీటిని చూసి నవ్వా; ఇలా ఒకళ్ళకేసి ఒకళ్ళు చూసుకొని తెగనవ్వి, చివరికి కడుపులో పోట్లు వచ్చి ఆగారు. ఆగారే కాని మళ్ళీ ఒకళ్ళని చూసినప్పుడు ఇంకొకళ్ళకి నవ్వు వస్తూనే ఉంది.

"ఎంత దబాయించావురా ఏదో నిజంగా కొంప మునిగిందని హడలి చచ్చాను నేను"

"అది సరే కాని .ఎప్పుడు రాశావురా ఈ రేడియో నాటిక? నాకు మాట మాత్రంగానైనా - చెప్పలేదేం?"

"ఆః ఆ మధ్య ఇద్దరికీ మనిఆర్డర్లు ఆలశ్యం అయి, చేతుల్లో డబ్బులు లేక, పాతపేపర్లు అమ్మాం? ఆ రాత్రే ఏం తోచక రాశాను బాగా వచ్చింది కదా అని రేడియో వాళ్ళకి పంపాను. వాళ్ళకి నచ్చుతుంది అనీ, మనల్నే ట్రూప్‌తో వచ్చి ఇలా వెయ్యమంటారనీ, అనుకోలేదు "

"అనుకోలేదు కనకే వాళ్లు అంగీకరించారు. 'భలే మంచి నాటిక రాశాన'ని నువ్వు అనుకున్నావో, వాళ్లు వెంటనే వెనక్కి తిప్పి పంపించి ఉందురు పత్రికల వాళ్ళకీ రేడియో వాళ్ళకీ అదో సరదా—ఎవరూ ఊహించని రీతిగా రచనల్ని ఎన్నుకుని, ఇటు రచయితల్నీ అటు పాఠకుల్నీ ఏకదమ్మున ఆశ్చర్యంలో ముంచె త్తేస్తూంటారు."

"కాబోలు!" అనుకున్నాడు కిరీటి.

"సరే మంచి పని చేశావు. ఇలాంటి మంచి పనులు అప్పుడప్పుడు చేస్తూ ఉంటే, మనం మరీ అంత అణాకీ బేడకీ అప్పులకి వెళ్ళడమూ తగ్గుతుంది, కప్పు కాఫీకి కక్కుర్తిపడి ఆ వీర్రాజుగాడు కోసే కోతలు వినడమూ తప్పుతుంది "

కిరీటి ఏం మాట్లాడలేదు. గదిమూలని ఉన్న బెడ్డింగుని మరి కొంచెం గట్టిగా దగ్గిరిగా చుట్టి దానిమీద కూర్చున్నాడు. కిరీటి చేతిలోంచి కవరూ కాగితం తీసుకుంటూ "ఈ నాటికలో కథ ఏవిటి? నెల్లాళ్ళలో వచ్చి మనల్నే రికార్డింగ్ ఇమ్మంటున్నాడు ఇంతకీ ఇందులో పాత్రలు ఎన్ని?" అన్నాడు శేఖర్.

"నాలుగు" అన్నాడు కిరీటి, గోడవార నున్న ట్రంకుపెట్టి గది మధ్యకి లాగి, దానిమీద కూర్చుంటూన్న శేఖర్‌ని చూస్తూ.

"అయితే మన ఇద్దరం కాక ఇంకో ఇద్దర్ని వెతకాలన్న మాట."

"ఆ అందులో ఒకటి స్త్రీ పాత్ర."

"వాట్! స్త్రీ పాత్రా? ఒరేయ్ కిరీటీ, నీకు బుద్ధి లేదురా! నాటికలో స్త్రీ పాత్ర నెందుకు చేర్చావు? నలుగురూ మగాళ్ళయితే సరిపోదూ?"

"అబ్బే వీల్లేదు ఆ కథకి ఆడది ఉండి తీరాల్సిందే!"

"వీల్లేదూ? అయితే కాగితం కలం తీసుకుని, 'అయ్యా! ఈ నాటిక మేం వెయ్యలేం. మీరే వేయించుకోండి' అని రాసి పడెయ్యి ఆ రేడియో వాళ్ళకి."

"అలా అయితే మన కెంతో డబ్బు ఇవ్వరు."

"అయితే ఏం చెయ్యమంటావు? నీ నాటకంలో స్త్రీపాత్ర వెయ్యమని ఎవర్ని అడుగుతావు ఈ హైదరాబాదు మహాపట్నంలో? అయినా ఎవరినేనా వెళ్ళి అడిగి చూడు. కాని వెళ్లేటప్పుడు ఓ దంతవైద్యుణ్ణికూడా వెంట తీసుకుపో. రాలిపోయిన పళ్లు వెంటనే కట్టి ఇవ్వడానికి"—

కిరీటి బిక్కమొహం పెట్టి దీనంగా చూశాడు.

పెట్టిమీంచి లేస్తూ విసుగ్గా, "నువ్వు ఏదో ఇలాంటి ఒక లిటిగేషన్ లేకుండా ఏ పనీ చెయ్యవు కదా?" అన్నాడు శేఖర్. అనీ, చేతులు వెనక్కి కట్టుకునీ ఆ గదిలో,

ఈ గోడ దగ్గర్నుంచి ఆ గోడ దగ్గరికీ, అక్కడనుంచి వెనక్కి తిరిగి మళ్లీ మొదటి గోడ దగ్గరికీ పచార్లు చెయ్యసాగాడు. అలా తిరుగుతూన్న శేఖర్‌ని చూసేసరికి, జానపద చిత్రాల్లో జైళ్ళముందూ కోటగుమ్మాల ఎదటా, జానెడుచోట్లో అటూ ఇటూ చకచకా గస్తీ తిరిగేసే రాజభటులు జ్ఞాపకం వచ్చి పకాల్న నవ్వాడు కిరీటి. అతని నవ్వు చూసేసరికి ఒళ్లు మండుకొచ్చింది శేఖర్‌కి.

"ఒరేయ్! నవ్వావంటే చంపేస్తాను. నిన్ను చూస్తే నాకు పచ్చడి బండా, చాకిరేవులో రాయీ, జ్ఞాపకం వస్తున్నాయి. తల బద్దలు కొట్టేస్తాను ఏ మనుకున్నావో ఏమిటో?" అంటూ అరిచాడు శేఖర్.

రెండు చేతుల్తోనూ నోరు మూసుకుని అతి ప్రయత్నంమీద నవ్వాపుకున్నాడు కిరీటి

అలా పచార్లు చేస్తూనే, తనలో తను అనుకొన్నట్లుగా పైకి అన్నాడు శేఖర్, "ఎన్ని రకాలుగా తల బద్దలు కొట్టుకొని ఆలోచించినా, ఆడపిల్లని ఎలా సంపాదించాలో అర్థం కావడం లేదు. పోనీ అని మన 'గేంగ్'లో ఎవడికీ పరిచయమూలూ ఏడవలేదు ఆడపిల్లలతో. అందరూ ఒకే రకం అడివి జంతువులు తయారయ్యారు"—అని.

"పోనీ వీర్రాజుని అడిగితేనో - వాడికి చాలామంది అమ్మాయిలు తెలుసునని అంటూంటాడు కదా?"

"ఒరేయ్ నీదో వెఱ్ఱిగోల! వాడి మాటలు నమ్మావట్రా నువ్వు? అవే నిజం అయితే, వాడికో అమ్మాయి రోజూ ప్రేమలేఖలు రాస్తూ ఉండాలి, మరో సరోరుహాక్షి సాయంత్రం వాహ్యాళికి వస్తూ ఉండాలి, ఇంకో ఇందీవరాక్షి మందహాసాలు అందించాలి. ఒక కన్య వీడితో కలిసి కారులో తిరగాలి, ఒక అమ్మాయి ఆస్తి అంతా వీడిపేర రాయాలి. ఇలా వీడు నిజంగా అయిదుగురు ఆడవాళ్ళు ఉన్న మోడరన్ మొగద్రౌపదే అయితే, ఏ హస్తినాపుర అంతఃపురంలోనో అశోకా హోటల్లోనో ఉండును కాని, ఇలా నీ చుట్టూ నా చుట్టూ తిరుగుతూ, కాకిఎంగిలి కత్తెరమార్కు సిగరెట్లు తాగుతూ, 'కాక్ ఎండ్ బుల్' స్టోరీలు చెబుతూ ఇక్కడ ఉండునా?"

గీతోపదేశం వింటూన్న అర్జునుడిలా కళ్లు పెద్దవిచేసి ఆశ్చర్యంగా చూశాడు కిరీటి.

"ఒరేయ్ అబ్బీ! ఈ జబ్బు నేటి అబ్బాయిల కందరికీ ఉన్నదేరా. ఇంకేం ఉంది? ఆ అమ్మాయి నేనంటే పడి ఛస్తుంది అంటాడు. మనం వెంటనే వెఱ్ఱిమొహం లాగ "ఎప్పుడు? రేపా ఎల్లుండా?" అని అడగకూడదు. "అహా అలాగా!" అని నోరు ఆవలించి వినాలి. అదంతా డాబు అని మనకీ తెలుసు. మనదంతా నటనని వాడికీ తెలుసు. తెలిసినా తెలియనట్లుండడమే నాగరికతంటే."

"ఎంత చిత్రం! నిజంగా?"—ముక్కుమీద వేలేసుకున్నాడు కిరీటి. ఎవరేనా తను చూస్తూండగా ముక్కుమీద వేలేసుకున్నా, తన ఎదురుగుండా ముక్కు గోక్కున్నా

పిచ్చికోపం వస్తుంది శేఖర్‌కి. పట్టలేని ఆగ్రహంతో కోతిగంతులు వేసేస్తాడు. పైగా ఇప్పుడు లేనిపోని సమస్యనో దాన్ని తీసుకువచ్చి మీద పడేశాడు.

పడేసి, ఇంక నాకేం సంబంధం లేదు, నీ అఘోరింపేదో నువ్వు అఘోరించు అన్నట్లు ఇలా తాపీగా కూర్చుని, ఆశ్చర్యపోతూ కళ్లు ఎగరేస్తూ ముక్కుమీద వేలేసుకుంటూ, భరతనాట్య భంగిమలన్నీ చేస్తూంటే ఒళ్లు మండిపోదూ? అందుకే అరిచేడు శేఖర్. "అలా నోరు తెరుచుకుని చూస్తూ కూర్చోపోతే కాస్త దీనికి పరిష్కార మార్గమేదో ఆలోచించకూడదూ॰" అంటూ.

ఆ అరుపు విని అదిరిపడి శేఖర్‌కేసి చూశాడు కిరీటి.

"నాకేసి కాదు అలా దూలాలకేసి చూడు, పరీక్షహాల్లో విద్యార్థిలాగ. ఓ ఆలోచనైనా వస్తుంది."

'తనుకూడా శేఖర్‌లాగ ఇంటి పైకప్పుకేసి చూస్తూ, ఆలోచిస్తున్నట్లు గాలిలో చేతులు అటూ ఇటూ తిప్పకపోతే, తన్నేలాగ ఉన్నాడు ఏం వచ్చిందో వీడి కివాళ! సరే కానియ్యి' అనుకొని కిరీటి కూడా ఊర్ధ్వదృష్టి ఏర్పరుచుకొని, అభినయ ముద్రలు పట్టసాగాడు.

ఇలా ఇద్దరూ ఒకరివేపు ఒకరు వీపుపెట్టి, దూలాలు ఎక్కడికీ పోకుండా జాగ్రత్తగా కనిపెట్టి చూస్తూ, చిత్ర విచిత్రంగా చేతుల్నీ వేళ్ళనీ గాలిలో పల్టీలు కొట్టిస్తూ, మూకీ సినిమాలో బొమ్మల్లా ఎంతసేపు ఆలోచనని అభినయించి ఉందురో ఏమో-

ఇంతలో, సైడుకర్టెన్‌లోంచి 'ప్రాంప్టర్' ఒక్కతోపుతో స్టేజిమీదికి వచ్చిపడ్డ పిరికి 'యాక్టర్' లా, గుమ్మంలోంచి రూమ్‌లోకి ఊడిపడి, ఒకే భరతనాట్యంలో ఇద్దరూ చెరోవేపూ తిరిగి ఒక్క భంగిమనే అభినయించే ఇద్దరమ్మాయిలులాగ, కదులుతూన్న కిరీటినీ శేఖర్‌నీ చూసి, బిత్తరపోయాడు వీర్రాజు.

వీళ్ళకేం కాలేదుకదా అని మొదట అనుమానించాడు.

కొట్టుకున్నారేమో పిచ్చినాయన్లు—అనుకున్నాడు ఆ తరవాత.

"దొంగ రాస్కెల్స్-నటిస్తున్నారేమో నన్నుచూసి అని అభిప్రాయపడ్డాడు చివరికి. పడీ, "ఒరేయ్-మీరు నాకేంఅప్పు ఇవ్వక్కర్లేదు లెండిరా ఇవాళ—వెధవ నటన చాలించి ఇటు చూడండి" అన్నాడు వీర్రాజు.

ఉహూఁ! వాళ్ళలో చలనంలేదు.

"ఇటు చూడమంటూంటే-ఏం-చూస్తారా చూడరా? ...వన్—టూ—త్రీ"

'అమ్మబాబోయ్!' అంటూ ఒక్కగెంతు గెంతి అమాంతం శేఖర్‌ని వాటేసుకున్నాడు కిరీటి ఆ వచ్చినవాడెవడో దొంగఅయి ఉంటాడనీ, చేత్తో పిస్టల్ పట్టుకొని తనవైపు గురిచూస్తూ, అలా అంకెలు లెఖ్ఖపెట్టి ఉంటాడనీ ఊహించుకుని.

"ఇడియెట్! బ్యూటిఫుల్ ఐడియాని బుగ్గిపాలు చేశావుకదరా నీగోలా నువ్వూను? ఏం జరిగింది?" అంటూ కిరీటిని విదిలించి ఓ మూలకివిసిరి, ఇటు తిరిగాడు శేఖర్.

ఎదురుగుండా వీర్రాజు!

విలన్‌పోజులో, చ్యూయింగ్‌గమ్ నములుతూ, ఓకాలు ఆడిస్తూ విలాసంగా నిలబడి, ఎడం అరచేతిలో కుడిగుప్పిడి గుద్దుకుంటున్నాడు.

'ఏవిటి వీడిపోజూవీడూను ఎదురుగుండా అమ్మాయిలు ఉన్నట్టు? కొంపదీసి వీడికి చత్వారం రాలేదు కదా? ఖర్మ! తననీ కిరీటినీ చూసి అందమైన ఆడపిల్లలు అనుకుంటున్నాడో ఏమో!'

"ఒరేయ్ ఏవిట్రా ఆ పోజు, కిరీటిని ఏవిటి అలా బెదరకొట్టేశావు? చూడు వాడా మూలకిపోయి పిచికపిల్లలా ఇంకా భయంతో ఎలా డొక్కలు ఎగరేస్తున్నాడో!" అన్నాడు శేఖర్.

"వాడి పిరికితనం ఎప్పుడూ ఉండేదేకానీ, మనకిప్పుడో సమస్య వచ్చిపడిందిరా" అన్నాడు వీర్రాజు కుడికాలు ఎత్తుగా స్టూలుమీదపెట్టి ఓచేత్తో బట్టలు ఆరవేసే దండెం తాడుని గట్టిగాలాగి పట్టుకుంటూ.

"ముందు ఆ తాడు ఒదులు, తెగిందంటే మాసిపోయిన బట్టలన్నీవచ్చి మానెత్తిన పడతాయి."

చేతిలోఉన్న ఏ తాచుపామునో వదిలేసినట్లు. వెంటనే కంగారుగా దండెం వదిలేసి, కాలుకిందఉన్న స్టూలులాక్కుని కూర్చున్నాడు వీర్రాజు.

తనకేసి ఆశగా చూస్తూన్న వీర్రాజుతో "ఇప్పటికే కిరీటి తెచ్చిన ఓ సమస్యతో తల బద్దలుకొట్టుకుని ఛస్తూంటే మళ్ళీ నీదొకటా?" అంటూ నిస్పృహగా నిట్టూర్చాడు శేఖర్.

"అలా అనకురా...బాబ్బాబు నీచేతులు పట్టుకుంటాను, సలహాచెప్పి సమస్యా పరిష్కారం చెయ్యరా ఇదిగో-కొత్త సిజర్స్‌పేకెట్-ప్రారంభోత్సవమైనా చెయ్యలేదు. దక్షిణగా తీసుకో దమ్ములాగు. ఐడియా వస్తుంది."

అప్పటిదాకా ఐడియాలెందుకురాలేదో అప్పుడు అర్థమయింది శేఖర్‌కి.

పొగ రింగు రింగులుగా వదులుతూ, అరమోడ్పు కన్నులతో ఆలోచనని అభినయిస్తూ సిగరెట్టుని ఆస్వాదించసాగాడు శేఖర్. ఆలోచిస్తున్నాడో నిద్రపోతున్నాడో అర్థంకాలేదు కిరీటికి.

"పాపం వాడంతగా కాళ్ళావేళ్ళా పడుతూంటే కాస్త పరిష్కారమార్గం ఆలోచించకూడదురా!" అన్నాడు కిరీటి. కేబినెట్ మినిష్టర్‌కి రికమెండ్‌చేసే, డిప్యూటీ మినిష్టర్‌లాగ.

"ఓహో! వాడి సిగరెట్టే అనుకుంటే నీ సిఫార్సు ఒకటా?"

"నవ్వులాటకాదురా పాపం వాడిసమస్యా పరిష్కారం."

"అదేకదట్రా ఆలోచిస్తున్నాను!"

"ఏవిటీ?,, నేనింకా అసలు సమస్యఏదో చెప్పకుండానే!"

''కానియ్యి...చెప్పు...ఈలోగా ఆలోచించేస్తూ ఉంటాను'' అన్నాడు శేఖర్, తన జబ్బు ఏదో రోగి ఇంకా ఓ పక్కనుంచి చెబుతూఉండగానే. మందుచీటీ రాసిఇచ్చేసే బిజీ డాక్టరులాగ.

''నేనీమధ్య ఓ అమ్మాయిని ప్రేమించారా'' అన్నాడు వీర్రాజు తలవంచుకుని సిగ్గుపడుతూ.

ఇంతక్రితమే వీర్రాజు ప్రేమ కలాపాలగురించి శేఖర్‌చెప్పిన వివరాలన్నీ గుర్తుకువచ్చి, పకపకా నవ్వాడు కిరీటి, శేఖర్ కోపంగా చూశాడు కిరీటికేసి.

అదేం పట్టించుకోకుండా ''అదికాదురా ..వీడివన్నీ కోతలని ఇప్పుడేగా మనం అనుకున్నాం'' అన్నాడు కిరీటి.

కిరీటిని గుడ్లురిమిచూసి ''నువ్వంతటితో నోరుమూస్తావా'' అంటూ అరిచి, వీర్రాజువైపుతిరిగి ''ఊ.. కానియ్యి'' అన్నాడు శేఖర్.

''ఇది పాతకోతలలాంటిదికాదు. నిజంరా. నిఝంగా నిజం'' అన్నాడు వీర్రాజు దీనంగా ముఖం పెడుతూ.

''సర్లే కానియ్యి'' అన్నాడు శేఖర్, సిగరెట్టునుపీని, పాతసిగరెట్టు పెట్టితో చేసిన అట్ట 'యాష్‌ట్రే' లో దులుపుతూ.

''ఈమధ్య ఒకటి రెండుసార్లు ఓ అందమైన అమ్మాయి మన ఆటో రిక్షాఎక్కింది''

''మన అంటూ నన్నుకూడా కలుపుతావేమిటి? నువ్వయితే ఎందుకూ పనికిరాని ఆ బి. యే. పాసయ్యావుకనుకా, ఇంటర్వ్యూలలో అభ్యర్థి అక్షతలుమాత్రమే చూస్తారనీ, మనీపర్సుకీ, 'మనోడు'అనేమాటకీ, సెలక్షన్‌కమిటీ అబ్జక్షన్ పెడుతుందనీ, బుద్ధిలేకుండా ఆలోచించావుకనుకా, ఉద్యోగపర్వంలో విషాదయోగాన్ని తెచ్చుకున్నావు ఎటూతోచక చివరికి ఆటోరిక్షా అద్దెకి పుచ్చుకున్నావు నాకేంఖర్మ! ఈ కాస్త ఎమ్.డి అనిపించానంటే, కన్సల్టేషన్‌ఫీజుకిందే సంపాదిస్తాను రోజుకో వంద.''

''సంపాదిస్తావులేరా-నేను కాదన్నానా? అందరికీ ఒకే అదృష్టం ఉండమంటే ఉంటుందా?''

''సరే కానియ్యి''

''ఆ అమ్మాయికో మావయ్య ఉన్నాడు ''

''వాడుంటే ఉన్నాడులే-ముందు అమ్మాయికథ కానియ్యి.''

''కాదురా ..వాడీ కథలో విలన్. చాలాముఖ్యం. వాడికి మనలాంటి చురుకైన యువకులన్నా, కాలేజీ స్టూడెంట్సులన్నా చచ్చేటంత ఎలర్జీ.''

''పూర్వాశ్రమంలోనో పూర్వజన్మలోనో ప్రిన్సిపాల్ అయి ఉంటాడు.''

''వాడి మొహానికి ప్రిన్సిపాలు కూడానా?''

''పోనీ లెక్చెరరు. అయినా ఇప్పుడు ఆ గొడవెందుకు? అసలు సంగతి అఘోరించు.''

''ఇలా స్టూండెంట్సుమీద సదభిప్రాయం లేకపోవడంవల్ల, తన మేనకోడల్ని ఏ కాలేజీలోనూ చేర్పించక ఇంటిదగ్గరే కూర్చోపెట్టి భాషాప్రవీణ పరీక్షకి ప్రైవేటుగా చదివిస్తున్నాడు ఇంతవరకూ మనకేం అభ్యంతరం లేదనుకో.''

''వాడి మేనకోడల్ని వా డిష్టం వచ్చినట్లు చదివించుకుంటాడు మధ్యన నీ అభ్యంతరం ఏవిటోయ్ బోడి అభ్యంతరం?'' అన్నాడు కిరీటి కోపంగా.

''నువ్వుండరా వాణ్ణి చెప్పనీ.''

''శుభమైన ఆ అమ్మాయి నిలా పాతచింతకాయపచ్చడి చదువులోపెట్టి ఊరుకో లేదు ఆ దౌర్భాగ్యుడు. నవనాగరికతా చిహ్నా లేవీ అంటని, అమాయకుడైన ఓ పెసర పప్పులాంటి అబ్బాయిని వెతుకుతున్నాడు ఆ అమ్మాయికి పెళ్ళి చెయ్యడంకోసం. సంస్కృత పండితుడికి కాని, లేదా తెలుగుపండితుడికి కాని, అధమం ఒక తెలుగు ఎమ్మేకి కాని ఇచ్చి చేస్తాట్ట. మనలాంటి కుర్రకుంక కెవ్వడికీ చచ్చినా ఇవ్వడట! ఇలా భయంకరమైన శపథం ఒకటి చేసి తడిసిపోయిన మడతమంచంలా బిర్రబిగుసుకుని కూర్చున్నాడు.''

''ఈ పిచ్చాడు సరే, ఆ అమ్మాయి ఏం అంటుంది?''

''ఆ పిల్లకి మరో పిచ్చి ఉంది. తనక్కాబోయే భర్త ఏం చదువుకున్నా. అసలేం చదువుకోక పోయినా, ఏం అభ్యంతరం లేదట. అందం ఉన్నా సరే లేక పోయినా సరేట. తెలివి తేటల 'కాలమ్' లో 'నిల్' ఉన్నా ఫర్వాలేదట. ధనవంతుడైనా బీదవాడైనా ఒకటేట.''

''వీర కమ్యూనిస్టు ఏవిటీ కొంపదీసి?''

''కానీ, తనకి కాబోయే భర్తకి కొన్ని కనీసమైన అర్హత లుండాలట!''

''ఏమిటిట?''

''ఎత్తు ఎట్టి పక్షంలోనూ అయిదున్నర అడుగులికి తగ్గకూడదట. బరువు అధమం నూట ఏభై పౌను లుండాలట. ఇంక ఛాతీ - గాలి పీలిస్తే ముప్ఫైఅయిదూ వదిల్తే ముప్ఫై ఉండాలిట. అంటే దాదాపు నీ రూపం ఉండాలి.''

''ఇంతకీ విగ్రహపుష్టి చాలు. అంతేనా?''

''అయినా ఈ సంగతులన్నీ నీకు ఎలా తెలిశాయి?'' అన్నాడు అమాయకంగా కిరీటి

''ఆ అమ్మాయే చెప్పింది వర్రి వసపిట్టలే. ఒకటి రెండుసార్లు మన ఆటోరిక్షా ఎక్కింది అన్నానుగా - కన్నేశాను కనుక నెమ్మదిగా కబుర్లలో దింపాను అంతే — మావ షరతులూ తన ఆశయాలూ ఏకరువు పెట్టింది.''

''మొత్తానికి మావకి పెసరపప్పూ, కోడలికి ఫైల్వానూ కావాలి. ఈ రెండూ బుజుప్రవర్తనా, రాజకీయ జీవితంలా ఒకదాని కొకటి అతకవే!''

''మనకి రెండు అర్హతలూ లేవు. చదువు చూద్దాం అంటే తెలుగు బి. యే.

అయినా కాదు, ఎందుకూ ఉపయోగం లేని ఎకనమిక్సు బి. యే. పోనీ చూద్దామా అంటే అయి దడుగులేనా మించని, వంద పౌను లయినా దాటని, ఎదు మట్టం శరీరం.''

''ఎందుకొచ్చింది కానీ, నువ్వా అమ్మాయిని మరిచిపో.''

వీర్రాజు శేఖర్ చేతులు పట్టుకుని ''అమ్మమ్మ అలా అనకురా ఏదో ఉపాయం ఆలోచించి నన్ను ఒడ్డు ఎక్కించు'' అన్నాడు కళ్ళ నీళ్లు పెట్టుకుంటూ.

''ఎలాగబ్బా? వీడి సమస్యలాగే నీది కూడా దారపుచిక్కు సమస్యేనే—ఎలాగ దీన్ని విడదియ్యడం?''

''నీ గొడవ ఏమిట్రా?'' అని వీర్రాజు కిరీటిని అడిగాడు, కిరీటి తను రేడియో నాటిక రాయడం దగ్గర్నుంచీ, స్త్రీపాత్రకి ఎవర్ని అడగడమా అనే ప్రశ్నదాకా, జరిగిందంతా వివరంగా చెప్పాడు.

''అయితే ఈ సమస్యకి నేనో పరిష్కారం చెప్తాను. నాకా అమ్మాయి చిక్కే మార్గం ఏదో ఆలోచించి చెప్పు'' అన్నాడు వీర్రాజు శేఖర్‌కేసి తిరిగి.

''ఆ ఆలోచనే తెగడం లేదు ఆ సరే ఒక పని చెయ్యి ఆ హిరణ్యాక్షుడు ఏ వరాలు కోరాడన్నావు?''

''మధ్యలో హిరణ్యాక్షు డెవడు?''

''అదే నీ ప్రియురాలి మేనమామ; ఆ పిల్లకి కాబోయే వరుడి విషయంలో విధించిన షరతు లేవిటి?''

''సంస్కృత పండితుడు- తప్పితే తెలుగు పండితుడు - తప్పితే తెలుగు ఎమ్మే.''

''ఇన్ని 'తప్పితే' లుపెట్టాడుకదా. కాశీమజిలీకథలో గంఢభేరుండ పక్షిల్లాగ: అయితే ఫర్వాలేదు. నువ్వు రేపే వేషంమార్చేసి మీ బాబయ్యని కలుసుకో-అదే-నీప్రియురాలి మావయ్యని-ఆ కాకీ పేంటూ, కాకీచొక్కా మెళ్ళో గళ్ళరుమాలూ తీసెయ్యి. ఎగదువ్వడు క్రాప్ చెరిపెయ్యి. పంచకట్టి పైమీద ఉత్తరీయంవెయ్యి ముఖాన్ని విభూది రాసుకుని కనుబొమలో కుంకంపెట్టుకో-నువ్వు తెలుగు ఎమ్మే చదూతున్న విద్యార్థివనీ అయన్ని నమ్మించు. అవసరంఅయితే ఈ కిరీటి పుస్తకం ఒకటి చేతిలో ఉంచుకో.''

''పుస్తకంమీదా పేరుచూసి నీ పేరు కిరీటా అనిఅడిగితే?''

''అవునను. ఆ షరతుల షరాబుకి సంబంధించి నంతవరకూ నువ్వే కిరీటివి''

''ఒరేయ్...ఇక్కడ నేనో కిరీటిని ఉండగా, మళ్ళీ వాడినో కిరీటినిచేస్తే అనక ఏం కొంపలు అంటుకుంటాయోయేమో—పైగా, నాది సుబ్బారావు, సూర్యనారాయణలాగ తరుచుగా ఉండే పేరుకూడాకాదు'' అన్నాడు కిరీటి గాభరాపడుతూ

''నీ దుంపతెగా, మధ్యలో అడ్డుపుల్లలు వెయ్యక ఆగరా, చచ్చీ చెడీ తలబద్దలు కొట్టుకొని ఓదారికి వస్తూంటే నువ్వేమిటి మధ్యలో ఊ సరే వీర్రాజూ, ఆ వాదస్తుడిని బోల్తాకొట్టించడంకోసం కిరీటిపేరు ఉపయోగించుకో, ఇకపోతే ''

"ఇంకేం? వాడిని అలా పడగొడితే ఆ తర్వాత ఆ అమ్మాయిని బుట్టలో వేసుకోవడంకోసం నీ రూపం ఉపయోగించుకుంటానులే-"

"అదెలాగ?"

"ఎలాగో నాకు వదిలెయ్యి. ఊ నా సమస్యని ఇలా పరిష్కరించేస్తే, ఇంక నీ సమస్య ఎంత? రేపు నేనా అమ్మాయిని పెళ్ళిచేసేసుకోవడం, ఎల్లుండి సతీసమేతంగా వచ్చి నీ నాటకంలో వేషం వేసెయ్యడం, స్త్రీ పాత్రకోసం వెతికే అవస్థనుంచి మిమ్మల్ని తప్పించడం, రైట్, అన్నీ సర్దుబాటు అయిపోయాయి."

"ఒరేయ్ ఎంత తేలిగ్గా చెప్పేశావు బడ్జెట్ ఉపన్యాసం ఇచ్చే ఆర్థికమంత్రిలాగ. ఒప్పించడం, పెళ్ళిచేసుకోవడం, అవన్నీ అలా నిముషాలమీద అయేపనులేనా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు శేఖర్.

"ఏమో-వాడివన్నీ రెండు రోజుల్లో సాధిస్తాడేమో- కాదని నువ్వెందుకు అనుకోవాలి?" అన్నాడు కిరీటి.

"రెండురోజులుకాదు. రెండునెలలు టైమిస్తున్నాను. ఈలోగా వాడు మనకి పెళ్ళి శుభలేఖ ఇయ్యగలిగితే, నేను వాడికి నా చెవి కదపా ఇస్తాను."

"అదిసరేకాని ఇంతకీ నీ ప్రియురాలికి వీణ పాటవచ్చా?" అన్నాడు కిరీటి.

"తెలియదు ఇంకా అలాంటి వివరాలు అడిగేటంత పరిచయం ఏర్పడలేదు. అయినా సంగీతంమీద ఆసక్తి ఉన్న అమ్మాయిలా కనిపించదు."

"అదేం ప్రశ్నరా? ఆ అమ్మాయికి వీణపాట వచ్చునోరాదో, ఆ గొడవంతా నీకెందుకు అయినా"

"అమ్మమ్మ! అది చాలా అవసరం, మన రేడియో నాటికకి. నాటకం మధ్యలో ఆ అమ్మాయి వీణ వాయించాలి. అవీణపాటమీద చాలా కథ ఉంది "

"నీ శ్రార్ధం ఉంది. వెధవ షరతులూ నువ్వూను. ఆ చచ్చు నాటకం తీసికెళ్ళి నీనెత్తినేసుకుని కొట్టుకో అసలే ఆడది దొరక్క చస్తుంటే, వీణపాటవచ్చిన ఆడది ఒకటట" పళ్ళు పటపటా కొరికాడు శేఖర్

"ఏమైనా అంత ఆశ పనికిరాదురా. నీది మరీ గొంతెమ్మ కోరికలావుంది. చెప్పొద్దూ. పైగా వీణ, బూర్జువా మన తత్వానికి చిహ్నం" అన్నాడు వీర్రాజు.

శేఖర్, వీర్రాజూ కలిపి "ఏం కోరికలురా నాతండ్రీ!" అంటూ శనిపాతం వాడిని చూసినట్టు చూశారు కిరీటిని.

"ఏం చెయ్యమంటావురా మరి!" అన్నాడు. దీనంగా మొహంపెట్టిన కిరీటిని చూసేసరికి, వీర్రాజుకి జాలేసింది, "పోనీ-వీణ వాయించే అమ్మాయి ఒకత్తె ఉంది. ఆమెని తీసుకుంటారా?" అన్నాడు.

"అసలు స్పెసిమెన్‌లేకే చస్తుంటే మళ్ళీ ఇందులో సెలెక్షన్ ఒకటా? ఆనందంగా తీసుకుంటాం. దండలతో ఆహ్వానించి మరీ తీసుకుంటాం. చెప్పు. త్వరగా చెప్పు."

"ఈ వీధికి ఆ చివర మీద ఉందా ? "

"ఉందో లేదో ఎవడు చూశాడు? ఆ చివరకిమాత్రం ఎవడు వెళ్లాడు? మైలున్నర పొడవు ఉంది ఈవీధి. ఊ ఆ మేడలో? వీణ వాయించే అమ్మాయి ఉందా? నీకు పరిచయస్థురాలేనా?"

"చంపావు ఫో-నేనేం ఎరగను. అటూ ఇటూ వస్తూంటే. అప్పుడప్పుడు ఆమేడమీంచి వీణపాట వినిపిస్తూ ఉంటుంది. వినిపించినప్పుడల్లా 'ఓహో! ఎవరీ అమ్మాయి? ఎంతబాగా వీణవాయిస్తోంది' అనుకుంటూ ఉంటాను. అంతే."

"ఏడవలేకపోయావు? ఇదా నీ సహాయం? ఇంకా నీకా అమ్మాయి తెలుసునేమో అనుకున్నాను నేను అఘోరించినట్టే ఉంది సర్లే ఆ అమ్మాయినో మరొకర్నో నేనూ కిరీటి వెళ్ళి ప్రార్థిస్తాం. అవసరం అయితే కాళ్లుపట్టుకుని బ్రతిమాలి మరీ తీసుకొస్తాం! నువ్వుమాత్రం వచ్చే ఆదివారం మధ్యాహ్నం మూడు అయ్యేటప్పటికి ఇక్కడ ఉండాలి. మేటనీకి బేరం చూసుకున్నావా, ఆపేటలో జనాన్ని దింపడానికి వెళ్లాను, అంటే ఊరు కానేదిలేదు."

"వత్సా-నీకు ఆ అనుమాన మేమియూ వలదు ఆ సమయానికి ఎక్కడ ఉన్న వీర్రాజు అయినాసరే. గ్రద్దలా ఇక్కడికివచ్చి వాలును సరా?"

"ఆరోజు పోర్షన్లు పంచుకొని రిహార్సల్సు మొదలెట్టాలి "

"రైట్!" అంటూ మెడని ఉన్న గళ్ళ రుమాలుతీసి, గార్డు జెండాలా ఊపి, 'టాటా' అంటూ వెళ్ళిపోయాడు వీర్రాజు.

బయట ఆటోరిక్షా స్టార్టు అయిన చప్పుడు విని, "గడుసుపిండం! ఇలా చెప్పి, అలా చెప్పి మొత్తంమీద వాడికి కావలసింది ఏదో సాధించుకుపోతాడు అందుకే బతకగలుగుతున్నాడు ఈ లోకంలో. మనం ఉన్నాం. ఎందుకూ? మన కళ్ళజోడు మనం తుడుచుకోలేం" అన్నాడు శేఖర్ నిట్టూరుస్తూ.

కిరీటి ఉలిక్కిపడి, కళ్లజోడు తీసుకుని జేబురుమాలుతో శుభ్రంగా తుడుచుకొని మళ్ళీ పెట్టుకున్నాడు.

2

కాలేజీలకి శలవు చీట్లు పంపించేసి, ఆ నాడు నిర్వర్తించ వలసిన కార్యక్రమాన్నంతనీ ఒకటికి రెండుసార్లు రిహార్సల్ వేసుకొని, ఉన్న వాటిల్లో కాస్త ఖరీదైన మంచి బట్టలు తొడుక్కుని, జుట్టు రేగిందేమో అని అద్దంలో మళ్ళీ మళ్ళీ చూసుకొని, బయల్దేరారు శేఖర్, కిరీటీను, ఆ వీధి చివర మేడలో వీణ పాటపాడే అమ్మాయిని కలుసుకుని, తమ రేడియో నాటికలో పాల్గొనవలసిందిగా ప్రార్థించడానికి

ఎంత నడిచినా ఆ వీధి ఎంతకీ తరగడం లేదు. ఇంకా చాలా మిగిలిపోయింది.

'ప్లేక్‌మనీ' లాగ అయినా పెదిమలు బిగించి ముందుకి వెళుతూనే ఉన్నారు. పోను పోను నడకలో మొదటి వేగం, దూకుడూ తగ్గిపోయింది. ఏదో జంకూ-భయం-ఆమె ఎవరో, ఎలా వుంటుందో, ఏం అంటుందో, అయినా ఎలా పలకరించడం? ఇదే ఆలోచన ఇద్దరి బుర్రల్లోనూ. కాళ్లు తడబడుతున్నాయి. గుండె ఏక దడదడా కొట్టు కుంటోంది. చెప్పలేనంత ఆరాటం. ఆయాసమూను.

"నత్తనడక నడిచినా ఈ ఆయాసం ఏవిటి చెప్మా? ఇదంతా భయంవల్ల కాదు కదా?''

అలా అనుకోడానికి శేఖర్‌కి పౌరుషం అడ్డు వచ్చింది తనకి ఒక ఆడపిల్లని కలుసుకోడానికి భయమా? హుం! —ఎంత ధైర్యాన్ని పుంజుకోవాలని చూస్తున్నా శరీరం ఒక పక్కనుంచి ఒణికిపోతూనే వుంది. కిరీటి కనిపెట్టేస్తాడేమో తను పడు తూన్న కంగారు! పరిస్థితి మహ ఇబ్బందిగా వుంది శేఖర్‌కి.

''ఏవిటిరా? అలా జంకుతూ వెనక్కి నడుస్తావేం?" అన్నాడు ముందు నడుస్తూన్న కిరీటి, వెనక్కి తిరిగి శేఖర్‌కేసి చూస్తూ.

''జంకేవిటి?''-అన్నాడే కాని ముఖంలో కంగారూ విసుగూ కనిపిస్తూనే వుంది.

'వెధవ నాటకం ఒకటి రాసి, లేనిపోని సమస్య తెచ్చిపెట్టావు కదురా' అన్నట్లు న్నాయి అతని చూపులు. గట్టిగా అడుగు వేస్తే కాలికింద వున్న డైనమైటు ఎక్కడ పేలుతుందో అన్నట్లుంది అతని నడక. తను ఇంత తడబడుతూంటే వీడేవిటి పెద్ద ధైర్యవంతుడిలా జబర్దస్తీగా నడుస్తున్నాడు' పరిశీలనగా చూచాడు శేఖర్.

నిజానికి కిరీటి కూడా అంతగానూ భయపడుతున్నాడు. ఒళ్లంతా చెమటలు - నరాలన్నీ పీకడం గుండెల్లోంచి చలిగాలిలా జివ్వుమంటూ భయం. శేఖర్ తంతా డేమో అని కానీ, లేకపోతే ఈపాటికి వెనక్కి తిరిగి రూమ్‌వేపు ఒక్క దౌడు తీసి ఉండేవాడే!

ఇద్దరూ ఒకళ్ళకోసం ఇంకోకళ్ళు ధైర్యాన్ని నటిస్తూ, అడుగులో అడుగు వేసు కుంటూ, చచ్చీ చెడే ఎలాగో ఓలాగ ఆ మేడదాకా రాగలిగారు. వచ్చి నెమ్మదిగా తలెత్తి ఆ రెండస్థుల మేడనీ చూశారు.

అంతే - అది చూస్తూనే గుండె ఆగిపోయింది ఇద్దరికీ.

ఓరి నాయనోయ్! ఈ మేడేవిటి? ఈ పెద్ద పెద్ద కిటికీలూ ద్వారబంధాలూ, గాలికి ఎగురుతూన్న ఈ పువ్వుల కర్టెన్లూ, వెన్నెల రంగులో వెలిగిపోతూన్న ఈ పార్లర్లూ, బిల్డింగులో ఒక భాగంలాగ అ పక్కని, కిందనుంచి పై దాకా ఉన్న ఈ మెట్లగదీ. ఈ రంగురంగుల 'గ్రౌండ్ గ్లాస్' అలంకరణలూ ఏవిటి? ఈ ఒక్క మేడే చేస్తుంది లక్షరూపాయలపైన, వీళ్ల అమ్మాయినా మనం రేడియో నాటకంలో వేషం వెయ్యమని అడగడం? చాలు చాలు! దవడ ఊడిపోవడానికి ఇంతకంటే దగ్గర మార్గం ఏం లేదు.

"నడు పోదాం వెనక్కి" అన్నాడు శేఖర్.

"బతుకు జీవుడా" అని తక్షణం వెనక్కి తిరగబోయి, అంతలోనే ఓ చిన్న అనుమానం వచ్చి ఆగిపోయాడు కిరీటి.

"ఏం ఆగావు? బతకాలని లేదేవిటి?"

"అది కాదురా! ఇంత పెద్దమేడలో తప్పకుండా ఒక ఆల్సేషియన్ ఉండి ఉంటుంది. ఏం?"

"అల్సేషియన్ ఏం ఖర్మ? ఆఫ్రికన్ టైగరే ఉండొచ్చు!"

"టైగర్! అంటే పె ద్ద పు లి!" - కిరీటి ఉలిక్కిపడ్డాడు. "ఎవిటిరా అలా భయపెడతావు? అసలే కాళ్లలోంచి దడపుట్టి ఛస్తూంటే" అన్నాడు.

ఆ మేడకేసి బిక్కమొహంతో చూసి. ఆఖరిసారిగా ఆశవదులుకొని, వెనక్కి తిరగబోతూంటే శేఖర్‌కి ఆ మేడలోంచి మెరుపుతీగలాంటి ఒక అందమైన అమ్మాయి ఇవతలికి రావడం కన్పించింది. చేతిలో పుస్తకాలు విలాసంగా ఊపుతూ నడుస్తూన్న ఆ తీరు చూసేసరికి ఎక్కడో చూసినట్లనిపించింది వెనక్కి తిరగబోతున్న వాడల్లా ఆ మట్టున ఆగి పరకాయించాడు

ఆ అందమైన కోలముఖం, చక్రాల్లాంటి కళ్ళూ, కొసదేలిన గెడ్డం, చేతికి పెట్టు కున్న వాచీ చైన్ రంగుకంటే పసిమిగా వున్న చెయ్యీ, మెత్తని ఫుల్‌వాయిల్ చీర లోంచి మెరిసిపోతూన్న ఆ శరీరచ్ఛాయ, నడకలో హుందాతనంతో కూడిన ఆ హొయలూ-ఇవన్నీ తనకి పరిచయ మైనవే-చాలాసార్లు ఈ అమ్మాయిని చూసినట్లు గుర్తు. ఎక్కడో మాత్రం జ్ఞాపకం రావడంలేదు.

సరే-ఏమైతేనేం? తెలిసిన మొహమే కదా? ఓ సారి అడిగి చూద్దాం. ఒప్పు కుంటుందా సరే సరి. లేదూ? మరో అమ్మాయిని ప్రయత్నం చేయవచ్చు.

మళ్లీ ఆశ చిగురించడంతో, కొత్తగా చురుకూ, చొరవా, ధైర్యం వచ్చాయి శేఖర్‌కి. అప్పుడే వచ్చిన వుత్సాహం అప్పటిదాకా వున్న దైన్యాన్ని తోసేసింది. హుషారుగా పక్కనున్న కిళ్ళీకొట్టు వైపు నడిచి గోల్డుఫ్లాక్ సిగరెట్టు ఒకటి కొని ముట్టించి "కిరీటీ డబ్బులిచ్చెయ్యి" అన్నాడు

"ఇదేవిటి? కత్తెరమార్కు కాదని ఖరీదైన బ్రాండ్‌లోకి దిగాడు అసలే డబ్బుల్లేక ఛస్తూంటే" అని లోపల్లోపల విసుక్కుంటూ కిరీటి కిళ్లీకొట్టు వాడికి ఏడుస్తూ డబ్బు లిచ్చాడు.

"ఊ రారా అబ్బీ!" అంటూ శేఖర్ ముందుకి అడుగేశాడు.

ఇప్పుడేగా వెనక్కి పోదాం అన్నాడు! మళ్ళీ ఏం వచ్చింది? భయం ఎక్కు వయి, వున్న ఆ కాస్త మతీ పోలేదు కదా!

"ఒరేయ్ వెనక్కి రా-అటెక్కడికి?"

"వెనక్కీ లేదు ఏం లేదు-కళ్ళు మూసుకుని నాతో వచ్చెయ్యి....ఊ " అంటూ కిరీటి చెయ్యి పట్టుకుని బరబరా ఈడ్చుకు పోసాగాడు శేఖర్.

"వీడినేదో ఆవహించింది. సందేహం లేదు. లేకపోతే ఇప్పటిదాకా లేని ఈ ఆవేశం ఏమిటి, ఈ తెగింపు ఏమిటి? ఇవాళేదో మూడింది వీడికీ, వీడితోపాటు నాకూను. సరే కానియ్యి. అన్నింటికీ ఆ భగవంతుడే వున్నాడు" అని మనస్సు రాయి చేసుకుని, మాయల మరారీ వెనకాల వెళ్లే కుక్కపిల్లలాగ ఇష్టం లేక ఇష్టం లేక నడువసాగాడు కిరీటి శేఖర్ వెనకాల

దార్లో శేఖర్ గొంతు కొంచెం లేచింది. కంఠంలో ఇందాకటి దడా ఒణుకూ లేదు. ముందు వెళ్తూన్న అమ్మాయిని చూపించి "ఆ అమ్మాయిని చూశావురా కిరీటీ! ఆ మేడవాళ్ళ పిల్లా, వీర్రాజు చెప్పిన సదరు వీణ వాయించే యువతీ, దేవుడు చాలా మేలుచేస్తే రేపొద్దున్న నీ నాటకంలోకి రాబోయే హీరోయినూ, ఆ అమ్మాయే!" అన్నాడు.

ఇలా ఇద్దరూ ముచ్చట్లాడుకుంటూ సావకాశంగా వెనకాల వస్తూంటే, ముందు నడుస్తూన్న ఆ అమ్మాయి, చక్రాల్లాంటి తనకళ్ళు ఇటూ అటూ తిప్పి, వచ్చే పోయే ట్రాఫిక్‌ని జాగ్రత్తగా పరకాయించి, మంచి ఒడుపు చూసి, మెరుపులా మైన్‌రోడ్డు దాటేసి అవతల ఉన్న బస్‌స్టాప్ చేరుకుంది.

అది చూసి కిరీటి ఆశ్చర్యపోయాడు. "అరే-ఏం చాకచక్యంగా రోడ్డు క్రాస్ చేసింది! తను చచ్చినా అలా చెయ్యలేడు. వచ్చేపోయే కార్లని, ఆటోరిక్షాల్ని, సైకిళ్ళని తప్పించుకొని తను ఇటునుంచి అటు వెళ్లేప్పటికి అధమం పది నిముషాలైనా పడు తుంది. మధ్యలో ట్రాఫిక్ అంతా గల్లంతు! సడన్‌బ్రేక్ వేసిన ఏ కారు డ్రైవరు చేతో 'ఏవయ్యా బ్రతకాలని లేదేవిటి?' అనే ఆశీర్వచనం తప్పకుండా లభిస్తుంది ఏమైనా ఆల్లేషియన్‌లు వుండే ఇళ్ళల్లో పెరిగిన అమ్మాయిల సంగతే వేరు తెలివీ, చురుకూ, గడుసుదనం ఇవన్నీ వాళ్ళకుండే అందంలాగే, పుట్టుకతోటే పుష్కలంగా వచ్చేస్తాయి."

రోడ్డు అవతలనుంచి శేఖర్ చప్పట్లు కొట్టాడు.

"అరే-వాడూ వెళ్ళిపోయాడే! ఇప్పుడు నేను ఒక్కణ్ణీ ఎలా రోడ్డు దాటడం?" అని తటపటాయిస్తూ, ఏకతోరణంలా అటూ ఇటూ పోతూన్న శకటాలకేసి నిస్సహాయంగా చూస్తూ కొంచెం సేపు శిలా ప్రతిమలా వుండిపోయాడు కిరీటి.

చివరకి ఎలాగో ధైర్యంచేసి, ఆంజనేయ దండకం చదువుతూ కళ్ళు మూసుకుని రోడ్డుకి అడ్డం పడ్డాడు. కార్లు ఆగిపోయాయి. స్పీడుగా పక్కకి తప్పించడంలో ఆటో రిక్షాలు బోల్తా కొట్టబోయాయి. సైకిలు రిక్షాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి మొత్తం ట్రాఫిక్ అంతా స్టిల్ ఫోటో గ్రాఫ్‌లా అయిపోయింది. అంతా కిరీటిని చంపెయ్యాల న్నంత కోపంతో చూస్తూవుండగా, సర్కస్ ఫీట్ లాంటిది ఒకటి చేసి, మొత్తం మీద ఎలాగైతేనేం ఇటువేపుకి వచ్చి పడ్డాడు కిరీటి.

శేఖర్‌తో కలిసి నాలుగడుగులు గబగబా వేసి బస్‌స్టాప్ దగ్గరకి వచ్చేసరికి, బస్సు కోసం వేచి యున్న ప్రయాణికుల 'క్యూ' పెద్ద కొండచిలువలా పొడుగ్గా కనిపించింది

కిరీటికి. ఆ క్యూ మధ్యలో, కొండచిలువ ఒంటిమీది మెరుపులా పచ్చగా ఆ అమ్మాయి.

కిరీటికి కోపం వచ్చేసింది. ఇంత అందమైన అమ్మాయి కూడా ఈ 'క్యూ' లోనా? చింపిరి తలలూ, డోక్కుపోయిన మొహాలూ, చెమట బట్టలూ, చమురు కాళ్లూ, జర్మను సిల్వరు కేరియర్లూ మధ్య?

ఇలాంటి అందమైన యువతుల కోసం ఇంకో ప్రత్యేకమైన 'క్యూ' ఏర్పాటు చేస్తే వీళ్ళ సొమ్మేం పోయింది? ఛీ ఛీ ఏమైనా ఈ సిటీ బస్ కార్పొరేషన్ వాళ్ళకి కళాదృష్టి, సౌందర్యారాధనా ఏం లేదు. అందుకే దేశం ఇలా తగులడుతోంది.

విశాలంగా ఇలా జాతీయ స్థాయిలో ఆలోచనలు సాగిస్తున్న కిరీటిని, దగ్గరగా వచ్చి నిలబడ్డ బస్సు బిగ్గరగా హారన్ కొట్టి భయపెట్టింది.

బస్సుని చూడగానే 'క్యూ'లో నిలబడ్డ వాళ్ళ మంచితనం అంతా, మంత్రి మండలిలో కాళీ ఏర్పడ్డగానే ప్రభుత్వ పక్షం ఎం. ఎల్. ఏ. లలో వుండే క్రమశిక్షణ లాగ, చటుక్కున మాయం అయింది నేను ముందు అంటే, నేను ముందు అంటూ ఒకళ్ళనొకళ్ళు తోసుకుని బస్సు ఎక్కసాగారు. ఆ త్రొక్కిసలాటలో స్త్రీలకేం సమస్య లేకపోయింది కాని, పురుషపుంగవులకి మాత్రం బస్సులోకి ఎక్కడం పెద్ద పరీక్షే అయింది. ఎలా అయితేనేం అతి ప్రయత్నం మీద శేఖర్, కిరీటీ బస్సు ఎక్కారు. నుంచోడానికి మాత్రమే చోటు దొరికింది అందులో శేఖర్‌కి మరీ కిరీటికి దూరంగానూ, ఆడవాళ్ళ సీట్లకి దగ్గరగానూ లభించింది. కొంతలో కొంత నయం, ఆ అందమైన అమ్మాయికి సమీపంలో వుంది ఆ కాస్త చోటయినా. ఇదీ శుభసూచనే. బస్సు దిగేలోగా ఏదో వంకని మాటలో మాట కలిపి కొంచెం పరిచయం సంపాదించుకోవచ్చు.ఆ తర్వాత అంటావు, అసలు విషయం కదిపి ఎలాగో అలాగ ఒప్పించడానికి ప్రయత్నించవచ్చు. ఈ లోగా మాట కలపడం ఎలాగో ఆలోచించాలి.

శేఖర్ ఊహలు ఇలా పరిగెడుతూంటే, కిరీటి భావాలు ఇంకోలా నడుస్తున్నాయి.

"అంత మేడా,ఆల్సేషియన్ డాగ్గూ వున్న శ్రీమంతురాలు కదా! స్వంత కారులో వెళ్ళక ఇలా సిటీ బస్సులో వస్తోందేవిటి? కారు ఏదైనా రిపైరింగ్‌కి వెళ్ళిందా? లేదా ఇంట్లో వాళ్లెవరైనా ఎక్కడికైనా వేసుకు వెళ్ళారా? డ్రైవరు శలవు పెట్టాడా? ఇవేం కాక పాతకారు అమ్మేసి కొత్త మోడల్‌కి ఆర్డరిచ్చారా? ఏమై వుంటుంది చెప్మా."

ఇలా ఇద్దరూ చెరో లోకంలోనూ వుండడం వల్లనే కండక్టరు వేస్తూన్న కేకలు ఏ ఒక్కరి చెవిలోనూ పడలేదు. చివరకు విసుగెత్తి కండక్టరు శేఖర్‌ని చేత్తో తడుతూ, "ఏవిటి సార్ మాట్లాడరు! టిక్కెట్టు తీసుకోండి. ఎక్కడికి పోవాలి?" అని అడిగాడు.

శేఖర్ ఉలిక్కిపడి "అవును-ఎక్కడికి?" అన్నాడు అటు తిరిగి పక్కనే వున్న అమ్మాయి ముఖంలోకి చూస్తూ. ఆ యువతి కోపంతో ముఖం అటు తిప్పుకుంది.

"ఈమె ఎక్కడ దిగుతుందో తెలియదే-ఎక్కడికని తను టికెట్టు కొనేటట్టు?"

శాంతి

శేఖర్ ఇబ్బందిలో పడ్డాడు. ఆ అమ్మాయి కనక ఇంకొంచెం దూరంగా వుంటే, "మనలో మన మాట. ఆవిడ ఎక్కడికి తీసుకుంది టికెట్టు?" అని కండక్టరుని లోపాయికారీగా అడిగి వుండేవాడే. ఇప్పుడు చిక్కు పడింది. ఏమిటి చెయ్యడం?

ఇంతలో కిక్కిరిసి వున్న పదిమంది మనుష్యుల అవతలనుంచి, తల మాత్రమే కనిపించేలా కాళ్లు ఎత్తి. "ఏరా టిక్కెట్టు కొననా? ఎక్కడికి కొనమంటావు?" అంటూ అరిచాడు కిరీటి.

"వెధవ అరుపులూ, వీడూను ఎక్కడికని కొంటాడు? బొత్తిగా ఎప్పుడేం అనాలో తెలియదు మట్టిబుర్రా వీడూను" అని మనస్సులో తిట్టుకుని "నీ దగ్గర డబ్బులు లేవుగా-నేను కొంటాలే-నా దగ్గరేనా వందరూపాయల నోటేగా వుంది. అందరికీ టిక్కెట్లు ఇచ్చాక కండక్టరు చిల్లర పట్టుకుని నా దగ్గరకు వస్తాడు. నువ్వీ లోగా తొందరపడకు' అంటూ శేఖర్ గట్టిగా చెప్పాడు, ఇటు అమ్మాయికీ అటు కండక్టరుకీ కూడా వినిపించే లాగ

"నా దగ్గర డబ్బులు లేవూ? తన దగ్గర వంద రూపాయలనోటు వుందా? చచ్చుడాబూ వీడూను. ఆ అమ్మాయి ఏం అనుకుంటుంది. నన్ను ఒక పాపర్‌గా జమ కట్టదూ? ఉండు వీడి బండారం బైట పెడతాను," అనుకొని, ఆ మాటలే పైకి అందా మని నోరు తెరిచాడు కిరీటి

కాని, "నోరు ఎత్తావో జాగ్రత్త! చంపేస్తాను!" అన్నట్లు గుడ్లురిమి చూశాడు శేఖర్. దాంతో హడలిపోయి, తెరిచిన నోరును తెరిచినట్లే ఆమట్టున వుండిపోయాడు కిరీటి.

ఆ పిల్ల బస్సు దిగేలోగానే, ఏదో ఒక వంకని ఓ మారు పలకరించేస్తే, ఆ పరి చయాన్ని పురస్కరించుకుని తక్కినదంతా మాట్లాడవచ్చు. నిజమే! కాని, ఆ పలక రించడమే ఎలాగ? ఏమని?

"మేడమ్! టైమెంతయిందీ?" అంటే-బాగానే వుంటుంది కాని ఖర్మ! తన చేతిని వాచీ ఏడిసిందే! పోనీ-తన వాచీ ఆగిపోయింది అనుకుందాం అయ్యా తాత్కాలిక ప్రాతి పదికమీద. అయితే మాత్రం? బస్సులో ఇంతమంది చేతులకి ఇన్ని వాచీ లుండగా ప్రత్యేకించి ఆమెనే టైము అడగడం ఏమంత సమంజసంగా వుంటుంది?

పోనీ-"మీరెక్కడ దిగుతారండీ?" అని అడిగితే?-అడగొచ్చు. కాని ఆమె రపీ మని దవడ వాయగొట్టినట్లు "తమకెందుకండీ ఆ సంగతి?" అంటే-నిజమే, పది మందీ ఘొల్లున నవ్వడం, తనకీ జన్మలో ఆమెని పలకరించే అవకాశం పోవడం-

మరి అయితే ఏవిటి చెయ్యడం?

ఇలా, తెలివితక్కువ సినీ ప్రొడ్యూసర్‌లాగ తెగ ఆలోచించేస్తూ, బంగారం లాంటి టైముని, సిగరెట్టు పొగలాగా బ్రాందీ వాసనలాగా ఒక ప్రక్కకి శేఖర్ ఖర్చు పెట్టేస్తున్నాడు. మరో ప్రక్కని తన బస్‌స్టాప్ వచ్చి ఆ అమ్మాయి దిగి పోయింది.

కండక్టరు రైట్ రైటంటూ బెల్ కొట్టడం. "ఒరేయ్ మనం ఇక్కడ దిగొద్దూ" అంటూ కిరీటి అరవడం ఒక్క మాటే జరిగాయి.

తుళ్లిపడి శేఖర్ ఆమె సీటులోకి చూశాడు.

ఆ స్థానంలో, రెండు చేతుల నిండా రకరకాల తెల్ల కర్ర గాజులు వేసుకుని, వీపు కనిపించే అతుకుముక్కల జాకెట్టూ, అద్దాల బొంత పరికిణీ కట్టుకొని, అట్టలు కట్టిన జుట్టుకి ఆభరణాలు తగిలించి, మెడలో వింత వింత రంగు పూసల దండ వేసుకుని, ముడతలు పడి వేళ్ళాడిపోతూన్న శరీరంతో, ఓ ముగ్గు బుట్ట ముసలి లంబాడీ కనిపించింది.

కెవ్వున కేకవేసి కళ్ళు నులుపుకొని చూశాడు శేఖర్.

అనుమానం లేదు.

అమ్మాయి లేదు. ఆ స్థానంలో ముసలి లంబాడీ ఉంది.

ఏవిటీ మేజిక్?

"కొంప మునిగిందిరా దేవుడా!" అనుకుంటూ ఒక్క పొలికేక వేసి, బస్సు ఆపమన్నాడు శేఖర్.

బయలుదేరిన బస్సే సడన్ బ్రేక్‌తో ఆగడంవల్ల, జనం అంతా ముందుకి ఒక్కమారు ఊగి, తిరిగి వెనక్కి పడ్డారు.

"దిగు దిగు ఇంతసేపు ఆగితే దిగకుండా ఏం చేస్తున్నావు?" అన్న కండక్టరు పల్లవికి, బస్సులోవాళ్ళంతా తక్కిన చరణాలు అందుకొని కోరస్ పాడారు.

కంగారుగా దిగబోతూన్న శేఖర్‌ని పట్టుకొని "టిక్కెట్టు కొనలేదుగా? ఆ వంద రూపాయల నోటు ఇలా ఇయ్యి. చిల్లర ఇస్తాను" అన్నాడు కండక్టరు.

"అక్కర్లేదులే. మావాడి దగ్గర చిల్లరుంది" అంటూ కిరీటిని కండక్టరుకి ఆహారంగా పడేసి, తను మాత్రం ఆ అమ్మాయిని వెంబడించడం కోసం, గబగబా బస్సు దిగి వెళ్ళిపోయాడు శేఖర్.

తీరా కిరీటి వచ్చేసరికి, రోడ్డు వారనున్న లైటు స్తంభానికి జేర్లబడి దిగాలుగా కనిపించాడు.

"ఏరా? ఏమైంది? అలా ఉన్నావేం? ఆ అమ్మాయిని పలకరించావా?" అన్నాడు కిరీటి.

"లేదురా - తీరా నేను వచ్చేసరికి ఆ అమ్మాయి ఇదిగో, ఈ గేటులోంచి లోపలికి వెళ్ళిపోయింది" అంటూ మెడికల్ కాలేజీ గేటు చూపించాడు శేఖర్.

"అయితే ఇకనేం? ఆ అమ్మాయి మెడిసన్ చదువుతోందన్న మాట. నిన్ను అడ్డేవాళ్ళెవరూ, నీ కాలేజీయేగా లోపలికి పోలేకపోయావా?"

"కాలేజీ లోపల ఆమెని పలకరిస్తే బాగుండదు. ఆమె ఏమైనా పెడసరంగా

మాట్లాడితే? తెలిసిన ప్రొఫెసర్లూ, సర్జన్లూ వాళ్ళ ముందు అవమానం కాదూ? అందు వల్ల ఆమె తిరిగి వచ్చేదాకా మన మకాం ఇక్కడే.''

''మరి, మన మధ్యాహ్నం భోజనం?''

''ఏం? జేబునిండా డబ్బులున్నాయా?''

''ఎక్కడివిరా? తెచ్చిందే రూపాయి లోపు చిల్లర కదా? మళ్ళీ అందులో నీ షోకు ఒకటి-గోల్డుఫ్లాక్ సిగరెట్టూ నువ్వూను! అదీ, ఇందాకటి సిటీబస్సు ఛార్జీలు పోగా ఇంకే మాత్రమో అర్ధరూపాయి కాబోలు మిగిలింది.''

''మరింకేం? పెద్ద జమీందారులాగ భోజనం కబుర్లూ నువ్వూను. ఆ అర్ధ రూపాయి అలా ఉంచు అదిగో ఆ చెట్టు కింద వేరు శనక్కాయలు అమ్మడంలేదూ - అవో పదిపైసలివి కొనుక్కుని, పంపునీళ్ల తాగితే, ఈ పూట కిక భోజనం సమస్య ఉండదు ఈ ఒక్కపూటకీ గాంధీగారివి అనుకో. రాత్రి రూమ్‌కి వెళ్ళాక, అయ్యరు అరువు కాతా ఎలాగా ఉందిగా? సుష్టుగా భోజనం చెయ్యొచ్చు. అంతగా ఏడుపు వస్తే కార్తీక సోమవారం జ్ఞాపకం తెచ్చుకో. ఏం తెలిసిందా?''

''ఏం ఖర్మ వచ్చి పడిందిరా భగవంతుడా అనుకుని. కళ్ళల్లో తిరిగిన నీరు కనపడకుండా ముఖం అటు తిప్పి 'అలాగే' అన్నట్లు తల ఊపాడు కిరీటి.

''నువ్వు చాలా మంచివాడివిట. ఎనిమిది పైసలుంటే ఇస్తావుట! ఇయ్యరా ఓ సిజర్ సిగరెట్ తెచ్చుకుంటాను భయపడకు. ఇంక మళ్లీ రూమ్‌కి తిరిగి వెళ్ళేదాకా అడగనులే-దాన్నే సాయంత్రందాకా తాయిలంలా దాచుకొని, కొంచెం కొంచెం కాల్చు కుని ఆర్పేస్తూ ఉంటాను. మా బాబువి కాదూ? ఇయ్యరా!''

దీనంగా పెట్టిన శేఖర్ ముఖం చూసేసరికి కిరీటి కాదనలేక పోయాడు.

సాయంత్రం నాలుగు గంటలకి స్నేహితులతో కలిసి నవ్వుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ గేటులోంచి ఇవతలకి వచ్చిన ఆ అమ్మాయిని చూసేసరికి, శేఖర్‌కీ కిరీటికీ ప్రాణం లేచివచ్చినట్లయింది. రోడ్డు దుమ్ముతో అసహ్యంగా తయారయి, పొద్దుటినుంచీ చేసిన బలవంతపు ఉపవాసంవల్ల నీరసంగా పీక్కుపోయిన వాళ్ళ ముఖాలు ఆమె కని పించడంతో పొద్దు తిరుగుడు పువ్వుల్లా వికసించాయి. స్నేహితుల్ని పంపించేసి. ఒక్కత్తే బస్సుస్టాప్ దగ్గిరికి నడుస్తూన్న ఆ అమ్మాయి, తనని వెంబడిస్తూన్న శేఖర్‌నీ కిరీటినీ చూసి, 'ఓహో! వీళ్లు పొద్దుటి జంటేనే' అనుకుంది.

దానికితోడు వాళ్ళు ప్రొద్దుటిలాగ కాకుండా, కాస్త చొరవనీ, మరి కాస్త ధైర్యాన్నీ పుంజుకొని, ఆమెని పలకరించి తాడో పేడో తేల్చేసుకోవాలనే ఉద్దేశంతో ఇంకొంచెం దూకుడుగా తనకేసి వస్తున్నారేమో, ఆమెకి అనుమానం మరికొంచెం ఎక్కువయింది. ఏదో తెగింపు. సరే కానియ్యి ఏదైతే అది అవుతుంది అనే ఒక రకమైన మొండితనం, పారిపోడానికి వీలు లేనప్పుడు పెద్ద పులి వచ్చి మీద పడి పోతూంటే మనుష్యులికి సాధారణంగా వచ్చే ఓ పిచ్చి ధైర్యం, వెఱ్ఱి ఆవేశం. ఇవన్నీ స్పష్టంగా కనిపించాయి వాళ్ళ మొహాల్లో.

వాళ్ళ చేష్టలన్నీ కళ్ళ చివరనుంచి కనిబెడుతూన్న ఆ అమ్మాయి "ఓహో వీళ్ళేదో అఘాయిత్యం చెయ్యడానికే పొద్దుటినుంచీ నన్ను వెంటాడుతున్నారు" అనుకొని, ఎడంకాలి చెప్పు రెడీగా ఉందా లేదా అని ఓమారు చూసుకుంది.

ఇలా ఉండగా శేఖర్, కిరీటీ ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు చూసుకుని, నాలికల్ని తడుపుకొని, ఎండిపోయిన గొంతుల్ని సవరించుకొని "ఊ రెడీ" అని ఒకళ్ళనొకళ్ళు మౌనంగా హెచ్చరించుకొని, ఆమెని పలకరించడానికి నోరు తెరిచారు.

ఇంకొక్క క్షణం ఉంటే వాళ్ళా పని చేసి ఉందురు.

ఆమె దగ్గరనుంచి సన్మానంకూడా పొంది ఉందురేమో

కాని ఇంతలో పిటీ బస్సు వచ్చేసింది.

"చేతికి అందింది అనుకున్న అవకాశం కాస్తా జారిపోయిందే!" అని ఘొల్లున మనస్సులో ఏడ్చారు ఇద్దరూ.

ఆ కండక్టరు వాళ్ళ సంకల్పాన్ని కనిపెట్టాడో, లేక కావాలని వాళ్ళ నేడిపించాలనుకున్నాడో, కాక అలా ఆడపిల్లల్నీ, మొగపిల్లల్నీ విడదియ్యడం అంటే అతనికి సరదాయో, రూల్సుని తు. చ. తప్పకుండా అమలు జరిపే చాదస్తుడో-ఏం పాడో కాని, "అమ్మా మీరలా ముందు డోర్‌లోంచి ఎక్కండి ఇదిగో బాబూ, మీ రిలా వెనక డోర్‌దగ్గిరికి వచ్చెయ్యండి" అంటూ బోడి ఉత్తరువు ఒకటి జారీచేశాడు వళ్లు మండిపోయేలాగ.

ఇంకేం ఉంది? ఆ అమ్మాయీ, తామూ ఒకే బస్సులో ఉన్నాం అన్న సంతృప్తే కాని, ఆ అమ్మాయిని చూడడమా, పలకరించడమా? ఒకళ్లు ఇచ్ఛాపురంలోనూ, మరొకళ్లు హిందూపురంలోనూ - సరదాగా నవ్వుకుంటూ హాయిగా పాడుకుంటూ, సెక్రటేరియేట్‌లోని పక్కపక్క సీట్లలో కూర్చుని, గంటల్ని నిముషాలులాగ దొర్లించేసే యు. డి. సీ. నీ లేడీ టైపిస్టునీ చూసి ఓర్వలేక, ఇద్దర్నీ రాష్ట్రానికి చెరో మూలా విసిరేసే రాష్ట్రప్రభుత్వ రాక్షస మనస్తత్వం నీలోకూడా పూర్తిగా జీర్ణించి పోయిందేమిట్రా భగవాన్లూ!" అనుకుంటూ, బస్సు దిగేదాకా, కండక్టరుని రకరకాల నామావళితో పూజిస్తూనే ఉన్నారు, ఆ ఇద్దరు మిత్రులూ కసిగా మనస్సులో.

పొద్దుట ఎక్కినచోటే ఆ అమ్మాయి దిగింది. కిరీటీ శేఖరూ కూడా దిగారు. "అనుమానం లేదు. వీళ్ళు కావాలనే నన్ను వెంబడిస్తున్నారు సరే కానియ్యి" అనుకొంది ఆ అమ్మాయి. కోపంతో ఆమె ముఖం ఎర్ర గులాబీల తోటగా మారడం కానీ, దొండపండులాంటి కింది పెదవిని ముత్యాలలాంటి ఆమె పళ్ళు గట్టిగా నొక్కడం కానీ, చక్రాల్లా ఉన్న కళ్ళు రెండూ విచ్చుకత్తుల్లా ప్రజ్వరిల్లడం కానీ, వాళ్ళిద్దరూ గమనించనే లేదు.

వాళ్ళ తొందరంతా, ఆమె తిరిగి ఇంట్లోకి వెళ్ళిపోయే లోగా ఎలా పలకరించడం అనే.

ఆమె విసురుగా ముందు నడిచేస్తోంది.

వెనకాల శేఖర్ కిరీటీ, పొద్దుటినుంచి భోజనం లేకపోవడంవల్ల నకనకలాడు తూన్న పొట్టలమీంచి మాటిమాటికీ జారిపోతూన్న పేంట్లని పైకి లాక్కుంటూ, దాదాపు పరుగులాంటి నడక సాగిస్తున్నారు.

ముందు వేగంగా ఆమె.

వెనక ఆయాసపడుతూ వీళ్ళు.

ఆ సమయంలో కుర్రాళ్ళు ఎవరేనా ఆ ముగ్గుర్నీ చూస్తే, 'నగరంలో నడకల పోటీ' జరుగుతోందేమిటి చెప్మా అనీ, పెద్దవాళ్ళు అందులో ఆడపిల్లల్ని కన్న తండ్రు లెవరేనా చూస్తే, పాపం ఈ అమ్మాయిని వీళ్ళెవరో తరుముతూంటే ఆమె తప్పించుకు పారిపోతోందనీ తప్పకుండా అనుకొని ఉందురు.

ఇలా ఆ పోటీ, అపూర్వ కౌశలంతో, అసదృశమైన చాకచక్యంతో, అసామాన్యమైన నైపుణ్యంతో, కన్నుల పండుగలా సాగి సాగి, చివరకి పొద్దుటి రెండస్తుల మేడ దగ్గిరికి వచ్చేసింది.

ఆ అమ్మాయి ఇంకో రెండడుగులు వేసి చీడీలు ఎక్కేసి లోపలికి వెళ్ళి పోయిందో, ఇప్పటిదాకా తాము పడిన శ్రమా, చేసిన ప్రయత్నం, ఉన్న కార్తీక సోమవారం ఉపవాసం, అన్నీ వృథా దండగ వేస్ట్!

అందుకే ఇంక ఆగలేక, అలాగని ఆమెని ఆ రెండు అడుగుల్లోనూ వెళ్ళి కలుసుకొనే ఓపిక లేక, చేసిన ప్రయత్నం అంతా చేజేతులా జారిపోతోందే అనే ఆవేదనని భరించలేక, వెర్రి ఆవేశంతో ఇద్దరూ ఏకకంఠంతో గట్టిగా,

''మేడమ్! మాట!''

అంటూ అరిచారు. వాళ్ళ పిచ్చి కేకక్కి, ఇంట్లో గన్ తుడుచుకుంటూన్న ఆ అమ్మాయి తండ్రి ఇవతలకి వచ్చాడు కాని, ఆమె మాత్రం వెనక్కి తిరగలేదు.

పైగా మరింత తొత్రుపడుతూ ఎలాగో అలాగ లోపలికి వచ్చి పడి, ఎదురైన తండ్రితో, ''డాడీ! ఎవరో రౌడీలు నన్ను తరుముతున్నారు'' అంటూ వణికే కంఠంతో భయంగా అరిచింది.

అంతే.

ఎత్తుగా లావుగా ఏభై ఏళ్ళ విగ్రహం.

నల్లని సూటుపైన పచ్చని పెద్ద ముఖం.

చాకుల్లా ఇటూ అటూ తెల్లని మీసాలు

ఎర్రగా నిప్పులు కురిపిస్తూన్న కళ్లు.

కోపంతో వణికిపోతూన్న చేతులు.

చేతిలో బారెడు గన్!

మృత్యువులా చీడీలమీద ప్రత్యక్షమైన ఆ రూపాన్ని చూసేసరికి శేఖర్‌కీ, కిరీటికీ పై ప్రాణాయి పైకి పోయాయి. సీలలు వేసి బిగించినట్లు వాళ్ల కాళ్లు ఆ మట్టునే అక్కడే ఆగిపోయాయి.

వణికిపోతూన్న మోకాళ్లు ఒకదాని కొకటి కొట్టుకుంటున్నాయి.

పళ్ళు గిట్ట కరుచుకుపోయాయి.

చేష్టలు దక్కి, చైతన్యం నశించి, ప్రాణంలేని శిలావిగ్రహాల్లా అలా నుంచుండి పోయారు, పారిపోడానికికూడా ధైర్యంలేక శేఖర్ కిరీటీనూ.

3

బరువైన కిరాణా సరుకుల సంచీ ఒక హేండిల్‌కీ, నిండుగాఉన్న కూరల సంచీ మరో హేండిల్‌కీ తగిలించాడు రవణయ్య ముక్కుమీదకి జారిపోతూన్న కళ్ళజోడుని పైకి తోసుకుని, చుట్టూ పరకాయించాడు. కనుచూపు మేరలో తూముకానీ, అధమం ఎత్తైన ఓరాయికానీ ఏదీ కనిపించలేదు. మరయితే ఎలాగ తను సైకిలెక్కడం? ఎవడి నెత్తినో కాలెయ్యడం ద్వారానే పైకి రాగలం, అనే నమ్మకాన్ని నరనరాల్లోనూ జీర్ణించుకొన్న రవణయ్య, సైకిలు ఎక్కడంలో కూడా ఆ సిద్ధాంతాన్నే అక్షరాలా అమలుపరుస్తాడు, సాధ్యం అయినంతవరకూ.

ఇప్పుడది సాధ్యపడేలాలేదు. స్వయం కృషి తప్ప శరణ్యంలేదు. సరే తప్పుతుందా? బాధగా మూలిగాడు. చెరో కాలిమీదకీ వచ్చేలా మధ్యకి విరిచి సైకిలు కట్టు కట్టిన పంచెని, మరోమారు బిగించుకున్నాడు. పిక్కలకి ఉన్న క్లిప్పుల్ని సర్దుకున్నాడు. సైకిలు వెనక్కి వెళ్ళి నుంచుని, చేతులు తెగిపోతాయి అన్నంతవరకూ సాగదీసి చాపి, హేండిల్‌బారు పట్టుకొని, ఎడంకాలు వెనక చక్రం ఫోర్కుమీద పెట్టి, కుడికాలితో నేలని తన్నగా తన్నగా ముందుకి కదిలిన సైకిలుమీదకి, అమాంతం ఎగిరి కూర్చో బోయాడు. కాని సైకిలుకి అంతలో రోడ్డు దాటుతూన్న కుర్రాడు అడ్డువచ్చాడు. మరి కొంచెం దూరం మామూలుగా నడిపించుకు వెళ్ళి, మళ్ళీ అదేవిధంగా ఎక్కబోయాడు రవణయ్య ఈ మాటు కార్పొరేషనువాళ్ళ కారు ఎదురైంది. మూడో ప్రయత్నాన్ని ఓ ముసలాడు పాడుచేశాడు. నాలుగోసారి ఎక్కబోతే, రోడ్డు మధ్యలో నిలబడి రాత్రి చూసిన సినిమా గురించి ఉద్వేగంతో చెప్పుకుంటూన్న బెల్‌బాటమ్ గురూ షర్టుల అమ్మాయిలు అడ్డువచ్చారు. రవణయ్యకి ఒళ్ళు మండిపోయింది తన సైకిలికి అడ్డు రావడం తప్ప ఈ జనానికేం పనిలేదేవిటి? వీళ్ళంతా తనని సైకిలెక్కకుండా చెయ్యడాని కేదో కలిసి కుట్రపన్నినట్లు కనిపిస్తోంది. తెల్లవారేటప్పటికి అంతా కొంప మునిగి పోయినట్లు ఇలా రోడ్లమీదకి వచ్చి అఘోరించకపోతే, ఇళ్ళల్లో కూర్చోకూడదూ ఇంచక్కా? ఎందుకూ పనికిరాని చట్టాలు చెయ్యకపోతే ఈ గవర్నమెంటు 'పనిలేని

వాళ్ళెవరూ వీధుల్లో తిరగరాదు' అంటూ ఓ చక్కని శాసనం చెయ్యరాదూ? ప్రజలకీ బుద్ధిలేదు, ప్రభుత్వానికీ బుద్ధిలేదు.

ప్రపంచంమీద కోపంతో ఓమారు పళ్ళు పిండుకొని, ఆ ఊపులో, వెనక కేరియర్ మీంచి ఎగిరి అమాంతం సీటుమీదకి ఉరికాడు రవణయ్య. మంత్రిపదవి అధిష్ఠించినంత ఆనందం అయింది అయితే చెరో వైపునా తగిలించిన బరువైన సంచులు కారణంగా, హేండిలు ఇటూ అటూ తెగ ఊగిపోతూ, బలమైన ప్రతి పక్షంలా, అతనికి ఆ ఆనందం మిగల్చడంలేదు ప్రాణాలు ఉగ్గబట్టుకొని. ఏ చిన్న అడ్డంకి వచ్చినా తెగ కంగారు పడిపోతూ, బెల్ ఉంది దాన్ని ఉపయోగించవచ్చు అన్న సంగతే మరిచిపోయి, 'ఏయ్ తప్పుకోండి తప్పుకోండి ' అని అరుస్తూ, రోడ్డుమీద యావత్తు ట్రాఫిక్ నీ తికమక పెట్టేస్తూ, నడిచే జీవకోటిపాలిటి మృత్యువులా, శాంతి భద్రతలకి ఛాలెంజిలా, సైకిలుమీద వచ్చేస్తున్నాడు రవణయ్య.

సరిగ్గా, అదిగో ఆ సమయంలో ఎదురయ్యాడు వీర్రాజు మారువేషంలో. బిళ్ళ పంచెకట్టూ-కప్పు పెట్టవలసినచోట ఎర్రని ఊలు ముడేసిన పొడుగు చేతుల కమీజూ-పై మీద మడత కండువా. నుదుటను దిట్టంగా వీభూదీ, కనుబొమల్లో కుంకం. బుద్ధి మంతుడిలా పాపిటతీసి పక్కకి దువ్విన క్రాపూ-చేతిలో, కీటి దగ్గర్నుంచి ఎరువు తెచ్చుకొన్న, శ్రీనాధుని శృంగార నైషధం-రవణయ్యని చూడగానే గుర్తుపట్టాడు సైకిలు మీద సర్కస్ చేస్తూన్న ఆ అసామీ తన ప్రియురాలికి సాక్షాత్తూ మేనమామనీ, ఆ శాస్త్రీ కోసమే తానిలా తయారు వేషంలో. అరగంటనుండి వెతుకుతున్నాననీను

గుర్తు తెచ్చుకొని కంగారుగా పుస్తకంతో సహా రెండు చేతులూ జోడించి, "నమస్కారంఅండీ'" అన్నాడు. అనుకోకుండా ఎదురైన ఆ గౌరవానికీ, లభించిన మర్యాదకీ. ఉబ్బి తబ్బిబ్బై "నాకు దణ్ణంపెట్టే దౌర్భాగ్యుదెవడున్నాడ్రా ఈ మహా పట్నంలో'' అని ఆశ్చర్యపోతూ తల పక్కకి తిప్పి చూశాడు రవణయ్య.

అంతే-ఇంకేం ఉంది? గోవిందా! హేండిల్ ఇటూ అటూ ఊగిపోయి, సంచులూ సైకిలుతో సహా, రోడ్డుకి అడ్డంగా పడిపోయాడు రవణయ్య మేష్టారు. పైన సైకిలూ కిందతనూ. చలనం లేకుండా గుడ్లు మిటకరించి చూస్తూ పడిఉన్న ఆ జీవుడిని చూసేసరికి, నవ్వుతో ఉంగలు చుట్టుకుపోయిన వీర్రాజుకి, విపరీతమైన జాలివేసింది. "అయ్యో పడిపోయారే!'' అంటూ ఒంగుని సైకిలు ఎత్తి రవణయ్యని లేవదీశాడు. కాని పాపం రవణయ్య లేచే పరిస్థితిలోలేడు చట్ట బెణికింది అప్పటికే ఏం జరిగిందో అని చుట్టూ మూగిన జనంలోంచి, సంఘసేవయందు నమ్మకంఉండి, ముందు ముందు ఎలక్షన్స్‌లో నిలబడదాం అనుకుంటూన్న ఒక పెద్దమనిషి, రవణయ్యకి చెయ్యి ఆసరా ఇచ్చి, ఆదుకుని నిలబెట్టాడు. తోటివాడికి సాయంచేస్తే సాటిలేని పుణ్యం వస్తుందని మత గ్రంథాల్లో చదివిన భక్తుడొకడు, సంచుల్లోంచి పడిపోయిన సరుకుల్ని తిరిగి సంచుల్లోకి ఎత్తసాగాడు. మిగిలిన జనం 'ట్రాఫిక్ ఆగిపోయింది. ఏమైంది' అంటూ

కార్లూ స్కూటర్లూ దిగి వచ్చిన ఖరీదైన మనుష్యులూ. నడ్డిపట్టుకుని వంకరగా నుంచుని మూలుగుతూన్న రవణయ్యనీ, సైకిలు పట్టుకుని రవణయ్యకేసి ప్రాధేయ పూర్వకంగా చూస్తూన్న వీర్రాజునీ, మార్చి మార్చి పరిశీలించి, నేలమీద పడిపోయిన వస్తువులేమిటా అని పరీక్షించ సాగారు.

నిజమైన దేశభక్తుల్తో విడదియ్యడానికి వీల్లేనంత తమాషాగా కలిసిపోయిన దొంగల్లా, ఏకం అయిపోయాయి, బద్దలైన ఉప్పు పొట్లంలోంచి బయటపడ్డ సన్నని ఉప్పుకణాలు, పంచదార పలుకులతోటి చింతపండుకి అంటుకున్న మెంతులు, అనాకారి ధరించిన ఆభరణాలులా వెక్కిరిస్తున్నాయి కూరలు కూడా వచ్చి, కిరాణా సరుకుల్లో కలిసిపోయాయేమో, పరమబద్ధ కస్తూరాలి వంటిల్లులా అయోమయంలా ఉంది ఆ ప్రదేశం. చోద్యం చూస్తూన్న ప్రజలకి అన్ని వస్తువులూ అర్థం అయ్యాయి కాని, నల్లగా జిగురు జిగురుగా అక్కడక్కడ తెల్లగా గింజలతో ఎర్రని నీళ్ళల్లో తేలుతూన్న ముద్ద ఏమిటో అర్థంకాలేదు. అడ్డాకులో కట్టించుకు వచ్చిన గట్టివెన్నా, ఉల్లిపొర కాగితంలో పేక్ చేసిన కాఫీపొడుం, సంచీలోంచి దొర్లిపోయిన టొమాటాలూ మహా విప్లవంలో తమతమ విభేదాలు మరిచి కలిసిపోయిన వివిధ వర్గాలులా, ఆ యాక్సిడెంటులో ఏకం అయిపోయి, ఒక కొత్త పదార్థంగా రూపొందాయని ఎవరూహించగలరు?

"ఎందుకిలా జరిగింది? అసలు ఏమైంది?" అన్నారు అక్కడ జేరిన పెద్దల్లో, పత్రికా విలేఖరులులా ప్రశ్నలు వెయ్యడంలో సరదా ఉన్న ఒకళ్ళిద్దరు ఆసక్తిపరులు.

నీరసంగా మూలుగుతూ రవణయ్యేదో చెప్పబోయాడు అతని మాటలు విని పించ నియ్యకుండా "ఆ : అదేదో అలా జరిగిపోయింది లెండి. ఆ సంచులు మళ్ళీ ఇలా సైకిలుకి తగిలించండి. ఆయన్నీ, సైకిలునీ, సంచుర్నీ భద్రంగా ఇంటికిజేరుస్తాను. ఆయన మా బాబయ్యేలెండి" అన్నాడు వీర్రాజు.

"ఆహా అయితే ఇంకనేం? మనం పోదాం" అనుకుంటూ, బందరాతి మీద పడ్డకుండ పెంకుల్లా, నలుగురూ నాలుగు వైపులా చెదిరిపోయారు. రవణయ్యా వీర్రాజూ మాత్రం మిగిలిపోయారు. "పనిమాలా నమస్కారం పెట్టి పడగొట్టింది చాలక పైగా బాబయ్య అంటాడేవిటి? ఎక్కడి చుట్టం వీడు నాకు?" అంటూ పుల్తాపుల్తా చూశాడు వీర్రాజుని రవణయ్య

బతిమాలుతున్నట్లు ముఖంపెట్టి "క్షమించండి. నావల్లే పడిపోయారు మీరు. అందువల్ల నేను దగ్గిరుండి మిమ్మల్ని ఇంటికి చేరుస్తాను. మీరు కుంటుతున్నట్లున్నారు. సైకిలు తొక్కలేరు. రిక్షా కట్టించనా?" అన్నాడు వీర్రాజు.

"అక్కర్లేదు" విసుగ్గా అన్నాడు రవణయ్య.

వీర్రాజు సైకిలు నడిపిస్తూంటే, నడ్డిమీద చెయ్యివేసుకుని, కుంటుతూ పక్కనే వస్తున్నాడు రవణయ్య.

''నన్ను మీరు ఎరగరు కానీ మీరు నాకు తెలుసు''-నెమ్మదిగా కబుర్లలోకి దింపాడు వీర్రాజు.

రవణయ్య ఏం మాట్లాడలేదు.

''మీదగ్గర ఓనమాలు నేర్చుకొన్న ఒకళ్ళిద్దరు నాకు ఆప్తమిత్రులు.''

'ఒకళ్ళిద్దరేవిటి. తన సర్వీసులో వందలమీద ఉంటారు ఓనమాలు దిద్దినవాళ్లు' అనుకున్నాడు రవణయ్య.

''వాళ్ళు చెబుతూ ఉంటారు మీ శక్తీ, సామర్థ్యం క్రమశిక్షణా,కోపం, ఇవన్నీ ''

''నాలుగు తన్ని చెప్పకపోతే కుర్రాళ్ళకి చదువురా వొద్దూ!''-తల పంకించాడు రవణయ్య.

''మీచలవవల్లే వాళ్ళివాళ ఈ స్థితిలో ఉన్నాం అని, తెగ చెప్పుకుంటూ ఉంటారు.''

మూతిమీద మీసం లేకపోవడంవల్ల మనస్సులోనే మీసం తిప్పుకున్నాడు రవణయ్య.

''నాకు ఎన్నాళ్లనుంచో మిమ్మల్ని కలుసుకోవాలని. కాని ఏమిటో భయం. ధైర్యంలేక ఊరుకున్నాను.''

గర్వంగా నవ్వుకున్నాడు రవణయ్య.

''మా ప్రొఫెసర్‌గారు అంటూ ఉంటారు, ''ఉప్పులో ఊరిన ఊరగాయకీ, రవణయ్య మేష్టారులాంటి ఉత్తమ ఉపాధ్యాయుని దగ్గర నలిగిన విద్యార్థికీ ఇంక డోకా ఉండదు'' అని-''

రవణయ్య ఇంక ఉండబట్టలేక పోయాడు. మనస్సులోంచి పెల్లుబికి వస్తూన్న సంతోషాన్ని అతి ప్రయత్నంమీద నిగ్రహించుకుంటూ ''ఎవరయ్యా ఆ ప్రొఫెసరు?'' అన్నాడు.

'పడ్డావురా నాయనా' అనుకొని ''తెలుగు ప్రొఫెసరు లేరండీ? అదే యూనివర్సిటీలో'' అన్నాడు వీర్రాజు.

'అలాంటి వారెవరూ తనకి తెలియదే!' అని ఒక్క క్షణం ఆలోచించి, ఆ ఆలోచన తాలూకు చిహ్నాలేవీ ముఖంమీద కనిపించనియ్యకుండా, 'ఓ! ఆయనా?' అన్నాడు రవణయ్య

కాస్సేపు ఎవ్వరూ మాట్లాడలేదు. మౌనంగా ఎవరి ఆలోచనల్లో వాళ్ళుండి నటిస్తున్నారు మధ్యలో రవణయ్య తలెత్తి వీర్రాజుకేసి చూశాడు. బిళ్లపంచెకట్టూ, పీభూదీ-కుర్రాడెంతో వినయంగా కనిపించాడు. ఇలా ఉండాలి-ఏవిటో? ఎవర్ని చూద్దాం అన్నా ఈరోజుల్లో పువ్వుల లుంగీలూ, దవళ్ళదాకా పెంచిన చెంపలూను. రౌడీల్లాగ-

''ఏం చదువుతున్నావయ్యా నువ్వు?'' అన్నాడు రవణయ్య, ఎడంచెయ్యి మార్చి కుడిచేత్తో బెణికిన నడ్డి నొక్కుకుంటూ.

"ఎం ఏ అండి తెలుగు, ఎం. ఏ." అన్నాడు వీర్రాజు, శేఖర్ ఇచ్చిన సలహాని జ్ఞాపకం తెచ్చుకుంటూ.

ఆ మాటలు వినేసరికి రమణయ్య ముఖం చేటంతైంది. "అదీ అలా చెప్పు. తెలుగు ఎమ్మే కనకే ఆ ఒప్పు ఓర్పునూ, నేను అనుకుంటూనే ఉన్నాను. నువ్వే భాషా ప్రవీణ విద్యార్థివో, తెలుగు ఎమ్మే స్టూడెంటువో అయి ఉంటావని ఊ " అన్నాడు.

వీర్రాజు మరికొంచెం వినయాన్ని అభినయించాడు. రవణయ్యకి మహదానంద మైపోయింది. ఇటువంటి శాస్త్రీ కనిపించి ఎన్నాళ్ళయిపోయిందో-ఈరోజుల్లో ఎవర్ని చూద్దాం అన్నా పొగర్లూ పోకిరీవేషాలేకదా-ఒక్క విద్యార్థిలోనూ వినయం అనే పదార్థం కాగడాపెట్టి గాలించినా కనిపించడంలేదు. అలాంటిది ఈ కుర్రాడిలో ఏం అణకువ! ఏం నెమ్మది! ఆ కట్టూ బొట్టూ మాత్రం? సాంప్రదాయ మార్గంలో ఇప్పుడెవరు ఉంటున్నారు? బాగుంది!

"నీపేరెవరు నాయనా?" అన్నాడు రవణయ్య ఆప్యాయంగా.

వెంటనే చెప్పలేక వీర్రాజుతడబడ్డాడు. ఆ తర్వాత సర్దుకుని "కిరీటండి . కిరీటి " అన్నాడు సైకిల్ కేరియర్‌కి పెట్టిన శృంగార నైషధం అట్టమీద ఉన్న పేరుని చూస్తూ.

ఆ పేరువిని రమణయ్య ఉలిక్కిపడ్డాడు

కి రీ టి!

ఎక్కడో విన్నట్టుంది ఈపేరు ఇలాంటిపేరు అందరికీ ఉండదే ఎక్కడ విన్నాం చెప్మా తల బద్దలుకొట్టుకొని ఆలోచించగా ఆలోచించగా రక్కున జ్ఞాపకం వచ్చింది ఆవును అయిదేళ్ళకుర్రాడు తన చెల్లెలి ఆడబడుచు కొడుకు వాడిపేరు కిరీటేకదూ పాతరోజుల్ని ఒక్కమారు బాధగా జ్ఞాపకం తెచ్చుకుంటూ" కిరీటి అంటే మీది నరసాపురంకదూ? నువ్వు సావిత్రికొడుకువి అవునా?" అన్నాడు.

'ఏమో! నరసాపురమో సావిత్రో ఎవరికి తెలుసు? ఆ కిరీటిగాడిని అడిగినా బాగుండిపోను అయినా ఈ చిత్రగుప్తుడు ఇలాంటి ప్రశ్నలన్నీ వేస్తాడని ఎవరు కలగన్నారు తోరణంలా ఆపేర్లన్నీ ఏకరువు పెడుతున్నాడు, కొంపదీసి ఇతనికి కిరీటీ వాళ్ళూ తెలుసేవిటి? తెలిస్తే ఇంకేమైనా ఉందా?' ఏవిరా నువ్వు కిరీటివా? అంటూ నాతోళ్ళు ఒలిచెయ్యడూ? ఇప్పుడు నాకు ఏవిటిదారి? నేరకపోయి వాడిపేరు తగిలించు కున్నానురా భగవంతుడా'-ఇలా కంగారుగా ఆలోచించేసి, సైకిలు అమట్టునే వదిలేసి పారిపోదాం అనుకున్నాడు వీర్రాజు. రవణయ్య కనక ఇంకొంచెం డబాయిస్తే కాళ్ళమీద పడిపోయేవాడే!

కాని రవణయ్య డబాయించే స్థితిలోలేడు. జ్ఞాపకాలు అతని మెదడులో సుడిగుండంలా తిరుగుతున్నాయి.

తల్లీ తండ్రీ పోతే తను అల్లారుముద్దుగా పెంచుకొన్న చెల్లెలు సీత-గారంగా పెంచడంవల్ల కట్టుబాట్లుదాటి ఫైల్వాన్ భీమ్‌సింగ్‌తో సీత కాస్త హద్దుమీరే తిరిగింది. పరిస్థితి చెయ్యిదాటడంతో, తను గుట్టుచప్పుడుకాకుండా సీతకి ఆ మారుమూల గ్రామం నరసాపురంలో పెళ్ళిచేసేసి హమ్మయ్య అని స్థిమిత పడ్డాడు కాని పెళ్ళయిన ఏడు నెలలకే సీత, రాణీని ప్రసవించడంతో, సీతమొగుడు వెంకట్రావుకీ ఆడబడుచు సావిత్రికీ సీతమీద అనుమానం ఏర్పడి, తన స్థిమితంకాస్తా ఎగిరిపోయి, సమస్య మళ్ళీ మొదటి కొచ్చింది.

రాణీని తను తీసుకువచ్చి తనదగ్గరే పెంచుతూ, ఎన్నో అబద్ధాలుచెప్పి, సావిత్రినీ వెంకట్రావునీ నమ్మించి. సీత కాపురాన్ని తను ఎల్లాగో కుదుట పరిచాడు. రెండేళ్ళు కాపురం బాగానే సాగింది. సీతకి ఇంకో అమ్మాయికూడా పుట్టింది. కాని ఇంతలో భీమ్‌సింగ్ నరసాపురం వెళ్ళడం, అతనూ సీతా పెరటిగుమ్మంలో మాట్లాడు కోవడం, అది సావిత్రి కంట బడడం, దానికితోడు ఆరోజే సీత పెట్టి అడుగున ఎప్పుడో సీతా భీమ్‌సింగూ తీయించుకొన్న ఫొటో కనిపించడం జరిగిపోయి, ఆ సాయంత్రమే బోట్‌షైరు వంకని వెంకట్రావు సీతని నావలో నరసాపురం గోదావరి మధ్యకు తీసుకుపోయి దాన్ని ముంచేసి దానితోపాటు తనూ మునిగిపోయాడు.

ఇలా తనచెల్లెలు సీత సంసారం నట్టేట కలిసిపోయిందనే పిడుగులాంటివార్త తనకి ఆలశ్యంగా జేరింది. పుట్టెడు దుఃఖంతో తను రాణీని తీసుకుని నరసాపురం వెళితే, అక్కడ ఏం ఉంది? సీత ఆడబడుచు సావిత్రి తన ఆరేళ్ళకొడుకు కిరీటినీ సీత రెండో కూతురు చంటిపిల్లని తీసుకుని ఊరువదలి వెళ్ళిపోయిందట—

అంతకు మూడురోజులక్రితమే సీతా వెంకట్రావూ నావతో సహా మునిగి పోయారనీ, నావ మునగడానికి ముందు ఒక ఫైల్వాన్ మాత్రం ఒడ్డుమీంచి గోదావరిలోకి వురికి నావలోకి చేరుకున్నాడనీ, కాస్సేపు నావలో ఆ ఫైల్వానూ, వెంకట్రావూ పెనుగులాడారనీ, ఆ పెనుగులాటని గట్టుమీద నుంచున్న ఓ కుర్రాడు ఖరీదైన జపాన్ కెమేరాతో ఫోటోతీశాడనీ ఊళ్ళోవాళ్ళు చెప్పారు. తను ఆ కుర్రాడిని వెతికి పట్టుకుని ఆఫొటో తాలూకు రెండు కాపీలు సంపాదించాడు కాని ఫొటో చూస్తూనే తన రక్తం ఉడుకెత్తింది. ఆ ఫైల్వాన్ ఎవరోకాదు భీమ్‌సింగ్!

దాంతో తనకి ఒక అనుమానం వేసింది. కావాలని వెంకట్రావు సీతతోసహా మునిగిపోయి ఉండడనీ, ఈ భీమ్‌సింగ్ వెంకట్రావుని నీళ్ళల్లోకి తోసేసి సీతని దక్కించుకుని పోదాం అనే దురుద్దేశంతో గట్టుమీంచి నీళ్ళల్లోకి ఉరికి నావలో వెంకట్రావుతో పెనుగులాడి ఉంటాడనీ, అనిపించింది. మరి వాళ్ళతోపాటు భీమ్‌సింగ్‌కూడా మునిగి పోయాడోలేదో! తను పోలీసులికి రిపోర్టుచేసి ఫొటో చూపించేసరికి, వాళ్ళకి అనుమానం బలపడి పరారీ అయిపోయిన భీమ్‌సింగ్‌మీద కేసు బనాయించి, ఈపదిహేను పదహారు సంవత్సరాలనుంచీ అతనికోసం గాలిస్తూనే ఉన్నారు.

తనకి నరసాపురంలో దొరికిన ఫొటో కాపీలురెండూ తీసుకుని వెనక్కి వచ్చాడు. పుట్టెడు దుఃఖంతో తనదగ్గర పెరుగుతూన్న సీత పెద్దకూతురు రాణీని కౌగలించుకొని బావురు మన్నాడు. తన చెల్లెలు జీవితాన్ని నీడలా వెంటాడిన ఆ భీమ్‌సింగ్‌మీదా, తన చెల్లెల్ని కులట అని చూపి, ఆమె సంసారాన్ని మంటగలిపిన ఆ సావిత్రిమీదా మాత్రం కక్ష కోపం మిగిలిపోయాయి. తలచెడిన ఆడబడుచుగా ఇంట్లో పడివుండక పచ్చని సీత సంసారాన్ని నట్టేట ముంచుతుందా ఆ సావిత్రి? ఆమె నూరిపొయ్యకపోతే వెంకట్రావు అంతపని చేసి వుండకపోను.

ఏ సీతనైతే కులట అందో ఆ సీతకూతుర్నే కోడలుగా స్వీకరించవలసి వచ్చినప్పుడు తెలిసి వస్తుంది ఆ సావిత్రికి. ఏమైనా, తను నెమ్మదిగా కబుర్లుచెప్పి ఈ కిరీటికి, రాణీలకి పెళ్ళి ఏర్పాటుచెయ్యాలి. అందుకు వీలుగా ఇతణ్ణి ఇంటికి తీసికెళ్ళి రాణీకి పరిచయంచేస్తే. నెమ్మదిగా ఆ పరిచయమే బలపడి

ఇలా ఆలోచించి తల పంకించి రవణయ్య వీర్రాజుకేసి తీక్షణంగాచూసి "మీది నరసాపురం అన్నావుకదూ! అయితే మీ అమ్మపేరు సావిత్రి-అవునా?" అన్నాడు. వీర్రాజు నీళ్ళు నమిలాడు ఏంచెప్పాలో తెలియక. వెంటనే రవణయ్య కృత్రిమంగా ఓ నవ్వునవ్వి "రావయ్యా. ఇంటికిరా-నువ్వుమాకు పరాయివాడివేంకాదు" అన్నాడు.

మొదట వీర్రాజు మొహమాట పడుతున్నట్లు నటించి చివరికి "సరే నడవండి" అన్నాడు. 'హమ్మయ్య మన పథకంపారింది' అని సంతోషిస్తూ.

రవణయ్య దారిలో తెగ ఆలోచిస్తూనే ఉన్నాడు."ఈ కిరీటి కనక తనమేనగోడలు రాణీని పెళ్ళిచేసుకొంటే, బుద్ధిమంతుడైన కుర్రాణ్ణి తను రాణీకి వరునిగా సంపాదించి నట్లూ అవుతుంది, ఆ సావిత్రిమీద కక్ష తీర్చుకున్నట్లూ అవుతుంది ఆనక సావిత్రి మాత్రం ఏం అనగలదు? 'సీత కులట' అనే ప్రచారమేనా మానాలి. లేదా 'ఆమె ఉత్తమురాలు' అని ఏడుస్తూ బహిరంగంగా ఒప్పుకోనైనా ఒప్పుకోవాలి. ఎలాగైనా సీతకి వచ్చిన మచ్చమాయం అవుతుంది."

"ఇతను కిరీటి అని తెలుగు ఎమ్మే చదువుతున్నాడు. నేను సైకిలుమీంచి పడిపోతే పాపం సాయంచేసి ఇంటికి తీసుకువచ్చాడు" అంటూ వీర్రాజుని రవణయ్య రాణీకి పరిచయం చేస్తున్నప్పుడు, మంచివాడిలా వినయం నటించాడు వీర్రాజు.

"ఇతణ్ణి ఎక్కడో చూసినట్టుందే" అనుకొంది రాణి.

"ఈమె కాలి అందెలు ఘల్లు మంటూంటే నా గుండె ఎలా ఝల్లు మంటుందో! మిసమిసలాడుతూన్న యౌవనపు పొంగుతో చంద్ర బింబంలాంటి ఈపిల్ల ఎంత అందంగా ఉంది?" అనుకొన్నాడు. వీర్రాజు. "మారాణీకూడా భాషా ప్రవీణ చదువుతోందయ్యా! తెలియనివి ఏమైనా ఉంటే చెబుతూ ఉందువుగాని. అప్పుడప్పుడు వస్తూఉండు" అన్నాడు రవణయ్య "రానుమరీ!" అనుకున్నాడు వీర్రాజు.

తనకప్పులో కాఫీ చేదుగా వుందని రవణయ్య అన్నప్పుడు, "మీకూ నాకూ వెయ్యవలసిన మొత్తం పంచదార అంతా నాకప్పులోవేసేసింది" అంటూ వీర్రాజు

ఓరగా రాణీకేసి చూశాడు. అప్పటివరకూ పైటకొంగు వేలికి చుట్టుకుంటూ అక్కడే నిలబడ్డ రాణీ, సిగ్గుతో లోపలికి పరిగెత్తింది. రవణయ్య పకపకా నవ్వాడు. వీర్రాజు ఆ నవ్వుతో శ్రుతికలిపాడు.

4

తుపాకీని ఇద్దరిమీదకీ గురిచేసి "ఊ దేవుణ్ణి తల్చుకోండి" అన్నాడు జగత్పతిరావు

శేఖర్ కిరీటి బిగ్గరగా 'బేరు' మనలేదు-అంతే

"ఏం? ఆడపిల్లల్ని వేటాడ్డంలా లేదా ఈవేట?"

"వె ..వ్వె వ్వేటకాదు" అన్నాడు శేఖర్.

"మరి ఆటా?"

"ఆటా కాదండి"

"ఇంకేవిటి? మీ రౌడీపనులకి ఒక పేరుకూడానా?"

"మేం రౌడీలం కాదండీ! చాలా మంచివాళ్ళం," దాదాపు ఏడుపుకంఠంతో అన్నాడు కిరీటి.

"ఆ ఆ మీ వాలకమే చెబుతోంది. మీ లాంటివాళ్ళో-మాసినబట్టలు, చింపిరిజుట్టూ, జిడ్డుమొహాలూను"

"అవాండీ? . అవీ పొద్దుటినుంచీ మీ అమ్మాయి వెనకాలే తిరుగుతూ ఉండి పోయాం కదాండీ ! రూమ్‌కివెళ్ళి మార్చుకోవడానికి వీలులేకపోయింది" అన్నాడు కిరీటి సంజాయిషీ ఇచ్చుకుంటూ.

"ఏవిటీ? పొద్దుట్నుంచీ వేధిస్తున్నారా దాన్ని? అయితే మిమ్మల్ని అసలు క్షమించ డానికి వీలులేదు ఊ త్వరగా దేవుణ్ణి తలుచుకోండి, అవతల నాకు పనుంది."

"పొద్దుట్నుంచీ కాదండి... మావాడికి బుద్ధిలేదు తమబోటి పెద్దవాళ్ళతో మాట్లాడ్డం ఎలాగో తెలియదు. వరి అమాయకుడండి" అంటూ, శేఖర్ కిరీటికేసి కోపంగా, "ఎప్పుడు ఎలా మాట్లాడాలో తెలియకపోతే నోరుమూసుకుని ఊరుకోలేవూ?" అనే భావం వచ్చేలాగ చూశాడు.

"అమాయకుణ్ణా! ఒక్కడూ ఉండగా రూమ్‌లో ఏం అంటున్నా, పోనీ స్నేహి తుడుకదా అని ఊరుకుంటే, ముక్కూ-మొహమూ తెలియని వాళ్ళదగ్గరకూడా అవమాన పరుస్తావా?ఉండు నీపని చెప్తా"అని మనస్సులో పళ్ళుకొరికాడు కిరీటి. కొరికి అమాయకుణ్ణ యితే కావచ్చు కానండి అబద్ధాలకోరుని మాత్రం కాను." అన్నాడు శేఖర్‌ని "కొరకొరా చూస్తూ.

దాంతో శేఖర్ కంగారు పడిపోయి "వాడి మాట నమ్మకండి సార్! వాదన లన్నా, ఎదటివాడు చెప్పింది కాదనటం అన్నా మా వాడికి బలే సరదా. ప్రమాదాలు

వచ్చినపుడు వాడి సరదా మరీ పెరిగిపోతుంది కంగారులో. ఇప్పుడు మీరు ఎక్కడ కాల్చేస్తారో అనే భయంతో కంగారు పడిపోయి. ఉన్న కాస్త మతీకూడా పోగొట్టేసుకుని, ఇలా అంటున్నాడు. నిజానికి మీ అమ్మాయిని మేం అస్సలు వేధించలేదు''

''వేధించకపోతే వెంట పడ్డారు! ఏమైతేనేం? బాధ. పెట్టారు కదా? అది చాలు మిమ్మల్ని 'షూట్' చెయ్యడానికి'' అంటూ మళ్లీ గురి చూడబోయాడు జగత్పతిరావు.

''ఉండండి ఆమెని బాధపెట్టడం మా ఉద్దేశం కాదు.''

''ఆడపిల్లల వెనకాల పడడానికి వేరే ఉద్దేశాలేం ఉంటాయోయ్! అనవసరంగా వాదించి ఊరికే నా టైం పాడు చెయ్యకండి ఊఁ త్వరగా దేవుణ్ణి తలుచుకోండి.''

''అది కాదు సార్! అసలు జరిగిం దేవిటంటే ''

''ఏవిటీ? దీనికి వెనకాల ఓ కథ కూడానా?''

''కథ కాదు సార్! నాటకం.... రేడియో నాటకం'' అన్నాడు కిరీటి కంగారుగా.

''నాటకమా!'' జగత్పతిరావు కనుబొమలు పైకి లేచాయి. అసలే పెద్దవిగా ఉన్న గుడ్లు ఆశ్చర్యంతో మరింత పెద్దవి అయ్యాయి

''అవునండి మా వాడు ఒక నాటకం రాశాడు.''

''ఏవిటేమిటి? నాటకం? నువ్వా? రాశావా? ..''—గన్ నేలమీద నుంచో పెట్టి, దాని మొనమీద ఎడం అరచెయ్యీ, దానిమీద కుడి మోచెయ్యీ ఆన్చి, మురళి వాయించే శ్రీకృష్ణుడిలాగ వ్యత్యస్త పాదారవిందుడై, చిత్రంగా కిరీటికేసి చూడసాగాడు జగత్పతిరావు.

తప్పు చేసినవాడిలాగ తల వంచుకున్నాడు కిరీటి.

''ఊఁ అయితే నువ్వు నాటక రచయితవన్నమాట.'

''రచయిత ఏవిటండీ నా మొహం. ఏదో పొరబాటుని ఒకటి రాశాను. అదిలా నా ప్రాణానికి వచ్చింది. ఈ తప్పు క్షమించి ఈ మాటుకి మీరు మమ్మల్ని వదిలేస్తే ఇంకెప్పుడూ రాయను. అలా రాయనని మీరు ఏ ఒట్టు పెట్టుకోమంటే ఆ ఒట్టు పెట్టుకుంటాను'' అన్నాడు కిరీటి జాలిగా.

''అవునండి వాడు రాయనంటే రాయడండి. మాట ఖచ్చితం మనిషి. ఆడి తప్పనివాళ్ళ లిస్టులో హరిశ్చంద్రుడి పక్కని మా వాడి పేరు కళ్లు మూసుకుని రాసెయ్య వచ్చండి.''

''ఇప్పుడు రాసినందుకు లెంపలు వేసుకోమంటే వేసుకుంటాను.''

''వాడి రూమ్‌మేట్ అయిన పాపానికి నేనుకూడా. ఇద్దర్నీ జమిలిగా లెంపలు వేసుకోమంటారా?''

''అలా చూడకండి. పెద్ద పులి జాలిగా చూస్తే గుండె పగిలి చచ్చేటంత భయం వేస్తుంది. ఇదిగో దేవుడిమీద ఒట్టేసి చెప్తున్నా. ఇకముందు నేను ఛస్తే నాటకాలు రాయను.''

"రాయవూ?"-గర్జించాడు జగత్పతిరావు.

"చిత్తం చిత్తం తమరు రాయమంటే రాయకేం జేస్తాడు? రాస్తాడండి. హాలో లక్ష్మణా అని నోరు మూసుకుని ఏడుస్తూ చచ్చినట్లు మరీ రాస్తాడండి రోజు కొకటి, ఫీచర్ రచయితలాగ"

"బలవంతంగా రాస్తే అదేం బాగుంటుంది? రాయాలనే తహతహ గుండెల్లోంచి జలపాతంలా పొంగి రావాలి కాని."

"మీకా సందేహం ఏం అక్కర్లేదు. మా వాడి గుండెల ముందు శివసముద్రం ఎత్తిపోతలు యేం ఆగవు. నయాగరా కూడా ఆగుతుందో ఆగదో-అనుమానం."

"ఊ రాయడమే వృత్తా? లేకపోతే ఏదైనా వృత్తి ఉందా నీకు?"

"వృత్తిదాకా ఎక్కడండి, వాడింకా చదువుకుంటుంటేనూ?"

"వాట్ స్టూడెంటా ఇతను?"

"వాడే కాదండి. నేనూను. వాడు యూనివర్సిటీలో తెలుగు ఎమ్మే - నేను మెడికల్ కాలేజీలో ఎమ్. డి."

"ఏవిటేవిటి? నిజమే! ఇంతింత పెద్దచదువులు చదువుతూ, బికారి రూపాలు వేసుకుని ఆడపిల్లల వెనకాల తిరగడం ఏవిటీ. ఈ వ్యవహారం ఏవిటీ? ..అబ్బెబ్బె! నాకేం నచ్చలేదు."

"మీరింకా మమ్మల్ని అపార్థం చేసుకుంటున్నారు. మేం అలాంటి మనుష్యులం కాదు. ఆడపిల్ల వెనకాల జరగవలసిన అవస్థ - అది మాకు అలా వచ్చింది-అంతే."

"అసలు ఏ ముహూర్తంలో రాశాడో కానీ, వీడా రేడియో నాటిక రాయడం తోటే మా అవస్థ ప్రారంభం అయింది. అదంతా మీరు విన్నారంటే కోపపడడం కాదు మా మీద జాలిపడతారు."

"అలాగా పాపం! అయితే సరే లోపలికి రండి సావుకాశంగా కూర్చుని తుందాం" అంటూజగత్పతిరావు గన్ చేత్తో ఊపుకుంటూ లోపలికి దారితీశాడు.

వెనకాలే శేఖర్. కిరీటి వెళ్లాలి.

వెళితే?

ఆ పైన ఆలోచించేసరికి వాళ్ళ వెన్నులోంచి భయం ఒక్కమారు జివ్వుమంటూ పరిగెట్టింది.

తీరా లోపలికి వెళ్లాక తలుపులు మూయించి మెత్తగా తన్ని స్తే? తమకి దిక్కా-మొక్కా?

"నోరు ఆవిలించినట్లు పెద్దపెద్ద గుమ్మాలూ-లోపలికేక వస్తే బయటికి వినిపించ నంతగా విశాలమైన హాలూ, ఆ పైన లోతట్టు గదులూ-పగలే లైట్లు వేసుకోవలసి వచ్చే మధ్య వసారాలూ-ఆ ఇల్లంతా ఒక పెద్దగుహలాగా, జగత్పతిరావు ఆ గుహలో సింహం

లాగా కన్పించాడు వాళ్ళ కళ్ళకి. సింహాన్ని నమ్మి దాని గుహలోకి వెళ్ళడమా?

ఎముకల్లోంచి చలి పుట్టుకొచ్చింది.

ఈ మట్టున ఇక్కడనుంచి వెనక్కి పారిపోతే?

బాగానే ఉంటుంది. కాని వెనకాలే తరుముకుంటూ వచ్చి కాల్చెయ్యడని గ్యారంటీ ఏముంది?

మరయితే సింహం గుహలోకి వెళ్ళడమా ?

మధ్యన కుక్కచావు వచ్చింది!

వచ్చి వచ్చి ఎంత ఇబ్బందిలో పడిపోయామురా దేవుడా!

ఏవిటి చెయ్యడం!

జగత్పతిరావు వెనక్కి తిరిగి "ఆ మట్టునే నిలబడిపోయారేం? రండి రండి" అన్నాడు గట్టిగా. ఖంగుమన్న అతని కంఠం, గదుల్లోంచీ హాలులోంచీ ప్రతిధ్వనించి, సింహం గుహ భయంకరంగా ఆహ్వానిస్తున్నట్లనిపించింది.

"సరే కానియ్యి. ఈ జీవితం ఎలాగా ఇవాళ్టితో ఆఖరు" అని నిరాశ చేసుకుని తెగించి లోపలికి బయల్దేరారు శేఖర్ కిరీటీను.

కాళ్ళకింద మెత్తని కార్పెట్.

చుట్టూ డిస్టెంపర్ కొట్టిన అందమైన గోడలు

పైన కనిపించకుండా అమర్చిన మెర్క్యూరీ లైట్లు.

మేడపైకి అటూఇటూ మెట్లున్న పెద్దహాల్లో రెండు మూడు సోఫా సెట్లు టీపాయ్‌లూ—

కిటికీలకీ గుమ్మాలకీ ఖరీదైన కర్టెనులు

గోడమూలల్ని ఎత్తులో అమర్చిన కార్నర్ల మీద ఫ్లవర్ వాజులూ, అజంతా బొమ్మల నమూనాలూ, నటరాజ విగ్రహాలూ-

గోడల్ని భీముడు, రావణాసురుడు, రాముడు, శ్రీకృష్ణుడువంటి రకరకాల వేషాల్లో జగత్పతిరావు తీయించుకున్న పెద్దపెద్ద ఫోటోలు - మధ్యన ఉండి హాలుని రెండుగా విడదీస్తూన్న అద్దాలబీరువాతో, సైజువారీగా కప్పులూ, షీల్డులూ.

హాలునిండా, ఎక్కడినుంచి వస్తోందో తెలియని, చిక్కని నీలపుకాంతి.

పక్కనున్న స్టూలుమీద గన్ పెట్టి, తనో సోఫామీద కూర్చుంటూ, ఇటూ అటూ ఉన్న సోఫాల్ని శేఖర్‌కీ కిరీటికీ చూపించాడు జగత్పతిరావు.

"సోఫామీద కూర్చోబెట్టి మరీ చంపుతాడా గౌరవంగా?" - ఇద్దరూ కూచోడమా మానడమా అని తటపటాయిస్తున్నారు. (సశేషం)

Edited and Published by V. Leelavathy Raghavaiah
7-A, Sivaji Street, Madras-600 017 and Printed by
D. Hanumantha Rao, at Kranti Press,
12, Francis Joseph Street, Madras-600 001.